
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



గుంటూరు

సోమవారం 21 ఆగస్టు 2017 | 20 | ★★★★★★★



రాయపాటి శ్రీనివాస్
క్లబ్ అధ్యక్షుడు

కోవెలమూడి రవీంద్ర
కార్యదర్శి

దేవరశెట్టి సత్యనారాయణ
కోశాధికారి

గులకవరపు రవికుమార్
ఉపాధ్యక్షుడు

మద్దాల వెంకటేశ్వర్లు
సంయుక్త కార్యదర్శి

ఏకపక్షంగా ఎల్‌వీఆర్ ఎన్నికలు

● డాక్టర్ రాయపాటి ప్యానల్ ఘన విజయం

● చంద్రమౌళి ప్యానల్‌కు రెండు పదవులు

6

పెద్దాయనకు అవమానం


20

● ఆయన వెళ్తే రాష్ట్రపతి, గవర్నర్ బంగ్లాల ద్వారాలు తెరుచుకుంటాయి

● జిల్లా స్థాయిలో మాత్రం చేదు అనుభవం

● ఓ అధికారిని కలిసేందుకు గంట నిరీక్షణ

ఒక కంత పూడ్చడానికి మరోచోట కంత పెడుతున్నారు ఆర్టీసీ అధికారులు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఓ పథకాన్ని ఆసరా చేసుకొని రాష్ట్ర ఖజనాకు బెజ్జంవేసి తమ ఖాతాలో జమచేసుకుంటున్నారు. నష్టాన్ని నష్టంలా చూపడానికి సాహసించలేక లాభాల బాట పట్టినట్లు మసిపూస్తున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు రవాణాభారం పడకుండా ప్రభుత్వం ఉచిత బస్సుపాస్‌లను ప్రవేశపెట్టింది. పాఠశాల జరిగినన్ని రోజులు లెక్కేసి రోజుకు ఆ విద్యార్థికి రానూ పోనూ అయ్యే టిక్కెట్టు ధరను ప్రభుత్వం భరిస్తుంది. తెలివిమీరిన అధికారులు ఇబ్బడిముబ్బడిగా ఉచిత బస్సుపాసులు రాసేసి ఆ రీయింబర్స్‌మెంట్‌ను దారి మళ్లిస్తున్నారు. మాచర్ల, పిడుగురాళ్ల డిపోల పరిధిలో రెండేళ్ల నుంచి ఇదే తంతు.



ఖజానాకు కన్నం

20

● నష్టం పూడ్చుకునేందుకు ఆర్టీసీ కుయుక్తి
● బస్సు ఊసేలేని గ్రామాలకు ఉచితపాసులు
● హాస్టల్ విద్యార్థులకూ ఇదే వరుస
● ప్రభుత్వ రీయింబర్స్‌మెంట్‌కు ఎర

ఖరీఫ్ ఖతం!

పుడమికి పచ్చని రంగేసినట్టు కనుచూపు మేర సాగర్ ఆయకట్టు వరి పొలాలతో కళకళ లాడేది. సాగునీటి సంక్షోభంతో నేడు లక్షలాది ఎకరాలు బీళ్లుగా మారి ఆయకట్టు వెలవెల బోతోంది. కనీవినీ ఎరగని రీతిలో ఆయకట్టులో సాగునీటి సంక్షోభం నెలకొంది. 48 సంవత్సరాల్లో ఎన్నడూలేని విధంగా ఈ ఖరీఫ్‌లో నాగార్జునసాగర్, శ్రీశైలం జలాశయాల్లో నీటిమట్టాలు కనిష్ఠ స్థాయి దిగువకు పడిపోయాయి. కృష్ణానది పరివాహక ప్రాంతంలో వర్షాలు కురవకపోవటంతో ఆయకట్టులో కరువు అలుముకుంది. సాగునీటికే కాదు, తాగునీటికీ సాగర్ ప్రాంతం విలవిల లాడుతోంది.

● వరిసాగుకు విరామమే
● బీళ్ళుగా మారిన లక్షలాది ఎకరాలు
● వరుసగా మూడో ఏటా సాగునీటి కరువు
● మూడేళ్లలో రూ. 5,145 కోట్ల విలువైన ధాన్యం దిగుబడులు నష్టం
● 48 ఏళ్లలో కనిష్ఠ స్థాయికి సాగర్, శ్రీశైలం జలాశయాలు

19



నాడు ఆయకట్టు వరి సాగుతో కళ కళ...
ఆయకట్టులో వరి సాగు(పాత చిత్రం)



నేడు ఆయకట్టు వెల వెల...వరి సాగు చేసే పొలాలు
బీళ్ళుగా మారటంతో మేత మేస్తున్న పశువులు

మన హాస్పటల్ స్పెషాలిటీ

కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా జీజీహెచ్ యూరాలజీ విభాగం అత్యంత అధునాతనమైన విధానాల్లో చికిత్సలు అందిస్తోంది. మూత్రపిండాలు, మూత్రనాళం, మూత్రాశయం, ప్రొస్టేట్ గ్రంధి సమస్యలకు శస్త్రచికిత్సలు నిర్వహిస్తూ ఎందరో రోగులకు ఉపశమనం కలిగిస్తున్నది ఈ విభాగం... నెఫ్రాలజీ విభాగంలో మందుల ద్వారా పై సమస్యలకు పరిష్కారం లభించని పక్షంలో శస్త్రచికిత్స చేసే విభాగాన్నే యూరాలజీ విభాగం అంటారు.


యురాలజీ వార్డు

- జీజీహెచ్ యూరాలజీ విభాగంలో అందుబాటు
- కీహోల్, లేజర్, లాప్రోస్కోపీ విధానంలో చికిత్సలు
- 60ఏళ్లు పైబడిన ప్రతి పురుషుడికి ప్రొస్టేట్ గ్రంధి పరీక్షలు
- జీజీహెచ్ యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ప్రకాశరావు వెల్లడి

కార్పొరేట్‌కు దీటుగా అధునాతన చికిత్సలు

జీజీహెచ్‌లో యూరాలజీ విభాగానికి పురుషులకు 26 బెడ్లు, మహిళలకు 18 బెడ్లతో 221వ వార్డులో చికిత్సలు అందిస్తారు. వీరికి ప్రత్యేకమైన ఆపరేషన్ థియేటర్ అందుబాటులో ఉంది. ప్రతి బుధ, శనివారాల్లో ఓపీ బ్లాక్‌లోని మొదటి అంతస్తులోని 26వవిభాగం గదిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నాం ఒంటి గంట వరకు వైద్యులు అందుబాటులో ఉంటారు. ఈ విభాగంలో ఒక ప్రొఫెసర్, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 8 మంది పీజీ విద్యార్థులు అందుబాటులో ఉంటారు.

ఈ విభాగానికి వస్తున్న రోగుల్లో అధిక శాతం మంది కిడ్నీలో రాళ్లు, మూత్రానాళంలో అడ్డంకులు, కేన్సర్, మూత్రాశయంలో రాళ్లు, ప్రొస్టేట్ గ్రంధి పనితీరులో లోపాల వల్ల కలిగే ఇబ్బందులకు లోనైనవారు వస్తుంటారు. ప్రధానమైనవి కిడ్నీలో రాళ్లు. ఇటీవల ఆహార అలవాట్లలో వచ్చిన మార్పుల కారణంగా దశాబ్దకాలం నుంచి ఈ రోగుల సంఖ్య విపరీతంగా పెరిగింది. కిడ్నీలో రాళ్లలో అధిక శాతం మంది ఆక్సిలేట్ రాళ్లతో ఇబ్బంది పడుతుంటారు. కిడ్నీరాళ్లతో ఇబ్బంది పడుతున్నవారిలో 45 శాతం ఈ రాళ్లతో ఇబ్బంది పడేవారే. మిగిలిన రాళ్లతో ఇబ్బంది పడేవారిలో రాళ్లు వాటంతట అవే పడిపోయే అవకాశం ఉంది. కానీ ఆక్సిలేట్ రాళ్లు పడవు. కారణం ఇవి నిర్మాణం కావడమే బయటకు ముళ్లుముళ్లుగా ఏర్పడి ఉంటాయి. దీనివల్ల ఈ విధానంలో రాళ్లు ఏర్పడినవారు విపరీతమైన బాధకు లోనవుతారు. ఇవి మూత్రపిండం నుంచి మూత్రనాళంలోకి వచ్చినా బయట ఉండే ముళ్ల కారణంగా నాళాల్లో రాపిడి జరిగి రక్తస్రావం అయి మూత్రం ద్వారా బయటకువస్తుంది. అందువల్ల ఈ రాళ్లు ఏర్పడినవారికి శస్త్రచికిత్స తప్పదు. ఐదు మిల్లీమీటర్ల రాయి కూడా బైటకు వచ్చేసమయంలో విపరీతంగా ఇబ్బందిపెడుతుంది. మనం తీసుకునే ఆహారంలో టమోట, వంకాయ, పాలకూర, పిస్తా, బాదం వంటివి ఎక్కువగా తీసుకునే వారిలో ఆక్సిలేట్ రాళ్లు ఏర్పడే అవకాశం ఉంది.



యురాలజీ వార్డు

రెండో విధానం ఫాస్ఫేట్ రాళ్లు. ఇవి వాటంతట అవే పడి పోవడానికి ఎక్కువ అవకాశం ఉంటుంది. వీటి ఉపరితలం గోలి మాదిరిగా ఉండడంతో జారిపడిపోతాయి. వీటి బాధితులు 20శాతం మంది మాత్రమే ఉంటారు. క్యాల్షియం ఎక్కువగా ఉండే పదార్థాలైన పాలు, నెయ్యి వంటివి ఎక్కువగా తీసుకునేవారిలో ఈ రాళ్లు ఏర్పడతాయి.

మూడో విధానం యూరిక్ యాసిడ్ స్టోన్స్... ఇవి కూడా ప్రమాదకరం కాదు. వాటంతట అవే పడిపోతాయి. ఈ విధానం బాధితులు కూడా 20శాతం ఉంటారు. మాంసాహారం అధికంగా తీసుకునేవారిలో ఈ తరహారాళ్లు ఏర్పడతాయి. మిగిలిన 10 శాతం మందిలో సిస్టిల్స్ విధానంలో ఉండే రాళ్లు. అంటే వంశపారంపర్యంగా రాళ్లు ఏర్పడ తాయి. వీరిని ముందుగానే గుర్తించి తగు జాగ్రత్తలు తీసు కుంటే భవిష్యత్తులో వచ్చే అవకాశం ఉండదు. మిగిలిన ఐదు శాతం ఇన్‌ఫెక్షన్‌ల కారణంగా ఏర్పడుతుంటాయి.

రోజుకు కనీసం ఐదు లీటర్ల నీళ్లు తాగాలి

ఏ విధానంలోనైనా కిడ్నీలో రాళ్లు ఏర్పడకుండా ఉండాలంటే ప్రతిరోజూ కిడ్నీలో ఉండిపోయే క్యాల్షియం, ఆక్సిలేట్, యూరిక్‌యాసిడ్‌లు అదే రోజున బయటకు వెళ్లి పోవాలి. లేదంటే వాటి మధ్య రసాయన ప్రక్రియ జరిగి రాళ్లుగా ఏర్పడతాయి. అవే కొన్నిరోజులకు పరిమాణం పెరిగి ఇబ్బందులు వస్తాయి. ప్రతిరోజూ ఐదులీటర్ల నీరు తీసుకుని రెండులీటర్ల మూత్రం పోసేలా చూసుకోవాలి. అప్పుడు ప్రతి రోజూ మూత్రపిండంలో ఏర్పడే వ్యర్థాలు బైటకు వచ్చేస్తాయి. అప్పుడు రాళ్లు ఏర్పడే ప్రసక్తే ఉండదు.

అధునాతన చికిత్సలు...

జీజీహెచ్ యూరాలజీ విభాగంలో కిడ్నీలో రాళ్లు తొలగించేందుకు అత్యాధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. పాతవిధానంలో ఎక్కువ కుట్లు పడడం, రోగి రోజుల తరబడి ఆసుపత్రిలోనే ఉండాల్సి వచ్చేది. ఇప్పుడు లేజర్, లాప్రోస్కోపీ, కీహోల్ వంటి అధునాతన చికిత్సలతో తక్కువ కుట్లు పడడమే కాకుండా రోగులు త్వరగా కోలుకుంటారు.

మూత్రనాళంలో సమస్యలు...


డాక్టర్ ప్రకాశరావు

మూత్రపిండాల్లో ఏర్పడే రాళ్లు కొన్ని సందర్భాల్లో మూత్రం ద్వారా మూత్రనాళంలోకి ప్రవేశించి బయటకు వచ్చే అవకాశంలేక మూత్ర ప్రవాహానికి అడ్డుపడతాయి. ఇలా అడ్డుపడ్డ నిమిషాల వ్యవధిలోనే రోగి విపరీతమైన నొప్పికి లోనవుతాడు. కిడ్నీలో రాళ్ల వల్ల ఏర్పడే నొప్పి కన్నా అనేక రెట్లు దీనివలన ఇబ్బందులు పడతారు. రోగికి తక్షణం చికిత్సను అందించి ఉపశమనం కలిగించాలి. జీజీ హెచ్‌లో ఈ సదుపాయం ఉంది. అంతేకాకుండా కొన్ని సందర్భాల్లో మూత్రనాళానికి క్యాన్సర్ వస్తుంది. మూత్రంలో రక్తం గుర్తించడం ద్వారా దీనిని అనుమానించవచ్చు. మూత్రంలో రక్తాన్ని గుర్తించిన కొన్ని రోజుల్లో చికిత్స చేయగలిగితే కేన్సర్ సోకిన ప్రాంతాన్ని తొలగిస్తే సరిపోతుంది. అదేఏడాది అశ్రద్ధ చేస్తే కిడ్నీవరకు క్యాన్సర్ సోకి కిడ్నీని కూడా తొలగించాల్సి ఉంటుంది. మూత్రంలో రక్తం క్యాన్సర్ వల్లే కాదు అనేక రకాలుగా రావచ్చు. రక్తం కనిపిస్తే మాత్రం తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలి.

కొందరికి తల్లిగర్భంలో బిడ్డ ఉండగానే మూత్రనాళం సరిగా ఏర్పడదు. ఈ పరిస్థితి స్కానింగ్‌లో తెలుస్తుంది. ఇటువంటి బిడ్డల్లో మూత్రనాళం మూసుకుపోయి ఉండడం వల్ల కిడ్నీ పరిణామం పెరిగిపోతుంది. గర్భంలో ఉమ్మనీరు ఉండదు. కారణం బిడ్డపోసే మూత్రమే ఉమ్మనీరుగా ఉంటుంది కాబట్టి. మూత్రం రావడం లేదు కనుక ఉమ్మనీరు తగ్గి 7-8 నెలలోనే కాన్పులు అవుతాయి. ఇటువంటి బిడ్డలకు రెండేళ్ల తరువాత శస్త్రచికిత్స చేసి సరిచేస్తారు. ఇది జీజీహెచ్‌లో అందుబాటులో ఉంది.

మూత్రాశయంలో సమస్యలు...

మూత్రనాళం నుంచి మూత్రాశయానికి వస్తుంది. ఇక్కడ కూడా రాళ్లు ఏర్పడే అవకాశం ఉంది. ఇక్కడ ఏర్పడే రాళ్లు బంగాళ దుంప పరిమాణంలో ఉంటాయి. ఇక్కడ మూత్రం ఎక్కువకాలం నిలువ ఉండడం వల్ల ఈ రాళ్ల పరిమాణం పెరుగుతుంది. మూత్రం వచ్చినట్లు ఉండడం, పూర్తిగా బయటకు రాకుండానే ఆగిపోవడం వంటి లక్షణాల ద్వారా ఈ సమస్యను గుర్తించవచ్చు. ఉదాహరణకు 500మిల్లీలీటర్ల మూత్రాశయంలో ఉంటే 250 మిల్లీలీటర్లు బయటకు వచ్చి మిగిలినది ఉండిపోతుంది. మరో 250 వచ్చిన తరువాత 250 బైటకు వస్తాయి. అంటే ఎప్పుడూ 250 మిల్లీలీటర్లు అక్కడే ఉంటాయి. వీటివల్ల మూత్రంలో రసాయన చర్యలు జరిగి రాళ్ల పరిమాణం రోజురోజుకూ పెరుగుతుంటుంది. దీనికి శస్త్రచికిత్సే పరిష్కారం. పొగతాగేవారిలోనే ఇటువంటి రాళ్లు ఏర్పడడాన్ని ఎక్కువగా గుర్తిస్తున్నారు. ఈ చికిత్స జీజీహెచ్‌లో అందుబాటులో ఉంది.

ఇదే కాకుండా మహిళల్లో ఆలస్యంగా జరిగే ప్రసవాల కారణంగా బిడ్డ పరిమాణం పెరుగుతుంది. సాధారణ కాన్పు జరిగినా ఇటువంటి కాన్పుల్లో తల్లి మూత్రాశయానికి కాన్పు సమయంలో రంధ్రాలు పడతాయి. దీనివల్ల మూత్రం శరీరంలోకి ప్రవేశించి 3-4 రోజుల్లోనే ప్రాణాపాయస్థితి ఏర్పడే అవకాశాలున్నాయి. ఇటువంటి కాన్పులు జరిగినప్పుడు మూత్రం వస్తున్న విధానాన్ని తల్లి గమనించుకోవాలి. ఇవికాకుండా సుఖవ్యాధులకు గురైనవారికి కూడా మూత్రాశయంలో ఇన్‌ఫెక్షన్‌లు వస్తాయి. సాధారణంగా పూర్‌మెన్ డిసీజ్ అంటారు. జననాంగాలను శుభ్రం చేసుకోకపోవడం, సురక్షితం కాని సెక్స్‌లో పాల్గొన్నవారు వీటి బారిన పడుతుంటారు. వీరిని వెంటనే గుర్తిస్తే జీజీహెచ్‌లో చికిత్స అందుబాటులో ఉంది.

- గుంటూరు (సంగడిగుంట)

ఆ మూడు పదార్థాలు వద్దు

కిడ్నీ సంబంధిత వ్యాధులకు గురవకుండా ఉండాలంటే ఉప్పు, పంచదార, పిండి పదార్థాలు (ముఖ్యంగా మైదా) మూడింటిని తగ్గించుకుంటే మంచిది.

మగవారికి ప్రత్యేకం ప్రొస్టేట్ గ్రంధి సమస్యలు

మూత్రనాళానికి పైన ఉండే ప్రొస్టేట్ గ్రంధి మగవారిలో మాత్రమే ఉంటుంది. సంసారజీవితానికి అవసరమైన వాటిని ఈ గ్రంధి హార్మోన్‌ల రూపంలో విడుదల చేస్తుంది. సాధారణంగా 60 ఏళ్లు పైబడిన మగవారిలో ఈ గ్రంధి పనితీరులో మార్పువచ్చి కాన్సర్‌కు గురవడం, ఇన్‌ఫెక్షన్‌ల కారణంగా వాపు వస్తుంది. సాధారణంగా 3 సెంటీమీటర్లు ఉండే ఈ గ్రంధి 8 సెంటీమీటర్ల వరకు వ్యాకోచిస్తుంది. దీని పక్కనే మూత్రనాళం ఉండడం వల్ల అది వ్యాకోచించినప్పుడు మూత్రనాళంపై ఒత్తిడి పడి మూత్రం ఆగిపోతుంది. ప్రొస్టేట్ గ్రంధికి చికిత్స చేయించుకోవడం ద్వారా ఈ సమస్య నుంచి బైటపడొచ్చు. క్యాన్సర్ వంటివి సోకినా పూర్తిగా గ్రంధిని తొలగించవచ్చు. దీనివల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఇటీవల 60 ఏళ్లు పైబడిన వారిలో 80 శాతం ఈ సమస్యతో వస్తున్నారు. దీనికి జీజీహెచ్‌లో పూర్తి చికిత్స ఉంది.

రాకుండా జాగ్రత్తలు

అయితే ప్రొస్టేట్ గ్రంధి సమస్యను ముందుగానే గుర్తించవచ్చు. పీఎస్‌ఏ పరీక్ష ద్వారా ముందుగానే పసిగట్టవచ్చు. ఈ పరీక్షకు సుమారు రూ. 500 వరకు అవుతుంది. జీజీహెచ్‌లో అందుబాటులో లేకపోయినప్పటికీ ప్రైవేట్ ల్యాబ్‌తో ఒప్పందం మేరకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. 60 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ ఈ పరీక్షలు చేయించుకుంటే మంచిది.

కడుపునొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్య


శివకుమారి మృతదేహం

గణపవరం(నాదెండ్ల): మండలంలోని గణపవరం గ్రామ పరిధిలోగల రాజీవ్‌గాంధీ కాలనీకి చెందిన బిగల శివకుమారి(30) కడుపునొప్పి తాళలేక ఆదివారం ఇంటిలోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె చిలకలూరిపేటలోని శాఖా గ్రంథాలయంలో పనిచేస్తుండేది. భర్త వీరరాజు రాజీవ్‌గాంధీ కాలనీలో కిరాణా షాపు నిర్వహిస్తున్నారు. శివకుమారి కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతూ రెండుసార్లు శస్త్రచికిత్స కూడా చేయించుకుంది. అయినప్పటికీ కడుపునొప్పి తగ్గలేదు. దీనితో ఆమె ఇంట్లో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు. ఇన్‌చార్జి ఎస్‌ఐ పవన్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

గోదావరిలో ఫిరంగిపురం యువకుడి గల్లంతు


గల్లంతైన యువకుడి కోసం గోదావరిలో గాలిస్తున్న బోటు

కొవ్వూరు : పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు గోష్పాద క్షేత్రం వద్ద గోదావరిలో స్నానానికి దిగిన ఒక యువకుడు గల్లంతయ్యాడు. గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం విజ్ఞానపురం గ్రామానికి చెందిన పెరికల చిన్నా ఆధ్వర్యంలో 24 మంది ఆదివారం గౌరీపట్నం నిర్మలగిరి మేరీమాత ఆలయానికి వచ్చారు. అక్కడి నుంచి కొవ్వూరు గోష్పాద క్షేత్రం వద్ద గోదావరిలో స్నానాలకు వచ్చారు. గ్రామస్థులు, స్నేహితులతో కలసి గోదావరిలో స్నానానికి దిగిన కనపర్తి సురేంద్ర (20) నీటి ఉధృతికి కొట్టుకుపోతూ రక్షించాలంటూ కేకలు పెట్టాడు. అతడి స్నేహితులు కాపాడడానికి ప్రయత్నించినా సాధ్యపడలేదు. సమీపంలోని ఏపీ టూరిజం బోటు సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చేసరికే సురేంద్ర గల్లంతయ్యాడు. ఈ సంఘటనపై సురేంద్ర తాత పెరికల చిన్నా (జోసఫ్) మాట్లాడుతూ తనతో పాటు వచ్చిన మహిళలు, స్నేహితులతో సురేంద్ర గోదావరిలో స్నానానికి దిగాడని, లోపలికి వెళ్లవద్దని హెచ్చరిస్తున్నప్పటికీ నదిలోపలకు వెళ్లి గల్లంతయ్యాడని రోదించాడు. సీఐ ప్రసాదరావు, ఎస్‌ఐ సతీష్ జానా, ఫైర్ సిబ్బంది గోష్పాద క్షేత్రానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు.

50 టిక్కీల రేషన్ బియ్యం స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యంతో నిందితులు

మాచర్ల: అర్ధరాత్రి సమయంలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించేందుకు ప్రయత్నిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న సంఘటన శనివారం అర్ధరాత్రి మాచర్ల పట్టణంలో చోటుచేసుకుంది. 13వ వార్డులో ఓ ఇంటి వద్ద వాహనంలో రేషన్ బియ్యం బస్తాలను లోడు చేస్తుండగా సమాచారం అందుకున్న ఎస్‌ఐ పి లక్ష్మయ్య తన సిబ్బందితో దాడి చేశారు. అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా 50 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని పౌర సరఫరాల గోడౌన్‌కు తరలించారు. వాహనంలోని ముగ్గురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో విద్యుత్ ఉద్యోగి మృతి

వినుకొండ: అనుమానాస్పద స్థితిలో విద్యుత్ ఉద్యోగి మృతిచెందిన సంఘటన పట్టణంలోని కారంపూడి రోడ్డులో గల హైమా డెయిరీ ఎదురు చోటు చేసుకుంది. చిలకలూరిపేటకు చెందిన నూన్సావత్ లక్ష్మానాయక్ పశ్చిమగోదావరి జిల్లా ఉండి భీమవరంలో విద్యుత్ లైన్‌మ్యాన్‌గా పనిచేస్తున్నాడు. బొల్లాపల్లి మండలంలో అటెండర్‌గా పనిచేస్తున్న రామస్వామినాయక్ కుమార్తె జ్యోతిబాయితో ఇతడికి వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు. వారిద్దరూ తాతయ్య రామస్వామి దగ్గర ఉంటున్నారు. కుమార్తెలను చూసేందుకు ఈపూరు వచ్చిన లక్ష్మానాయక్ చూసి తిరిగివెళ్తూ వినుకొండ వద్ద అనుమానాస్పద స్థితిలో శవమై కనిపించాడు. పట్టణ సీఐ జి.శ్రీనివాసరావు తన సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు.

బాలిక అపహరణ

కొత్తగణేష్‌పాడు (మాచవరం): బాలిక అపహరణకు గురైనట్లు ఆదివారం మాచవరం ఎస్‌ఐ జగదీష్ తెలిపారు. మండలంలోని కొత్తగణేష్‌పాడు గ్రామానికి చెందిన కప్పా హనుమంతరావు అదే వీధికి చెందిన బాలికకు మాయమాటలు చెప్పి శుక్రవారం కిడ్నాప్ చేశాడు. బాలిక తల్లి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దృష్టి మరల్చి... బ్యాగు కోసి...

- బస్సు ప్రయాణికుడి నుంచి రూ.10 లక్షల చోరీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు
- రూ.9లక్షల 96 వేలు స్వాధీనం
- బ్యాగ్‌లు కత్తిరించే విధానాన్ని చూపిన నిందితులు


ప్రయాణికుల బ్యాగ్ కత్తిరించే విధానాన్ని పోలీసు అధికారుల సమక్షంలో డెమో ద్వారా చూపుతున్న నిందితులు

గుంటూరు: ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడి దృష్టి మరల్చి అతడి బ్యాగ్‌ను కత్తిరించి అందులోని రూ.పది లక్షలు అపహరించిన కేసులో ఇద్దరు నిందితులను చిలకలూరిపేట పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. విశాఖపట్నం పూర్ణామార్కెట్ సమీపంలోని ప్రసాద్ గార్డెన్స్ ప్రాంతానికి చెందిన బుర్రి సురేష్, రవీంద్రనగర్ పాత డెయిరీ ఫామ్ ప్రాంతానికి చెందిన కరణం సత్తిబాబులను అరెస్టు చేసి వారి నుంచి రూ.9 లక్షల 96 వేలను రికవరీ చేసినట్లు రూరల్ ఎస్పీ అప్పలనాయుడు తెలిపారు. ఆదివారం పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను మీడియా ఎదుట హాజరుపర్చి వివరాలు వెల్లడించారు.

నరసరావుపేటకు చెందిన మాదల ఆంజనేయులు చేపల కమీషన్ వ్యాపారం చేస్తుంటాడు. ఈ నెల 14న నెల్లూరు నుంచి విజయవాడ వెళ్ళే ఆర్టీసీ బస్సు ఎక్కాడు. తన వద్ద ఉన్న టార్పాలిన్ సంచిలో రూ.15 లక్షలు నగదు తీసుకుని వస్తున్నాడు. చిలకలూరిపేటలో బస్సు దిగుతుండగా ఓ వ్యక్తి అతని ముందు నిలబడి డ్రైవర్‌తో మాట్లాడుతున్నాడు. మరో వ్యక్తి ఆంజనేయులు వెనుక నిలబడి దిగండంటూ తోస్తూ అతని చేతిలోని బ్యాగ్‌ను కత్తిరించి అందులో రూ.పది లక్షలను నొక్కేశాడు. ఈ విషయం గ్రహించని ఆంజనేయులు కిందకు దిగిన తరువాత చూసుకోగా బ్యాగ్ కత్తిరించి ఉంది. వెంటనే చిలకలూరిపేట పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఎలాంటి ఆధారాలు లేకున్నా...

తొలుత ఈ కేసులో పోలీసులకు ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదు. అయితే నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో చిలకలూరిపేట సీఐ సురేష్‌బాబు చాకచక్యంగా కేసును ఛేదించారు. బాధితుడు చెప్పిన వివరాల ఆధారంగా ఈ తరహా కేసుల్లో పాత నిందితులను తిరగేశారు. అనుమానితుల సెల్‌ఫోన్ నెంబర్ల డేటాను పరిశీలించగా 14న వారు ఈ ప్రాంతంలో తిరిగినట్లు గుర్తించారు. దీంతో ఈనెల 19న సాయంత్రం విశాఖపట్నంలోని నేహా రెసిడెన్సీ లాడ్జిలో మకాం వేసిన నిందితులు సురేష్, సత్తిబాబులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారించగా రూ.పది లక్షలు అపహరించి చెరిసగం పంచుకున్నామని చెప్పారు. దీంతో నిందితుల నుంచి రూ.9లక్షల 96 వేలు స్వాధీనం చేసుకున్నారు.

ఇలా టార్గెట్ చేశారు...

నెల్లూరు నుంచి బస్సులో వస్తున్న బాధితుడు ఆంజనేయులు తన బ్యాగ్‌ను తరచూ తడుముతూ ఉండడంతో నిందితులకు పెద్ద మొత్తంలో డబ్బులు ఉంటాయని అనుమానం కలిగింది. అదే సమయంలో ఫోన్‌లో పెద్దగా మాట్లాడుతూ డబ్బులున్న విషయాన్ని చెప్పడంతో నిందితులు అతడిని టార్గెట్ చేశారు. నిందితులు ఇద్దరూ ఈ తరహా చోరీ కోసం తిరుపతి వరకు ప్రయాణించారు. తిరుగు ప్రయాణంలో వారికి ఆంజనేయులు కంటపడ్డాడు. దీంతో చాకచక్యంగా డబ్బు కొట్టేశారు.

ఇలా చోరీ చేశారు...

పెద్ద మొత్తంలో నగదు తీసుకెళ్ళేవారు ఎంత జాగ్రత్తగా ఉన్నప్పటికీ నిందితుల కన్ను పడితే చిటికెలో నగదు మాయం చేస్తారు. అదెలా అనేది నిందితులే స్వయంగా ఎస్పీ, పోలీసు అధికారుల ముందు మీడియాకు ప్రదర్శించి చూపారు. సుమారు 50 ఏళ్ళ వయసు ఉన్న సత్తిబాబు ప్రయాణికుడికి అడ్డు నిలబడతాడు. వెనుక ఉన్న సురేష్ కుడి వైపు చంకలో ఓ బ్యాగ్‌ను పెట్టుకుని వెనుక నుంచి ఎవరో నెడుతున్నట్లుగా ముందున్న ప్రయాణికుడిని నెడుతూ అతని దృష్టి మరలించి అదే సమయంలో బ్లేడుతో బ్యాగ్‌ను కత్తిరించి క్షణాల్లో నగదు లాగేస్తాడు.

అధికారులు, సిబ్బందికి రివార్డులు

ఏ మాత్రం ఆధారాలు లేని ఈ కేసులో పోలీసు అధికారులు, సిబ్బంది అత్యంత చాకచక్యంగా, సమర్థంగా విచారణ జరిపి ఇద్దరు నిందితులను అరెస్టు చేశారని రూరల్ ఎస్పీ తెలిపారు. ఈ మేరకు డీఎస్పీ నాగేశ్వరరావు, సీఐ సురేష్‌బాబు, హెడ్ కానిస్టేబుళ్ళు రోసిబాబు, ఎం.వి. రామరాజు, కానిస్టేబుళ్ళు ధనుంజయరావు, ఎస్‌కె షావుద్దీన్, హోంగార్డు డివి చక్రపాణి, ఐటీ కోర్ సభ్యులు జి.రాజాకిషోర్, సిహెచ్ రాము, వి.శ్రీనివాసరావులను రూరల్ ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి రివార్డులు ప్రకటించారు.

ప్రయాణాల్లో జాగ్రత్త: రూరల్ ఎస్పీ

ప్రయాణాల్లో పెద్ద మొత్తం డబ్బు తీసుకెళ్ళరాదని రూరల్ ఎస్పీ తెలిపారు. తీసుకెళ్ళే సమయంలోనూ ఎదుటి వారికి అనుమానం వచ్చేలా అతి జాగ్రత్త వహించడం, ఫోన్‌లో డబ్బు విషయాలు మాట్లాడడం వంటివి చేయవద్దన్నారు. బస్సు ఎక్కే సమయంలో, దిగే సమయంలో వెనుకా ముందు కొంత గ్యాప్ ఉండేలా చూసుకోవాలన్నారు.

మహిళ హత్య కేసులో వీడిన మిస్టరీ

- వ్యభిచార కార్యకలాపాల వద్ద వివాదమే కారణం
- మహిళ సహా నలుగురి అరెస్టు


హతురాలు రేవూరి లక్ష్మి పాతచిత్రం

గుంటూరు: నరసరావుపేటలోని ఎస్‌ఆర్‌కేపీ కాలనీకి చెందిన రేవూరి లక్ష్మి అలియాస్ తొర్రి లక్ష్మి (47) హత్య కేసులో మిస్టరీ వీడింది. నిందితులు పథకం ప్రకారం వైరుతో మెడకు బిగించి ఆమెను హత్యచేసి గోనెసంచిలో మూటకట్టి చిలకలూరిపేట రూరల్ స్టేషన్ పరిధిలోని పోతవరం గ్రామం శివారు కల్వర్టులో పడేశారు. తొలుత గుర్తు తెలియని మహిళగా కేసు నమోదైనప్పటికీ చిలకలూరిపేట రూరల్ పోలీసులు చాకచక్యంగా మహిళను గుర్తించడమే కాక కేసు మిస్టరీని కూడా ఛేదించారు. నరసరావుపేట పెద్దచెరువు ఐదో లైనుకు చెందిన సీతనబోయిన నాగశేషు, ప్రకాష్‌నగర్‌కు చెందిన వాకా కోటేశ్వరి, అత్తిలి లక్ష్మణరావు, కొమ్ము యేబులను అరెస్ట్ చేశారు. ఆదివారం పోలీస్ కార్యాలయంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో రూరల్ ఎస్పీ అప్పలనాయుడు నిందితులను మీడియా ఎదుట హాజరు పరిచి వివరాలు వెల్లడించారు.

నరసరావుపేటకు చెందిన రేవూరి లక్ష్మి హ్యాండ్స్ ఆఫ్ కంపాజన్ (హెచ్‌వోసీ) అనే సంస్థలో పీర్ ఎడ్యుకేటర్‌గా పనిచేస్తుండేది. దాంతోపాటు వ్యభిచారం కూడా చేయిస్తుండేది. ఈ క్రమంలో సీతనబోయిన నాగశేషుతో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో అమ్మాయిల కోసం రెండు నెలలుగా లక్ష్మిని నాగశేషు వేధిస్తున్నాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి నాగశేషును అరెస్ట్ చేశారు.

ఇదిలా ఉంటే శ్యావల్యాపురం మండలం గంటావారిపాలెంకు చెందిన వాకా కోటేశ్వరి కొంతకాలంగా ప్రకాష్‌నగర్‌లో ఉంటోంది. కోటేశ్వరి వద్ద లక్ష్మి రూ.10 వేలు అప్పుగా తీసుకుంది. ఆ మొత్తం తిరిగి ఇవ్వకపోగా కోటేశ్వరిని కొట్టి అవమానించింది. దీనితో నాగశేషు, కోటేశ్వరి కలిసి లక్ష్మిని హత్య చేసేందుకు పథకం రూపొందించారు. గత నెల 30న మధ్యాహ్నం లక్ష్మిని కోటేశ్వరి ఇంటికి పిలిపించారు. ఇంట్లో నాగశేషు, తన స్నేహితులైన లక్ష్మణరావు, యేబుల కోటేశ్వరి కలిసి లక్ష్మి మెడకు కరెంటు వైరు బిగించి, నోట్లో గుడ్డలు కుక్కి హత్య చేశారు. మృతురాలి శరీరం మీద ఉన్న బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్ తీసుకున్నారు. మృతదేహాన్ని రాత్రి వరకు ఇంట్లోనే ఉంచి ఆ తరువాత గోనెసంచిలో మూటకట్టి యేబుకు చెందిన ఆటోలో పోతవరం గ్రామ శివారులో పడేశారు.

పకడ్బందీగా కేసు విచారణ ...

గుర్తు తెలియని మృతదేహంగా విచారణ ప్రారంభించిన పోలీసులు చాకచక్యంగా ఆమెను గుర్తించారు. నరసరావుపేట డీఎస్పీ కె నాగేశ్వరరావు ఆధ్వర్యంలో చిలకలూరిపేట రూరల్ సీఐ యు శోభన్‌బాబు, రూరల్ ఎస్‌ఐ ఉదయ్‌బాబు, యడ్లపాడు హెడ్‌కానిస్టేబుల్ శివయ్య, చిలకలూరిపేట రూరల్ హెడ్ కానిస్టేబుల్స్ రోసిబాబు, జిలాని, కానిస్టేబుళ్లు వై మల్లేశ్వరి, ఇర్మియా, శ్రీనివాసరావు, ప్రభాకర్, ఏ కోటేశ్వరరావు, హోంగార్డులు మధు, సుధీర్, కిరణ్మయి తదితరులు కేసును ఛేదించారు. మృతురాలిని లక్ష్మిగా గుర్తించడంలో మహిళా కానిస్టేబుల్ మల్లేశ్వరి ప్రతిభ కనబరిచారని రూరల్ ఎస్పీ అప్పలనాయుడు ఆమెను ప్రత్యేకంగా అభినందించారు.

నేడు హెచ్‌ఎంలు గ్యాస్ ఏజెన్సీల వద్దకు రావాలి

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాల్లోని మండల పరిషత్, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులంతా గ్యాస్ ఏజెన్సీలకు వెళ్లి గ్యాస్ కోసం రిజిస్ట్రేషన్ ఫీజు కింద రూ.750లు చెల్లించాలని ఎంఈవో గంఢ్రకోట వెంకటేశ్వరరావు కోరారు. మధ్యాహ్నభోజన పథకానికి సంబంధించి 20 మంది విద్యార్థులుంటే ఒక సిలిండర్, 100 మంది వరకు ఉంటే రెండు సిలిండర్లను ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు. ప్రతి హెచ్‌ఎం ఆధార్‌కార్డు, ఐడెంటిటీ కార్డు, బ్యాంక్ ఎకౌంట్ బుక్, రెండు ఫొటోలను తీసుకుని రావాలన్నారు.

అమ్మకాలకు సిద్ధంగా గణనాథులు


వివిధ సైజులలో కొలువుదీరిన వినాయకుని విగ్రహాలు

● పట్టణంలో నెలకొన్న కోలాహలం

మాచర్ల రూరల్ : చవితి పండుగకు వినాయకుడు సిద్ధమయ్యాడు. భక్తులచే పూజలందుకొని వారి కోర్కెలను తీర్చేందుకు మండపాల వద్ద కొలువుదీరనున్నాడు. తమ భక్తి ప్రపత్తులను చాటుకునేందుకు, మేళతాళాల నడుమ నిమజ్జన యాత్ర సాగించేందుకు ప్రజలు కూడా ఏర్పాట్లను సిద్ధం చేసుకుంటున్నారు. పండుగ మరో నాలుగు రోజులుగా ఉండగానే గ్రామీణ ప్రాంత ప్రజలు పట్టణానికి వచ్చి విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. వీరి రాకతో ముందుగానే పండుగ వాతావరణం నెలకొంది. మాచర్ల-సాగర్ ప్రధాన రహదారిపై గల ఆర్టీసీ గ్యారేజీ వద్ద రాజస్థాన్‌కు చెందిన వారు ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పలు రకాల రంగులు, ప్రతిమలతో చూపరులను కట్టిపడేస్తున్నాయి. 5 నుంచి 15 అడుగుల విగ్రహాలు సైతం ఇక్కడ సిద్ధంగా ఉంచారు. సుమారు 300 గణేష్ విగ్రహాలు ఒకేచోట కొలువుదీరి ఉండడంతో భక్తి పారవశ్యం నెలకొంది. పట్టణానికి చెందిన వ్యాపారులు రాజస్థాన్ వారి వద్ద నుంచి విగ్రహాలను కొనుగోలు చేసి విక్రయిస్తున్నారు. అడుగుకు రూ.1000 చొప్పున ధర నిర్ణయించి అమ్ముతున్నారు.



వ్యాపారం అంతంతమాత్రంగానే ఉంది



ప్రస్తుతం వ్యాపారం అంతంత మాత్రంగానే ఉంది. గతంలో పండుగ పది రోజులు ఉందనగానే ప్రజలు ఎక్కువగా వచ్చి కొనుగోలు చేశారు. ఈ పాటికి సగానికి పైగానే అమ్మేవాడ్ని. కానీ ఈ యేడాది అంతా భిన్నంగా ఉంది. కొన్న ఖరీదు అన్నా వస్తుందోలేదోనని ఆందోళనగా ఉంది. పండుగ మరో నాలుగు రోజులు ఉంది. కొన్న ఖర్చయినా వెళ్తుందని భావిస్తున్నా.

- నరసింహారావు, విగ్రహాల విక్రయదారుడు.

ధరలు అధికంగా ఉన్నాయి



వినాయకుని విగ్రహాలకు విపరీతంగా ధర పెరిగింది. గతేడాదితో పోల్చితే రెట్టింపు ధర ఉంది. గతంలో రూ.4 వేలకు కొన్న విగ్రహం ఇప్పుడు రూ.8 వేల దాకా చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో విగ్రహం కొనాలంటే తలకు మించి భారంగా మారుతోంది. దీనికితోడు నిమజ్జనం రోజున ఇంతకంటే ఎక్కువ ఖర్చు వచ్చేలా ఉంది. పండుగ ఆనందోత్సాహాల మధ్య జరుపుకోలేని పరిస్థితులు దాపురించాయి.

- అంజినాయక్, విగ్రహ కొనుగోలు దారుడు, కేపీ గూడెం.

మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి



గణేష్ విగ్రహాల మండపాలు ఏర్పాటు చేసేందుకు తప్పనిసరిగా అనుమతి ఉండాలి. మైక్ పర్మీషన్ తప్పనిసరి. మండపాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్నా విగ్రహ కమిటీదే బాధ్యత. మండపం వద్ద నిత్యం ఒకరు కాపలాగా ఉండాలి. విగ్రహాల వద్ద బాణాసంచా కాల్పులు నిషేదం. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

- సత్యకైలాస్‌నాథ్, పట్టణ సీఐ.

విద్యార్థి గణనలో 740 మంది నమోదు

రెంటచింతల: సర్వశిక్ష అభియాన్ ద్వారా విద్యార్థి గణన సర్వే కార్యక్రమం మండలంలో ముగిసినట్లు ఎంఈవో గంఢ్రకోట వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. బడిబయట ఉన్న వారు 1175 మంది కాగా వారిలో 740 మందిని పాఠశాలలో సీఆర్పీలు చేర్పించారన్నారు. ఆధార్ లింకేజ్ జరగని, ఏ పాఠశాలలో నమోదు కానివారు 435 మంది ఉన్నారన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు 136 మంది, వయసు తక్కువ ఉన్న వారు 32 మంది, 14 సంవత్సరాల కంటే అధిక వయస్సున్నవారు 184, వివాహం చేసుకున్న వారు 9, మృతి చెందిన వారు 5, బడిబయట ఉన్న వారు 11, వేరే స్కూళ్లలో చదువుతున్న వారు 58 మంది ఉన్నట్లు గంఢ్రకోట చెప్పారు. జూన్ నెలకు సంబంధించి మధ్యాహ్న భోజన పథకానికి 36 ఏజెన్సీలకు రూ.5.30 లక్షలు విడుదలయ్యాయన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతల, జెట్టిపాలెం గ్రామాల్లో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి దేశానికి ఆయన చేసిన సేవలను ప్రస్తుతించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కంచర్ల రాంబాబు మాట్లాడుతూ దేశంలో కంప్యూటర్ రంగానికి ఆద్యుడు రాజీవేనన్నారు. భారత్‌కు శ్రీలంక దేశాలకు మధ్య సుహృద్భావ సంబంధాలను నెలకొల్పే క్రమంలో ఎల్‌టీటీఈ (లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ ఈలం) చేతిలో ప్రాణాలు కోల్పోయారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ము జాన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జరావత్ శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.


రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కాంగ్రెస్ నేతలు

వాసవీ సేవా సమితి సమైక్య జిల్లా ఉపాధ్యక్షుడిగా ప్రసాదరావు

గురజాల: శ్రీ వాసవీ సేవా సమితి సమైక్య నూతన జిల్లా ఉపాధ్యక్షుడిగా గురజాలకు చెందిన మన్నెం ప్రసాదరావు, కార్యదర్శిగా గుండా సురేష్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం నరసరావుపేటలోని సత్తెనపల్లి రోడ్డులో గల విజయ్ కల్యాణ మండపంలో జరిగిన ప్రమాణ స్వీకార మహోత్సవంలో జిల్లా అధ్యక్షుడు కూరపాటి లక్ష్మి పూర్ణచంద్రరావు సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. వీరి ఎన్నికపై పట్టణానికి ఆర్యవైశ్యులు కట్టమూరి గోవర్ధనరావు, ఆకుల నాని, బవిరిశెట్టి అరుణ్‌కుమార్, పల్నూరి శ్రీనివాసరావు, బొగ్గవరపు రామకృష్ణలు హర్షం వ్యక్తం చేశారు.


ప్రసాదరావు, సురేష్

296 మంది పరీక్షకు హాజరు

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ పరీక్షకు 296 మంది హాజరైనట్లు సాక్షర భారతి మండల కో ఆర్డినేటర్ కె.రామాంజనేయులు చెప్పారు. మొత్తం 485 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉందన్నారు. మంచికల్లులోని పరీక్షా కేంద్రాన్ని మాచర్ల నియోకవర్గంలోని ఐదు మండలాల పరిశీలకుడు మల్లికార్జునరావు సందర్శించి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారని ఆయన చెప్పారు.

కొత్తపల్లి గ్రామంలో పారిశుధ్యం పరిశీలన

కొత్తపల్లి, మాచర్లరూరల్ : మాచర్ల మండలంలోని కొత్తపల్లి గ్రామంలో పారిశుధ్యంను ఆదివారం ఈవోపీఆర్డీ గంగామోహన్ పరిశీలించారు. అధ్వాన పారిశుధ్యం నెలకొని ఉండడాన్ని గుర్తించి పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణకు పలు సూచనలు చేశారు. మురుగు కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. అలాగే దోమలు వృద్ధి చెందకుండా చర్యలు చేపట్టాలన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ : ఒకరికి గాయాలు

రెంటచింతల: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటన మండల కేంద్రమైన రెంటచింతలలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద ఆదివారం మధ్నాహ్నం చోటు చేసుకుంది. దాచేపల్లి మండలం మాదినపాడు గ్రామానికి చెందిన మేడబోయిన వెంకయ్య తన కుటుంబంతో మాచర్లకు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన బండి ఆరోగ్యం ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకయ్య కుడి కాలుకు తీవ్ర గాయమైంది. స్థానికంగా ప్రథమ చికిత్స నిర్వహించారు.

జెట్టిపాలెంలో ముత్యాలమ్మ జాతర

రెంటచింతల: మండలంలోని జెట్టిపాలెం గ్రామంలో ఆదివారం ముత్యాలమ్మ జాతర వైభవోపేతంగా నిర్వహించారు. గ్రామ దేవతైన ముత్యాలమ్మకు శ్రావణమాసంలోని ఆదివారం జాతర నిర్వహించడం ఓ ఆనవాయితి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని, కుంకుమబండ్లు కట్టి పురవీధుల్లో ఊరేగించడం వందల సంవత్సరాల నుంచి వస్తున్న ఓ ఆచారం, సంప్రదాయం. అందులో భాగంగా వివధ వర్గాలకు చెందిన మహిళలంతా భక్తి ప్రపత్తులతో పూజలు నిర్వహించడమే గాకుండా బోనాలు సమర్పించారు. కుల, మతాలకు అతీతంగా జరిగే గ్రామోత్సవాల్లో తర తమ బేధం లేకుండా అందరు పాల్గొనడం విశేషం. సకాలంలో వర్షాలు మెండుగా కురవాలని గ్రామం పాడి పంటలతో తులతూగాలని, గ్రామానికి ఎటువంటి అరిష్టలు సంభవించకుండా చల్లని మనస్సుతో కరుణ కటాక్షాలు వీక్షించేలా చూడాలని అందరూ కలిసి మెలిసి ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.


గ్రామదేవత ముత్యాలమ్మ

విగ్రహాలను పగలగొట్టిన దుండగులను అరెస్టు చేయాలి

రెంటచింతల: అనంతపురం జిల్లా హిందూపురం పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలోని విగ్రహాన్ని పగుల గొట్టిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని ఆర్యవైశ్య సంఘాల నేతలు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ దుశ్చర్య వలన రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఆర్యవైశ్యుల హృదయాలు గాయపడ్డాయన్నారు. ఇటువంటి చర్యలు పునరావృతం గాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ ప్రకటన విడుదల చేసిన వారిలో వాసవి ఆలయ చైర్మన్ కట్టమూరి వెంకట నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు గుండా రామ్మూర్తి, కట్టమూరి గణేష్, మండవ రామారావు, పెరుమాళ్ల టాటారావు, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మనిగండ్ల నరసింహారావు, ఏచూరి బుడ్డ, శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ నాళం పెదబాబు, స్వర్గపురి కమిటీ చైర్మన్ పల్నూరి ప్రసాదరావు, ఆత్మకూరి శ్రీనివాసరావు, వైఆర్ఎస్ హైస్కూల్ కరస్పాండెంట్ వైవీ సైదయ్య, ఏచూరి కొండలు, పొట్టిమూర్తి రాంబాబు, నాళం వెంకటేశ్వర్లు, గుండా కిషోర్, కొత్తా రత్నం తదితరులున్నారు.

నేడు ఎస్‌జీటీలకు వీడియో కాన్ఫరెన్స్

రెంటచింతల: ఒకటవ తరగతి నుంచి 8వ తరగతి వరకు బోధిస్తున్న ఎస్‌జీటీలకు అభ్యసన ఫలితాలపై సోమ, మంగళవారాల్లో వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని ఎంఈవో గంఢ్రకోట వెంకటేశ్వరరావు చెప్పారు. 23న స్కూల్ అసిస్టెంట్లకు ఉంటుందన్నారు. ప్రతి పాఠశాల నుంచి మొత్తం టీచర్లలో సగం మంది ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

చంద్రన్న బీమా... బాధిత కుటుంబాలకు ధీమా

- రూ.15లతో రూ.5 లక్షల బీమా
- బీమాలో చేరారు... లబ్ధి పొందారు
- పేదలకు పెద్దన్నగా చంద్రన్న

రెంటచింతల : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అసంఘటిత రంగంలో పనిచేసే వారందరికి తక్కువ ప్రీమియం సంవత్సరానికి రూ.15కే రూ.5 లక్షల ప్రమాద బీమా కల్పించింది. రాష్ట్రంలో కోటిన్నర మందికి ఈ బీమా అందించాలనేది లక్ష్యం. ప్రస్తుతం ప్రజా సాధికార సర్వేలోనే అర్హులైన వారికి చంద్రన్న బీమా నమోదు చేయిస్తున్నారు. త్వరలో విధి విధానాలు మారనున్నాయి. ఏ క్షణాన ఏమి జరుగుతుందో ఎవరు ఊహించగలరు. అలాగే ఎప్పుడు ఏ ప్రమాదంలో అంగవికలురుగా మారవచ్చో.. ఒక్కోసారి విలువైన ప్రాణాలు కోల్పోవచ్చు. అప్పటి వరకు ఇంటి బాధ్యతలు చూసిన వ్యక్తి ఒక్కసారి అసువులు బాస్తే ఊహించుకుంటేనే భయంగా ఉంటుంది. ఆ కుటుంబాన్ని చూసి అయ్యో పాపం అనుకోవడం తప్ప ఎవరూ ఏమీ చేయలేని పరిస్థితి. అయితే అటువంటి ఆపత్కాలంలో బాధిత కుటుంబాలకు ఆసరాగా రాష్ట్ర ప్రభుత్వం చంద్రన్న బీమా పథకం ప్రవేశపెట్టి బాధిత కుటుంబాల్లో స్వాంతన చేకూర్చుతోంది. జీవనం కోసం ప్రమాదకర వృత్తుల్లో పనిచేసే వారి సంఖ్య అధికంగానే ఉంది. అసంఘటిత రంగ కార్మికులైన భవన నిర్మాణ రంగ కార్మికులు, కల్లుగీత, వాహన డ్రైవర్లు, వ్యవసాయ కూలీలు, దుకాణాలు ఫ్యాక్టరీలో పనిచేసే వారు అధికంగా ఉన్నారు. కార్మికుల్లో ఎక్కువ భాగం పేద, మధ్యతరగతి వారే. రెక్కాడితే గాని పూట గడవని స్థితి. గతంలో బీమా చేసుకోవాలంటే చాలీచాలని సంపాదనతో ఏం చేస్తాంలే అంటూ నిట్టూర్చేవారు. కష్టకాలం బీమా పథకాలు ఆయా కుటుంబాలకు ఆసరాగా నిలవడంతో పాటు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది.



విస్తృత ప్రచారం కల్పిస్తున్నాం



ఈ పథకానికి విస్తృత ప్రచారం కల్పిస్తున్నాం. ఇప్పటి వరకు 23,300 మంది సభ్యులుగా చేరారు. జూన్ 2న పిడుగుపాటుకు మృతి చెందిన ముప్పూరి సాంబశివరావు భార్య సత్యవతికి రూ.5 లక్షల చెక్కు ఇచ్చాం. ఈ పథకం ద్వారా మండలంలో సహజ మరణం పొందిన 71 మందికి ఒక్కొక్కరికి రూ.30 వేలు చొప్పున రూ.21.30 లక్షలు ఇచ్చాం. 18 నుంచి 58 సంవత్సరాల లోపు వారు సహజ మరణం చెందితే రూ.30 వేలు. 70 సంవత్సరాల లోపున్న వారు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతే రూ.5 లక్షలు ప్రభుత్వం అందజేస్తోంది. **- ఏపీఎం అంకమరావు.**

బాబు ఆలోచన బాగుంది



ఇంత వరకు ఎవరూ ప్రవేశపెట్టని అద్భుతమైన పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశపెట్టారు. అసలు ఇటువంటి ఆలోచన రావడమే ఎంతో గొప్పవిషయం. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఏడాదికి కేవలం రూ.15 చెల్లిస్తే కలిగే ప్రయోజనం అమోఘం. దాచేపల్లి మండలం గామాలపాడు గ్రామానికి చెందిన గణపా జానకి రామయ్య మే16న ప్రమాదంలో మృతి చెందితే జూన్ 6న అంటే నెలలోపు రూ.5 లక్షల చెక్కును అందించాం. ఇటీవల రెంటచింతలలో మృతి చెందిన షేక్ హుస్సేన్ కుటుంబానికి న్యాయం జరుగుతుంది. **- యరపతినేని శ్రీనివాసరావు, ఎమ్మెల్యే, గురజాల.**

నిదానంపాటి అమ్మ హుండీ లెక్కింపు

అడిగొప్పల (దుర్గి): నిదానంపాడులో కొలువైవున్న శ్రీలక్ష్మి అమ్మవారి ఆలయ సన్నిధి ఆదివారం భక్తుల సందర్శనతో కిటకిటలాడింది. పరిసర జిల్లాల నుంచి సైతం వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. సాయంత్రం హుండీ కానుకలను లెక్కించగా మొత్తం ఆదాయం రూ.2,83,765 సమకూరింది. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యం, కార్యనిర్వహణాధికారి పుణ్యాల వెంకటరెడ్డి, ఆలయ ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు హుండీ కానుకల లెక్కింపును పర్యవేక్షించారు.

కశ్యప్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

మాచర్ల రూరల్: ప్రభుత్వ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ ద్వారా అర్హులైన బ్రాహ్మణ వృద్ధ, వితంతు, దివ్యాంగుల పింఛన్ పథకం కశ్యప్‌కు రిజిస్ట్రేషన్ ప్రారంభమైందని, అర్హులైన వారు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని శ్రీ గాయత్రి బ్రాహ్మణ సంఘం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు దండం రాజు వెంకట హనుమంతరావు, సాగి వెంకట శివనాగరాజు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. జూలై 31 నాటికి 60 సంవత్సరాలు నిండిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

వృద్ధాశ్రమాల్లో అన్నదానం

గురజాల: పట్టణానికి చెందిన కొంగర అఖిల 24వ జన్మదినం సందర్భంగా మండలంలోని గంగవరం గ్రామంలో గల అక్షర ఫౌండేషన్ వృద్ధాశ్రమం, పట్టణంలో ఉన్న ఆనిగ్రేస్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ, అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కత్తి ప్రసంగి, డేవిడ్, సిల్వరాజు, గనిపల్లి సుధాకర్, అనిత, మందా జాన్‌బాబు, విఘ్నేష్ పాల్గొన్నారు.

104 సమాచారం

వెల్దుర్తి మండలంలోని గుండ్లపాడు, పర్లబాయితండా, శివలింగాపురం గ్రామాల్లో సోమవారం 104 వైద్య సేవలు నిర్వహిస్తారు.

సినిమా గైడ్

వెంకటేశ్వర	నేనే రాజు నేనే మంత్రి
నాగార్జున	లై
శ్రీరామ	జయ జానకి నాయక

మాచర్ల కూరగాయల ధరలు (రూ.) 1 కిలో

టమోటా:రూ.60, పచ్చిమిర్చి: రూ.35, బెండ:రూ.15, దొండ:రూ.15, బంగాళదుంప: రూ.20, దోస:రూ.15, వంకాయలు: రూ.20, బీర:రూ.20, క్యారెట్:రూ.50, బీట్‌రూట్:రూ.40, ఉల్లిగడ్డలు:రూ.30 కీర: రూ.40, కాకర:రూ.40, క్యాబేజి రూ20, మునక్కాయ(1):రూ.4, సొరకాయ:రూ.10.

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో సామాజికపరమైన (వ్యక్తిగతమైనవికాదు) సమస్యలు ఉన్నాయా? ఫోన్ చేసి ఆంధ్రజ్యోతికి తెలపండి. ఆ సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారి దృష్టికి తీసుకువెళ్తాం.

సమయం : ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి 8 గంటల మధ్య
ఫోన్ నెంబర్ : 08642 224949

ఘనంగా అమ్మవార్లకు బోనాలు సమర్పణ

మాచర్ల రూరల్: వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో ఆనందంగా ఉండేలా చూడమని వేడుకుంటూ పట్టణంలోని పోలేరమ్మ, చౌడేశ్వరి అమ్మవార్లకు పుర ప్రజలు బోనాలు సమర్పించారు. మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ మహిళలు పెద్ద ఎత్తున బోనాలను తలపై ధరించి ఆలయాలకు ఊరేగింపుగా వచ్చారు. పలు సామాజిక వర్గాలకు చెందిన మహిళలు పోలేరమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించగా యాదవ సంఘం ఆధ్వర్యంలో చౌడేశ్వరి అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు జరిపారు. ఆయా దేవాలయాల్లో అన్నదానం జరిపారు. ముళ్లా శ్రీనివాస్‌యాదవ్, కామన బోయిన కోటయ్య, ముక్కా సోమయ్య, మున్నా యలమంద ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కంచరగుంట గ్రామంలో...

కంచరగుంట (దుర్గి): కంచరగుంట గ్రామంలో ఆదివారం పోలేరమ్మ జాతర వార్షిక మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నైవేద్య నివేదనలు సమర్పించి గ్రామాన్ని చల్లగా చూడాలని వేడుకున్నారు.



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు



అమ్మవారికి నైవేద్యం తీసుకెళ్తున్న మహిళలు

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడతాం

సీపీఐ ఏరియా కార్యదర్శి బాలస్వామిరెడ్డి

మాచర్ల టౌన్: కోట్లాది రూపాయలను కూడగట్టుకొని బోర్డు తిప్పేసిన అగ్రిగోల్డ్ సంస్థ బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడతామని సీపీఐ ఏరియా కార్యదర్శి చవ్వా బాలస్వామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో జరిగిన అగ్రిగోల్డ్ ఏజెంట్స్, కష్టమర్స్ అసోసియేషన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అగ్రిగోల్డ్ ఆస్తులను వేలం వేయించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని అసెంబ్లీ సాక్షిగా హామీనిచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆ హామీని తుంగలో తొక్కారన్నారు. బాధితులను చైతన్య పరిచి వారికి న్యాయం చేసేందుకు సీపీఐ ఆధ్వర్యాన తలపెట్టిన చైతన్య బస్సు యాత్ర ఈనెల 30వ తేదీన మాచర్ల పట్టణానికి చేరుకుంటుందన్నారు. ఈ సమావేశంలో మంత్రునాయక్, మధుసూదనరావు, బాబురావు, పాత వెంకటశివయ్య, ఆదిశంకర్, చంద్రయ్య, కుమార్, సురేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు చూపిన మార్గంలో నడవాలి

విజయపురిసౌత్: ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తు చూపిన మార్గంలో నడవాలని సాగర్‌మాత ఆలయ విచారణ గురువులు ఫాదర్ హృదయకుమార్ అన్నారు. పాప క్షమాపణ కొరకు ఏసుక్రీస్తు తన రక్తాన్ని భూమిపై చిందించారన్నారు. ఏసుక్రీస్తు చిందించిన రక్తం ద్వారానే పాపవిమోచనం కలిగిందన్నారు. ఆదివారం స్థానిక సాగర్ మాతను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులనుద్దేశించి ఆయన దేవుని వాక్యం అందించారు. భక్తులు స్నానాలఘాట్ వద్ద స్నానమాచరించి దైవ దర్శనం చేసుకొని మొక్కుబడులు చెల్లించుకున్నారు. దివ్యబలి పూజతోపాటు ఆలయం చుట్టూ తేరు ప్రదక్షిణ గావించారు. భక్తులు జపమాల క్షేత్రం వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

అడిగొప్పల (దుర్గి): అడిగొప్పల గ్రామంలో ఆదివారం మెగా ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. గుంటూరులోని కార్తికాస్ ఈఎన్‌టీ, కిడ్నీ కేర్ హాస్పిటల్ ఈ సేవా కార్యక్రమాన్ని తలపెట్టింది. డాక్టర్ చిలకల శ్రీనివాసరెడ్డి, డాక్టర్ వరలక్ష్మిదేవి పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో 400 మందిని పరీక్షించి 137 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వీరందరిని గుంటూరు తరలించి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేసి మందులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎన్ఆర్ఐ అకాడమి ఆఫ్ సైన్సెస్, ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల హాస్పిటల్, చిన కాకాని నేత్ర వైద్య నిపుణులు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు నిర్వాహక కమిటీ తెలిపింది.

డీటీకి సన్మానం

దుర్గి: దుర్గి తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారుగా విధులు నిర్వహిస్తున్న తులసీరాంను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఉత్తమ డీటీ అవార్డుకు ఎంపికై మంత్రి అయ్యన్నపాత్రుడు చేతుల మీదుగా గౌరవ పురస్కారం అందుకున్న నేపథ్యంలో తోటి ఉద్యోగులు ఈ సన్మాన కార్యక్రమం తలపెట్టారు. పూలమాలలు వేసి దుశ్శాలువాలతో సన్మానించి అభినందించారు. తహసీల్దారు శివన్నారాయణమూర్తి, ఆర్ఐ ప్రభాకర్, వీఆర్వోలు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

బ్రాహ్మణులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

మాచర్లటౌన్ : కారంపూడి గ్రామానికి చెందిన బ్రాహ్మణులు ఆదివారం మాచర్ల పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి చలమారెడ్డిని కలిసి తమకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. స్పందించిన చలమారెడ్డి అర్హులైన పేద బ్రాహ్మణులకు స్థలాలు కేటాయించేలా చూస్తానని హామీనిచ్చారు. చలమారెడ్డిని కలిసిన వారిలో దిలీప్‌చార్యులు, మారేపల్లి రమణాచార్యులు, విజయ్‌శర్మ, దిడుగు రవిశేఖర్ ఉన్నారు.



ఇళ్ల స్థలాలు కేటాయించాలని నియోజకవర్గ ఇన్‌చార్జి చలమారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బ్రాహ్మణులు

పాప మృతిపై ప్రభుత్వాసుపత్రిలో విచారణ



సమావేశంలో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ ప్రసన్నకుమార్, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో రమేష్

వినుకొండ రూరల్: ప్రభుత్వ వైద్యశాలలో ఇంజెక్షన్ వికటించి 2 సంవత్సరాల పాప మృతిచెందిన ఘటనపై జిల్లా అధికారులు డీసీహెచ్‌ఎస్ ప్రసన్నకుమార్, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో రమేష్ ఆదివారం వైద్యాధికారులపై విచారణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాప మృతికి ఇంజెక్షన్ కారణం కాదని, విషపురుగుగానీ, పాముగానీ కుట్టి ఉండవచ్చని తెలిపారు. ఆసుపత్రిలో బయోమెట్రిక్ విధానం పెట్టినా కాని వైద్యులు ఎటువంటి మార్పు లేదని, దీనిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ఆసుపత్రిలోని లోపాలను గుర్తించి సమస్యలను పరిష్కరించేందుకు సత్వరమే చర్యలు తీసుకుంటామన్నారు. ఆసుపత్రిలో మౌలిక వసతుల మెరుగుపరిచి రోగులకు వైద్యం అందిస్తామన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ శివరాంప్రసాద్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఎం.ఎన్.ప్రసాద్, పి.వి.సురేష్‌బాబు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి అంటే దోచుకోవడం కాదు

● వైసీపీపై టీడీపీ జిల్లా అధ్యక్షుడు జీవీ ధ్వజం



ఆంధ్రజ్యోతి, గుంటూరు: 'అభివృద్ధి అంటే తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని లక్ష కోట్లు దోచుకొని దాచుకోవడం కాదు.... రాష్ట్ర ప్రజలను ముందుండి నడిపించడం' అని జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు విపక్షంపై విరుచుకుపడ్డారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 'రాయలసీమను రత్నాల సీమగా మార్చడం ఎన్టీఆర్‌తో ప్రారంభమైంది. దానిని ముఖ్యమంత్రి చంద్రబాబు పూర్తి చేస్తున్నారు. మూడున్నర సంవత్సరాలలో రాష్ట్రం ఏ విధంగా అభివృద్ధి చెందిందో ప్రజలకు తెలుసు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే అదర్శంగా నిలిచాయి. ఈ విషయాలన్ని మరిచి వైసీపీ నాయకులు అసత్య ఆరోపణలు చేయటం సమంజసం కాదు. రాజకీయాల్లో 40 ఏళ్ల సుధీర్ఘ అనుభవం ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు నీతులు చెప్పే స్థాయి వైసీపీ నాయకులకు లేదు. ముఖ్యమంత్రిని నడిరోడ్డు మీద కాల్చి చంపండి, ఉరితీయ్యండి, గుడ్డలు ఊడతీస్తా అంటూ అనుచిత వ్యాఖ్యలు చేసిన జగన్‌ను ప్రజలు ఛీ కొడుతున్నారు. ప్రతి శుక్రవారం కోర్టు మెట్లెక్కే అతిపెద్ద ఆర్థిక నేరస్థుడు జగన్‌కు నంద్యాలలో ఓట్లు అడిగే హక్కు ఎక్కడది? జగన్ మీడియాను అడ్డుపెట్టుకొని ఇష్టానుసారంగా కథనాలను ప్రచురించడం ప్రజలు గమనిస్తున్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ మున్సిపల్ సేవలు పూర్తి స్థాయిలో ఆన్‌లైన్‌లో లభించడం లేదు. ఒక్క ఏపీలోనే అది సాధ్యమైంది. మున్సిపాలిటీల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం. పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారు...' అని జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు.

జీజీహెచ సీటీ టెక్నీషియన్లపై ఆరోపణలు: కొనసాగుతున్న విచారణ

గుంటూరు(సంగడిగుంట): గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో సీటీ టెక్నిషియన్‌లు తన వద్ద లంచం తీసుకున్నారంటూ శనివారం చైతన్య కళాశాల యాజమాన్యం చేసిన ఫిర్యాదుపై సీసీ కెమెరాలను పరిశీలించారు. ఫిర్యాదుదారుడు, తేజస్విని బంధువు తనను సీటీ టెక్నిషియన్ పరీక్షకు రూ. 15 వేలు అడగగా రూ. 5 వేలు ఇచ్చానని చైతన్య కళాశాల యాజమాన్యానికి ఫిర్యాదు చేశాడు. కళాశాల యాజమాన్యం జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేసింది. శనివారం చైతన్య కాలేజీ బస్సును ఆయిల్ ట్యాంకర్ ఢీకొన్న ఘటనలో గాయపడిన తేజస్వినికి నిర్వహించిన బ్రెయిన్ స్కాన్‌కు ప్రైవేటు ల్యాబులో నైనా రూ. 2 వేలు ఫీజు తీసుకుంటారు. అటువంటి దానికి రూ. 15 వేలు అడిగారనడం ఆశ్చర్యమే. రూ.5 వేలు ఇచ్చానన‌డం కూడా నమ్మశక్యంగా లేదు. తేజస్వినిని జీజీహెచ్‌కు తీసుకొచ్చిన శనివారం ఉదయం 8.11 గంటలనుంచి తిరిగి వెళ్లే వరకు సీసీ కెమెరాలను పరిశీలించారు. ఆ సమయంలో టెక్నిషియన్‌గా ఉన్న జయ గాని, ఆమె బంధువులు గానీ మాట్లాడుకున్నట్లు కనిపించలేదు. బయటకు వెళ్లినట్లుగా కూడా సీసీ కెమెరాల్లో నమోదు కాలేదు. ఫిర్యాదుదారుడికి కబురు చేయగా అతడు ఆదివారం రాత్రి వరకు రాలేదు. తేజస్విని పోగులు కూడా దొంగిలించారని ఫిర్యాదు చేశాడు. తేజస్విని పోగులను సీటీ సిబ్బంది సెక్యూరిటీకి ఇవ్వగా ఆమె తేజస్విని బంధువుకు ఇచ్చినట్లు తెలిపింది. ఆమె కూడా విచారణకు హాజరు కాలేదు. జీజీహెచ్‌కు వచ్చేటప్పటికే ఒక చెవికి పోగులు లేని విషయం సీసీ కెమెరాల్లో కనిపిస్తోంది. రెండో చెవికి ప్రథమ చికిత్స చేశారు. తర్వాతే జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. జీజీహెచ్ అధికారులు సోమవారం తేజస్విని బంధువుని, సీటీ టెక్నిషియన్‌ను, సెక్యూరిటీ మహిళను ఒకేసారి విచారించాలని నిర్ణయించారు. సీటీ టెక్నిషియన్ పేరుతో వేరే ఎవరైనా అడిగారా అనే దానిపై కూడా అనుమానాలు వస్తున్నాయి.

రైతుల ఆదాయం రెట్టింపు చేయాలి

● జేసీ-2 ముంగా వెంకటేశ్వరరావు



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ-2 ముంగా వెంకటేశ్వరరావు

(ఆంధ్రజ్యోతి, గుంటూరు)

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలని జేసీ-2 ముంగా వెంకటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. కేంద్రం మేరకు ఈ నెల 21 సోమవారం సంకల్ప సిద్ధి అనే కార్యక్రమాన్ని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీని ఏర్పాట్లపై ఆదివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సమీక్షించారు. న్యూ ఇండియా మథనం పేరుతో శ్రీ వెంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏర్పాట్లను ఆయన చర్చించారు. ఉత్పత్తి పెరుగుదల, ఇన్‌పుట్ ప్రభావిత ఉపయోగాలు, ఉత్పత్తి తరువాత నష్టాలను తగ్గించడం, విలువ ఆధారిత వృద్ధి, నూతన మార్కెటింగ్ విధానాల ద్వారా అధిక ఆదాయం, వ్యవసాయ రంగంలో ఒడిదుడుకుల నివారణ, వ్యవసాయ అనుబంధ రంగాలను బలోపేతం చేయడం వంటి అంశాల ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నట్లు చెప్పారు. విజ్ఞాన మందిరంలో సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి సుజనా చౌదరి పాల్గొంటున్నారు. రాష్ట్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరవుతారు. సుమారు వెయ్యి మంది రైతులు కార్యక్రమంలో పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం సంకల్ప సిద్ధి కార్యక్రమాన్ని ప్రకటించిన తరువాత దేశం మొత్తం మీద గుంటూరు జిల్లాల్లో మొదటి సారిగా దీనిని నిర్వహిస్తున్నట్లు ముంగా వెంకటేశ్వర్లు చెప్పారు. కార్యక్రమానికి హాజరయ్యే వారికి తాగునీరు, ఆహార సౌకర్యాలు కల్పించాలన్నారు. విజ్ఞాన మందిరం వెలుపల రైతులకు ఉపయోగపడే విధంగా వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన నిర్వహించాలన్నారు. కార్యక్రమం పూర్తయ్యే వరకు విద్యుత్ కోత లేకుండా చూడాలన్నారు. సమావేశంలో కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ యుగంధర్ కుమార్, తిరుపతి శ్రీ వెంకటేశ్వర పశు వైద్యవిశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు డి.శ్రీనివాసులు, రిజిస్ట్రార్ డాక్టర్ జి.గంగరాజు ప్రసంగించారు.

ఏకపక్షంగా ఎల్‌వీఆర్ క్లబ్ ఎన్నికలు

- డాక్టర్ రాయపాటి ప్యానల్ ఘన విజయం
- చంద్రమౌళి ప్యానల్‌కు రెండు పదవులు

గుంటూరు: ఆసక్తికరంగా, ఉత్కంఠగా జరిగిన ఎల్‌వీఆర్ అండ్ సన్స్ క్లబ్ పాలక వర్గ ఎన్నికల్లో డాక్టర్ రాయపాటి ప్యానల్ ఘన విజయం సాధించింది. ఈ ఎన్నికల్లో మూడు ప్యానల్స్ బరిలోకి గతంలో ఎన్నడూ లేనివిధంగా పోరు ఉత్కంఠగా సాగింది. అయితే ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితాలు ఏకపక్షంగా వచ్చాయి. అధ్యక్ష కార్యదర్శుల సహా 15 పదవులకు మూడు ప్యానల్స్ నుంచి అభ్యర్థులు పోటీలో నిలిచారు. ఈ ప్యానల్స్‌తో సంబంధం లేకుండా క్లబ్ కార్యదర్శి పదవికి గింజుపల్లి శివప్రసాద్ పోటీ చేశారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మూడు గంటల వరకు పోలింగ్ జరగ్గా 1300 మంది సభ్యులకుగాను సుమారు 1142 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు కౌంటింగ్ జరిగింది. అనంతరం ప్రకటించిన ఫలితాల్లో డాక్టర్ రాయపాటి శ్రీనివాస్‌తో పాటు ఆయన ప్యానల్‌కు చెందిన 12 మంది విజయం సాధించారు. మువ్వా చంద్రమౌళి ప్యానల్ నుంచి ఇద్దరు అనూహ్యంగా గెలుపొందారు.

● క్లబ్ అధ్యక్షుడిగా డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ రెండోసారి ఘన విజయం సాధించారు. డాక్టర్ రాయపాటికి 625 ఓట్లు రాగా సుబ్బారావుకు 259, మారుతీవరప్రసాద్‌కు 223, సుబ్బయ్యకు 28 ఓట్లు వచ్చాయి. డాక్టర్ రాయపాటి 366 ఓట్ల మెజార్టీ లభించింది.

● కార్యదర్శి పదవికి పోటీ పడిన కోవెలమూడి రవీంద్రకు 430, వినాయకరావుకు 346, చంద్రమౌళికి 324, గింజుపల్లి శివప్రసాద్‌కు 20 ఓట్లు లభించాయి. కాగా రాయపాటి ప్యానల్‌కు చెందిన రవీంద్ర 84 ఓట్లతో గెలుపొందారు.



గెలుపొందిన డాక్టర్ రాయపాటి ప్యానల్ సభ్యులైన డాక్టర్ రాయపాటి, కోవెలమూడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కమిటీ సభ్యులు

● సంయుక్త కార్యదర్శి పదవికి పోటీ చేసిన మాదాల వెంకటేశ్వర్లుకు 426, రావి శ్రీనివాసరావు 325, కాంతారావుకు 323 ఓట్లు వచ్చాయి. రాయపాటి ప్యానల్‌కు చెందిన వెంకటేశ్వర్లు 101 ఓట్లతో గెలుపొందారు.

● ఉపాధ్యక్ష పదవికి పోటీ చేసిన గులకవరపు రవికుమార్‌కు 480, పతంగి జనార్దనరావుకు 380, కొసనా వెంకటేశ్వరరావుకు 240 ఓట్లు వచ్చాయి. రాయపాటి ప్యానల్‌కు చెందిన రవికుమార్ 100 ఓట్లతో విజయం సాధించారు.

● కోశాధికారి పదవికి పోటీచేసిన దేవరశెట్టి సత్యనారాయణ(చిన్ని) 62 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈయన కూడా రాయపాటి ప్యానల్ నుంచి పోటీ చేశారు.

● విశ్రాంతి గదుల విభాగంలో ఏటుకూరు రత్నకుమార్ 179, సాంఘిక సంక్షేమ, క్రీడా కార్యక్రమాల విభాగంలో మధుసూదనరావు 218, జిమ్, సూపర్‌బజారు విభాగంలో బచ్చు రమేష్‌కుమార్ 209, రీడింగ్ రూమ్, లైబ్రరీ విభాగంలో పాటిబండ్ల సాంబశివరావు 165, బఫే విభాగంలో కొండ్రగుంట శ్రీనివాసరావు 190, కళలు, సాంస్కృతిక, వైజ్ఞానిక కార్యక్రమాల విభాగంలో కాట్రగడ్డ రామకృష్ణప్రసాద్ 516, బార్ విభాగంలో కోట సతీష్ 253, టెన్నిస్ విభాగంలో తరిగోపుల వెంకటేశ్వరరావు 152 ఓట్లతో గెలుపొందారు. వీరందరూ రాయపాటికి ప్యానల్‌కు చెందిన వారు కావడంతో ఆ వర్గంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. బిలియర్డ్స్ విభాగంలో చంద్రమౌళి ప్యానల్‌కు చెందిన సాంబశివరావు 21, వైద్యశాల విభాగంలో డాక్టర్ ప్రసాద్ 338 ఓట్ల మెజార్టీ సాధించారు.

ఐరన్, హార్డ్‌వేర్, ప్రింట్ మర్చెంట్స్ ఆధ్వర్యంలో ఉపకార వేతనాల పంపిణీ

గుంటూరు(విద్య): స్థానిక పట్నం బజారులో ఐరన్, హార్డ్‌వేర్, అండ్ ప్రింట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఆదివారం ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. మొత్తం 60 మంది విద్యార్థులకు రూ. 2 వేల చొప్పున అందజేశామని సంఘం అధ్యక్షులు కొమ్మినేని సీతారామయ్య వెల్లడించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు కొప్పురావూరి నాగార్జునప్రసాద్, ఉపాధ్యక్షులు తాడికొండ శ్రీనివాసరావు, గ్రంధి గాంధీబాబు, సహాయ కార్యదర్శులు చీమకుర్తి శివరామకృష్ణప్రసాద్, జీవీఎల్ఎన్ ప్రసాద్, కొప్పురావూరి వెంకట శివనాగప్రసాద్, కోశాధికారి నేరళ్ళ శ్రీనివాసరావు తదితరులు పాల్గొని ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు చెక్కులు అందజేశారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించ తలపెట్టిన అమరావతి - అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవే బాలారిష్టాలను ఎదుర్కొంటోంది. పరిహారంపై రైతులు పట్టు పట్టడం.. బృందాలను అడ్డగిస్తుండడంతో అధికార యంత్రాంగం తాత్కాలికంగా సర్వే నిలిపివేసింది. మరోవైపు భూ సేకరణ ఏ చట్టానికి లోబడి చేయాలో స్పష్టత లేకపోవడంతో కేంద్ర నిర్ణయం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎదురుచూస్తోంది.



పరిహారంపై పట్టు!

- **నిలిచిన ఎక్స్‌ప్రెస్ వే సర్వే ● బృందాలను అడ్డగిస్తున్న రైతులు**
- **91 కిలోమీటర్లలో 34.5 సర్వే పూర్తి**
- **నష్టపరిహారంపై స్పష్టత ఇవ్వాలని కోరుతోన్న రైతులు**
- **భూసేకరణకు ఎన్‌హెచ్ చట్టమా... 2013 చట్టమా?**
- **స్పష్టత కోసం ఎదురు చూస్తున్న జిల్లా యంత్రాంగం**

ఆంధ్రజ్యోతి, గుంటూరు:
అమరావతి - అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవే భూసేకరణలో ప్రాథమిక ప్రక్రియ అయిన సర్వే పనులు గుంటూరు జిల్లాలో నిలిచిపోయాయి. సర్వేకు వెళుతున్న బృందాలను రైతులు అడ్డగిస్తూ నష్టపరిహారం తేల్చాల్సిందిగా కోరుతుండటంతో అధికార యంత్రాంగం తాత్కాలికంగా సర్వే నిలిపేసింది. మరోవైపు భూసేకరణ నేషనల్ హైవే యాక్టు ప్రకారం చేపట్టాలా లేక 2013 భూసేకరణ చట్టం కింద సేకరించాలనే దానిపై స్పష్టత లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నిర్ణయం కోసం ఎదురు చూస్తోంది. జిల్లాలో సుమారు 91 కిలోమీటర్ల పొడవున ఎక్స్‌ప్రెస్ హైవే కోసం భూములను సేకరించాల్సి ఉండగా ఇప్పటివరకు 34.5 కిలోమీటర్ల పొడవునా సర్వే పూర్తి అయింది. మరో 56 కిలోమీటర్ల మేరకు పెగ్ మార్కింగ్ చేసిన భూములను సర్వే చేయాల్సి ఉంది. ప్రధానంగా ఈ భూములు తాడికొండ, మేడికొండూరు, ఫిరంగిపురం మండలాల్లో ఎక్కువగా ఉన్నట్లు సర్వే విభాగం అధికారులు తెలిపారు.

హైవే రూపం ఇదీ..
రాయలసీమ ప్రాంతాన్ని అమరావతి రాజధాని నగరంతో అనుసంధానం చేసేందుకు 598.78 కిలోమీటర్ల పొడవునా నాలుగు, ఆరువరుసల ఎక్స్‌ప్రెస్ వే నిర్మించేందుకు కేంద్రం అంగీకారం తెలిపింది. ఇందుకోసం రూ.27,635 కోట్ల నిధులు అవసరమౌతాయని ప్రాథమికంగా అంచనా వేశారు. 120 కిలోమీటర్ల మేరకు వాహనాల వేగాన్ని తట్టుకొనేలా డిజైన్‌లు రూపొందించారు. అనంతపురం నుంచి అమరావతి వరకు నేరుగా ఈ రోడ్డు ఉంటుంది. కర్నూలు, కడప జిల్లాలకు కూడా కనెక్టివిటీని కల్పించేందుకు నాలుగు వరసల రహదారులను నిర్మిస్తారు. గిద్దలూరు వద్ద నుంచి అమరావతి వరకు ఈ రోడ్డు ఆరు వరసలుగా ఉంటుంది. జిల్లాలో నూజెండ్ల, వినుకొండ, చిలకలూరిపేట, నాదెండ్ల, మేడికొండూరు, ఫిరంగిపురం, తాడికొండ, తుళ్లూరు మండలాల మీదగా రోడ్డు నిర్మాణం ఎలైన్‌మెంట్ చేశారు. డిజైన్ ప్రకారం పెగ్ మార్కింగ్ పూర్తి చేసిన రెవెన్యూ శాఖ ఆ వెంటనే భూముల సర్వే ప్రారంభించింది. నూజెండ్ల, వినుకొండ, నాదెండ్ల మండలాల్లో సర్వేని పూర్తి చేశారు. మొత్తం 1,500 ఎకరాల్లో సర్వే జరిగినట్లు జాయింట్ కలెక్టర్ కృతిక శుక్ల తెలిపారు. సర్వే సమయంలో నష్టపరిహారం గురించి రైతులు ప్రశ్నిస్తోన్నందున తాడికొండ నుంచి చిలకలూరిపేట వరకు సర్వేని నిలిపేశారు.

నష్ట పరిహారంపై ...
ప్రధానంగా తాడికొండ, మేడికొండూరు, ఫిరంగిపురం, చిలకలూరిపేటల్లో భూముల ధరలు అధికంగా ఉన్నాయి. కొన్ని చోట్ల ఎకరం రూ.కోటికి పైగానే ఉన్నది. ఈ నేపథ్యంలో రైతులు ప్రభుత్వం చెల్లించే నష్టపరిహారం ఎంతో చెప్పాల్సిందిగా ఏ పట్టుబడుతున్నారు. తాడికొండ మండలంలోని అన్ని పార్టీల రైతులు ఏకమై నిరసన కార్యక్రమాలు కూడా నిర్వహించారు. సహజంగా భూముల రిజిస్ట్రేషన్ విలువకు మూడు రెట్లకు తగ్గకుండా నష్టపరిహారం అందుతుంది. అయితే రైతులు రాజధాని ప్యాకేజ్‌ని కోరుతూ ఆందోళనలను నిర్వహిస్తోండటంతో సర్వేని నిలిపేశారు. జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ నుంచి ఇంకా నోటిఫికేషన్ కూడా రాని కారణంగా ఈ నిర్ణయాన్ని తీసుకొన్నట్లు అధికారులు తెలిపారు. భూములను ఏ చట్టం కింద సేకరించాలో తెలియని పరిస్థితి నెలకొన్నది. జాతీయ రహదారుల నిర్మాణం కోసం ప్రత్యేకంగా యాక్టు ఉన్నది. అలానే 2013లో యూపీయే ప్రభుత్వం మరో భూసేకరణ చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ రెండింటిలో ఏ చట్టాన్ని అమలు చేయాలో తెలియక కేంద్ర నిర్ణయం కోసం అధికారులు లేఖలు రాశారు. కేంద్రం నుంచి స్పష్టత వచ్చాకే ముందుకు వెళతామని జిల్లా అధికారులు తెలిపారు.

భూ సేకరణ పునరావాస కార్యాలయం ప్రారంభం


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ లక్ష్మీకాంతం

ఆంధ్రజ్యోతి, విజయవాడ: విజయవాడ ప్రభుత్వ అతిథి గృహ ప్రాంగణంలో ఆదివారం భూ సేకరణ పునరావాస కార్యాలయాన్ని ప్రారంభించారు. కలెక్టర్ లక్ష్మీకాంతం, సంస్థ ప్రిసైడింగ్ అధికారి, రిటైర్డ్ జడ్జి జగన్నాథం, విజయవాడ ఆర్డీవో ఎన్ హరీష్, అర్బన్ తహసీల్దార్ ఆర్.శివరావు, డిప్యూటీ కలెక్టర్ శారద, ఆర్ అండ్ బి ఈఈ ఏఎల్ మాధవస్వరూప్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీకాంతం మాట్లాడుతూ, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో భూ సమస్యలను పరిష్కరించడానికి ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 2013 భూ సేకరణ చట్టం మేరకు అవార్డులు పాస్ అయిన తరువాత సివిల్ కోర్టులకు అధికారాలు ఉండవని స్పష్టం చేశారు. టైటిల్, పరిహారం చెల్లింపు తదితర విషయాలలో ఏవైనా వివాదాలు ఉన్నట్టయితే వాటిని ఈ కార్యాలయం ద్వారా మాత్రమే పరిష్కరించుకోవడానికి వీలుంటుందని తెలిపారు. సంస్థ ప్రిసైడింగ్ అధికారి అటు ప్రభుత్వానికి, ఇటు రైతులకు అనుసంధానంగా వ్యవహరిస్తారని, భూములు, భవన యజమానులకు నష్టం వాటిల్లకుండా చట్టం మేరకు తీర్పులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అమరావతి, విజయవాడ పరిసర ప్రాంతాలలో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. కొత్త రోడ్ల నిర్మాణం, రహదారుల విస్తరణ ఇంకా పలు పనులను చేపట్టడానికి భూమి అవసరం ఉందని తెలిపారు. భూ సేకరణకు సంబంధించి యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలకు ఈ సంస్థ చక్కటి పరిష్కార వేదికగా నిలుస్తుందని తెలిపారు. ప్రిసైడింగ్ అధికారి చక్కని సూచనలు, సలహాలు కూడా ఇవ్వనున్నారని తెలిపారు.

సకాలంలో గుర్తిస్తే చిన్నపిల్లల్లో గుండెజబ్బుల నివారణ

డాక్టర్ ఎన్.శ్రీనాథ్‌రెడ్డి


ప్రసంగిస్తున్న శ్రీనాథ్‌రెడ్డి


సదస్సుకు హాజరైన చిన్నపిల్లల వైద్య నిపుణులు

విజయవాడ (లబ్బీపేట) : చిన్నపిల్లల్లో గుండె సంబంధిత వ్యాధులను సకాలంలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని ప్రముఖ చిన్నపిల్లల గుండె వైద్య నిపుణుడు ఎన్.శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. డాక్టర్ రమేష్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో హోటల్ గేట్‌వేలో ఆదివారం కృష్ణా, గుంటూరు, ప్రకాశం, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన చిన్నపిల్లల వైద్య నిపుణులతో చిన్న పిల్లల గుండె సమస్యలపై అవగాహన సదస్సు (కంటిన్యూ మెడికల్ ఎడ్యుకేషన్) జరిగింది. ఈ సదస్సులో డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డితో పాటు కొచ్చికి చెందిన వైద్యులు మహేష్, ఎడ్విన్, ముంబాయికి చెందిన శ్రీనివాస్‌లు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నపిల్లల్లో పుట్టుకతో వచ్చే గుండె సమస్యలు ముందే గుర్తిస్తే ప్రస్తుతం సరికొత్త వైద్య విధానాల ద్వారా పూర్తిగా తగ్గించవచ్చని తెలిపారు. భారతదేశంలో లక్షల మంది చిన్నారులు గుండె సమస్యల బారిన పడుతున్నారని ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి సంవత్సరం పది వేల మంది చిన్నారులు గుండె సంబంధిత వ్యాధులకు గురవుతున్నారని, వారిలో కేవలం 2500 మందికి మాత్రమే ఆపరేషన్‌లు చేస్తున్నా మిగిలిన వారిని సరైన సమయంలో గుర్తించలేకపోవడం జరుగుతోందన్నారు. చిన్నారుల్లో ఆయాసం, పాలు సరిగ్గా తాగకపోవడం, బరువు పెరగటం, నీలంగా మారడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. గర్భిణీ సమయంలో స్కానింగ్ పరీక్షల్లో శిశువుకు గుండె సంబంధిత వ్యాధులను కూడా గుర్తిస్తే ముందుగా వైద్యం అందించటం ద్వారా సమస్యలను నివారించవచ్చని తెలిపారు. అనంతరం రమేష్ హాస్పటల్స్ ఎండీ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల నుంచి నుంచి తమ ఆసుపత్రిలో దాదాపు వెయ్యి వరకు చిన్న పిల్లలకు వివిధ గుండె సమస్యలపై చికిత్స అందించటం జరిగిందని, వీటిలో 80 శాతం కేసులు ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందించినట్టు తెలిపారు. ముందుగానే తల్లిదండ్రులు, డాక్టర్స్ చిన్నారులలో సంభవించే గుండె సమస్యలను గుర్తించినట్లయితే ఎంత క్లిష్టమైన జబ్బునైనా నిర్మూలించవచ్చని తెలిపారు. ఈ సదస్సులో నాలుగు జిల్లాల డాక్టర్లు పాల్గొన్నారు.

సాంకేతికతపై పట్టు తప్పనిసరి

- డాక్టర్ సుబ్బారావు సూచన
- ముగిసిన ఏపీ ఎపికాన్ వార్షిక సదస్సు
- క్విజ్‌లో జీఎంసీకి ద్వితీయ స్థానం
- పోస్టర్ ప్రజెంటేషన్‌లో కేజీహెచ్ విజేత
- వచ్చే ఏడాది కడపలో రాష్ట్ర సదస్సు


బహుమతులు అందజేస్తున్న ప్రొఫెసర్లు సుబ్బారావు, భాస్కరావు, త్రిమూర్తిరావు

గుంటూరు (మెడికల్): వైద్య రంగంలో చోటు చేసుకుంటున్న నూతన శస్త్రచికిత్స పద్ధతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై వైద్య నిపుణులు అవగాహన పెంచుకోవాలని గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్, సదస్సు ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ జి.సుబ్బారావు సూచించారు. గుంటూరు వైద్య కళాశాల జింకానా ఆడిటోరియంలో జరుగుతున్న భారతీయ శస్త్రచికిత్స వైద్యనిపుణుల సంఘం (ఏఎస్ఐ) ఆంధ్రప్రదేశ్ శాఖ వార్షిక సదస్సులో ఆదివారం జరిగిన ముగింపు సభలో ఆయన ప్రసంగించారు. మూడు రోజుల సదస్సుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో వైద్యనిపుణులు హాజరయ్యారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రసిద్ధి చెందిన సర్జన్లు ఈ సదస్సులో వివరించిన అంశాలు, నేర్పిన శస్త్రచికిత్సలు పీజీ విద్యార్థులకు ఎంతగానో ప్రయోజనం కలిగిస్తుందని డాక్టర్ సుబ్బారావు అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సదస్సు నిర్వాహణ కమిటీ సభ్యులు డాక్టర్ నూతలపాటి శ్రీనివాసరావు, డాక్టర్ టి.వాసుకిషోర్, డాక్టర్ అత్తోట సతీష్‌బాబు, డాక్టర్ ఉమాశంకర్, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గన్నీ భాస్కరరావు తదితరులు ప్రసంగించారు.

రాష్ట్ర అధ్యక్షుడిగా త్రిమూర్తిరావు..

భారతీయ శస్త్రచికిత్స వైద్యనిపుణుల సంఘం (ఏఎస్ఐ) ఆంధ్రప్రదేశ్ శాఖ నూతన అధ్యక్షుడుగా డాక్టర్ ఏ త్రిమూర్తిరావు ఎన్నికయ్యారు. ఆదివారం సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. ప్రస్తుత ఏపీ చాప్టర్ అధ్యక్షుడు డాక్టర్ జి.భాస్కరరావు పదవీకాలం ముగిసింది. డాక్టర్ కేఆర్‌సీ నాయుడు ప్రెసిడెంట్ ఎలెక్ట్‌గా ఎంపికయ్యారు. భారతీయ శస్త్ర చికిత్స వైద్యనిపుణుల సంఘం ఏపీ శాఖ 41వ వార్షిక సదస్సు వచ్చే ఏడాది కడపలో జరుగుతుందని ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ సుబ్బారావు ప్రకటించారు.

క్విజ్‌లో జీఎంసీకి ద్వితీయ స్థానం..

పీజీ విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో రంగరాయ మెడికల్ కళాశాల (కాకినాడ) టీమ్స్ విన్నర్స్‌గా నిలిచింది. గుంటూరు వైద్య కళాశాల రన్నర్స్‌గా రెండో స్థానంలో నిలిచింది. పీజీ పోస్టర్ ప్రజెంటేషన్ విభాగంలో మొత్తం 80 పేపర్లు రాగా, ఇందులో ఆంధ్ర మెడికల్ కాలేజ్ (విశాఖపట్నం)కు చెందిన డాక్టర్ దీపిక సమర్పించిన పోస్టర్ బెస్ట్ పోస్టర్‌గా ఎంపికైంది. ఎన్నారై మెడికల్ కాలేజీ (గుంటూరు)కు చెందిన పీజీ డాక్టర్ హుస్సేన్ సమర్పించిన పోస్టర్ ద్వితీయ బహుమతికి ఎంపికైంది. వ్యాఘ్రేశ్వరుడు బెస్ట్ పేపర్ అవార్డుకు స్విమ్స్ (తిరుపతి)కి చెందిన డాక్టర్ నితీష్ ఎంపికయ్యారు. ఏఎస్ఐ రాష్ట్ర విభాగంలో ఉత్తమ శాఖగా కర్నూలు ఎంపికైంది. ఆ శాఖ తరపున డాక్టర్ రామ్మోహన్ అవార్డు అందుకున్నారు.

ఆసక్తికరంగా లైవ్ వర్క్‌షాప్..

చివరి రోజు ఆదివారం లైవ్ సర్జికల్ వర్క్‌షాప్ హైలైట్‌గా నిలిచింది. ప్రభుత్వాస్పత్రిలో నిర్వహించిన పలు శస్త్రచికిత్సలను వైద్య కళాశాలలోని ఆడిటోరియంలో భారీ స్క్రీన్‌లపై ప్రత్యక్ష ప్రసారం చేశారు. ల్యాప్రోస్కోపీ శస్త్రచికిత్సలు నిర్వహించిన వైద్యనిపుణులు.. ఆపరేషన్ చేస్తూనే ఆడిటోరియంలో వాటిని తిలకిస్తూ వైద్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. కొలిసిస్టెక్టమీ, పాంక్రియాటిక్ సర్జరీ, రొమ్ము కేన్సర్, ఫైల్స్ ఆపరేషన్, బేరియాట్రిక్ సర్జరీ వంటి పలు రకాల శస్త్రచికిత్సలు నిర్వహించారు. జింకానా ఆడిటోరియంలో డాక్టర్ ఉమాశంకర్ సంధానకర్తగా వ్యవహరించారు. సాంకేతిక సమస్యలతో స్క్రీన్‌పై ఆపరేషన్ దృశ్యాలు కొద్ది సేపు కనిపించకపోవడంతో తిలకిస్తున్న వైద్యులు అసౌకర్యానికి గురయ్యారు.


ఆడిటోరియంలో ఆపరేషన్ ప్రత్యక్ష ప్రసారం

పనిభారం తగ్గించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవీడీ ప్రసాద్

పంచాయతీ కార్యదర్శుల సంఘం డిమాండ్

మంగళగిరి: రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న కార్యదర్శులపై పనిభారం తగ్గించి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవీడీ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం మంగళగిరిలోని హోటల్ సరిగమలో ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి ప్రసాద్ అధ్యక్షత వహించి ప్రసంగించారు. పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు కల్పించాలని, అధికారుల వేధింపులు ఆపాలని, బయోమెట్రిక్ విధానం సరికాదని, పలు అంశాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఇక నుంచి రాష్ట్ర పంచాయతీలలో కార్యదర్శులుగా పనిచేస్తున్న అన్ని క్యాడర్లు, సంఘాలకు సంబంధించి ఒకే యూనియన్‌గా రాష్ట్ర ఆంధ్రప్రదేశ్ కార్యదర్శుల సంఘంగా ఏర్పాటు కావాలని సమావేశంలో నిర్ణయించారు. సమస్యలను వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని తీర్మానించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.జనార్ధనరెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు కే శ్రీనివాసరావు, నేతలు జీటీవీ రమణ, గల్లా అమరేష్, వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి ఉద్యోగుల సమస్యలు

- ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

గుంటూరు(విద్య): రాష్ట్రంలో పంచాయితీరాజ్ ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేలా కృషి చేస్తామని ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం రెవెన్యూ కల్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయితీరాజ్ మినిస్ట్రీరియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హెడ్‌ఆఫ్‌ది డిపార్టుమెంట్ పదోన్నతులు, బదిలీలు 121/2 కోటా కింద సబార్డినేట్ ఆఫీసుల నుంచి పదోన్నతులు వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు. ఉద్యోగులు బాధ్యతగా పనిచేసి హక్కుల కోసం పోరాటాలు చేయాలన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులుగా ఎ.వెంకటస్వామి(ప్రకాశం), కార్యదర్శిగా ఎస్‌కె నబి అహ్మద్(పశ్చిమగోదావరి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కె భీమాలింగేశ్వరరావు(కర్నూలు), కె శ్రీనివాసరావు(గుంటూరు) ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ ఎన్నికను ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఫణివీర్రాజు పర్యవేక్షించారు. నూతన కార్యవర్గం ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. సెప్టెంబరు ఒకటిన తలపెట్టిన మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఏపీజే ఏసీ అమరావతి సంఘం నాయకులు జయధీర్, శ్రీరాములు, కేశవనాయుడు, సంగీతరావు, బ్రహ్మయ్య, రమేష్, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

అక్షయపాత్ర సేవలు అభినందనీయం

హైదరాబాద్ ఐటీ ఉద్యోగులు

తుళ్లూరు: అక్షయపాత్ర సేవలు ప్రశంసనీయమని హైద్రాబాద్‌కు చెందిన ఐటీ ఉద్యోగులు పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనం పథకంతో ప్రభుత్వ పాఠశాలలకు, ఎన్టీఆర్ క్యాంటీన్లకు రాజధానిలో ఆహార పదార్థాలను సేవా దృక్పథంతో పంపిణీ చేస్తున్న అక్షయపాత్ర పౌండేషన్ వారిని కొనియాడారు. లింగాయపాలెం చీరల కంపెనీలో ఏర్పాటు చేసిన అక్షయపాత్ర వంటశాలను ఆదివారం వారు సందర్శించారు. అందులో కూరగాయలు కడగటం, కోయటం, పాత్రలు కడగటం వంటి పనులను నిర్వహించారు. అత్యాదునికమైన పద్ధతులు అవలంబిస్తూ ఆహారపదార్థాలు రుచికరంగా వండి అందిస్తున్న అక్షయపాత్రను అభినందించారు. కార్యక్రమంలో అక్షయపాత్ర హైద్రాబాద్ ఈవెంటు కోఆర్డినేటర్ లీలాసుజిత, సెక్రటరీ రాఘవేంద్రరావు, లింగాయాలెం అక్షయపాత్ర కోఆర్డినేటర్ ప్రతీప్, పాల్గొన్నారు.


వంట శాలలో కూరగాయాలు కడుగుతున్న ఐటీ ఉద్యోగులు

ప్రశంసలు అందుకున్న పరిశోధన పత్రం

గుంటూరు (మెడికల్): టైఫాయిడ్ జ్వరాల చికిత్సకు వినియోగించే యాంటీబయోటిక్ మందులు రోగులపై అంతగా ప్రభావం చూపలే కపోతున్నట్లు ఇన్‌ఫెక్షన్స్ వ్యాధుల వైద్య నిపుణులు కే కళ్యాణ్‌చక్రవర్తి తెలిపారు. ఆగస్టు 15 నుంచి 17 వరకు మలేషి యా రాజధాని కౌలాలంపూర్‌లో జరిగిన అంతర్జాతీయ ఇన్‌ఫెక్షన్ల సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ సదస్సులో ఇన్‌ఫెక్షన్లపై తాను చేసిన అధ్యయనంపై పరిశోధన పత్రం ఆయన సమర్పించారు. ఇది వైద్యనిపుణుల ప్రశంసలు అందుకుంది. సదస్సు ముగించుకొని నగరానికి వచ్చిన డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి తన పరిశోధన పత్రం విశేషాలను వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో నాలుగేళ్ల కిందట 15-20 శాతం వరకు టైఫాయిడ్‌కు యాంటీబయోటిక్ రెస్టిస్టెన్స్ (నిరోధకత) ఉందని, ఇప్పుడు అది 40-50 శాతానికి పెరిగిందని ఆయన చెప్పారు. కొన్నిరకాల యాంటీబయోటిక్ మందుల సంపూర్ణంగా పని చేయకపోవచ్చని తమ విస్తృత పరిశోధనలో


డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి

తేలిందన్నారు. సరైన పద్ధతిలో వ్యాధి నిర్ధారణ చేయకపోవడం, యాంటీబయోటిక్ నిరోధక శక్తిని అంచనా వేసే ప్రక్రియను సరిగా పాటించకపోవడం కూడా ఇందుకు ముఖ్య కారణమని డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. ప్రతి ఆరునెలలకు ఒకసారి ఆయా ప్రాంతాలకు సంబంధించిన యాంటీ బయోటిక్ మందుల నిరోధకశక్తిని అంచనా వేసే 'యాంటీ బయోగ్రామ్' ప్రక్రియను ప్రారంభించాలని కౌలాలంపూర్ సదస్సు పిలుపునిచ్చినట్లు ఆయన తెలిపారు. దీనివల్ల ఆయా ప్రాంతాల్లో ప్రజలకు వ్యాపించే ఇన్‌ఫెక్షన్లకు ఏ మందులు పని చేస్తున్నాయో తెలుసుకోవచ్చని ఆయన వివరించారు.

సీపీఎస్ రద్దు కోసం నిరసన దీక్షలు

● ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి జోసఫ్‌సుధీర్‌బాబు

గుంటూరు(విద్య): నూతన పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం ప్రవేశపెట్టాలని కోరుతూ ఎస్టీయూ ఆధ్వర్యంలో త్వరలో నిరసన దీక్షలు చేపట్ట నున్నట్లు యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ జోసఫ్‌సుధీర్‌బాబు పేర్కొన్నారు. కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఆదివారం నిర్వహించిన కార్యవర్గ సమావే శంలో ఆయన మాట్లాడారు. సీపీఎస్ విధానం వల్ల పెన్షన్‌కు అనేక సమస్యలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. పెన్షన్ డబ్బును ఇతర కార్యకలాపాలకు వినియోగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో అనేక అసంబద్ధాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో తప్పిదాల వల్ల అనేక ఇబ్బందులు వచ్చాయని తెలిపారు. ఉపాధ్యాయులకు జరిగిన నష్టాన్ని సవరించాలని ఆయన కోరారు. స్వయం పోషక స్వతంత్ర్య పాఠశాలల చట్టం వల్ల ప్రభుత్వ విద్యాసంస్థలకు అనేక ఇబ్బందులు ఉన్నాయని పేర్కొన్నారు. కార్పొరేటీకరణ మరింత పెరిగే ప్రమాదం ఉందని తెలిపారు. 10వ పీఆర్‌సీలో బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి జోసఫ్‌సుధీర్‌బాబు

సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీవీ శ్రీనివాసరావు, ఎస్.రామచంద్రయ్య, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కోడే గౌరిశంకర్, జె శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కేవీ సుబ్బారావు, కె.బెనహర్‌బాబు, ఎస్ఎం సుభాని, ఎం. వెంకటకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి గణన సర్వేలో జిల్లాకు ప్రథమస్థానం

● ఎస్ఎస్ఏ ప్రాజెక్టు అధికారి వెంకట సత్యవతి



గుంటూరు (విద్య) : బడిబయట పిల్లల్ని గుర్తించేందుకు ప్రభుత్వం నిర్వహించిన విద్యార్థి గణన ప్రత్యేక కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించడంలో గుంటూరు జిల్లాకు ప్రథమస్థానం వచ్చిందని సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్టు ఆఫీసర్ వెంకట సత్యవతి వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఆగస్టు 21 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సర్వే నిర్వహించారని తెలిపారు. విద్యాశాఖ నిర్వహిస్తున్న ఆధార్ వివరాలతో కూడిన విద్యార్థులను వివరాలను పరిశీలించినప్పుడు రాష్ట్రవ్యాప్తంగా 8.89 లక్షలు తక్కువగా ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. గుంటూరు జిల్లాలో ఈ సంఖ్యం 90,034గా నమోదు అయినట్లు వెల్లడించారు. ప్రస్తుతం వీరిలో 68,198 మంది వివిధ పాఠశాల్లో చదువుతున్నారని పేర్కొన్నారు. వారి ఆధార్ వివరాలతో ఆయా పాఠశాలల్లో ఆన్‌లైన్ చేశారన్నారు. ఇంకా 21,836 మంది విద్యార్థుల వివరాల సేకరణ కార్యక్రమం జరుగుతుందన్నారు. వీరిలో కొంతమంది చదువు మధ్యలో మానివేశారని వివరించారు. కొంతమంది వలస వెళ్లినవారు, చనిపోయిన వారు ఉన్నారని వివరించారు. ఈ వివరాలు ఎపిగేర్ యాప్ ద్వారా ప్రతిరోజు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని తెలిపారు. ఇలా జిల్లాలో 75.75 శాతం వివరాలు నమోదు చేసి అన్ని జిల్లాల కంటే అగ్రస్థానంలో ఉన్నట్లు వెంకట సత్యవతి తెలిపారు.



పాఠకులకు సూచన:

క్లాసిఫైడ్ ప్రకటనలకు స్పందించే ముందు పూర్తిగా విచారించి తగిన నిర్ణయం తీసుకోగలరు. ప్రకటనదారు ప్రకటిస్తున్న లేదా చేసుకుంటున్న క్లయిమ్‌లతో మా పత్రికకు ఎటువంటి సంబంధం లేదు. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు.** పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

- మేనేజర్

ఐఐటీలో సీటు రాలేదన్న దిగులు ఇక వదిలేయవచ్చు. టెక్నాలజీపరంగా ఐఐటీ విద్యార్థుల్లా అప్‌డేట్ కాకపోతున్నామన్న ఆవేదనను మరిచిపోవచ్చు. జాతీయ స్థాయి విద్యాసంస్థలైన ఐఐటీలు అనేక కోర్సులను ఆన్‌లైన్ పద్ధతిలో గ్రామీణ ప్రాంతాల్లోని ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాయి. చదివే బ్రాంచి సబ్జెక్టుతోపాటు, సాంకేతికంగా ఎప్పుడూ ఆయా కళాశాల విద్యార్థులు అప్‌డేట్ అయ్యేలా ఆయా సంస్థలు కోర్సులను రూపొందించాయి. నేషనల్ ప్రోగ్రాం ఆన్ టెక్నాలజీ ఎన్‌హెన్స్‌డ్ లెర్నింగ్(ఎన్‌పీటీఈఎల్) పేరటి 509 వీడియో, 320 వెబ్‌బేస్ డ్ కోర్సుల్ని విద్యార్థులకు అందిస్తున్నాయి.

ఆన్‌లైన్‌లో.. ఐఐటీ



ఉన్నత విద్యామండలి చైర్మన్ నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న డాక్టర్ కోండబోలు బసవపున్నయ్య తదితరులు...

గ్రామీణ కళాశాలల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

509 వీడియో, 320 వెబ్‌బేస్ డ్ కోర్సుల్ని అందిస్తున్న సంస్థలు

ఎన్‌పీటీఈఎల్ కోర్సులతో సాంకేతికంగా అప్‌డేట్ అవుతున్న విద్యార్థులు

గుంటూరు(విద్య): ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాంకేతిక విద్యార్థులు వేగాన్ని అదిపుచ్చుకోకుంటేనే వారికి భవిష్యత్తు ఉంటుంది. లేదంటే ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల్ని కోల్పోవాల్సి వస్తుంది. చదివే బ్రాంచి సబ్జెక్టుతోపాటు, సాంకేతికంగా ఎప్పుడూ అప్‌డేట్‌గా ఉంటేనే ఇంజనీరింగ్ పూర్తి కాగానే కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగాలు వస్తాయి. లేదంటే పట్టా పట్టుకుని రోడ్లపైనే తిరగాల్సి వస్తుంది. ప్రస్తుతం గ్రామీణ ఇంజనీరింగ్ కళాశాలల్లో చదివే విద్యార్థుల్లో నైపుణ్యాలు కొరడుతున్నాయి. ఈ క్రమంలో ఐఐటీ బాంబే, ఢిల్లీ, గౌహితి, ఖరగ్‌పూర్, కాన్పూర్, చైన్నై తదితర జాతీయ స్థాయి సాంకేతిక విద్యాసంస్థలు అనేక కోర్సులు ఇంజనీరింగ్ విద్యార్థులకు అందిస్తున్నాయి. ఆన్‌లైన్ పద్ధతిలో సాగే ఈ కోర్సులను నేషనల్ ప్రోగ్రాం ఆన్ టెక్నాలజీ ఎన్‌హెన్స్‌డ్ లెర్నింగ్(ఎన్‌పీటీఈఎల్)గా అభివర్ణిస్తారు. ఈ కోర్సుల్ని విజయవంతంగా పూర్తి చేసుకుంటే ప్రాంగణ ఎంపికల్లో మిగిలి విద్యార్థుల కంటే మెరుగైన ఫలితాలు సాధించవచ్చు. అంతేగాక ఉన్నత విద్యలో కూడా రాణించవచ్చని ఇంజనీరింగ్ కళాశాలల అధ్యాపకులు సూచిస్తున్నారు. ఈ విధంగా ఆయా కోర్సుల్లో శిక్షణ పొంది ఆర్వీఆర్‌అండ్ జేసి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు అగ్రస్థానంలో నిలిచారు. ఇటీవల ఉన్నత విద్యామండలి నుంచి సర్టిఫికెట్లు కూడా అందుకున్నారు. ఆ విద్యార్థుల్ని, వారికి సహకారం అందించిన అధ్యాపకుల్ని ఆంధ్రజ్యోతి పలకరించింది. ఆ వివరాలు వారి మాటల్లోనే.



కాన్సెప్ట్ నేర్చుకున్నాం

ఐఐటీల ఆధ్వర్యంలో అందించే ఆన్‌లైన్ కోర్సుల ద్వారా కాన్సెప్ట్ నేర్చుకున్నాం. ఈ కోర్సుల ద్వారా గేట్ పరీక్షకు సిద్ధం కావడానికి ఉపయోగ పడింది. పైథాన్, ప్రోబబులిటీ, ర్యాండమ్ తదితర కోర్సులు నేర్చుకున్నాం. పోటీ పరీక్షలకు ఉపయోగం.

- కిరణ్మయి, బుద్ద రేహిత(ఈసీఈ)



అనేక అసైన్‌మెంట్స్

ఎన్‌పీటీఈఎల్ అందించే కోర్సులు విద్యార్థులు సమర్ధవంతంగా ఉపయోగించుకోవాలి. ఇందులో అనేక అసైన్‌మెంట్స్ ఉంటాయి. వాటిని సబ్‌మిట్ చేయడం వల్ల ఎన్నో విషయాలు తెలుస్తాయి. స్టీమ్ అండ్ గ్యాస్ పవర్ సిస్టమ్ సబ్జెక్టుల్లో ఎన్నో కొత్త విషయాలు తెలుసుకున్నా.

- రాఘవబాబు, బాలనగేష్



నైపుణ్యాల మెరుగు

నైపుణాల్యను మరింతగా పెంచుకునేందుకు ఎన్‌పీటీఈఎల్ కోర్సులు ఉపయోగ పడుతున్నాయి. సీ ప్లస్, ప్లస్‌తో పాటు కొన్ని కోర్సులు ఆన్‌లైన్‌లో నేర్చుకున్నాం. ఈ కోర్సులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఎంతో అవసరం.

- కే శ్రీకావ్య, పీ శ్రీకావ్య



ఐఐటీల కృషి అభినందనీయం

జాతీయ స్థాయిలో సాంకేతిక విద్యా సంస్థలు ఈ విధమైన కోర్సులు ప్రవేశ పెట్టడం అభినందనీయం. అక్కడ విద్యార్థులతో పాటు మాకు సరైన అవకాశాలు వస్తున్నాయి. క్యాంపస్ ఇంటర్వ్యూల్లో మెరుగ్గా రాణిస్తున్నాం. వందల సంఖ్యలో వెబ్ బేస్‌డ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

- ఇందూ, వర్షిత

బ్యాట్ పడితే.. బాదుడే

- గ్రౌండ్‌లోకి దిగితే సిక్స్‌లు, ఫోర్లే
- ఫాస్టెస్ట్ సెంచరీతో రికార్డు బద్దలు
- క్రికెట్‌లో రాణిస్తున్న బాపట్ల యువకుడు
- రంజీల్లో ఆడటమే లక్ష్యమంటున్న రవీంద్ర

సరదాగా పట్టిన బ్యాట్.. ప్రస్తుతం 'పరుగులు' పెడుతోంది. పేదింట పుట్టినా.. మైదానంలో బౌలర్లకు చెమటలు పట్టిస్తున్నాడు. క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్‌ను స్ఫూర్తిగా తీసుకుని బ్యాట్‌ను ఝుళిపిస్తున్నాడు. ఇటీవల బెంగళూరులో జరిగిన మ్యాచ్‌లో 29 బంతులలో 102 పరుగులు చేసి ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డును బద్దలు కొట్టాడు. ఆంధ్రా రంజీ జట్టు తరుపున ప్రాతినిధ్యం వహించటమే లక్ష్యంగా సాధన చేస్తున్న బాపట్ల యువకుడు పల్లప్రోలు రవీంద్ర క్రికెట్‌లో రాణిస్తున్నాడు.

బాపట్ల: బాపట్ల పట్టణం నరాలశెట్టివారిపాలేనికి చెందిన పల్లప్రోలు రవీంద్ర చిన్ననాటి నుంచే క్రికెట్‌పై ఆసక్తి పెంచుకున్నాడు. బాపట్ల పట్టణం నరాలశెట్టివారిపాలేనికి చెందిన పల్లప్రోలు హరిబాబు, పద్మావతిల కుమారుడు పల్లప్రోలు రవీంద్ర. రవీంద్ర సోదరుడు వాసు సైన్యంలో పనిచేస్తున్నాడు. తండ్రి రైతు, తల్లి గృహిణి. వీరి ప్రోత్సాహంతో భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తానని రవీంద్ర చెబుతున్నాడు. స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడటం ప్రారంభించిన రవీంద్ర మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. కుమారుడు సాధిస్తున్న విజయాలను చూసి తల్లిదండ్రులు హరిబాబు, పద్మావతిలు ఎంతో సంతోషిస్తున్నారు.



రవీంద్ర తల్లిదండ్రులు హరిబాబు, పద్మావతి

ప్రతిభకు నిదర్శనాలు..

2010లో ప్రకాశం జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడు. బ్యాట్స్‌మన్‌గా చెలరేగి ఆడి పరుగుల వరద సృష్టించాడు. ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాల అండర్ -22 జోనల్స్, సీనియర్ జోనల్స్ జట్టుకు ఎంపికై రాష్ట్ర స్థాయి పోటీలో రాణించాడు. 2011లో అండర్-22 వన్డే జోనల్స్, 2012లో అండర్-25 జోనల్, 2014 సీనియర్ జోనల్స్, 2015 ట్వంటీ ట్వంటీ సీనియర్స్ జోనల్, 2015లో ట్వంటీ ట్వంటీ సీనియర్ జోనల్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఇప్పటి వరకు ఆరు సెంచరీలు, 25 అర్ధ సెంచరీలు తన ఖాతాలో వేసుకున్నాడు. ఒంగోలులో కోచ్ వెంకటనగేష్ వద్ద శిక్షణ తీసుకున్న రవీంద్ర బ్యాటింగ్‌లో నైపుణ్యాలు పెంచుకున్నాడు. జూలై 29న బెంగళూరులో కర్నాటక రాష్ట్ర క్రికెట్ అకాడమి నిర్వహించిన క్లబ్ స్థాయి లీగ్ మ్యాచ్‌లో సిటీ జింఖానా, జైదుర్ క్లబ్‌లు పోటీపడ్డాయి. ఈ పోటీలో రవేంద్ర సిటీ జింకానా జట్టు తరుపున ఆడాడు. 58 బంతుల్లోనే 144 పరుగులు చేశాడు. 13 సిక్స్‌లు, 4 ఫోర్లు కొట్టాడు. తొలి 29 బంతులలో 102 పరుగులు చేసి ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డును బద్దలు కొట్టాడు. నెల్లూరు జిల్లా గూడూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలో చెలరేగి ఆడి 63 బంతులలో 130 పరుగులు సాధించి నాటౌట్‌గా నిలిచాడు.

ప్రభుత్వం చేయూతనందిస్తే

రైతు కుటుంబానికి చెందిన తనకు ప్రభుత్వం చేయూతనందిస్తే క్రికెట్‌లో మరింత ఎదుగుతానని రవీంద్ర చెప్తున్నాడు. స్పాన్సర్‌లు ముందు కొచ్చి సాయం అందిస్తే రంజీజట్టుకు ఎంపికై క్రికెట్ పోటీలలో రాణిస్తానంటున్నాడు. త్వరలో వైజాగ్‌లో జరిగే లీగ్ పోటీలలో పాల్గొనేందుకు సిద్ధమౌతున్నట్లు తెలిపారు.



ఇటీవల రవీంద్రను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్



బ్యాటింగ్ చేస్తున్న పల్లప్రోలు రవీంద్ర. ఇన్‌సెట్‌లోనూ..

కనుమరుగవుతున్న మానవ సంబంధాలతో నేడు ఎంతోమందికి వృద్ధాప్యం భారంగా మారుతోంది. కని పెంచిన బిడ్డలు కేవలం ఫాదర్స్‌డే, మదర్స్‌డే అంటూ ఏడాదిలో ఓ రోజు తల్లిదండ్రులతో ఓ సెల్ఫీ దిగి ముచ్చట తీర్చుకుంటున్నారు. మరికొందరైతే తల్లిదండ్రులు భారమంటూ వదిలించుకునే ప్రయత్నమూ చేస్తున్నారు. వృద్ధులను ఆదుకునేందుకు ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా అవి కాగితాలకే పరిమితమవుతున్నాయి. నేడు వరల్డ్ సీనియర్ సిటిజన్స్ డే. ఈ సందర్భంగా జిల్లాలో వృద్ధుల పరిస్థితి, వారి కోసం ఉన్న చట్టాలు, ప్రభుత్వ రాయితీలతో ప్రత్యేక కథనం..

అండ కరువైన.. పండుటాకులు



- జీవిత చరమాంకంలో అనాథలుగా కొందరు వృద్ధులు
- ఆదరణకు నోచుకోని వారు ఎందరో..
- వృద్ధుల రక్షణకు ప్రత్యేక చట్టాలు
- సీనియర్ సిటిజన్స్‌కు ఎన్నో సదుపాయాలు
- అయినా అవగాహన కరువు
- నేడు సీనియర్ సిటిజన్స్ డే

చిలకలూరిపేట అర్బన్: జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు చవిచూసి, మొక్కవోని ధైర్యంతో రెక్కలు ముక్కలు చేసుకుని పిల్లలను పెద్దవారిని చేస్తే చరమాంకంలో అనాథలుగా జీవించాల్సిన వృద్ధుల సంఖ్య జిల్లాలో పెరుగుతోంది. నా అనేవాళ్లు ఉన్నా వారి జీవితం మాత్రం అనాథ బతుకే.. అందరినీ మరచిపోయి శరణాలయాల్లో జీవించాల్సి వస్తోంది. 2011 గణాంకాల ప్రకారం జిల్లా మొత్తం జనాభాలో వృద్ధులు 5 లక్షల మంది ఉండగా వీరిలో నెలకు వెయ్యి రూపాయల వృద్ధాప్య ఫించను పొందే వారు దాదాపు లక్షన్నరకు పైగానే ఉన్నారు. కొన్నేళ్లుగా జిల్లాలో వృద్ధుల సంఖ్య పెరుగుతోంది. బిడ్డల ఆదరణకు నోచుకోక కడజీవితం కష్టంగా మారినవారు సగంపైగా ఉన్నారు. ఈ మధ్య కాలంలో వృద్దాశ్రమాలకు చేరుతున్న వారు ఎక్కువవవుతుండమే ఇందుకు నిదర్శనం. జిల్లాలో భారమైన వృద్ధుల బతుకులపై ఓ స్వచ్ఛంద సంస్థ చేపట్టిన సర్వే మరింత బాధాకరమైన విషయాలను వెల్లడించింది. ఆ సర్వే ప్రకారం

- వృద్ధాప్యంలో బిడ్డలు పట్టించుకోనివారు : 37 శాతం
- కోడలు అదుపు ఆజ్ఞలో బతికేవారు : 20శాతం
- ఆస్తుల కోసం వేధింపులకు గురయ్యేవారు: 9శాతం
- కుటుంబీకుల చీదరింపులకు గురయ్యేవారు :13శాతం
- కనీస అవసరాలు కరువైనవారు :13శాతం
- ఇళ్లనుంచి గెంటివేయబడిన వారు :8శాతం
- జిల్లాలో మొత్తం 354 వృద్ధాశ్రమాలు ఉన్నాయి.

అండగా చట్టం

వృద్ధులకు చట్టపరమైన భరోసాను న్యాయస్థానాలు, ప్రభుత్వం కల్పిస్తున్నాయి. కన్నబిడ్డల నుంచి కన్నవారిని కాపాడటానికి మెయింట్‌నెన్స్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్ చట్టాన్ని అమలులోకి తెచ్చింది. 1973 క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 125(1) (2) ప్రకారం వృద్ధుల ఆలనా పాలనా బాధ్యతలన్నీ కుమారులు, కుమార్తెల పైనే ఉంటాయి. వివాహితలైనా, కాకున్నా తల్లిదండ్రులను ఆదరించాల్సిన బాధ్యత వారి పిల్లలపై ఉంటుంది. అది అతిక్రమిస్తే క్రిమినల్ చర్యలు ఉంటాయి. వృద్ధులను ఆదరించకపోయినా వారికి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా బాధించినా లేదా మానసికంగా ఇబ్బందులకు గురిచేసినా వారు శిక్షార్హులు. 2008 నుంచి కేంద్ర ప్రభుత్వం తల్లిదండ్రులు, వృద్ధుల సంరక్షణ సంక్షేమ చట్టాన్ని అమలు చేస్తోంది. 2008 ఏప్రిల్ 28న ఇది రాష్ట్రంలో అమలులోకి వచ్చింది.

ఇలా ఫిర్యాదు చేయవచ్చు..

వయో వృద్ధులు సమస్యలపై జిల్లా కేంద్రంతోపాటు రెవెన్యూ డివిజన్లలో ఫిర్యాదు చేయవచ్చు. ఇందుకోసం ఏర్పాటు చేసిన కమిటీలో జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, వయో వృద్ధుల సంక్షేమశాఖ ఏడీ, ఎస్పీ, అడిషనల్ ఎస్పీ, డీఎం అండ్ వాచ్ ఓ, డీఆర్‌డీఏ పీడీ తోపాటు మరో ఏడుగురు సభ్యులుగా ఉంటారు. కమిటీ మూడు నెలలకోసారి సమావేశం నిర్వహించి వృద్ధుల సమస్యలపై చర్చించాలి. అత్యవసర పరిస్థితుల్లో అధికారులకు ఫోన్‌లోనూ ఫిర్యాదు చేయవచ్చు. లేదా బాధితుల తరపున ఎన్జీవోలు ఫిర్యాదు చేసే అధికారం ఉంది.






అందరూ ఉన్నా అనాథే...

మాది మంచి పేరున్న కుటుంబం. నాకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు . అందరికీ పెళ్లి చేశా. అనారోగ్యంతో భర్తతోపాటు కొడుకు, కూతురు మృతి చెందారు. ఉన్న ఆస్థి కరిగిపోయింది. మరో కొడుకు ఆర్థికంగా అంతంత మాత్రంగానే ఉన్నాడు. వారికి భారం కాకుడదని నిర్ణయించుకున్నా. ఇంటి నుంచి వచ్చి ఈ వృద్ధాశ్రమంలో తలదాచుకుంటున్నా.

- ఓరుగంటి అంజమ్మ, బొందిలిపాలెం



బాగా చూసుకుంటున్నారు..

భార్య, పిల్లలు మృతి చెందడంతో బంధువులు అందరూ ఉన్నా అనాథగా బతకాల్సి వస్తోంది. ఆశ్రమంలో నన్ను బాగా చూసుకుంటున్నారు. మంచి భోజనం, వసతి, వైద్య సేవలు అందిస్తున్నారు. ఇంటిలో కూడా ఇలా జరగదేమో.

- కొండా మందయ్య



కోర్టును ఆశ్రయించవచ్చు..

వృద్ధాప్యంలో తల్లిదండ్రులను బిడ్డలు నిర్లక్ష్యం చేయడం తప్పు. దీనిపై తల్లిదండ్రులు న్యాయస్థానాన్ని ఆశ్రయించి న్యాయం పొందవచ్చు. తల్లిదండ్రులను పట్టించుకోని బిడ్డలపై కోర్టులు తగిన శిక్షలు వేసే అవకాశం ఉంది.

- నాగబాబు, న్యాయవాది

మలిసంధ్యలో.. ఆపన్నహస్తం

చిలకలూరిపేట: వృద్ధులకు అండగా నిలిచి మలిసంధ్య వేళలో భరోసా నిచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని రాయితీలను అందిస్తున్నాయి. వాటి గురించి తెలుసుకుందాం..

● 65 సంవత్సరాల పైబడినవారికి తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీశైలం దేవస్థానాల్లో ప్రత్యేక దర్శనం కల్పిస్తున్నారు. వయసు నిర్ధారణ ధ్రువీకరణ పత్రం వెంట తెచ్చుకోవాలి.


● రైలు ప్రయాణంలో అన్ని తరగతుల్లో 60 ఏళ్లు నిండిన మగవారు, 58 ఏళ్లు నిండిన ఆడవారికి టికెట్ ధరలో 40 నుంచి 50శాతం వరకురాయితీ లభిస్తుంది. ఎయిర్ ఇండియా విమానంలో 80 ఏళ్లు దాటినవారికి చార్జీలో 50శాతం రాయితీ కల్పిస్తోంది. సీనియర్ సిటిజెన్స్‌కు ఆర్టీసీ టిక్కెట్టు ధరపై 25శాతం రాయితీని ఇస్తోంది.

● రాష్ట్ర ప్రభుత్వం దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వృద్ధులకు నెలకు రూ.1,000 పించను అందిస్తోంది. 65 ఏళ్లు నిండిన వారికి బీఎస్ఎన్ఎల్ టెలిఫోన్ బిల్లులో రాయితీ ఇస్తోంది. జీవిత బీమా సంస్థ ప్రవేశపెట్టిన బీమా పథకంలో 8శాతం వంతున పదేళ్ల వరకు పించను అందిస్తోంది. అధికంగా రూ.7.5లక్షలు వరకు బీమా చేసే అవకాశం కల్పించారు. ఇష్టమైన కాలపరిమితి ప్రకారం పింఛను తీసుకునే వీలు కల్పించింది. వైద్య పరీక్షలు, చికిత్స అనంతరం ఖర్చులు చెల్లించేందుకు జన్ ఆరోగ్య బీమా పథకం కింద వరుసగా 18 నెలల పాలసీ వారి కోసం అందుబాటులో ఉంది. పలు బీమా కంపెనీలు మెడిక్లెయిమ్ పాలసీల ద్వారా 60 నుంచి 80 ఏళ్ల వృద్ధులకు రూ.1 లక్ష ఆసుపత్రి చార్జీలు, క్లిష్టమైన ఆరోగ్య సమస్యలుంటే రూ.2లక్షలు మెడిక్లెయిమ్ సదుపాయం కల్పిస్తోంది.

● బ్యాంకుల పొదుపు ఖాతాలలో, పథకాలలో దాచిన సొమ్ముపై 60 ఏళ్లు పైబడిన వారికి 8.4శాతం వడ్డీ, ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 0.5శాతం అదనంగా వడ్డీ లభిస్తోంది.

● ఆదాయపన్ను చట్టం 1961 సెక్షన్ 80 డి ప్రకారం ప్రత్యేక పన్ను మినహాయింపులన్నీ వర్తిస్తాయి. రూ.3లక్షల వార్షిక ఆదాయంలోపు ఉన్నవారికి పన్ను పూర్తిగా మినహాయించారు. 80ఏళ్లు పైబడిన సూపర్ సీనియర్స్‌కు రూ.5లక్షల వరకు పన్ను మినహాయింపు ఉంది. ఆరోగ్య బీమాలో రూ.30వేల ఈమ్రియం వరకు పన్నుల మినహాయింపు ఉంటుంది. క్లిష్టమైన ఆరోగ్య సమస్యలున్న వృద్ధులకు రూ.60వేల వరకు, 80 ఏళ్లు పైబడిన వారికి రూ.80వేల వరకు మినహాయింపు ఉంటుంది.





జంబ్లింగ్ వర్డ్స్

1. WLKA ▸ ....
2. NGKI ▸ ....
3. DMBU ▸ ....
4. MEUT ▸ ....

జంతర్‌మంతర్

1. ద్భుఅతం ▸ ....
2. తణంక్ష ▸ ....
3. త్తిడిఒ ▸ ....
4. సంవికా ▸ ....

చెప్పగలరా?

పాలులో ఉన్నా కానీ వేలులో లేను
యతిలో ఉన్నా కానీ గతిలో లేను
సందులో ఉన్నా కానీ విందులో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

సూక్తి

మనం ఉన్నతంగా ఎదగడానికీ, నష్టపోవడానికీ కారణం మన ఆలోచనలే.

రోబోల రికార్డ్ బ్రేక్ డ్యాన్స్

రోబో స్టెప్పు వేస్తే.. అదిరి పోతుంది కదూ! మరి ఒకేసారి వెయ్యికి పైగా రోబోలు కదం తొక్కితే.. డ్యాన్సులు చేసి అదరగొడితే అద్భుతం కదా! ఒకే సైజులోని రోబోలన్నీ కాలంలో ఒకే రీతిలో డ్యాన్స్ చేసి 'గిన్నిస్ పుటల్లో' స్థానం పొందాయి.

సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి పరిచిన 1069 రోబోలు విభిన్నంగా డ్యాన్స్ చేసి చూపరులను ఆకట్టుకున్నాయి. ప్రపంచ రికార్డును సాధించి గిన్నిస్ పుటలకెక్కాయి. డబ్ల్యు.ఎల్ ఇంటిలెజెంట్ టెక్నాలజీ కంపెనీ లిమిటెడ్ వీటిని రూపొందించింది. 'వన్ గ్రూప్ కంట్రోల్ సిస్టమ్' ప్రోగ్రామ్ ఆధారంగా ఇవి ఏకకాలంలో డ్యాన్స్ చేశాయి. చిందులతో కదం తొక్కిన ఆ రోబోల పేరు 'దోబి'. చైనాలో గతంలో జరిగిన బీర్ ఫెస్టివల్ సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో 1007 రోబోలు బ్రేక్ డ్యాన్స్ చేసి గిన్నిస్ రికార్డు సృష్టించాయి. ఆ రికార్డును 'దోబి' రోబోలు ప్రస్తుతం బద్దలుకొట్టాయి. ఈ దోబి రోబోల ఎత్తు - 47.3 సెంటిమీటర్లు. ఇవి పాటలు పాడటంతో పాటు, ఫుట్‌బాల్ కూడా ఆడతాయి. కుంగ్‌ఫూ కూడా చేయడం విశేషం. వీటి డ్యాన్సింగ్ వీడియోను యూట్యూబ్‌లో గంట వ్యవధిలోనే లక్షల మంది చూశారు.



మీకు తెలుసా?

షాంగై ఎక్స్‌పో పార్క్‌లో గత సంవత్సరం జరిగిన 'ఫ్రాన్స్ నేషనల్ పెవిలియన్ డే'లో సందర్శకులను అలరించేందుకు నిర్వాహకులు 20 రోబోలతో డ్యాన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతేకాదు వాటితో సాకర్ కూడా ఆడించారు.



'రోబో' స్టెప్పుల రికార్డు

ప్రభుదేవా డ్యాన్స్ మెరుపులు, చిరంజీవి స్టెప్పులు అందరికీ తెలుసు. మరి చిందులేసే రోబోలు తెలుసా? చైనా కొత్త సంవత్సర వేడుకల్లో భాగంగా 540 రోబోలు ఒకే వేదికపై డ్యాన్సులు చేసి అలరించాయి. అంతేకాదు ప్రపంచంలోనే అత్యధిక మంది వీక్షించిన టీవీ ప్రోగ్రామ్‌గా అది రికార్డులకెక్కింది. రోబోలు చిందేస్తుంటే 26 డ్రోన్లు ఆ నృత్యాన్ని వీడియో తీశాయి. చైనా సెంట్రల్ టెలివిజన్(సీసీటీవీ) ఈ కార్యక్రమాన్ని ప్రసారం చేయగా 70 కోట్ల మంది వీక్షించటం విశేషం. ప్రపంచంలోనే అత్యధిక ప్రజలు చూసిన కార్యక్రమంగా రోబో డ్యాన్స్ నిలిచింది. సాహిత్యాన్ని, సంగీతాన్ని అనుసరించి కొరియోగ్రాఫర్లు డ్యాన్స్ కంపోజ్ చేస్తారు. అదే విధంగా రోబోలు సంగీతానికనుగుణంగా నృత్యం చేసేలా వీటిని రూపొందించారు. 'ప్రతి రోబోలో 16 స్టీరింగ్ ఇంజిన్లు ఉన్నాయి. మానవుడి తల, కాళ్లు, చేతులు ఏ విధంగా అయితే కదుపుతారో అదే విధంగా రోబోలు కదలడానికి వీలుగా ఈ స్టీరింగ్ ఇంజిన్స్ ఉపయోగపడతాయి.

రోబోట్ డ్యాన్స్

రోబోలను ఇమిటేట్ చేస్తూ చేసే డ్యాన్సే 'రోబోట్ డ్యాన్స్'. మైఖేల్ జాక్సన్‌తో ఈ డ్యాన్స్ బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. 'డ్యాన్సింగ్ మెషిన్' పాటలో - మైఖేల్, తన సోదరులతో కలిసి 'రోబోట్ డ్యాన్స్' చేశారు. 'బిల్లి జీన్' అనే పాటలో కూడా 'రోబోట్ డ్యాన్స్' చేసి అలరించాడు.

మెల్‌బోర్న్ యూనివర్సిటీలో 'రోబోగాల్స్' అనే బృందం, 318 మంది 'రోబోట్ డ్యాన్స్' చేసి వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం పొందారు.

ఔనా!



వాసన పసిగట్టే శక్తి శునకాల కన్నా, చీమలకే ఎక్కువ.

బొమ్మ గీయండి



దారి కనుక్కోండి





నవ్వుల్ నవ్వుల్

అప్పారావు : ఏరా! వెళ్లినప్పుడు నాలుగు గంటల్లో విజయవాడ వెళ్లావు కదా! వచ్చేటప్పుడు ఎనిమిది గంటలు పట్టిందేం?

సుబ్బారావు : కారు తయారు చేసిన వెధవ ఎవడో గానీ, ముందుకు వెళ్లడానికి నాలుగు గేర్లు ఇచ్చాడు. వెనక్కి రావడానికి రెండు గేర్లు మాత్రమే ఇచ్చాడు రా!

అప్పారావు : !!!!!!!!!


టంగ్ ట్విస్టర్స్

1. Upper roller lower roller Upper roller lower roller. ..
2. Swan swam over the sea,
   Swim, swan, swim!
   Swan swam back again
   Well swum, swan!
3. I saw a saw that could out saw any other saw I ever saw.

చుక్కలు కలపండి



మీకు తెలుసా?



ప్రపంచంలో రెండు శాతం మందికి మాత్రమే ఆకుపచ్చ రంగు కళ్లు ఉంటాయి.

జవాబులు

చెప్పగలరా? : పాయసం
జంతర్‌మంతర్ : 1. అద్భుతం 2. తక్షణం 3. ఒత్తిడి 4. వికాసం
జంబ్లింగ్ వర్డ్స్ : 1. WALK 2. KING 3. DUMB 4. MUTE

పత్తిని దెబ్బతీస్తున్న గులాబి రంగు పురుగు

● ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారిస్తే మేలు
● ఎన్విరాన్‌మెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు డైరెక్టర్ చైతన్యకుమార్


పత్తికి ఆశించిన గులాబిరంగు పురుగు

ఆంధ్రజ్యోతి, గుంటూరు: రాష్ట్ర వ్యాప్తంగా రెండేళ్ల నుంచి పత్తి పైరుపై గులాబి రంగు పురుగు ఉధృతి ఎక్కువగా ఉంది. ఈ పురుగు దాదాపుగా 100 రోజులు దాటిన పత్తిలో కనపడుతుందని రైజింగ్ ఇండియా ఎన్విరాన్‌మెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు డైరెక్టర్ కె చైతన్య కుమార్ తెలిపారు. తమ సంస్థ ప్రతినిధులు జిల్లాలోని సత్తెనపల్లి, చిలకలూరిపేట, యడ్లపాడు, ప్రత్తిపాడు తదితర ప్రాంతాల్లో పర్యటించినట్లు చెప్పారు. గులాబి రంగు పురుగు గుడ్ల నుంచి వెలువడిన వెంటనే చిన్న గొంగలి పురుగులు మొగ్గలకు, లేత కాయలకు కంటికి కనిపించని చిన్న రంధ్రాలను చేసి లోనికి ప్రవేశించి ఒక రోజులో 1-5 విత్తనాలను తిని పత్తి పంటకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయని తెలిపారు. గులాబి రంగు పురుగు ప్రభావం ముందస్తుగా వేసిన పత్తిలో కంటే ఆగస్టులో వేసే పైరుపై తీవ్రంగా ఉంటుందన్నారు. జూన్, జూలైలో విత్తిన పత్తిపైరు చివరి దశలో గులాబి రంగు పురుగు ఆశించడం వలన దిగుబడి తగ్గి రైతుకు నష్టాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలే మేలు..

రైతులు వీటిని దృష్టిలో ఉంచుకొని పత్తికి బదులుగా ప్రత్యామ్నయ పంటలైన అపరాలు, ఇతర పంటలపై దృష్టిని సారించాలి. దీనికి గాను రైతులు ఆయా ప్రాంతాల్లోని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను, శాస్త్రవేత్తలను సంప్రదించాలి. తమ భూమి స్వభావం, నీటి వనరుల లభ్యత తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని పత్తికి ప్రత్యామ్నాయ పంటలు ఎన్నుకొని సాగు చేయాలి. ప్రత్తిపాడు, యడ్లపాడు, చిలకలూరిపేట, సత్తెనపల్లి, ప్రాంతాల్లో గులాబి రంగు పురుగు పత్తికి సోకినట్లు తమ బృందం గుర్తించిందన్నారు. ఏపీ సీడ్స్ సంస్థ పత్తికి ప్రత్యామ్నాయ పంటలు వేసుకునే రైతులకు వివిధ రకాల విత్తనాలను సబ్సిడీపై పంపిణీ చేస్తోందని, రైతులు సంబంధిత అధికారులను సంప్రదించి సబ్సిడీ విత్తనాలను పొందాలని చైతన్య కుమార్ తెలిపారు.

పడిపోయిన ధరలతో బెండ రైతుల దిగాలు

యడ్లపాడు : బెండకు మార్కెట్లో సరైన ధర లేకపోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో ఆరుగాలం కష్టించినా రైతులకు నష్టాలే మిగులుతున్నాయి. వచ్చిన దిగుబడులను చూసి ఆనందపడాలో, గిట్టుబాటు ధర రాక నష్టాల బారినపడుతున్నందుకు బాధపడాలో అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు. నిన్న మొన్నటివరకు మార్కెట్‌లో మంచి ధర పలికిన బెండ ధర ప్రస్తుతం కిలో రూ.10లకు పడిపోవడంతో బెండతోటలు సాగుచేస్తున్న రైతులు దిగాలు చెందుతున్నారు. పెరిగిన పెట్టుబడులు, కౌళ్లతో ఇప్పటికే సతమవుతున్న రైతులు గిట్టుబాటు ధర లభించకపోవడంతో మరింత ఆందోళన చెందుతున్నారు. ధరలు పడిపోవడంతో కోతకూలి ఖర్చులు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు.

మండలంలో 50 ఎకరాల్లో సాగు..

యడ్లపాడు మండలం పరిధిలో బెండసాగు 50 ఎకరాలకు పైగానే రైతులు సాగుచేస్తున్నారు. వర్షాలు సరిపడా కురవడం, దిగుబడులు అధికంగా రావడంతో ఒక్కసారిగా మార్కెట్‌ధర పడిపోయింది. ఏడాది ప్రారంభం నుంచి ఐదారు నెలలపాటు కేజీ ధర రూ.30 వరకు పలికింది. ఊహించని విధంగా పక్షం రోజుల నుంచి ఈ ధర తగ్గుతూ వచ్చి రూ.10లకు చేరింది. ఎకరానికి 40 క్వింటాళ్ళ వరకు దిగుబడి వస్తున్నా దానికి తగ్గ గిట్టుబాటుధర లభించడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో పండించిన బెండలను గుంటూరు మార్కెట్‌కు స్థానిక రైతులు తరలిస్తున్నారు. రవాణా, కమీషన్, కూలీ ఖర్చులు కలిపి సుమారు క్వింటాకు రూ.1200ల వరకు ఖర్చు అవుతుండగా చేతికి మాత్రం రూ.వెయ్యి రూపాయలే వస్తున్నాయి. దీంతో చేలో కాయలు కోసేందుకు కూడా రైతులు వెనకాడుతున్నారు.

ఎకరాకు రూ.35వేలు పెట్టుబడి..

కౌలు, వ్యవసాయ ఖర్చులు కలిపి ఎకరా బెండ సాగుకు రూ.35 వేల వరకు పెట్టుబడి అవుతోంది. మంచి దిగుబడులు సాధించినప్పటికి గిట్టుబాటుధర లేకపోవడంతో పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి

కూలీల ఖర్చుకూడా రావడం లేదని ఆందోళన


జగ్గాపురంలో సాగుచేస్తున్న బెండతోట

కనిపించడంలేదని రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

రైతులు నష్టపోతున్నారు
- ముద్దన రామయ్య, రైతు, జగ్గాపురం



మార్కెట్ మాయాజాలంతో ఎప్పుడూ రైతులే నష్టపోతున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో ధర బాగా ఉండడంతో 3 ఎకరాలలో బెండసాగు చేపట్టా. రైతులవద్ద నుంచి కేజీ బెండకాయలు రూ.10లకు వ్యాపారులు కొనుగోలు చేసి రూ.40లకు అమ్ముకుంటున్నారు. దీంతో పండించిన రైతు కన్నా వ్యాపారులే అధికంగా లాభపడుతున్నారు. కనీసం రైతుకు రూ.25 నుంచి రూ.30లు లభిస్తేనే గిట్టుబాటు అవుతుంది. ఈ నెలాఖరుకు ధరలో పెరుగుదల కానరాకుంటే కోతలు నిలిపి వేయడంతో పాటు, తోటలను దున్ని వేయాల్సి ఉంటుంది.

రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు

పొన్నూరు: వ్యవసాయంలో ఆధునిక యంత్ర పరికరాలను రైతులు ఉపయోగిస్తున్నారు. రైతులకు అందిస్తున్న యంత్ర పరికరాల గురించి పొన్నూరు ఏడీఏ సీహెచ్ తిరుమలాదేవి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రోత్సాహాన్ని ఇచ్చేందుకు కొన్ని పరికరాలను నూరుశాతం రాయితీపై అందచేస్తున్నట్లు, సన్న, చిన్న కారు రైతులకు 50 శాతం నుంచి 90 శాతం, పెద్ద రైతులకు 50 శాతం రాయితీతో యంత్రాలను వ్యవసాయ, ఉద్యాన శాఖలు అందిస్తున్నాయని తెలిపారు.

రాయితీలు ఇలా...

డ్రిప్ పద్ధతి..

ఐదు ఎకరాలలోపు భూమి కలిగిన ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.2 లక్షలు విలువైన డ్రిప్ సామాగ్రిని ఉచితంగా అందిస్తారు. ఇదే సన్న చిన్నకారు రైతులకు 90 శాతం, 5 నుంచి 10 ఎకరాల ఉన్న రైతులకు 70 శాతం రాయితీతో రూ.2.80 లక్షలకు మించకుండా అందిస్తారు. పది ఎకరాల భూమి పైబడిన రైతులకు 80


ట్రాక్టర్ స్ప్రేయర్

శాతం రాయితీపై రూ. 4 లక్షలు విలువైన యూనిట్లు అందుకోవచ్చు.

స్ప్రింకర్లు, రెయిన్‌గన్స్

అన్ని కులాల రైతులకు (0.4 హెక్టార్ల నుంచి ఒక హెక్టారు వరకు) స్ప్రింకర్లు, రెండున్నర అంగుళం కొలత కలిగి రూ. 17,998 విలువైన 25 పైపులను రాయితీపై రూ.8,999 లకు ఇస్తారు. హెక్టారు నుంచి రెండు హెక్టార్ల వరకు అమర్చటానికి రూ. 26,199 విలువ కలిగిన 7 స్ప్రింకర్లు, 3 అంగుళాల 30పైపులను రూ. 13,100 లకు అందిస్తారు. రెయిన్‌గన్‌ల కోసం రూ. 23,524 విలువ కలిగిన 25 పైపులను రూ.11,752లకు అందచేస్తారు. కౌలు రైతులకు కూడా ఈ అవకాశం ఉంది. మరమ్మతులకు కూడా 50 శాతం వరకు రాయితీ ఇచ్చే సదుపాయం ఉంది.

ఇలా దరఖాస్తు చేసుకోవాలి..


తిరుమలాదేవి, ఏడీఏ

రాయితీపై డ్రిప్ స్ప్రింకర్లు, రెయిన్‌గన్‌లను కొనాలనుకునే రైతులు తమ ఆధార్‌కార్డు, తహసీల్దార్‌తో ధ్రువీకరించిన భూమి, యాజమాన్యపు పత్రం (1బిపత్రం), పాస్‌పోర్ట్ ఐఫొటో, రేషన్‌కార్డుతో మీ-సేవ కేంద్రంలో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాల కోసం జిల్లా వ్యవసాయ శాఖ, ఉద్యానశాఖలో ప్రత్యేక సెల్ రైతులకు ఏర్పాటుచేశారని ఏడీఏ సీహెచ్ తిరుమలాదేవి రైతులకు తెలియచేశారు.

వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు

యాంత్రీకరణకు మొగ్గుచూపుతున్న రైతులు



దమ్ము చక్రాలతో పొలంలో పనిచేస్తున్న ట్రాక్టర్, వరినాట్లకు ఉపకరించే యంత్రం

(కారంపూడి)

పల్నాటి ప్రాంతంలో ప్రజలకు వ్యవసాయమే ముఖ్య జీవనాధారం. వ్యవసాయంలో ఆధునిక యంత్రాలను ఉపయోగిస్తూ అన్నదాతలు పంటలు పండిస్తున్నారు. కూలీల కొరత ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో యాంత్రీకరణతో వ్యవసాయం లాభసాటిగా మారింది.

ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచే పొలం దుక్కిదున్నటానికి బ్లేడ్లు ఏర్పాటు చేసిన ట్రాక్టర్లు ఉపయోగిస్తున్నారు. వరినాట్లు వేయటానికి సైతం మిషన్లు అందుబాటులోకి వచ్చాయి. దమ్ముచక్రాల ట్రాక్టర్‌లతో పొలంలో దమ్ము చేయిస్తున్నారు. తైవాన్ స్ప్రేయర్లతో మందులు చల్లిస్తూ పంట పండిన తరువాత వరికోత యంత్రాలను కల్లాల్లో ఉపయోగిస్తున్నారు. గతంలో కల్లాలు నిర్వహించటానికి నాలుగురోజుల సమయం పట్టేది. మధ్యలో వర్షం పడితే ధాన్యం తడిచి రైతు నష్టపోయేవాడు. ఇప్పుడు ఈ యంత్రాల వలన సమయం కలిసివచ్చి రెండు మూడు గంటల్లోనే కల్లాల పనిపూర్తిచేసుకుంటున్నారు. ప్రభుత్వం 50శాతం సబ్సీడీపై యంత్ర పరికరాలను అందజేస్తోంది.


వరికోతలు జరుపుతున్న మిషన్

ట్రాక్టర్‌తోనే వ్యవసాయం
- దాసరి కోటయ్య, రైతు



మా ఇంట్లో రెండు జతల ఎద్దులు ఉండేవి. ట్రాక్టర్లు, మిషన్లు వచ్చాక వాటిని అమ్మేశాం. ఇప్పుడు మొత్తం మిషన్లతోనే వ్యవసాయం చేస్తున్నాం. యంత్రాలతో వేగంగా చేస్తున్నా ఖర్చులు పెరిగిపోయాయి. అయితే దీనివలన సమయం కలసి వస్తోంది.

కూలీల కొరత తీరుస్తున్న యంత్రాలు
- బొల్నేడి వెంకటేశ్వర్లు, రైతు



కూలీల కొరత తీవ్రంగా ఉంది. ప్రతి పనికి కూలీలను ఇతర ప్రాంతాల నుంచి తీసుకురావాల్సి వచ్చేది. దీంతో సమస్య పెరిగిపోవటంతో యంత్రాలనే వాడుతున్నాం. పొలం దున్నాలన్నా, దమ్ముచేయాలన్నా, కోతలకు సైతం యంత్రాలనే వాడుతున్నాం.

పెరటికోళ్ల పెంపకం .. లాభసాటి వ్యాపకం

చిలకలూరిపేట టౌన్ : వ్యవసాయానికి అనుబంధంగా సాగే వ్యాపకాల్లో పాడిపరిశ్రమ తర్వాత స్థానం పెరటికోళ్ల పెంపకానిదే. పౌల్ట్రీలు రాకముందు నాటుకోళ్ల పెంపకం ద్వారా ఆర్థికంగా అభ్యున్నతిని సాధించిన వారెందరో ఉన్నారు. ఇప్పటికీ కొందరు నాటుకోళ్ల పెంపకం ప్రధానవృత్తిగా లాభాలు గడిస్తున్నార పశువైద్యులు సీహెచ్ మల్లయ్య పేర్కొంటున్నారు. పెరటికోళ్ల పెంపకంలో పాటించవలసిన మెళకువలను వివరిస్తున్నారు.

ఇంటి పరిసరాల్లోనే..

ఉత్పత్తి సామర్థ్యం ఎక్కువగా ఉండే కోళ్లను ఇంటి పరిసరాల్లోనే పెంచుకోవచ్చు. దేశవాళీ కోళ్లకు ఉత్పత్తి సామర్థ్యం తక్కువగా ఉంటుంది. తొలకరి తర్వాత కాలం కోళ్ల పెంపకానికి అనువైనది. గడ్డి, పురుగులు, వర్షానికి కొట్టుకుని వచ్చే




సీహెచ్ మల్లయ్య, మండల పశువైద్యాధికారి

విత్తనాలు ఈ సీజన్‌లో కోళ్లకు మంచి ఆహారం. పెరటికోళ్లు ఆరుబయట తిరిగి ఆహారాన్ని సమకూర్చుకుంటాయి. వ్యవసాయ వ్యర్థాలను మేతగా వేస్తే సరిపోతుంది. నాటుకోళ్ల గుడ్లు, మాంసం రుచిగా ఉంటాయి. వీటి మాంసం ఆరోగ్యానికి శ్రేయస్కరం.

పెరటికోళ్లలో రకాలు

వనరాజా, గిరిరాజా, గ్రామలక్ష్మి తదితర జాతు కోళ్లను ఎంచుకుంటే లాభసాటిగా ఉంటుంది.

ఆరోగ్య సంరక్షణ

కోళ్లకు న్యాకాస్టల్, ఫౌల్‌ఫాక్స్ వంటి వ్యాధుల ముప్పు పొంచి ఉంటుంది. వీటి నివారణకు 8 నుంచి 9 వారాల పిల్లలకు టీకాలు వేయించాలి. పెట్ట కోళ్లను గుడ్ల ఉత్పత్తికోసం వేరు చేయాలి. రెండు, మూడు నెలల మధ్య నట్టల నివారణ మందులు వాడాలి.

పెంపకంలో మెళకువలు

కోళ్లకు ఆరువారాల వయస్సు వరకు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. వెదురుకర్రలు, చెక్కల వంటి స్థానికంగా లభించే వాటితో వీటికి వసతి ఏర్పాటు చేసుకోవచ్చు. కోళ్లు విసర్జించే వ్యర్థాల తేమను పీల్చుకోవడానికి, చల్లదనం కోసం రంపపు పొట్టును లిట్టర్‌గా వాడుకోవాలి.

సంగీత, సాహిత్య, సాంస్కృతిక కదంబం
అమరావతీయం 14
గుంటూరు ● సోమవారం ● 21 ఆగస్టు 2017

దాస్య భక్తిని పండించిన దాసరులు

జానపదం.. జానపదం

'హరిలో రంగ హరి.. హరిలో రంగహరి
రంగని గాథలు వినరండి
కావేటి రంగని కనరండి"

పాల భాగాన తిరుమణి ధరించి, మెడ నిండా తులసి పూసలు, తెల్లని ధోవతి, ఎర్రని అంగ వస్త్రం నడుముకు బిగించి ఒకచేత తంబురా ధరించి భుజంపై మీటుతూ, మరో చేత చిరతలు వాయిస్తూ, పాటకు అనుగుణంగా నృత్యం చేస్తూ ఉంఛవృత్తి నవలంబించే దాసరులు తెలుగునాట అన్ని ప్రాంతాలకూ పరిచయమైన వారే. ఈ వ్యాసంలో దాసరి భజనపరుల గురించి తెలుసుకుందాం.

'దాసరి' అంటే దాసుడు లేదా సేవకుడు అని అర్థం. ఈ 'దాసు' పదం బహుశా కన్నడ ప్రాంతం నుంచే వచ్చియుండవచ్చు. మనకి దాసభక్తి గురించి భాగవతం చెబుతోంది. నవ విధ భక్తి మార్గాల్లో దాసభక్తి శ్రేష్ఠమైనదిగా గుర్తించిన మహానుభావులు తమ పేరు చివర 'దాసు' నామాన్ని చేర్చుకున్నారు. అలాంటివారే పురందరదాసు, కనకదాసు, కృష్ణదాసు మొదలైనవారు. వీరంతా కన్నడ ప్రాంతం వారే. తమ గానవిద్యతో భగవంతుని మెప్పించి ఈశ్వర సాయుజ్యాన్ని పొందిన మధుర గాయకులు. వీరు భక్తి సామ్రాజ్యంలో నేగాక కర్నాటక సంగీత సామ్రాజ్యంలోకూడా విశిష్టస్థానాన్ని చేరుకున్నవారే. ఉత్తరాదిన రామాయణ కర్త తులసీదాసు ఈ దాస భక్తిమార్గాన్ని అనుసరించారు. మనం గమనించవలసిన మరో విషయం వీరంతా వైష్ణవ సంప్రదాయానికి చెందిన వారు కావడం.



కేవలం అనుసరించిన భక్తి మార్గంలో దాసత్వమేగాక భౌతికంగా కూడా భగవంతుని సేవ చేస్తూ, అదే తమ వారసత్వంగా స్వీకరించి, తరతరాలుగా భగవత్సేవలో పునీతమైన ఎన్నో తెగలున్నాయి. ఒకనాడు హైందవంలో బాగాలుగా నిలిచిన వీరశైవులు, వీర వైష్ణవులు తమ మతాల్లో సర్వ వర్ణాల వారికీ ప్రాధాన్యం, ప్రాతినిధ్యం ఇచ్చారు. అలా వైష్ణవంలో ప్రాతినిధ్యం పొందిన వారే ఈ దాసరులు. వీరు చాలా వర్గాల్లో కనిపిస్తారు. బుక్కదాసర, భాగవత దాసరి, పాగ దాసరి, దండె దాసరి, బుట్టదాసరి, మాల దాసరి, చిన్నదాసరి అనే అనేక తెగలు కనిపిస్తాయి.

వీరిలో దండె దాసరుల్ని పూర్తిగా దాసరి వారుగా పరిగణిస్తున్నారు. వీరు వైష్ణవ పీఠాధిపతుల అండలాలు మోసేవారట. వీరి భక్తికి మెచ్చి విశిష్టాద్వైత పీఠాధిపతులైన ఆచార్య రామానుజులవారు తంబుర, దండం, తాళాలు, శంఖం, దివ్వె ఇచ్చి, ఇవి ఆధారంగా భక్తి మార్గంలో జీవితాన్ని సాగించమని అనుజ్ఞయిచ్చాడట. ఈ కథ వారు పరంపరగా చెప్పుకుంటున్న కథ. నాటి నుంచి వీరిని దాసరులుగా పరిగణించడం జరిగింది.

వీరు వైష్ణవ దీక్ష స్వీకరించడం కూడా ఆచారంలో భాగంగా భావిస్తారు. శ్రీవైష్ణవుల్ని గురువులుగా భావించి వారి నుంచి దీక్ష స్వీకరిస్తారు. వైష్ణవాలయాల్లో పూజకు పూలు సమకూర్చటం, పల్లకీలు మోయడం మొదలైన పనులు కూడా వీరు చేసేట్టు తెలుస్తోంది. విజయనగర రాజుల కాలంలో ఈ దాసరులు వైష్ణవాలయాల్లో ఎంతో గౌరవంగా జీవించినట్లు, దేవాలయాలకు చెందిన మాన్యాల్లో వీరికీ భాగమున్నట్లు వీరి మాన్యాలను పూల మాన్యాలని పిలిచే వారని తెలుస్తోంది. ఇప్పటికీ బళ్లారి ప్రాంతంలో ఈ పూల మాన్యందారులున్నారు. అంతేకాక వీరికి వంశపారంపర్యంగా వచ్చే ఒక వాద్యముంది. దాన్ని 'తిరుచూర్ణము' లేదా 'తిరుసన్నాయి' అని పిలుస్తారు. పురాతనంగా మనకున్న 'బూరా' మాదిరిగా ఉంటుంది. ఈ వాద్యంతోపాటుగా ఈ దాసరులు కూడా ఆలయ పూజల్లో పాల్గొంటారు. నిత్య దేవాలయార్చనలో గోవిందనామాలు పాడుతూ, తిరుచూర్ణం మ్రోగిస్తూ, తిరుమంత్రోచ్చరణతో, భక్తిగానంతో వీరి విద్యుక్త కార్యక్రమాలు నడుస్తాయి.


(మిగతా భాగం వచ్చే సంచికలో)

- డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, సెల్: 98483 61627

నారదపాత్రకు జీవం పోసిన 'తుంగల'

నాటకం

నారద పాత్రకు జీవంపోసి ఒకే ఒక్క నాటకంతో రెండు దశాబ్దాల కాలం తెలుగు నాటకరంగంలో ఒకే ఒక్క నటునిగా రాజ్యమేలిన తుంగల చలపతిరావు ప్రతిభా వైదుష్యం చిరస్మరణీయం.



మల్లాది అచ్యుతరామశాస్త్రి రచించిన సక్కుబాయి నాటకంలో తుంగల నారదపాత్ర కీలకమైంది. ఏలూరు కంపెనీ చివరిదశలో తుంగల ఆ సంస్థలో సభ్యునిగా చేరారు. తెలుగులో గొప్ప భక్తిరస నాటకంగా పేరుపొందిన సతీసక్కుబాయి నాటకంలో తుంగల పేరు ప్రతిష్ఠలు ఆంధ్రదేశమంతటా మారుమ్రోగాయి. 1933లో సక్కుబాయి నాటకాన్ని గ్రామఫోన్ రికార్డులుగా విడుదల చేశారు. ఈ నాటకంలో రాధాకృష్ణ నాటకంలోని కొన్ని పద్యాలనుకూడా వాడుకున్నారు. సతీ సక్కుబాయి నాటకంలో నారదుని పాత్రలో తుంగల నటవైదుష్యాన్ని చూసిన సినీదర్శకులు సి పుల్లయ్య మోహినీ భస్మాసుర చిత్రంలో నారదుని పాత్రను ఇచ్చారు. సినిమా నిర్మాణ సమయంలో కూడా దాసరి కోటిరత్నం, ఏవీ సుబ్బారావు, రేలంగి, శివరావుతో కలసి సతీ సక్కుబాయి నాటకాన్ని రాష్ట్రవ్యాప్తంగా తుంగల ప్రదర్శించారు. సక్కుబాయి నాటకాన్ని చిన్న చిన్న పల్లెటూళ్ళతోపాటు మద్రాసు, బెంగుళూరు, మైసూరు, రంగూన్ వంటి పట్టణాల్లోకూడా తుంగల ప్రదర్శించారు. ఈ నాటకంలో జొన్నవిత్తుల కృష్ణునిగా, సూరవరపు వెంకటేశ్వర్లు అత్తగారుగా, ద్వైత గోపాలం యోగిగా, జొన్నవిత్తుల సత్యన్నారాయణ సక్కుబాయి భర్తగా నటించారు. తుంగల కోసం ఈ నాటకంలో ప్రత్యేకంగా రాసిన కదలిరాదిదూరమా, రంగా రంగా యనుడి అనే పాటలు ఆంధ్ర దేశమంతటా మార్మోగాయి. 1942మార్చి 29న మంగళగిరిలో సక్కుబాయి నాటకాన్ని ప్రదర్శిస్తూ రంగస్థలంపైనే తుంగల కన్నుమూశారు. - డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, 9848351517

నిత్య పోరాటశీలి పుతుంబాక భారతి

గుంటూరు మహిళలు



ఆదర్శాలు వల్లెవేయటంకంటే ఆచరించి చూపటమే నిజమైన మానవత్వమని నమ్మిన పోరాటశీలి పుతుంబాక భారతి. కృష్ణాజిల్లా శ్రీకాకుళంలో 1937 జూలై 17న మధ్యతరగతి రైతు కుటుంబంలో జన్మించారు. తల్లిదండ్రులు తిరుమలశెట్టి శేషయ్య, అలివేలు మంగమ్మ. కమ్యూనిస్టు నాయకుడు, మేనమామ కమ్మెల కనకదుర్గయ్యగారి వద్ద పెరిగారు. బాల్యం నుంచే పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాజకీయాలపై అవగాహన పెంచుకున్నారు. మాక్సింగోర్కీ 'అమ్మ', ఏడుతరాలు, రథచక్రాలు మొదలగు నవలలు చదివి కమ్యూనిస్టు భావజాలంతో రాజకీయాల్లోకి ప్రవేశించారు. నాటి ప్రముఖ నాయకుడు పుతుంబాక వేంకటపతిని కులాంతర వివాహమాడారు. 'ఆలిండియా డెమొక్రటిక్ ఉమెన్ అసోసియేషన్' గుంటూరుజిల్లా కార్యదర్శిగా సేవలందించారు. 28 సంవత్సరాలపాటు రాష్ట్ర మార్క్సిస్టుపార్టీ ఉపాధ్యక్షురాలిగా పనిచేశారు. రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా ప్రజాసమస్యలపై అలుపెరుగని పోరాటం చేశారు. 1994లో సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి శాసన సభ్యురాలిగా ఎన్నికయ్యారు. శాసన సభ లో మహిళా సమస్యలపై తన గళం వినిపించారు. అత్యాచారాలకు, అన్యాయాలకు గురైన మహిళలకు రక్షణ కల్పించారు. సత్తెనపల్లిలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ వైద్యశాలను తొలగించి నూతన భవనం నిర్మింపజేశారు. పలు పాఠశాలల భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం కొల్లూరులో నివసిస్తున్నారు. మహిళా సంఘం నేతృత్వంలో స్త్రీల సమస్యలపై ఆమె నిరవధిక పోరాటం ప్రశంసనీయం.

-డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి, 9394 113848

కవి చంద్రులు.. కన్నెకంటి చినలింగాచార్యులు

గుంటూరు కవులు

కన్నెకంటి చినలింగాచార్యులు పల్నాటి సోదర కవులలో రెండోవారు. 1903లో వేమవరంలో జన్మించారు. తల్లిదండ్రులు కోటమాంబ, రాజలింగాచార్యులు. కొండా రాజమల్లాచారి, బేతవోలు వెంకటకృష్ణశాస్త్రి గార్ల వద్ద విద్యనభ్యసించారు. 11వ ఏట గురువు అక్కిరాజు వెంకయ్యతో పోటీ పెట్టుకొని గంటకు 100 పద్యాలు ఆశువుగా చెప్పారు. లూథరన్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో చదువుకోవటంతో క్రైస్తవ మిత్రుల ప్రభావం వీరిపై ఉంది. పెదగార్లపాడు, తంగెడ, వేమవరం, ఆత్మకూరు, కారంపూడి, జూలకల్లు గ్రామాల్లో దాదాపు పది సంవత్సరాలు ఉపాధ్యాయుడిగా పనిచేశారు. 1933-35లో నరసరావుపేటలోని హనుమంతరాయ భవంతిలో ఉపాధ్యాయ శిక్షణ పొందారు. అక్కడ నెలకు ఎన్నిమిదిన్నర రూపాయల స్టైఫండ్ పొందారు. చినలింగాచార్యులు కంఠస్వరం వీణా నాదంలో ఉండేది. మత బోధనకై వచ్చే మిస్సమ్మలు, ఉద్యోగరీత్యా ఆ ప్రాంతంలో ఉండే తెల్లదొరలు చినలింగాచార్యులు గానాన్ని వినటానికి వచ్చేవారు. వీరు పురాణ పఠనంలో ప్రసిద్ధి పొందారు. అనంతర కాలంలో మాచర్లలో నివాసం ఏర్పరచుకున్నారు. 1964లో చంద్రవంక పొంగి పొరలి వీరి ఇంటిని నీళ్లపాలు చేసింది. ఆవిధంగా ఒకటొకటిగా కష్టాలు ఎదురు కావటంతో బంధువుల, పెద్దల ఆశ్రయం పొందాల్సివచ్చింది.

వీరి ముద్రిత రచనలు: 1.వేంకటరంగ శతకం 2.సూర్యనారాయణ స్తవం 3.కియామెఱ 4.సువ్రత 5.వెంకటరమణ శ తకం 6.దీర్ఘిక 7.నీలలోహిత శతకం 8.జ్యోతిస్తులు 9.రాజరా జు 10.స్తోత్రమంజరి 11.వేంకట రమణ స్తుతి 12.క్రీస్తు సుప్రభాతం. **అముద్రిత రచనలు:** బంగారు దార, ఆర్తనాదం, సంక్షిప్త రామాయణం, రామరాజ్యం, సంవాద లహరి, లోకం పోకడ.

కవి పండితులు పులవర్తి శరభాచార్యులు 'కవిచంద్ర' బిరుదుతో, చిలకలూరిపేటలో వేదాంత కవి 'మహా పౌరాణిక' బిరుదుతో వీరిని సన్మానించారు. మాచర్ల శిల్పకళా సమితి వారు 'కవికోకిల' బిరుదుతో గౌరవించారు. నరసరావుపేట ఎస్ఎస్ఎన్ కళాశాల వారు వీరి షష్టి పూర్తి ఉత్సవాన్ని నిర్వహించారు. మెడపై రాచపుండు లేచి 1968 జనవరి 26న చినలింగాచార్యులు మృతిచెందారు.

'రణభూమిన్ రిపు వేయునట్టి నిశితాస్త్రశ్రేణికోర్వంగ వచ్చును నానాశ్రమలైన తట్టుకొనవచ్చున్ జేదు భక్షింప వచ్చును వైశ్వానరు ముద్దుపెట్టుకొనవచ్చున్గాని క్షీణిస్థలిన్ ఋణ బాధన్ సహియింపరాదు గద తండ్రీ సూర్యనారాయణా!'

ఈ పద్యంలో కవి ఆక్రందన వెల్లడవుతోంది.

-డాక్టర్ వెన్నిసెట్టి సింగారావు, 9393015584

గ్రంథ సమీక్షకు ఆహ్వానం

జిల్లాకు సంబంధించిన రచయితల గ్రంథాల సమీక్షకు ఆంధ్రజ్యోతి శ్రీకారం చుట్టింది. దీనికిగాను రచయితలు చేయవలసిందల్లా వారి ప్రచురితమైన రచనకు సంబంధించి రెండు కాపీలను దిగువ చిరునామాకు పంపాలి. రచనలు సాహిత్య, సాంస్కృతిక, సామాజిక ఇతివృత్తాలతో కూడి ఉండాలి. సమీక్షకు సంబంధించిన గ్రంథాల ఎంపికలో తుది నిర్ణయం ఆంధ్రజ్యోతిదే. తమ రచనలను పంపవలసిన చిరునామా: ఎడిషన్ ఇన్‌చార్జి, ఆంధ్రజ్యోతి కార్యాలయం, రఘుమన్నన్ బిల్డింగ్స్, ఫస్ట్ ఫ్లోర్, బ్రాడీపేట 4వ లైన్, గుంటూరు.

నానీలు

- పతాకల కోసం
బరువు మోత..
కాలే కడుపు
దేవులాట ..!
....
నులకమంచంపై
కమ్మటి కల
అల్లిక జిగిబిగి
అమ్మనాన్నదే..

-సోమేపల్లి వెంకట సుబ్బయ్య

గ్రంథ సమీక్ష



ఈ దేశంలో..
నీళ్లకు కరువేమోగానీ,
అడుగడుగునా..
అబలల ఆర్తనాదాలతో
ఎగిసిపడే
కన్నీళ్లకు కొదవలేదు..

చిరకల శివరాజేంద్రప్రసాద్, కుందా డేవిడ్ విల్సన్ సంయుక్తంగా ప్రచురించిన 'విశ్వమంతకవిత' సంపుటిలోని 'నీళ్లు-కన్నీళ్లు' అనే శీర్షికతో కనిపించే కవిత ఇది. అబలల ఆక్రందనను అద్భుతంగా చిత్రీకరించిన ఈ కవిత కవుల సామాజిక స్పృహను తెలియజేస్తుంది.

పద్య కవులలో జంట కవులను చూశాంగాని వచన కవిత్వంలో జంట కవులుగా ప్రసిద్ధి పొందినవారు నాకైతే ఎవ్వరూ తెలియదు. వీరిద్దరూ జంట కవులుగా ఈ పుస్తకాన్ని ప్రచురించినట్లు ఊహించుకోవచ్చు. ఎందుకంటే ఇందులోని 65 కవితల్లో ఎవరు దేనిని రచించారో తెలపకపోవడమే దీనికి కారణం.

ఈ సంకలనంలోని కవితల్లో అధికభాగం వివిధ పత్రికల్లో ప్రచురింపబడినవే. 65వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 65 కవితలతో పుస్తకం ప్రచురించటం వారి దేశభక్తికి నిదర్శనం. ఈ కవితల్లో ప్రకృతిపై ప్రేమ కనిపిస్తుంది. మానవీయ విలువలతో మనుగడ సాగించాలనే హితవు కనిపిస్తుంది. రైతుల, శ్రామికుల గురించి ఉదాత్తంగా వర్ణించడం కనిపిస్తుంది.

ఆశ మనిషి సొత్తే..
మితిమీరితే పతనానికి పైమెట్టే
ఇది గమనిస్తే మనిషి కుదుట పడ్డట్టే..

ఇలాంటి కవితలు గమనిస్తే కవిత్వంలో వారి లోతు అర్థమవుతుంది.

(విశ్వమంత కవిత, కవులు: రాజు, బాబు, పుటలు: 39, వెల రూ.30, ప్రతులకు 9603726554లో సంప్రదించవచ్చు.

- డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, 9849799711

సాహితీ క్విజ్

1. 'పుష్పవిలాపం' అనే కవితా ఖండికను రచించిందెవరు?
2. 'నా కథ' అనే పేరుతో పద్యాలతో ఆత్మకథను రచించిందెవరు?
3. 'ధర్మజ్యోతి' అనే కావ్యాన్ని రచించిన కవి ఎవరు ?
4. 'చీకటి గదులు' అనే అనే నవలను ఎవరు రచించారు ?
5. 'ముఖంపుల్ల' అనే పేరుతో కవితా సంకలనాన్ని ప్రచురించిందెవరు ?

జవాబులు :

1 కరుణశ్రీ 2 జాషువా
3 తుమ్మల సీతారామమూర్తి
4.గోపీచంద్
5.రావి రంగారావు

నిర్వహణ : డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, 9849799711

పంట పొలాలపై దుండగుల దాడులు

● పొలాల్లో పత్తి మొక్కలు పెరికివేస్తున్న వైనం ● పంటలు రక్షించాలని రైతుల మొర


పొలంలో దుండగులు పెరికి వేసిన పత్తి మొక్కలను చూపిస్తున్న రైతు జోజప్ప

ఫిరంగిపురం : పుస్తెలు కుదువ పెట్టి పంటల సాగుకు సిద్ధమైన రైతన్న ప్రకృతి వైపరీత్యాలు, నకిలీ విత్తనాలు వంటి మార్కెట్ మాయాజాలంలో ఒకవైపు విలవిల్లాడుతుంటే పులిమీద పుట్రలా ఏపుగా పెరిగిన పత్తి మొక్కలను దారుణంగా పీకేస్తున్న దుండగులతో అల్లాడిపోతున్నారు మండలంలోని గొల్లపాలెం గ్రామానికి చెందిన రైతులు. దుండగుల ఆట కట్టించి పంటలను రక్షించాలంటూ రైతులు అధికారులకు మొర పెట్టుకోవడంతో సంఘటన వెలుగులోకి వచ్చింది. గొల్లపాలెనికి చెందిన ఆరుగురు రైతులు తమ పొలాల్లో పత్తి సాగు చేపట్టారు. గత పది రోజుల నుంచి గుర్తు తెలియని దుండగులు ఒక్కొక్కరి పొలంలో 25 సెంట్లు చొప్పున పత్తి మొక్కలను పెరికివేశారు. శనివారం రాత్రి అదే గ్రామానికి చెందిన గొట్టిపాటి జోజప్ప పొలంలోని పత్తి మొక్కలను పీకేశారు. ఆదివారం ఉదయం పొలంలోకి వెళ్లి చూసిన జోజప్పకు గుండె పగిలినంత పనైంది. సుమారు 60 రోజుల పత్తి పంట పూత, పిందెలతో మోకాలిపైన ఎదిగి ఉన్న మొక్కలు పెరికివేసి ఉన్నాయని రైతు జోజప్ప తెలిపాడు. గ్రామానికే చెందిన గొట్టిపాటి చెన్నయ్య, కార్యంశెట్టి శేషుబాబు, కురగంటి లక్ష్మయ్య, అబ్రహం, మక్కెన జయరావులతో పాటు మరికొందరి పొలాల్లో కూడా ఇదే విధంగా పత్తి మొక్కలు పెరికి వేస్తున్నారని రైతులు ఆవేదనతో చెప్పారు. గ్రామంలో ఎలాంటి గొడవలు లేవని, అందరం కలిసి మెలిసి జీవిస్తున్నామని, ఇలాంటి దుశ్చర్యకు ఎవరు పాల్పడ్డారో తెలియడంలేదని వాపోయారు. దీనిపై ఫిరంగిపురం పోలీసులకు ఫిర్యాదు చేశామని, దుండగులను పట్టుకొని తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అదనపు శ్రమ లేనిదే అద్భుతాలు సృష్టించలేం

● మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు


కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

నరసరావుపేట టౌన్ : అదనంగా పని చేయకుండా అద్భుతాలు సృష్టించలేమని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. వాసవి జూనియర్ కళాశాలలో విద్యావికాస్ వేదిక ఆధ్వర్యంలో నేషనల్ మీన్ మెరిట్ స్కాలర్ షిప్‌పై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో లక్ష్మణరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు అదనంగా పని చేయబట్టే ఎన్ఎంఎంఎస్‌లను నరసరావుపేట ప్రాంతంలో అధికంగా సాధించగలిగారని చెప్పారు. ఎన్ఎంఎంఎస్‌పై శిక్షణ పొందేందుకు ఉపాధ్యాయులు రావడం అభినందనీయమన్నారు. ఎంఎస్ఆర్‌కే ప్రసాదు మాట్లాడుతూ ఎన్ఎంఎంఎస్ పొందిన విద్యార్థులు ఏ కళాశాలలో చదివినా ఉపకారం అందేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. సీహెచ్ పాపారావు మాట్లాడుతూ ఉపకార వేతనాలు సాధించిన విద్యార్థులకు గుర్తింపుగా ధ్రువపత్రాలు ఇస్తే బాగుంటుందన్నారు. అనంతరం స్వాతంత్ర్య దినోత్సవాల్లో భాగంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ తదితర పోటీల విజేతలకు లక్ష్మణరావు బహుమతులు పంపిణీ చేశారు. క్విజ్‌లో కొత్తపల్లి జడ్పీ హెచ్ఎస్‌కు మొదటి, విప్పర్లరెడ్డిపాలెం జడ్పీహెచ్ఎస్‌కు ద్వితీయ, సెయింట్ ఆన్స్‌కు మూడవ బహుమతి లభించింది. చిత్రకళలో శంకర భారతీపురం జడ్పీహెచ్ఎస్ విద్యార్థి ఆర్.నందికి మొదటి, సెయింట్ ఆన్స్‌కు చెందిన ఏ.కౌషిత ప్రియకు రెండవ, ఎస్‌బీ పురం జడ్పీహెచ్ఎస్‌కు చెందిన టి.తేజకు మూడో బహుమతి లభించాయి. వ్యాస రచన లో కె.స్పందన మొదటి, పి.దీప్తి రెండు, బి.ఆదెమ్మ మూడో బహుమతి గెలుచుకున్నారు. కట్టా కోటేశ్వరరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు ఎం.దోనీ నాయక్, కేశవ్, నవీన్, శ్యామ్, కళాశాల డైరెక్టర్ రాయల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాసవి సేవా సమితుల సమాఖ్య నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

● మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యకు ఘన సత్కారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న సమాఖ్య నూతన కార్యవర్గం

నరసరావుపేట టౌన్ : జిల్లా వాసవి సేవా సమితుల సమాఖ్య నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం సత్తెనపల్లి రోడ్డులోని విజయ్ కల్యాణ మండపంలో అత్యంత వైభవంగా జరిగింది. విశిష్ట అతిథిగా హాజరైన మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్యను వెండి కిరీటం, శాలువాతో ఘనంగా సత్కరించారు. నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా కూరపాటి లక్ష్మీ పూర్ణచంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా పల్లబోతు రమేష్, కోశాధికారిగా కొత్తూరి ప్రదీప్ కుమార్, కో-ఆర్డినేటర్‌గా చందోలు ప్రకాశరావు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి హాజరైన ఉపన్యాసకులు, ప్రత్యేక ఆహ్వానితులను సన్మానించారు. చీతిరాల గురు పెద్దన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా, కపలవాయి విజయకుమార్, కాకుమాను పెదపేరిరెడ్డి, మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, పడుచూరి వెంకటేశ్వర్లు, దేవకి వెంకటేశ్వర్లు, భవనాసి యల్లారావు, కట్టమూరి శంకరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ వనమా సుబ్బారావు, ఎంఆర్‌కే మూర్తి, కూరపాటి వెంకట హనుమంతరావు, ఆల్ ఇండియా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పూరా బాస్కరరావు, ఏపీ స్టేట్ డ్రగ్ డీలర్స్ అధ్యక్షుడు కేవీ రంగారావు, కొల్లిపర కాశీ విశ్వనాథం, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

భట్రాజు ఫెడరేషన్‌కు పాలకవర్గం ఏర్పాటు చేయాలి

● భట్రాజు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూరపాటి కోటంరాజు

రాజుపాలెం/మాచవరం: భట్రాజు ఫెడరేషన్‌కు పాలకవర్గాన్ని ఏర్పాటు చేసి పేద భట్రాజుల అభివృద్ధికి తోడ్పడాలని భట్రాజు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూరపాటి కోటంరాజు ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని గణపవరంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం భట్రాజులకు రూ.15 కోట్లు మంజూరు చేసిందని, అయితే ఫెడరేషన్ పాలకవర్గం లేనందున ఆ నిధులను వినియోగించలేకపోయామన్నారు. ఉపాధ్యక్షుడు వేణుగోపాలరాజు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని అందరూ అభివృద్ధి చెందాలన్నారు. మాచవరం మండలం పిల్లుట్లలో జరిగిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాజా శ్రీధర్‌రాజు మాట్లాడుతూ భట్రాజులకు ప్రభుత్వం సబ్సిడీ రుణాలు అందజేయాలని కోరారు. కార్యక్రమాల్లో జిల్లా అధ్యక్షుడు కాసుల కృష్ణం రాజు, యువజన సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రతిష్ఠ పెంచిన నేత రాజీవ్‌గాంధీ

● మాజీ మంత్రి కాసు వెంకట కృష్ణారెడ్డి


నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కాసు, కాంగ్రెస్ పార్టీ నాయకులు

నరసరావుపేట టౌన్ : ప్రపంచ దేశాలలో దేశ ప్రతిష్ఠను పెంచిన నేత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అని మాజీ మంత్రి కాసు వెంకట కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను తన క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాసు మాట్లాడుతూ మచ్చ లేని వ్యక్తిగా జాతి కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయుడు రాజీవ్ అని కొనియాడారు. పేదల కోసం ఎన్నో సంస్కరణలు చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పెనుగొండ వెంకటేశ్వరరావు, కపలవాయి రమేష్ చంద్రదత్తు, కపలవాయి శివ ప్రసాదు, హరిబాబు, కుంచాల కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, కోనంకి ముత్యయ్య, అట్లూరి విజయ కుమార్, మౌలాలి, కానాల చెంచిరెడ్డి, వేలమూరి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ కొండపల్లి వెంకటేశ్వర్లు, అసెంబ్లీ ఇన్‌చార్జి గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్, ఎంఎం బాషా, మాబూ జానీ, మాబూ వలి, అన్వర్, శ్రీకాంత్, అద్దెపల్లి ఆనంద్, నాగేంద్ర, రాజు, నిమ్మకాయల బాజీ, లీగల్ సెల్ నాయకుడు పి.కోటేశ్వరరావు, కరీం బాషా, బాస్కర్ సాగర్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

పురావస్తు శాఖ ఉన్నతాధికారిని నియమించాలి

● బీఎంఎస్ ఏఎస్ఐ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు రామచంద్రరావు


మాట్లాడుతున్న రామచంద్రరావు

విజయపురిసౌత్: ప్రపంచ పర్యాటక కేంద్రం నాగార్జున కొండపై ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా డిప్యూటీ సూపరింటెండెంట్ స్థాయి అధికారిని నియమించాలని బీఎంఎస్ ఏఎస్ఐ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు రామచంద్రరావు కోరారు. స్థానిక మాతాసరోవర్ వద్ద ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రపంచంలోని బౌద్ధులు పరమ పవిత్రంగా భావించే నాగార్జున కొండ మ్యూజియంను కిందిస్థాయి ఉద్యోగులు నిర్వహించడంపై ఆయన అభ్యంతరం తెలిపారు. ఎంతో విలువైన బుద్ధుడి జీవిత విశేషాలకు సంబంధించిన వస్తువులు నాగార్జున కొండ మ్యూజియంలో ఉన్నాయన్నారు. అత్యంత భద్రత మధ్య ఉండాల్సిన ఈ మ్యూజియం నిర్వహణపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. కొండపై ఉన్న క్యాంటీన్‌కు సంబంధించిన ఎన్నికల అక్రమాలపై విచారణ చేపట్టాలని కోరారు. కొండపై బయోమెట్రిక్ యంత్రం ఏర్పాటు చేయాలని, కొండకు సంబంధించిన ప్రతి ఉద్యోగి హాజరు నమోదు చేయాలన్నారు. సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న ఏఎస్ఐ సిబ్బందిని అధికారులు వారి గృహాల్లో ఉపయోగించుకుంటున్నట్లు ఆరోపించారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

● ఏపీ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ మల్లికార్జునరావు

● ఆర్యవైశ్య విద్యానిధి ఆధ్వర్యంలో ఉపకార వేతనాల పంపిణీ


విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న విద్యానిధి సభ్యులు

చిలకలూరిపేట అర్బన్ : చదువును కష్టంగా కాకుండా ఇష్టంగా కొనసాగించాలని, విద్యతోనే సమాజంలో ఉన్నతి లభిస్తుందని ఏపీ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ పి.మల్లికార్జునరావు అన్నారు. ఆదివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణమండపంలో ఆర్యవైశ్య విద్యానిధి ఆధ్వర్యంలో 152 మంది పేద ఆర్యవైశ్య విద్యార్థులకు రూ.6 లక్షల ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభ కార్యక్రమానికి మల్లికార్జునరావుతోపాటు ఏపీ జెన్‌కో డైరెక్టర్ గ్రంధి వెంకట అప్పారావు, నూతనంగా ఐఏఎస్‌కు ఎంపికైన చందోలు విజయ నాగమణికంఠ, విశ్వనాథం సాయివంశీవర్ధన్, డి.సచిన్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభ కార్యక్రమంలో అతిథులు మాట్లాడుతూ విద్యార్థులు కష్టనష్టాలకోర్చి లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఆర్యవైశ్య విద్యానిధికి తమవంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెనాలికి చెందిన మునగాల శ్యామ్‌మోహన్ ప్రసాద్, డాక్టర్ పాలుకూరి నాగేంద్రలను సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య విద్యానిధి సభ్యులు పొట్టి శ్రీరాములు, మాజేటి వెంకటేశ్వర్లు, డాక్టర్ కొల్లా రామారావు, జీవీ రాఘవులు, రావికింది శ్రీనివాసరావు, ఎంవీ అప్పారావు, కృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన గుడ్లు సరఫరా చేస్తాం : ఎంఈవో

సత్తెనపల్లి: మధ్యాహ్న భోజనం పథకం కింద సరఫరా చేసే గుడ్లలో మురిగిపోయిన, పాడైపోయిన గుడ్లను తొలగించి వాటి స్థానంలో కొత్త గుడ్లు పాఠశాలలకు అందజేస్తామని ఎంఈవో శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. సుగాలీకాలనీ పాఠశాలకు అందజేసిన గుడ్లలో కొన్ని మురిగిపోయిన గుడ్లు వచ్చిన విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించినట్లు ఆయన చెప్పారు. అధికారులు మంచి గుడ్లు సరఫరా చేయిస్తామని చెప్పినట్లు ఎంఈవో తెలిపారు.

శివాలయంలో శాంతి కల్యాణం

పిడుగురాళ్లటౌన్: పట్టణంలోని శివాలయంలో మాస శివరాత్రి సందర్భంగా ఆదివారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు, శాంతి కల్యాణం జరిగాయి. ఉదయం స్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, నక్షత్ర హారతులు, నందీశ్వర, ద్వారపాలకుల, మకరకాళీసమేత వీరభద్రుడికి ప్రత్యేక పూజలు, గోపూజ, ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం శివపార్వతులకు దేవస్థాన అర్చకులు శాంతి కల్యాణం నిర్వహించారు. పల్లకీ, పవళింపు సేవలు వైభవంగా జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో దేవస్థాన ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ జె.శ్రీనివాసరావు, సభ్యులు కొత్తా వెంకట్రామయ్య, పాండురంగ శ్రీను, లఘువరపు పేరయ్య, మద్దినేని సైదమ్మ, మలిపెద్ది సత్యనారాయణ, అర్చకులు చందలూరి విజయకుమార్‌శర్మ, ప్రసాద్‌శర్మ పాల్గొన్నారు.

కిష్కింధను తలపిస్తున్న కారంపూడి

• గుంపులు గుంపులుగా వానర సంచారం • ఇళ్లలోకి చొరబడి ఆగడాలు • బెంబేలెత్తిపోతున్న ప్రజలు



నాగులేటి వంతెనపై భయభ్రాంతులను చేస్తున్న వానర మూకలు, పాలప్యాకెట్ చేతపట్టి ఇంటిపైకి ఎక్కిన కోతి

కారంపూడి : మండల కేంద్రమైన కారంపూడిలో కోతుల బెడద ఎక్కువైంది. సరిహద్దు నల్లమల అటవీప్రాంతం నుంచి ఇవి కారంపూడి చేరుకున్నాయి. వీధుల్లో తిరుగుతూ, నాగులేటి వంతెనపై ఉండి పాదచారులు, ద్విచక్ర వాహనదారుల వెంటపడి, వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. గృహాల్లోకి ప్రవేశించి, వస్తువులు, వస్త్రాలు తీసుకెళ్లి బయట పడవేస్తున్నాయి. అంతటితో ఆపకుండా మహిళలు, పిల్లల వెంటపడి గాయాలపాలు చేస్తున్నాయి. ఇలా పట్టణంలోని 16 వార్డుల్లో కోతుల చేష్టలతో ప్రజలు భీతావహులవుతున్నారు. కొద్దిరోజుల క్రితం స్టేట్‌బ్యాంకు సమీపంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న దంపతులపై కోతులు దూకగా, వెనుక ఉన్న మహిళ జారిపడి, గాయాలపాలయింది. తినుబండారాలు, పండ్లు, అమ్ముకునే సన్నా, చిన్నకారు వ్యాపారుల బండ్లపైకి వెళ్లి, వాటిని చెల్లాచెదురు చేస్తున్నాయి. గ్రామ పంచాయతీ పాలక వర్గం కోతులు పట్టేవారిని పిలిపించి, వాటిని పట్టించాలని ప్రజలు కోరుతున్నారు.

వేరే ప్రాంతం నుంచి వచ్చినవే..

కోతుల బెడద నివారణకు చర్యలు తీసుకుంటాం. మూడేళ్ల క్రితం కోతులు పట్టేవారిని పిలిపించి సుమారు 500ల కోతులను పట్టించి, దోర్నాల అడవుల్లో వదిలివేశాం. అయితే, వేరే గ్రామాలకు చెందినవారు కోతులను పట్టి కారంపూడి శివారులో వదిలివేయడం వల్ల అవి పట్టణంలోకి వచ్చి అలజడి సృష్టిస్తున్నాయి. పాలకవర్గ సమావేశంలో ఈ సమస్యపై చర్చించి, నిర్ణయం తీసుకుంటాం.

- జి.వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి

ఆర్యవైశ్యులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యే వేణుగోపాలరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం మండల నేతలు

కారంపూడి: ఆర్యవైశ్యులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి, వారిలోని పేదలను ఆదుకోవాలని కోరుతూ గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాలరెడ్డికి ఆర్యవైశ్య సంఘం మండల నేతలు ఆదివారం గుంటూరులో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ మండల అధ్యక్షుడు భవిరిశెట్టి రామారావు మాట్లాడుతూ, ఆర్యవైశ్యుల్లో నిరుపేదలు అనేక మంది ఉన్నారని మంత్రికి తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఆర్యవైశ్య సంఘం పట్టణ ఉపాధ్యక్షుడు కె.మల్లికార్జునరావు, వెలుగూరి శ్రీనివాసరావు, వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ కో ఆర్డినేటర్ ముచ్చర్ల రాంబాబు తదితరులున్నారు.

'పేద బ్రాహ్మణులు, విద్యార్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం'

దాచేపల్లి: అర్హత కల్గిన నిరుపేద బ్రాహ్మణులు పింఛన్‌కు, విద్యార్థులు ఉపకార వేతనాలకు దరఖాస్తులు చేసుకోవచ్చునని బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు పోతరాజు ప్రసాదరావు తెలిపారు. ఆదివారం సంఘం అధ్యక్షుడు ప్రసాదరావు, నియోజకవర్గ కో ఆర్డినేటర్ భరద్వాజశర్మలు మాట్లాడుతూ, సెప్టెంబర్ 30వ తేదిలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. వితంతవులు, వికలాంగులు, వృద్ధులకు పింఛన్‌లు, పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు(స్కాలర్‌షిప్‌లు) అందజేసేందుకు బ్రాహ్మణ వెల్‌ఫేర్ కార్పొరేషన్ అవకాశం కల్పించిందన్నారు. లబ్ధిదారులు పింఛన్‌ను బ్యాంకుల ద్వారా తీసుకోవచ్చునని తెలిపారు. బ్రాహ్మణుల అభివృద్ధికి సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, కార్పొరేషన్ ఛైర్మన్ ఆనంద్‌సూర్యలకు మండల బ్రాహ్మణ సంఘం ధన్యవాదాలు తెలిపింది.

నేటి కార్యక్రమాలు

● మాచవరం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం రుణమేళా జరుగుతుందని ఎంపీడీవో రాంబాబు తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న ఎస్సీ,ఎస్టీ, బీసీ, కాపు, మైనార్టీల అభ్యర్థులు హాజరుకావాలన్నారు. రేషన్, ఆధార్ కార్డులు, ఆన్‌లైన్ అర్జీ కాపీ తీసుకురావాలని సూచించారు.

పిడుగురాళ్ల కూరగాయల ధరలు (రూ.) 1 కిలో

టమోటా: 40, వంగ: 35, బెండ: 30, దొండ: 20, క్యారెట్: 60, క్యాబేజి: 20, దోస: 20, పచ్చిమిర్చి: 35, బంగాళదుంప: 20, చిక్కుళ్లు: 60, గోరుచిక్కుళ్లు: 30, బీట్‌రూట్: 40, బీర: 25, మునగ (1): 6.

సినిమా గైడ్

అశ్వని డీలక్స్	జయజానకినాయక
జయలక్ష్మి	నేనే రాజు నేనే మంత్రి
గంగామహల్	లై

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో సామాజికపరమైన (వ్యక్తిగతమైనవికాదు) సమస్యలు ఉన్నాయా? ఫోన్ చేసి ఆంధ్రజ్యోతికి తెలపండి. ఆ సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారి దృష్టికి తీసుకువెళ్తాం.

సమయం : ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి 8 గంటల మధ్య
ఫోన్ నెంబర్ : 9908622915



హ్యాపీ సండేలో పాల్గొన్న కమిషనర్ శివరామిరెడ్డి, విద్యార్థులు

ఒత్తిడిని అధిగమించాలి : కమిషనర్

పిడుగురాళ్లటౌన్: ప్రతి వ్యక్తి మానసిక ఒత్తిడికి దూరంగా ఉండాలని కమిషనర్ శివరామిరెడ్డి సూచించారు. ఆదివారం పట్టణంలోని విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్లో ఆనంద ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివరామిరెడ్డి, భవనాశి యల్లారావు, వైస్ ఛైర్మన్ అద్దంకి రత్నాకరరావు మాట్లాడుతూ ఉద్యోగులు ఒత్తిడికి దూరంగా ఉండి, సమన్వయంతో విధులు నిర్వర్తించాలని కోరారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలు, నృత్యాలు చేశారు. కమిషనర్, మున్సిపల్ ఉద్యోగులు విద్యార్థులతో కలసి డాన్స్ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సాంబశివరావు, కౌన్సిలర్లు వేముల సాంబయ్య, కొలిశెట్టి సుబ్బారావు, పాండురంగ శ్రీను, ఫణితిరవి, దేవళ్లరాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకే నంద్యాల ప్రజల జేజేలు

● మట్టి వినాయకుడి ఏర్పాటుకే మొగ్గుచూపాలి
● మార్కెట్ యార్డు కమిటీ ఛైర్మన్ 'పూజల'

రాజుపాలెం: నంద్యాలలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేపట్టిన పర్యటనతో తెలుగుదేశం పార్టీకే అక్కడి ప్రజలు జేజేలు పలుకుతారని మార్కెట్ యార్డు కమిటీ ఛైర్మన్ పూజల చినవెంకట కోటయ్య తెలిపారు. ఆదివారం ఆయన రాజుపాలెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, టీడీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి పట్టం కట్టేందుకు నంద్యాల ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను మేటి రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు చంద్రబాబు, సత్తెనపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సభాపతి కోడెల ప్రయత్నిస్తున్నారన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో ఈ మధ్యకాలంలో సభాపతి కోడెల ఏ కార్యక్రమానికి హాజరైనా పర్యావరణాన్ని పరిరక్షించండని చెబుతూ, వినాయకచవితి పండుగను మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకొని జరుపుకోవాలని సూచిస్తున్నారని చినవెంకట కోటయ్య వెల్లడించారు. ఈ విషయాన్ని విగ్రహాలు ఏర్పాటు చేసేవారు పరిగణలోకి తీసుకోవాలని కోరారు. సమావేశంలో మండలాభివృద్ధి కమిటీ ఛైర్మన్ బాబూరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు భాగ్యమ్మ, సాగర్ కెనాల్ కమిటీ డైరెక్టర్ ప్రభుదాసు తదితరులున్నారు.

ఎన్ఐవోఎస్ పరీక్షలకు 513 మంది హాజరు

కారంపూడి: జాతీయ సార్వత్రిక ప్రాథమిక పాఠశాల పరీక్షలను ఆదివారం మండలంలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలో సాక్షర భారతి ఆధ్వర్యంలో నిర్వహించారు. 513మంది వయోజనులు హాజరయ్యారు. ఈ పరీక్షలను మండల సాక్షర భారత్ కో ఆర్డినేటర్ కె.సుబ్బారావు, ఎంఈవో కె.వీరయ్యచౌదరి పర్యవేక్షించారు. అంగన్‌వాడీ టీచర్లను పరీక్షా కేంద్రాల నిర్వాహకులుగా నియమించారు.

గణనాథుడి విగ్రహ ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

● ఐదు రోజులకే నిమజ్జనం
● పర్యవేక్షణకు గ్రామానికొక కానిస్టేబుల్
● సీఐ హనుమంతురావు

పిడుగురాళ్ల రూరల్: గణనాథుడి విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సీఐ హనుమంతురావు తెలిపారు. శనివారం సాయంత్రం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో నిర్వాహకులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి విగ్రహం వద్ద తప్పనిసరిగా కమిటీని ఏర్పాటు చేసి, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. కమిటీ సభ్యులు ప్రతి రోజూ రాత్రి విగ్రహం వద్ద ఉండాలని తెలిపారు. డ్యాన్సులు, మద్యం, బాణసంచా ఊరేగింపు నిషిద్ధమని పేర్కొన్నారు. విగ్రహాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ఒక్కొక్క గ్రామానికి ఒక్కొక్క కానిస్టేబుల్‌కు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. వారు చెప్పిన స్థలంలోనే విగ్రహాల ఏర్పాటు చేయాలన్నారు. మూడు లేక ఐదు రోజుల్లోనే నిమజ్జనం చేయాలని సూచించారు. ఊరేగింపులో మహిళలు, పిల్లల పట్ల కమిటీ వారే బాధ్యత వహించాలన్నారు. సమావేశంలో ఎస్ఐ రఫీ, కానిస్టేబుల్ గోపాల్, కరిముల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

ఊరేగింపునకు అనుమతి ఉండాలి : ఎస్ఐ

బెల్లంకొండ: వినాయక విగ్రహాల ఏర్పాటు, నిమజ్జనం ఊరేగింపులకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడుతూ ఎవరైనా వినాయక విగ్రహాల వద్ద గొడవలు సృష్టిస్తే, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు వెలక్కాయల వేలం పాట

దాచేపల్లి: వినాయక చవితి పండుగను పురస్కరించుకొని నారాయణపురంలోని ఆర్ అండ్ బీ బంగ్లాలో ఉన్న వెలక్కాయలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఏఈ సుబ్బారావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం సోమవారం ఉదయం పది గంటల సమయంలో ఆర్ అండ్ బీ బంగ్లాలోని ఏఈ కార్యాలయం వద్ద ఈ వేలంపాట జరుగుతుందని, వివరాలకు సెల్ నం. 9491045158ను సంప్రదించవచ్చునన్నారు.

కడుపు నింపని కుల వృత్తులు

- ఆధునికతతో కరువైన ఆదరణ
- రోజురోజుకు పెరుగుతున్న ప్లాస్టిక్ వినియోగం
- కుండలు, ఈతచీపుర్లు, బుట్టలు కొనేవారే లేరు


వెదురు కర్రలు చీలుస్తున్న మేదరులు

చేతి వేళ్ల కదలికతో అద్భుత రూపం తెస్తారు.. కానీ, ఆ నాలుగు వేళ్లు నోట్లో కెళ్లక కడుపు నిండడంలేదు. పర్యావరణానికి హాని లేని విధంగా వారు ఇళ్లలో వినియోగించే వస్తువులను రూపొందిస్తారు.. అయితే, వారి ఇళ్లలో మాత్రం పొయ్యిలో పిల్లి లేవడం లేదు. స్థానికంగా దొరికే ముడిసరుకుతో వస్తువులు తయారుచేసే వారి జీవనం రోజు రోజుకు కడు దుర్భరంగా మారుతోంది. హైటెక్ మాయలో పడి ఆధునిక వస్తువులను ఆదరిస్తుండడంతో కులవృత్తి నమ్ముకున్నవారు పస్తులుండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇళ్లలో ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోవడంతో కులవృత్తిదారులు రూపొందించిన వస్తువులు కొనేవారే కరువయ్యారు.

(పిడుగురాళ్ల టౌన్)

పట్టణంలో వందకుపైగా కుటుంబాలు కుండల తయారీపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఒకప్పుడు దర్జాగా బతికిన వీరు నేడు పస్తులుండే పరిస్థితులు వచ్చాయి. వేల రూపాయలు ఖర్చుచేసి, మట్టిని కొనుగోలు చేసి, కుండలు తయారుచేసినా కొనేవారే లేరు. ప్రతి ఇంట్లో ఫ్రిజ్ వాడకం పెరిగి కుండలకు గిరాకీ తగ్గింది. అలాగే, రోజుల తరబడి కష్టపడి వెదురు కర్రల చీల్చి తయారుచేసిన బుట్టలు, చేటలను మార్కెట్‌లో కొనుగోలు చేసేవారే కరువయ్యారు. కొద్దిమంది మాత్రమే ఈ వృత్తిని ఆదరిస్తున్నా వారి కష్టానికి ఫలితం రావడం లేదు. మార్కెట్‌లో ప్లాస్టిక్ వస్తువులకే డిమాండ్ పెరిగింది. ఈతాకులతో తయారుచేసే చీపుర్లు, బుట్టలు వాడేవారు లేరు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ పథకాలు వర్తింప జేసి, తమను ఆదుకోవాలని కులవృత్తిదారులు కోరుతున్నారు.

రోజుకు రూ.50 రావడం లేదు



రోజంతా కష్టపడి గంపలు, బుట్టలు, తయారుచేసినా రూ.50 కూడా రావడం లేదు. ముళ్లు గుచ్చుకున్నా, రక్తం కారుతున్నా ఈతాకు తెచ్చి చీపుర్లు, బుట్టలు అల్లుతున్నాం. మార్కెట్‌లో మా వస్తువులకు గిరాకీ ఉండడం లేదు.

- కాకర్ల వెంకాయమ్మ

రుణాలిచ్చి ఆదుకోవాలి



చేతి వృత్తిదారులకు ప్రభుత్వం చేయూతనివ్వాలి. అతి తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చి ఆదుకోవాలి. డ్వాక్రా ఉత్పత్తుల మాదిరిగా మా వస్తువులను ఆదరించేలా ప్రభుత్వం ప్రోత్సహించాలి.

- మైలపల్లి నరసింహారావు

పూట గడవడమే కష్టంగా ఉంది



ఎన్నో ఏళ్లుగా బుట్టలు, తట్టలు తయారీనే నమ్ముకున్నాం. మార్కెట్‌లో ప్లాస్టిక్ వస్తువులు అందుబాటులోకి రావడంతో మేము తయారుచేసిన వస్తువులకు కొనుగోలుదారులు కరువయ్యారు. పూట గడవటమే కష్టంగా ఉంది.

- జొరిగే వెంకటపతమ్మ


బెల్లంకొండ డొంకలో..

మంచినీటి పథకానికి మరమ్మతులు

ఆఫీసర్స్ వాయిస్


శివరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్

పట్టణానికి మంచినీరు అందించే పథకానికి కొత్త విద్యుత్ మోటర్లను అమర్చుతున్నాం. నెలాఖరులోగా మోటర్ల బిగింపు ప్రక్రియ పూర్తి చేసి ట్రయల్‌రన్ వేసేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. వచ్చే నెల మొదటి వారానికి మరమ్మతులు, లీకేజీ పనులు పూర్తిచేసి, పట్టణానికి మంచినీరు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. **(పిడుగురాళ్లటౌన్)**

తెలుగుభాష ప్రాముఖ్యంపై వ్యాసరచన పోటీలు

కారంపూడి: ప్రభుత్వ గుర్తింపు పొందిన సెయింట్‌జాన్స్ హైస్కూల్ ఆవరణలో తెలుగుభాష ప్రాముఖ్యంపై ఆదివారం వ్యాసర చన పోటీలు జరిగాయి. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన సుమారు 1000 మందికిపైగా విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు. విజేతలుగా హైస్కూల్ విభాగంలో సీహెచ్ అభినవ్, పి.అన్నపూర్ణ, ప్రైమరీ విభాగంలో గుండా తేజస్, కజ్జం సాత్విక్‌లు నిలిచారు. వారికి కరస్పాండెంట్ భరత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రేష్మీ , పీఈటీ విజయ్ బహుమతి ప్రదానం చేశారు.

ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మాణమే లక్ష్యం

ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి

మాచర్ల: ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మాణమే లక్ష్యంగా పనిచేయాలని ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి సిబ్బందికి సూచించారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఆయన ఈవోపీఆర్డీ గంగా మోహన్, సూపరింటెండెంట్ సురేష్ విజయ్‌తో సమావేశమయ్యారు. ప్రతి గ్రామంలో పారిశుధ్యం మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా చూడాలన్నారు. మరుగుదొడ్డి లేని ఇంటిని గుర్తించి, మంజూరు చేయడంతోపాటు నిర్మించుకునేలా చూడాలని ఆయన సూచించారు.


సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి

గ్రామ దేవతలకు బోనాలు


పిడుగురాళ్లలో గంగమ్మతల్లి ఊరేగింపు, పాల్గొన్న మహిళా కోలాట బృందం

పిడుగురాళ్లటౌన్, రూరల్: శ్రావణమాస చివరి ఆదివారాన్ని పురస్కరించుకొని పట్టణంలోని గంగమ్మతల్లి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. పట్టణ, పరిసర ప్రాంతాలకు చెందినవారు అమ్మవారికి బోనాలు సమర్పించారు. దేవాలయంలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా నిర్వాహకుడు, కౌన్సిలరు కొక్కెర కొండలు సౌకర్యాలు సమకూర్చారు. అనంతరం అమ్మవారికి పట్టణ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. మహిళలు కోలాట ప్రదర్శన చేశారు. పట్టణ సీఐ ఎం.హనుమంతరావు భక్తులకు పులిహోర, పొంగలి పంపిణీ చేశారు.

దాచేపల్లి: గ్రామ దేవతలైన గంగమ్మ, ముత్యాలమ్మలకు భక్తులు బోనాలు సమర్పించారు. మండలంలోని నడికూడి, నారాయణపురం, అంజనాపురం గ్రామాలల్లో భక్తులు అమ్మవార్లకు పొట్టేళ్లు, కోళ్లను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నారాయణపురంలోని మైనింగ్ క్వారిలో ఉన్న గంగమ్మ తల్లికి మాజీ ఎంపీటీసీ పల్లపు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో భక్తులు బోనాలు సమర్పించారు. పిడుగురాళ్ల యార్డు ఛైర్మన్ మునగా నిమ్మయ్య, డీసీ ఛైర్మన్ నర్రా పుల్లయ్య, మాజీ జడ్పీటీసీ కోగంటి శివన్నారాయణ, నడికూడి-1 ఎంపీటీసీ తోట రజని, శ్రీనివాసరావు అమ్మవారికి పూజలు చేశారు. అంజనాపురం కాలనీలోని గంగమ్మకి బెల్లంకొండ ఎంపీటీసీ దేవళ్ల రేవతి పర్యవేక్షణలో భక్తులు బోనాలు సమర్పించారు. మన్సూర్‌షాపేటలోని ముత్యాలమ్మకి కులమతాలకతీతంగా బోనాలు సమర్పించారు. గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా కలసి, కుంకమ బండ్లు కట్టి, మొక్కులు చెల్లించారు.



గంగమ్మ గుడివద్ద యార్డు ఛైర్మన్ నిమ్మయ్య, పి.వెంకటేశ్వర్లు తదితరులు, పుష్పాలంకరణలో వీర్ల అంకమ్మ

వైభవంగా ముగిసిన చండీహోమం

వీర్ల అంకమ్మ దేవస్థానంలో నెల రోజుల నుంచి జరుగుతున్న చండీహోమం ఆదివారంతో ముగిసింది. చివరి రోజు పూర్ణాహుతి కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ నెల రోజులు దాతల సహకారంతో ఆలయంలో లక్ష గాజుల పూజ చేశారు. రెండు వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ప్రధానార్చకులు పాటిబండ్ల వెంకటరత్తయ్య, గుడా ఆంజనేయశర్మ, సాగి ఆంజనేయశర్మ, పుల్లభట్ల, మారుతి, గండికోట భరద్వాజ, జె.విష్ణు వేద పఠనం చేశారు. యలమల నరేష్, శ్రీ వేంకటేశ్వర, అంకమ్మ మహిళా మండలి భక్తులకు సహకరించారు.

రాజుపాలెం: మండలంలోని అనుపాలెం తూర్పుదిక్కు బోడుపై ఉన్న ముత్యాలమ్మకి ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకు కొలుపులు నిర్వహించారు. చివరి రోజున 2వేల మందికిపైగా మహిళలు ఉదయం గం.8లకు అమ్మవారికి బోనాలు సమర్పించారు. సాయత్రం గం.3ల సమయంలో కుంకుమ బండ్లు కట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈకార్యక్రమాల్లో ఇసుకేస్తే రాలనంత మంది మహిళా భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కమిటీ సభ్యులు సర్పంచ్ బండి కోటినాగిరెడ్డి, అంచుల హనుమంతరావు, నల్లగొర్ల ఆవులయ్య, మాలపాటి శ్రీనివాసరెడ్డి, జిల్లాగురవయ్య, వేముల చెన్నయ్య, గ్రామపెద్దలు, ప్రజలు ఏర్పాట్లుచేశారు.

కారంపూడి: మండలంలోని నరమాలపాడు గ్రామంలో పోలేరమ్మకి గ్రామస్థులు ఆదివారం బోనాలు సమర్పించారు. బోనాలను తలపై పెట్టుకొని మేళతాళాలతో, ఊరేగింపుతో గ్రామోత్సవం జరిపారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

స్థానిక అంకాళమ్మకి శ్రావణమాస చివరి ఆదివారం సందర్భంగా శాలివాహన సామాజిక వర్గం (కుమ్మరులు)వారు కుంకుమబండ్లు కట్టి, ఊరేగింపు నిర్వహించారు. మహిళలు బోనాలు సమర్పించారు.


రాజుపాలెంలో ముత్యాలమ్మకి సమర్పించేందుకు బోనాలు తీసుకెళ్తున్న అశేష జనవాహిని

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 2, 3

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): విద్యా విషయాల్లో ఆటంకాలు ఎదురవుతాయి. ప్రేమ బెడిసికొట్టే అవకాశం ఉంది. సృజనాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. పొదుపు పథకాలు, పెట్టుబడుల విషయంలో ఆచితూచి ముందడుగు వేయండి.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): కుటుంబ వ్యవహారాలు మనస్తాపం కలిగిస్తాయి. బదిలీ ప్రయత్నాలు ఫలించకపోవచ్చు. కార్యాలయంలో కొంత అసౌకర్యానికి గురవుతారు. వాయిదా పడుతున్న పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు.

మిథునరాశి: (మే21-జూన్21): విద్యార్థులు లక్ష్య సాధనకు పట్టుదలతో కృషి చేయాల్సి ఉంటుంది. వాహనాల కారణంగా అసౌకర్యానికి గురవుతాయి. రిప్రజెంటేటివ్‌లు, ఏజెంట్లకు శ్రమాధిక్యం. సమావేశాల్లో మాటపడాల్సి వస్తుంది.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులకు ఆటంకాలు కలిగే అవకాశం ఉంది. డిపాజిట్లపై మంచి ప్రతిఫలం అందుకుంటారు. రుణప్రయత్నాలు ఫలించకపోవచ్చు. ఖర్చులు అదుపులో పెట్టుకోవాలి.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): మనసును ఏదో వెలితి బాధిస్తుంది. చేపట్టిన పనులకు ఆటంకాలు ఎదురవుతాయి. కొత్తగా చేపట్టే పనుల ప్రారంభాన్ని వాయిదా వేయండి. అన్ని విషయాల్లో శ్రమాధిక్యం తప్పకపోవచ్చు.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల్లో అవాంతరాలు ఎదురవుతాయి. దీర్ఘకాలంగా వాయిదా పడుతున్న పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు. రహస్య సమాచారం అందుకుంటారు.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): మ్యూచువల్ ఫండ్స్, బ్యాంక్ డిపాజిట్లు, పొదుపు పథకాల వ్యవహారాలకు అనుకూల సమయం కాదు. సన్నిహితుల సహకారంతో ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. స్నేహానుబంధాలు బలపడతాయి.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ఉద్యోగ, వ్యాపారాల్లో అనుకోని చికాకులు ఎదురవుతాయి. పెద్దల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపించాలి. గౌరవ, ప్రతిష్ఠలకు భంగం కలిగే అవకాశం ఉంది. సంకల్ప సాధనకు పట్టుదలతో కృషి చేస్తారు.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ప్రణాళిక లోపించడం వల్ల లక్ష్యాలు సాధించలేకపోతారు. న్యాయపరమైన వివాదాలకు ఆస్కారం ఉంది. సమావేశాలు, చర్చలు, వ్యూహరచనలకు అనుకూలం. విద్యార్థులకు శుభప్రదం.

మకరరాశి:(డిసెంబర్22-జనవరి21): ఆస్పత్రులు, బ్యాంకులు, చిట్‌ఫండ్‌లు, మ్యూచువల్ ఫండ్ రంగాల వారికి ఆర్థికంగా నిరుత్సాహకరం. గ్రాట్యుటీ, బీమా, పింఛన్ వ్యవహారాలు కొలిక్కి వస్తాయి. బాధాకరమైన సమాచారం అందుకుంటారు.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): ఆర్థిక విషయాల్లో భాగస్వామి వైఖరి మనస్తాపం కలిగిస్తుంది. వేడుకల్లో ఖర్చులు అంచనాలు మించుతాయి. సెక్యూరిటీలు, పెట్టుబడుల్లో నష్టాలు తప్పకపోవచ్చు. సమావేశాల్లో కీలకపాత్ర పోషిస్తారు.

మీనరాశి:(ఫిబ్రవరి19-మార్చి20): వ్యవసాయం, పరిశ్రమలు, హోటల్ రంగాల వారు లక్ష్యసాధనకు అధికంగా శ్రమించాలి. విందుల్లో పరిమితి పాటించాలి. ఇంటర్వ్యూలలో నిరాశ తప్పకపోవచ్చు. ఆస్పత్రులు సందర్శించాల్సి రావచ్చు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

గన్నవరం విమాన సమాచారం

ఎయిర్ పోర్టు ఫోన్ నెంబర్: 0866- 2846729

- **హైదరాబాద్** : ఉదయం 9.35, సాయంత్రం 5.20, 5.35, రాత్రి 9.55 (ప్రతి రోజు), మధ్యాహ్నం 1.20 (బుధవారం మినహా)
- **విశాఖపట్నం** : ఉదయం 10.55 (బుధవారం మినహా), మధ్యాహ్నం 3.35 (బుధవారం మాత్రమే)
- **బెంగళూరు** : ఉదయం 7.45, రాత్రి 8.00 (ప్రతిరోజు), మధ్యాహ్నం 2.00 (మంగళవారం మినహా)
- **ఢిల్లీ** : ఉదయం 9.05, సాయంత్రం 5.20 (హైదరాబాద్ మీదుగా), రాత్రి 8.40 (ప్రతిరోజు)
- **చెన్నై** : ఉదయం 7.55, సాయంత్రం 5.20 (ప్రతిరోజు)
- **తిరుపతి** : ఉదయం 7.55 (బుధవారం మినహా)

43 మండలాల్లో 2.8 మి.మీ. సగటు వర్షపాతం

● **తాడేపల్లిలో అధికం**

ఆంధ్రజ్యోతి, గుంటూరు: జిల్లాలో ఆదివారం ఉదయం 8గంటల వరకు 43మండలాల్లో 2.8 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. తాడేపల్లి మండలంలో అధికంగా 8.2 మి.మీ, తక్కువగా దుర్గి మండలంలో 0.4 మి.మీ వర్షపాతం నమోదైంది. నెలాఖరు వరకు జిల్లాలో 152 మి.మీ. వర్షపాతం నమోదు కావాలి. ఈ నెల 20 తేదీ ఉదయం 8గంటల వరకు 102.8 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా 116.2 మి.మీ. కురిసి 13శాతం ఎక్కువగా ఉంది. తాడేపల్లి, వట్టిచెరుకూరు, పత్తిపాడు, గుంటూరు, పెదకూరపాడు, తాడికొండ, దుగ్గిరాల, కొల్లూరు, భట్టిప్రోలు, పొన్నూరు, దుర్గి, కాకుమాను, కారంపూడి, మాచవరం, నూజెండ్ల, తుళ్లూరు మండలాల్లో వర్షపాతం తక్కువగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో అధికంగా శావల్యాపురం మండలంలో 124 శాతం వర్షపాతం నమోదైంది.

నేడు గుంటూరులో న్యూ ఇండియా మథనం

ఆంధ్రజ్యోతి, గుంటూరు: స్వాతంత్ర్యం వచ్చి 70 సంవత్సరాలు అయిన సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో న్యూ ఇండియా మథనం అనే కార్యక్రమాన్ని సంకల్పంతో సిద్ధి పేరుతో... న్యూ ఇండియా మూమెంట్ 2017 - 22 కార్యక్రమాన్ని చేపట్టారు. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే ప్రధాన ధ్యేయంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. గుంటూరులోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సోమవారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే రావెల కిషోర్‌బాబు అధ్యక్షతన రాష్ట్రస్థాయిలో సదస్సు నిర్వహిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం, కృషి విజ్ఞాన కేంద్రం, ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కేంద్ర మంత్రి సుజనాచౌదరి న్యూ ఇండియా మథనం కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తారు. జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, శాస్త్రవేత్తలు, అధికారులు, అభ్యుదయ రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

కేన్సర్ బాధితుడికి రూ.15 వేల విరాళం

గుంటూరు (మెడికల్): అరుదైన మైలో ఫైబ్రోసిస్ అనే కేన్సర్‌తో బాధపడుతున్న వెల్లటూరుకు చెందిన బైరదుగు బాలాంజనేయులుకు శ్రీ ఆంజనేయం ధ్యాన యోగ మండలి ప్రధాన యోగాచార్యులు కేవీఎన్‌కే కిషోర్ గురూజీ రూ.15వేల ఆర్థిక సాయం అందజేశారు. సీఎంసి రాయవెల్లూరులో బోన్‌మ్యారో చికిత్స కోసం బాధితుడి పరిస్థితిని వివరిస్తూ 'కేన్సర్ కబళిస్తోంది...ఆదుకోరూ' శీర్షికన ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి కిషోర్ గురూజీ స్పందించారు. తెనాలి, బాపట్ల, రేపల్లె, మంగళగిరి, గుంటూరులోని యోగా సాధకులచే ఆయన విరాళాలు సేకరించగా వచ్చిన రూ.15 వేల నగదును బాలాంజనేయులు చికిత్సకు వినియోగించాలని కోరుతూ బాధిత కుటుంబ సభ్యులకు ఆయన అందజేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి

బ్రాయిలర్ బర్డ్	94.00,102.00,113.00
చికెన్ విత్ స్కిన్	182.00
చికెన్ స్కిన్‌లెస్	192.00

బ్రాయిలర్ ధరలు

వెన్‌కాబ్

రైతు ధర	88.00
రిటైల్ లైవ్	103.00
విత్‌స్కిన్	144.00
స్కిన్‌లెస్	170.00

జిల్లాలో నేటి వాతావరణం

గుంటూరు : జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు ఈ విధంగా ఉండవచ్చు. గుంటూరులో పగలు అత్యధికంగా 30 డిగ్రీల సెల్సియస్, రాత్రి అత్యల్పంగా 24 డిగ్రీల సెల్సియస్. జిల్లాలో కొన్ని ముఖ్య ప్రాంతాల్లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు. జంగమహేశ్వరపురం 30-24, తెనాలి 30-25, మాచర్ల 30-24, బాపట్ల 31-25, నరసరావుపేట 30-24 డిగ్రీల సెల్సియస్ ఉండవచ్చు.

ఆర్టీసీ సమాచారం

గుంటూరు : స్థానిక ఎన్టీఆర్ బస్టాండ్ నుంచి సోమవారం రాత్రి బయలుదేరు దూరప్రాంత సర్వీసుల సీట్ల ఖాళీల వివరాలను ఆర్ఎం జ్ఞానంగారి శ్రీహరి తెలిపారు. రిజర్వేషన్ కోసం 9959061597కు సంప్రదించాలని కోరారు. రాత్రి 11.00 - గుంటూరు - కేపీహెచ్‌బీ-గరుడ (ఏసీ)- 42, రాత్రి 10.50- గుంటూరు - కేపీహెచ్‌బీ - అమరావతి (ఏసీ)- 36, రాత్రి 10.15 - గుంటూరు - కేపీహెచ్‌బీ - ఇంద్ర (ఏసీ) - 31, రాత్రి 9.45 - గుంటూరు- కేపీహెచ్‌బీ-ఇంద్ర (ఏసీ) -36, రాత్రి 8.30- గుంటూరు - చెన్నై- సూపర్‌లగ్జరీ - 34 అని ఆర్ఎం తెలిపారు.

సాగర్‌లో 500.30 అడుగుల నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ నీటిమట్టం ఆదివారం నాటికి 500.30 అడుగులు ఉంది. ఇది 115.78 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 558 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 705 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 705 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం నీటిమట్టం 781.00 అడుగులు ఉంది. ఇది 20.74 టీఎంసీలకు సమానం.

సత్రశాల టెయిల్ పాండ్ సమాచారం

రెంటచింతల: సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో 4.76 టీఎంసీల నీరు నిల్వ వున్నట్లు ప్రాజెక్టు ఎస్ఈ శేషారెడ్డి తెలిపారు. దిగువకు నీటి విడుదలను నిలిపివేశామన్నారు.

పులిచింతలలో 3.70 టీఎంసీల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 3.70 టీఎంసీల నీటినిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ జీవీ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఎగువనుంచి ప్రాజెక్టులోకి సగటున 1044 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. పులిచింతల వద్ద స్లూయిజ్‌లను మూసివేసి దిగువకృష్ణకు నీటిని నిలిపివేశామన్నారు.

పశ్చిమ డెల్టాకు 5,523 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల : కృష్ణాపశ్చిమడెల్టాకు విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి 5,523 క్యూసెక్కులనీరు ఆదివారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజీ వద్ద ప్రస్తుతం 10.8 అడుగు నీటిమట్టం ఉంది. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ చానల్‌కు 250 క్యూసెక్కుల నీరు, తూర్పుకాల్వకు 532 క్యూసెక్కుల నీరు, పశ్చిమకాల్వకు 257 క్యూసెక్కుల నీరు, నిజాంపట్నం కాల్వకు 395 క్యూసెక్కుల నీరు, రేపల్లెకాల్వకు 1001 క్యూసెక్కుల నీరు, కొమ్మమూరు కాల్వకు 2020 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.

రాయపూడి మార్కెట్‌లో నిమ్మ ధరలు

తుళ్ళూరు: రాయపూడి నిమ్మకాయల మార్కెట్‌లో ఆదివారం జరిగిన లావాదేవీలు ఈ విధంగా ఉన్నాయి. పచ్చికాయ లావు రకం టిక్కీ రూ.1500 నుంచి 1800, పండుకాయ, సన్న రకం రూ. 1000 నుంచి రూ.1400 ధరలు పలికాయి.

రేపు ఎన్జీవోలకు మెడికల్ రీయింబర్స్‌మెంట్, హెల్త్‌స్కీంపై అవగాహన



మాట్లాడుతున్న షేక్ బాజిత్, సీహెచ్ రాంబాబు, జి.శ్రీనివాసరావు తదితరులు

గుంటూరు: ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్ట్ అందిస్తున్న మెడికల్ రీయింబర్స్‌మెంట్, ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌పై నాన్ గెజిటెడ్ ఆఫీసర్ (ఎన్‌జీవో)లకు ఈ నెల 22న అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏపీ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు షేక్ బాజిత్ తెలిపారు. స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్జీవో కల్యాణ మండపంలో సాయంత్రం 5 గంటలకు జరిగే కార్యక్రమంలో రూ. 50వేల రీయింబర్స్‌మెంట్ బిల్లుల వరకు ఎన్టీఆర్ ట్రస్టుకు ఆన్‌లైన్‌లో పంపే విధానంపై అధికారులు వివరిస్తారని పేర్కొన్నారు. స్కీముకు అర్హులైన వారికి ఈహెచ్ఎస్ విధానంలో ఏ ఆసుపత్రిలో ఏ రకమైన వ్యాధులకు ఏ ప్యాకేజీలు వర్తిస్తాయో, నెట్ వర్కింగ్ ఆసుపత్రుల గురించి ఎన్టీఆర్ వైద్యసేవా జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ వి.శ్రీనివాసరావు వివరిస్తారని తెలిపారు. సదస్సుకు ఈవో (ఈహెచ్ఎస్) డాక్టర్ టి.రవిప్రసాద్, జేఈవో (ఎంఆర్) డాక్టర్ కేవీ జోగారావు, డిప్యూటీ ఈవో (ఎంఆర్) సి.శివశంకర్ పాల్గొని పలు అంశాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, వర్కింగ్ జర్నలిస్టులు పాల్గొని ఇహెచ్ఎస్ పథకాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సీహెచ్ రాంబాబు, కోశాధికారి జి.శ్రీనివాసరావు, సహాధ్యక్షుడు ఎస్‌డీ జానీబాషా, ఉపాధ్యక్షులు జీఎస్ రాజ్‌కుమార్, బి.వెంకటప్పయ్య, సంయుక్త కార్యదర్శులు జీహెచ్‌వీ బ్రహ్మేశ్వరరావు, వైవీ సత్యనారాయణరావు, బి.కొండారెడ్డి, పి.హరికిషన్, నగర అధ్యక్షుడు కేఎన్ సుకుమార్, కార్యదర్శి ఎంఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ ఖతం

- వరిసాగుకు విరామమే
- బీళ్ళుగా మారిన లక్షలాది ఎకరాలు
- వరుసగా మూడో ఏటా సాగునీటి కరువు
- మూడేళ్ళలో రూ. 5,145 కోట్ల విలువైన ధాన్యం దిగుబడులు నష్టం
- 48 ఏళ్ళలో కనిష్ఠ స్థాయికి సాగర్, శ్రీశైలం జలాశయాలు

నరసరావుపేట: శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో నీటి నిల్వలు పరిశీలిస్తే ఈ ఖరీఫ్‌లో వరిసాగుకు విరామం ఇచ్చినట్లే. 2015, 2016, ఈ ఏడాది వరుసగా మూడు ఖరీఫ్‌లలో ఆయకట్టు రైతులు వరిసాగును కోల్పోయారు. జిల్లాలో సుమారు 3.42లక్షల ఎకరాల్లో సాగర్ ఆయకట్టు కింద వరి సాగయ్యేది. దీనిప్రకారం పరిశీలిస్తే మూడేళ్ళలో వరిసాగు లేక పోవటంతో సుమారు రూ. 5,145కోట్ల విలువైన ధాన్యం ఉత్పత్తులను రాష్ట్రం కోల్పోయింది. రైతులు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నారు. రైతులు, రైతు కూలీలు వరిసాగు లేకపోవటంతో ఉపాధికి ఇక్కట్లు పడుతున్నారు. ఆగస్టులో సాగర్ ఆయకట్టు ప్రాంతంలో పల్లెలు కళకళ లాడుతూ వుండేవి. వేలాది మంది కార్మికులకు ఈ ప్రాంతం ఉపాధి కల్పించేది. నేడు ఉపాధిని వెతుక్కోవాల్సిన దుస్థితి. గోదావరి జిల్లాల నుంచి వేలాది మంది వలస కార్మికులు ఆయకట్టు ప్రాంతానికి వచ్చి వరినాట్లు పనులు చేసేవారు. ట్రాక్టర్లు కూడా ఇతర జిల్లాల నుంచి ఇక్కడకు అధిక సంఖ్యలో తరలి వచ్చేవి. పుష్కలంగా పనులు వుండేవి. వరిసాగుతో ఆయకట్టు కళకళలాడుతూ వుండేది. నేడు ఆయకట్టు కళతప్పింది. వరిసాగు చేసే పొలాలు బీళ్ళుగా మారాయి. ఈ పొలాల్లో పశువులను మేపుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

● 48 ఏళ్ళ చరిత్రలో అతి తక్కువ నీటినిల్వలు ఇప్పుడే..


కృష్ణా బేసిన చరిత్రలో ఎన్నడూ లేనంతగా తక్కువ నీరు శ్రీశైలం జలాశయంలో వుంది. శ్రీశైలంలో నీటి నిల్వ మొదలైన తరువాత ఖరీఫ్‌కు సంబంధించి 2003లో అత్యంత దయనీయ పరిస్థితి ఎదుర్కోగా మళ్ళీ ఈ ఏడాది అటువంటి దారుణ పరిస్థితి తలెత్తింది. 2003 ఆగస్టులో 47.5 టీఎంసీలు నీటి నిల్వ మాత్రమే శ్రీశైలంలో వుంది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 20.75 టీఎంసీల నీటి నిల్వలు మాత్రమే వున్నాయి. ఈ జలాశయం ఏర్పడిన తరువాత ఆగస్టులో అత్యంత తక్కువ నీటి నిల్వలు నమోదు కావటం ఈ ఏడాదే. ఇప్పటివరకు శ్రీశైలంలోకి వరద నీరు రాక పోవటంతో ఆయకట్టులో గడ్డు పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తున్నది. సాగు నీటి మాట ఎలా వున్నా శ్రీశైలంలోకి వరదనీరు రాకపోతే సాగర్ కుడికాలువ ప్రాంతంలో తాగునీరు కూడా అందని ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి.

● 16 ఏళ్ళల్లో ఇది ఆరోసారి...

శ్రీశైలం జలాశయంలోకి నీటిప్రవాహం లేకపోవటంతో 16 ఏళ్ళల్లో నాగార్జున సాగర్ ఆయకట్టు కింద ఖరీఫ్‌లో సాగునీరు ఇవ్వక పోవటం ఇది ఆరోసారి. 2002, 2003 ఖరీఫ్‌లో సాగర్ ఆయకట్టుకు నీరు ఇవ్వలేదు. 2009 ఖరీఫ్‌లో వరిసాగు కాలేదు. అయితే ఆ సంవత్సరం అక్టోబరులో జలాశయాలకు వరద పోటెత్తటంతో ముందస్తు రబీ కింద వరి సాగుచేశారు. 2015, 2016 ఖరీఫ్‌లలో కూడా ఆయకట్టులో వరిసాగు కాలేదు. ఈ ఖరీఫ్‌లో కూడా వరిసాగుకు విరామం ఇచ్చినట్లే. శ్రీశైలం, నాగార్జున సాగర్ జలాశయాల్లో నీటినిల్వలు కనిష్ఠస్థాయి కంటే దిగువకు పడి పోయాయి. దీంతో ఆయకట్టు రైతులు ఖరీఫ్ వరిసాగుపై ఆశలు వదిలేసుకున్నారు. ప్రస్తుతం నాగార్జునసాగర్‌లో నీటి నిల్వ 500.3 అడుగులకు పడిపోయింది. ఇక్కడ 115.79 టీఎంసీలు నీటి నిల్వలు వున్నాయి. శ్రీశైలం జలాశయంలో 781అడుగులకు నీటి నిల్వ పడిపోగా 20.75 టీఎంసీలు నీరు ఈ జలాశయంలో వుంది. శ్రీశైలంకు వరదనీరు రావటం లేదు. ఆల్మట్టి, జూరాల, నారాయణ్‌పూర్ ప్రాజెక్టులు నిండు కుండల్లా వున్నాయి. వర్షాలు కురవకపోతుండటంతో ఆ జలాశయాల నుంచి నీరు శ్రీశైలంకు రావటం లేదు. శ్రీశైలం జలాశయం నిండాలంటే సుమారు 195 టీఎంసీల నీటి నిల్వలు అవసరం. ఇప్పటికైనా వరుణుడు కరుణించి కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో భారీవర్షాలు కురిస్తే కనీసం ముందస్తు రబీలోనైనా వరిసాగు చేసే అవకాశం వుంటుంది. ఏదేమైనా వరిసాగు ఆయకట్టులో చేయాలంటే కనీసం శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలకు 350 టీఎంసీల నీటి నిల్వలు అవసరం. ఈ నీరు వచ్చే పరిస్థితి లేదు. వరుసగా మూడేళ్ళు వరిసాగు కోల్పోయిన రైతులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఆర్యవైశ్యులు కలసికట్టుగా ఉండాలి

- తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య
- జిల్లా వాసవీ సమితుల సమాఖ్య కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం


మాట్లాడుతున్న మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య

నరసరావుపేట టౌన్: ఆర్యవైశ్యుల ందరూ వాసవీ మాత ముద్దు బిడ్డలుగా ఎదగాలని మాజీ ముఖ్యమంత్రి, తమిళ నాడు మాజీ గవర్నర్ డాక్టర్ కొణిజేటి రోశయ్య అన్నారు. ఆదివారం స్థానిక సత్తెనపల్లి రోడ్డులోని విజయ్ కల్యాణ మండపంలో జరిగిన జిల్లా వాసవీ సేవాసమితుల సమాఖ్య నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రోశయ్య మాట్లాడుతూ ప్రాథమిక అంశాల్లో ఆర్యవైశ్యులందరూ కలసికట్టుగా పని చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ నడపటానికి తలప్రాణం తోక్కొచ్చిందని, దీంతో రెండో సంస్థ జోలికి వెళ్ళలేదన్నారు. ఆర్యవైశ్య మహాసభ సంస్థను అందరి ముందు నిలబెట్టి తప్పుకున్నానని చెప్పారు. జిల్లా వాసవి సేవా సమితుల సమాఖ్య ఉత్సాహంగా పనిచేస్తే కొరత వుండదన్నారు. పేరుకు మాత్రమే సంస్థ వుంది, విధులు, బాధ్యతలు నిర్వహించలేకపోతే సమస్యలు పరిష్కారం కావని చెప్పారు. సంస్థలు సేవాభావంతో పనిచేయాలన్నారు. వాసవి అమ్మవారి దయ, కృప, కటాక్షం వుండటం వల్లే మనం అందరం చల్లగా వున్నామని నమ్మే వారిలో తానొకడినని చెప్పారు. రాజకీయ పార్టీలకు కొన్ని పరిమితులు వుంటాయన్నారు. అనేక సంస్థల మధ్య మన పూర్వీకులైన పెద్దలు ఆర్యవైశ్యులు ఏర్పాటుచేసిన ఆర్యవైశ్య మహాసభకు 1975లో నూతన జవసత్వాలు అందించి సేవ చేయటానికి కృషిచేశానని చెప్పారు. సంస్థ ఆదేశం, ఆలోచన, ఉద్దేశం సేవగా వుండాలన్నారు. రాజకీయ పార్టీలకు వీటితో సంబంధం లేదని చెప్పారు. ఎవరు ఏ పార్టీలో వున్నా ప్రాథమిక ఆలోచనలు ఒక్కటేనన్నారు. నరసరావుపేట చిరకాలంగా తెలిసిన ప్రాంతమన్నారు. ఆరోగ్యం, వయసు వెనుకకు లాగుతున్నా నరసరావుపేట అనగానే ఉత్సాహం వచ్చి రాగలిగి అందరినీ చూడగలిగానని రోశయ్య పేర్కొన్నారు. నరసరావుపేట ప్రాంతంలో రాజకీయ చైతన్యం ఎక్కువన్నారు. తన వయసు దృష్ట్యా లేచి సంప్రదాయం ప్రకారం మాట్లాడే ఓపిక సన్నగిల్లిందన్నారు. చీతిరాల గురు పెద్దన్న అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పడుచూరి వెంకటేశ్వర్లు, కాకుమాను పెద పేరిరెడ్డి, మునిసిపల్ ఛైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, దేవకి వెంకటేశ్వర్లు, మిట్టపల్లి వెంకట కోటేశ్వర రావు, కపలవాయి విజయకుమార్, భవనాశి యల్లారావు, కట్టమూరి శంకరరావు, కూరపాటి వెంకట హనుమంత రావు, వనమా సుబ్బారావు, ఎంఆర్‌కే మూర్తి, కొల్లిపర కాశీవిశ్వనాథం, కేపీ రంగారావు, పూరా భాస్కరరావు పాల్గొన్నారు.

అనంతపురం జట్టు ఆధిక్యం

- 154 పరుగులు చేసిన యోగానంద్


154 పరుగులు చేసిన అనంతపురం జట్టు బ్యాట్స్‌మెన్ బి.యోగానంద్


ఆరు వికెట్లు తీసిన శ్రీకాకుళం బౌలర్ టి.విజయ్

నరసరావుపేట టౌన్ : స్థానిక ఆంధ్రా పబ్లిక్ స్కూల్ ఆవరణలో ఏసీఏ ఎస్ కేఆర్‌బీఆర్ క్రికెట్ మైదానంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్- 16 అంతర్ జిల్లాల బాలుర క్రికెట్ పోటీ ఆదివారం రెండో రోజు అనంతపురం, శ్రీకాకుళం జట్ల మధ్య జరిగింది. శ్రీకాకుళం జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 61 పరుగులను ఆలౌట్ అయింది. అనంతపురం జట్టులో వి.గణేష్‌రెడ్డి నాలుగు వికెట్లు, బి. వెంకటరమణ నాలుగు వికెట్లు సాధించారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 339 పరుగులు చేసి ఆలౌట్ అయింది. శ్రీకాకుళం జట్టు బౌలర్ టి.విజ య్ ఆరు వికెట్లు సాధిం చాడు. అనంత పురం జట్టులో బి.యోగా నందరెడ్డి 154 పరుగులు, దత్తారెడ్డి 66 పరుగులు, హర నాథ్ 56 పరుగులు చేశారు. అనంతరం శ్రీకాకుళం జట్టు రెండో ఇన్నింగ్స్ ప్రారంభించి ఒక వికెట్ నష్టపోయి ఎనిమిది పరుగులు సాధించింది. మూడో రోజు సోమ వారం ఆట కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. అండర్ - 16 స్టేట్ సెలెక్టర్ ఎస్.కృష్ణమోహన్, జిల్లా సెలక్టర్ అమరనాథ్, ఏసీఏ కోచ్ వి.కృష్ణ, గ్రౌండ్ కోఆర్డినేటర్ కేవీ పురుషోత్తమరావు పోటీలను పర్యవేక్షించారు.

రేపు హిందూ ఫార్మసీ 'కళాశాలలో సంకల్ప సిద్ధి'

- హాజరు కానున్న కేంద్ర మంత్రి జగత్ ప్రకాష్‌నడ్డా

గుంటూరు(సంగడిగుంట): ప్రధాని మోదీ "సంకల్ప సిద్ధి- నవభారత నిర్మాణ ం" పిలుపులో భాగంగా అమరావతి రోడ్డులోని హి ందూ ఫార్మసీ కళాశాలలో ఈనెల 22న ఈ కార్యక్రమం జరుగుతోందని బీజేపీ నగర అధ్యక్షుడు అమ్మిశెట్టి ఆంజ నేయులు తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి జగత్‌ప్రకాష్ నడ్డా హాజరుకాబోతున్నారని అన్నారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం 2022 నాటికి నవభారత నిర్మాణం కోసం, సంకల్పం కోసం ప్రధాని మోదీ ఆదేశాల మేరకు దేశంలోని అన్ని పార్లమెంట్ నియోజకవర్గాల్లో కేంద్ర మంత్రులు పర్యటిస్తున్నారని తె లిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గండవరపు జగన్, ఆలూరి కోటేశ్వరరావు, నగర ప్రధాన కార్య దర్శి తోట రామకృష్ణ, ఉపాధ్యక్షుడు అప్పిశెట్టి రంగారావు పాల్గొన్నారు.

మహాశివునికి విశేష అభిషేకాలు


విభూదితో శివునికి అభిషేకం

నరసరావుపేట పట్టణ నడిబొడ్డున వున్న మహాశివుని విగ్రహానికి మాస శివరాత్రిని పురస్కరించుకొని ఆదివారం రాత్రి విశేష అభిషేకాలు నేత్ర పర్వంగా జరిగాయి. లోక కళ్యాణార్థం శ్రీశారదా స్మార్త పురోహిత సంఘం ఆధ్వర్యంలో శివునికి పంచామృత స్నపన పూర్వక రుద్రాభిషేకం వైభవంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. అభిషేకాల అనంతరం ప్రత్యేక అలంకారం చేశారు. భక్తులు హాజరై స్వామి అభిషేకాలను కనులారా తిలకించారు. - నరసరావుపేట


పసుపుతో శివునికి అభిషేకం

ఖజానాకు కన్నం

- నష్టం పూడ్చుకునేందుకు ఆర్టీసీ కుయుక్తి
- బస్సు ఊసేలేని గ్రామాలకు ఉచితపాసులు
- హాస్టల్ విద్యార్థులకూ ఇదే వరుస
- ప్రభుత్వ రీయింబర్స్‌మెంట్‌కు ఎర

మాచర్ల: గ్రామీణ బాల బాలికలను బడిబాట పట్టించడమే ప్రభుత్వ ప్రధానలక్ష్యం. ఇందుకు ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో పొరుగున ఉన్న మండల కేంద్రాలకు, పట్టణాలకు వెళ్లి చదువుకోవాలన్న విద్యార్థుల కోసం ప్రభుత్వం ఉచిత బస్సు పాసులను ప్రవేశపెట్టింది. ఒకటి నుంచి ఏడో తరగతి వరకు అంటే పన్నెండేళ్ల లోపు బాలురకు, ఒకటి నుంచి పదో తరగతి వరకు బాలికలకు ఉచిత బస్సు పాస్ వర్తిస్తుంది. ఆయా డిపోల పరిధిలోని విద్యార్థుల డేటాను ప్రభుత్వానికి అందిస్తే రీయింబర్స్‌మెంట్ రూపంలో ఆర్టీసీ తిరిగి చెల్లిస్తుంది.

● దారి మళ్లింపు ఇలా..

ఈ రీయింబర్స్‌మెంట్ నగదును అధిక మొత్తంలో గుంజేందుకు పిడుగురాళ్ల, మాచర్ల డిపో అధికారులు పెద్ద స్కెచ్చే వేశారు. ప్రైవేటు పాఠశాలల్లోని హాస్టల్ విద్యార్థులకు, బస్సు వెళ్లని గ్రామాలకు, స్థానికంగా బంధువుల ఇళ్లలో ఉండి చదువుకునే విద్యార్థులను వెతికి పట్టుకొని మరీ బస్సుపాస్‌లు రాసేశారు. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో మొన్నీమధ్యే 500మంది విద్యార్థుల ఫొటోలు, ఆయా తరగతి రిజిస్టర్లు తీసుకెళ్లి పాస్‌లు తయారుచేశారని సమాచారం. మాచర్ల మండలంలోని జమ్మలమడక గ్రామం నుంచి పట్టణానికి బస్సు సౌకర్యం లేదు. అయినా అక్కడి నుంచి రమారమి 600మంది విద్యార్థులు ఆయా పాఠశాలలు ఏర్పాటుచేసిన స్కూల్ బస్సుల్లో నిత్యం వచ్చిపోతుంటారు. వీరందరి పేర్లు ఉచిత బస్సుపాస్ పథకంలో నమోదై ఉండడం గమనార్హం! బస్సులేని ఊరికి ఎలా ఉచిత బస్సు పాసులిచ్చారో ఆ అధికారులకే ఎరుక. బస్సులు లేని తేరాల, లింగాపురం, ద్వారకాపురి, కొత్తూరు గ్రామాల విద్యార్థుల పేర్లను కూడా అధికారులు రాసిపడేశారు. సెప్టెంబర్ నుంచి తిరిగి ఆగస్టు మాసం చివరి వరకు చెల్లుబడయ్యే (సెలవు రోజులు మినహా) ఈ ఉచిత బస్సు పాస్‌లు మాచర్ల డిపోలో ఇప్పటికి 13వేలు ఉన్నాయి. మాచర్ల అధికారులను ఆదర్శంగా తీసుకున్న పిడుగురాళ్ల డిపో కూడా అదే బాటననడుస్తూ 4200 బస్సు పాస్‌లను మంజూరుచేసింది. నిజానికి రెండు డిపోల పరిధిలో కలిపి 5 వేలకు మించి లబ్ధిదారులు ఉండరన్న వాదన విద్యాశాఖాధికారుల నుంచే వినిపిస్తోంది. ఒక్కో విద్యార్థికి కనీసంగా రూ. 2వేల వంతున లెక్కేసుకున్నా రెండున్నర కోట్ల పైన నిధులు దారి మళ్లినట్లు తెలుస్తోంది.

● ఉద్యోగులకు టార్గెట్లు

ఆర్టీసీని లాభాలబాట పట్టించేందుకు అధికారులు పన్నిన ఈకుట్రలో ఉద్యోగులకు టార్గెట్లు ఇచ్చారు. సుమారు పదిహేను మంది కార్మికులను దీనికి కేటాయించి అన్ని పాఠశాలలకు పంపుతున్నారు. సదరు ఉద్యోగులు ఫొటోలు, రిజిస్టర్‌ల ఫొటోస్టాట్ కాపీలు తీసుకొని ఇంటి వద్దే బస్సు పాస్‌లు పూర్తి చేస్తున్నారు. తిరిగి పాఠశాలలకు వచ్చి స్కూల్ స్టాంపు, హెచ్‌ఎం సంతకాలు చేయించుకొని ఆ పాస్‌లు ఎవరికీ ఇవ్వకుండానే వెంటపెట్టుకు వెళ్తున్నారు. ఈ తంతు ఈనెలాఖరు వరకు జరిగే అవకాశం ఉంది.

● జీతం కడితే విధులకు మినహాయింపు

ఇక్కడ ఇంకో గమ్మత్తయిన విషయముంది. ఒక్కో ఉచిత బస్సు పాస్‌కు విద్యార్థులు రూ.40 చొప్పున ఆర్టీసీ యాజమాన్యానికి చెల్లించాలి. బస్సుపాస్ ముఖమే తెలియని ఆ విద్యార్థులు ఆ ఖర్చును ఎందుకు బరాయిస్తారు..? అందుకోసం డిపో ఉన్నతాధికారులు కొత్త ఎత్తుగడ వేశారు. జీతంపై పెద్దగా ఆధారపడని కొందరిని సేకరించి మీ పనుల్లో మీరుంటూ వచ్చే జీతాన్ని ఆ పాసుల కింద చెల్లించవచ్చని బంపర్ ఆఫర్ ఇచ్చేశారు. దీంతో మూడు మాసాలుగా ఓ పది మంది ఉద్యోగులు జీతాల రోజున తప్ప బస్టాండ్ వైపే చూడడం మానేశారు. ఓ ఉద్యోగి గుంటూరులో ఇంటి నిర్మాణ పనిలో ఉండగా మరో ఇద్దరు ఉద్యోగులు తమ వ్యవసాయ భూమిని సాగుచేసుకుంటున్నారు. ఓ ఉద్యోగి విజయనగరంలో, మరో ఉద్యోగి నరసరావుపేటలో కాలక్షేపం చేస్తున్నారు. అందరినీ బస్సుపాస్‌లకు కేటాయిస్తే పూర్తి చేసిన బస్సుపాసుల్లో వీరందరి సంతకాలు ఉంటాయి. కేవలం ఇద్దరు ముగ్గురే ఈ విధులు నిర్వహిస్తుండడం వల్ల సదరు పాసులపై వారి సంతకాలే ఉండడాన్ని దర్యాప్తు అధికారులే గమనించవచ్చు. చాలా మంది ఉద్యోగులు ఈ విధంగా విధులకు ఎగనామం పెట్టడంతో ప్రాణంమీదకు వచ్చినా విధులు నిర్వహించే ఉద్యోగికి సెలవు దొరకడం గగనంగా మారింది.

పెద్దాయనకు అవమానం

- ఆయన వెళ్తే రాష్ట్రపతి, గవర్నర్ బంగ్లాల ద్వారాలు తెరుచుకుంటాయి
- కేంద్ర బడ్జెట్ తుదిమెరుగుల్లోనూ ముద్ర
- జిల్లాస్థాయిలో మాత్రం చేదు అనుభవం
- ఓ అధికారిని కలిసేందుకు గంట నిరీక్షణ
- వెనుదిరిగే సమయంలో పేషీలోని ఉద్యోగుల్లో కదలిక

ఆంధ్రజ్యోతి, గుంటూరు: అధికారం ఉంటేనే ఈ రోజుల్లో ఎవరైనా గొడుగులు పట్టేది.. గులాములు కొట్టేది. వ్యక్తిత్వాన్ని చూసి గౌరవించేవారి కోసం ప్రస్తుత పరిస్థితుల్లో భూతద్దం వేసి వెతకాల్సిందే. ఇక కొత్తగా ఉద్యోగాల్లో చేరినవారికైతే పట్టపగ్గాలు ఉండవు. వారికి పైచూపే కాని కిందచూపు ఉండదు. ఒక జిల్లాకు కొత్తగా వచ్చినప్పుడు ముందు వారు తెలుసుకునేది కీలక పదవుల్లో ఎవరున్నారు? వారిలో ఎవరికి ముఖ్యమంత్రి వద్ద పరపతి ఉంది. జిల్లాలో శ్రీమంతులు ఎవరు? శాఖాపరంగా ఏదైనా కార్యక్రమం చేపడితే వారిలో ఉపయోగపడేవారు ఎవరనే వాటిపైనే ప్రధానంగా దృష్టిసారిస్తారు. అంతేగాని ఆ జిల్లాలో తమ ప్రతిభను మెరుగుపరుచుకునేందుకు మంచి సలహాలు ఇచ్చేవారు ఎవరున్నారు? గౌరవించాల్సిన మేధావులు ఎవరు? నిజమైన స్వాతంత్ర్య సమరయోధులు ఎవరైనా ఉన్నారా? వారి జీవనం ఎలా ఉంది అని ఆలోచించే తీరిక ఉండదు. కొంతమంది అధికారులైతే సమీక్షలతోనే తలమునకలవుతున్నారు.

ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలోనే జిల్లాకు చెందిన ఓ పెద్దాయన చేదు అనుభవం చవిచూడాల్సి వచ్చింది. మూడు దశాబ్దాల క్రితమే ఆయన పెద్దలసభలో అడుగు పెట్టారు. తనకున్న మేధాసంపత్తి మూలంగానూ, నీతి నిజాయితీల వల్లగాని ఆనాటి తన సమకాలీలకు ఎంతో దగ్గరయ్యారు. ఆ తరువాత ఆయన సమకాలీనులు రాష్ట్రపతులుగా, గవర్నర్‌లుగా, కేంద్ర ఆర్థికశాఖ మంత్రులుగా కీలక పదవులను అధిష్టించారు. రాష్ట్రపతిగా ఎవరున్నా వారు శీతాకాలవిడిదికి హైదరాబాద్ వస్తే మాత్రం ఆయనకు ఆహ్వానం ఉంటుంది. కొద్దిసేపు ఒకరికొకరు ఆలోచనలు పంచుకొని గౌరవపూర్వకంగా వీడ్కోలు పలుకుతారు. అంతేకాదు కేంద్రబడ్జెట్ రూపకల్పనలో ప్రతియేటా కేంద్ర ఆర్థిక మంత్రులు ఢిల్లీకి పిలిపించుకుని మరీ ఆయన సలహాలు తీసుకుంటారు. ఉపరాష్ట్రపతిగా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన వెంకయ్యనాయుడుతో సైతం ఆ పెద్దాయనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఇద్దరూ జై ఆంధ్ర ఉద్యమంలో కలసి పనిచేశారు.

అంతటి నేపథ్యం ఉన్న ఆ పెద్దాయన ఇటీవల ఓ జిల్లా అధికారిని కలవడానికి వెళ్లారు. ఆయన ఏమైనా సొంతపని మీద వెళ్లారా? అంటే అదీ కాదు. అసలు ఆయనకు సొంత పనులు అనేవి అసలు ఉండవు. గుంటూరు నగర సమస్యలను ఆ అధికారి దృష్టికి కూడా తీసుకువెళితే బాగుంటుందని, త్వరగా పరిష్కారం అవుతాయనే తపనతో వెళ్లారు. పేషీలో ఉండే అధికారులు పెద్దాయన వచ్చిన విషయాన్ని అధికారి చెవినవేశారు. కిందిస్థాయి అధికారులతో మాట్లాడుతూ కూర్చున్న ఆ అధికారి ఈ విషయాన్ని పెద్దగా పట్టించుకోలేదు. సార్ పిలుపు కోసం ఒక గంటపాటు వేచి ఉన్న ఆ పెద్దాయన అసహనంతో లేచి నిలబడి సార్ బిజీగా ఉన్నట్లున్నారు? మెయిల్ ఐడీ ఇవ్వండి తన విన్నపాన్ని అలాగైనా ఆయన దృష్టికి తీసుకు వెళతానని బయటకు వచ్చేందుకు సిద్ధమయ్యారు. అప్పుడు పేషీలోని అధికారుల్లో కదలిక వచ్చింది. పరుగెత్తుకుంటూ అధికారి వద్దకు వెళ్లి పెద్దాయనకు కోపం వచ్చిన విషయం విన్నవించి లోపలకు పంపేందుకు అనుమతి తీసుకువచ్చారు. ఎట్టకేలకు పెద్దాయనకు ఆ అధికారిని కలసే అవకాశం వచ్చింది.

● అధికారుల పేషీల్లోని ఉద్యోగులదీ అదే తీరు

ఏ అధికారికైనా ప్రతి మూడేళ్లకు బదిలీ ఉంటుంది.. ఒకవేళ కాలం కలసిరాలపోతే ఏడాది కూడా నిండక మునుపే వెళ్లిపోవాల్సి ఉంటుంది. అయితే ఆ పేషీల్లో పనిచేసే ఉద్యోగులు మాత్రం దశాబ్దాలుగా అక్కడే ఉంటారు. జిల్లా గురించి, జిల్లాలోని ముఖ్య నేతల గురించి వీరి వద్ద సమగ్ర సమాచారం ఉంటుందనే తలంపుతోనే ఏ అధికారి వచ్చినా వీరిని కదల్చరు. అయితే కొంత మంది అధికారుల పేషీల్లో పనిచేసే ఉద్యోగుల మూలంగా కూడా మంచి అధికారులకు చెడ్డపేరు వస్తోంది.

హిప్నాటిజమ్‌తో సానుకూల దృక్పథం

● డాక్టర్ హిప్నో కమలాకర్ వెల్లడి



ప్రసంగిస్తున్న డాక్టర్ హిప్నో కమలాకర్

గుంటూరు(మెడికల్): దైనందిన జీవనంలో నిత్యం ఒత్తిళ్లు, సవాళ్ల మధ్య ఉండే వ్యక్తులను సానుకూల దృక్పథం వైపు నడిపే శక్తి హిప్నాటిజానికి ఉందని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ హిప్నో కమలాకర్ తెలిపారు. హిప్నాటిజంపై పాతబస్టాండ్ సెంటర్‌లోని ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. నేటి ఆధునిక యుగంలో మనిషి కాలంతో పరిగెడుతూ మానసిక ప్రశాంతతను కోల్పోతున్నట్లు తెలిపారు. నిత్యం ఒత్తిళ్లతో డిప్రెషన్, టెన్షన్ వంటి మానసిక సమస్యలతో సహజీవనం చేయాల్సిన పరిస్థితులు ఉన్నట్లు చెప్పారు. మనిషి వ్యక్తిత్వ వికాసానికి మార్గదర్శక సూత్రాలను అందించే శక్తి హిప్నాటిజానికి ఉందని వివరించారు. హిప్నాటిజం ద్వారా ఎవరికి వారే తమ జీవన గతులను మార్చుకొని స్వయంగా పురోగతి సాధించవ చ్చన్నారు. హిప్నాటిజం శాస్త్రమని, మంత్రమో, తంత్రమో కాదని చెప్పారు. మనిషిలోని అంతర్గత శక్తి సామర్థ్యాలను వెలికితీసి ఆత్మవిశ్వాసం కలిగించేందుకు హిప్నాటిజం దోహదపడుతుందన్నారు. విద్యార్థుల్లో ఏకాగ్రత లోపం, మతిమరుపు, పరీక్షల భయం, వేగంగా రాయలేకపోవడం, ఇంటిమీద బెంగ వంటి సమస్యలను స్వీయ సాధనతో అధిగమించవచ్చని తెలిపారు. ధూమపానం, మద్యపానం, గుట్కా, ఖైనీ వంటి చెడు వ్యసనాల నుంచి బయటపడేందుకు సెల్ఫ్ హిప్నాటిజం ఎంతగానో దోహదపడుతుందన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్ వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు బీ బాబురావు, ఏ అనంతకుమార్, కాపు శ్యామల, బీ శ్రీనాథ్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
16
చిలకలూరిపేట
గుంటూరు । సోమవారం 21 ఆగస్టు 2017
చిలకలూరిపేట । యడ్లపాడు । నాదెండ్ల

దింతెనపాడులో ఆర్టీసీ క్యాట్‌కార్డు మేళా

దింతెనపాడు(యడ్లపాడు) : మండలంలోని దింతెనపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆర్టీసీ అధికారులు క్యాట్‌కార్డు మేళాను నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ఈ మేళా కార్యక్రమంలో అధికారులు పలువురు ప్రయాణికులకు క్యాట్‌కార్డులను అందించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులు డి.అశోక్, మౌలాలిలు మాట్లాడుతూ గ్రామానికి నూతనంగా సర్వీసును నడుపుతున్నామని, గ్రామంలోని ప్రతి ఒక్కరూ క్యాట్‌కార్డుని తీసుకుని ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించి ఆదరించాలని కోరారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సంస్థకు సహకరిస్తామని గ్రామస్థులంతా ముక్త కంఠంతో అధికారులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచి పోపూరి హనుమంతరావు, మాజీ సర్పంచి టి.చంద్రకళరాజు, గ్రామస్థులు రత్నం, సుందరరాజు, పి.వెంకటరత్నం, కె.ఆలియా పాల్గొన్నారు.

ఆదరణ కరువై .. బతుకు బరువై..

- నైరాశ్యంలో కొట్టుమిట్టాడుతున్న వృద్ధులు
- తల్లిదండ్రులను పట్టించుకోని పిల్లలు
- వృద్ధాప్యం శాపంగా మారుతున్న తీరు
- వైద్యం, వసతి కల్పించాలంటూ విన్నపం

చిలకలూరిపేట : పాశ్చాత్య సంస్కృతి విస్తరించటం, పిల్లలు విద్య, ఉద్యోగాల పేరుతో సుదూర ప్రాంతాల్లో నివసించటం తల్లిదండ్రులకు శాపంగా మారుతోంది. అన్నీ ఉండి కొందరు.. ఆసరా లేక మరికొందరు ఇలా నిరాదరణకు గురవుతున్న వృద్ధుల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. ప్రభుత్వం వృద్ధులకు పెన్షన్లు, పలు పథకాలలో రాయితీ సౌకర్యం కల్పించినప్పటికీ అవి ఏమాత్రం సరిపోవడంలేదని వృద్ధులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం జాతీయ సీనియర్ సిటిజన్స్‌డే సందర్భంగా నియోజకవర్గంలోని పలువురి వృద్ధులను పలుకరించగా వారు వెలుబుచ్చిన అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

ప్రభుత్వం దృష్టిసారించాలి



ప్రభుత్వం వృద్ధులకు నెలకు రూ.1,000 చొప్పున పెన్షన్ ఇస్తోంది. ఈ నగదు మా అవసరాలకు సరిపోవడం లేదు. రెక్కల కష్టంపై పిల్లలను పెంచి పోషించాం. వారికి వివాహాలై వేరే ప్రాంతాలలో స్థిరపడ్డారు. ప్రభుత్వం వృద్ధులకు రాయితీ రుణాలు అందించి ఉపాధి కల్పన దిశగా ప్రోత్సహించాలి. దీంతోపాటు అత్యవసర సమయంలో వృద్ధులు వైద్యానికి ఆసుపత్రులకు వెళ్లాలంటే ఎంతో కష్టంతో కూడుకుంది. ఈ నేపథ్యంలో 108 వాహనం లాగా వృద్ధులకు ప్రత్యేక వాహనం కేటాయిస్తే బాగుంటుంది.

- బత్తుల అంజయ్య, రైతు

ప్రత్యేక వసతి గృహాలు కేటాయించాలి



గ్రామీణ ప్రాంతాల్లో ఆదరణ కరువయిన వృద్ధుల కోసం 4 నుంచి 5 గ్రామాలకు కలిపి ఒక వసతి గృహం ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. కనీసం మండల స్థాయిలోనైనా వృద్ధులకు ఒక వసతి గృహమైనా ఉండాలి. వృద్ధులు స్థానిక గ్రామాలు వదిలిపెట్టి దూరంగా వెళ్లేందుకు ఇష్టపడరు. ఈ దిశగా కృషి చేస్తే మేలు జరుగుతుంది.

- పోపూరి శివరామయ్య, రైతు

వైద్యసేవలు అందించాలి





సీనియర్ సిటిజన్‌లు అందరికీ ఉచిత వైద్యసేవలు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. బస్సులతోపాటు రైళ్లలో ప్రయాణించే వారికి 75 శాతం రాయితీ ఇవ్వాలి. కాలం చేసిన విశ్రాంత ఉద్యోగుల కు టుంబ సభ్యులకు ప్రభుత్వ లబ్ధి వెంటనే అందే విధంగా కృషి చేయాలి.

- దారా కొండయ్య, విశ్రాంత ఉపాధ్యాయుడు.

సేవలను సద్వినియోగించుకోవాలి



నిరాదరణకు గురైన వృద్ధులకు భరోసా కల్పించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలి. ఎన్నో కష్టాలు, ఆటుపోట్లను ఎదుర్కొని జీవిత చరమాంకానికి చేరుకున్న వృద్ధులు ఎంతోమంది అయినవాళ్ల ఆదరణకు నోచుకోక వీధిన పడుతున్నారు. అటువంటి వారిని ఆదుకోవాలి. విద్య, వైద్యం, వ్యవసాయం, కళలు ఇలా ఆయా రంగాల్లో ప్రావీణ్యం, నైపుణ్యం కలిగిన వృద్ధుల సేవలను ప్రభుత్వం సద్వినియోగం చేసుకొని అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేయాలి.

- గోరంట్ల సింగరకొండయ్య చౌదరి, నాటక కళాకారుడు

గ్రామదేవతకు పొంగళ్లు

నూజెండ్ల : మండలంలోని వి.అప్పాపురం గ్రామంలో వరుణుడి కరుణ కోసం ఆదివారం పోలేరమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. నాలుగు రోజులుగా గ్రామంలో వర్షాలు పడాలని గ్రామదేవతకు గ్రామంలోని బొడ్రాయికి జలాభిషేకాలు చేశారు.

104 సమాచారం

చంద్రన్న సంచార వైద్యబృందం సోమవారం ఉదయం కావూరు పీహెచ్‌సీ పరిధిలోని కమ్మవారిపాలెం, మధ్యాహ్నం గోవిందపురంలో సేవలు అందిస్తుంది.

సినిమా గైడ్

కృష్ణమహల్	నిన్నుకోరి
విజయభాస్కర్	నేనేరాజు నేనే మంత్రి
కేఆర్ మినీ	గౌతమ్‌నంద
భాస్కర్	లై
మంగాడీలక్స్	జయ జానకీ నాయక
శ్రీనివాసా	కాటమరాయుడు
విజయలక్ష్మి	రెడ్‌లైట్
విశ్వనాథ్	ఇదేం దెయ్యం
రామకృష్ణ	జయ జానకీ నాయక
కళామందిర్	బాహుబలి 2
వెంకటేశ్వర	దండుపాళ్యం-2
సిటి సెంటర్‌స్క్రీన్-1	ఫిదా
సిటి సెంటర్‌స్క్రీన్-2	దర్శకుడు

యడ్లపాడులో..

జయలక్ష్మి మూవీల్యాండ్ నేనేరాజు నేనేమంత్రి/ జయజానకీనాయక

నేటితో ముగియనున్న అద్దంకమ్మ కొలుపులు

యడ్లపాడు : స్థానిక గ్రామదేవత అద్దంకమ్మ కొలుపులు సోమవారంతో ముగియనున్నాయి. నాలుగేళ్లకు ఒకసారి శ్రావణ మాసంలో తొమ్మిది రోజులపాటు ఈ కొలుపులను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గ్రామంలో చద్దిని సేకరించి గ్రామదేవతలకు నైవేద్యంగా సమర్పించే కార్యక్రమం 8వ రోజైన ఆదివారంతో ముగిసింది. పోలేరమ్మ ఆలయం వద్ద నుంచి కుండలతో ఊరేగింపుగా గ్రామంలో తిరుగుతూ చద్దిని సేకరించి మూడు ఆలయాలలోని గ్రామదేవతలకు నైవేద్యంగా సమర్పించారు.

ఆదివారం రాత్రి అద్దంకమ్మ తల్లి ఉత్సవ విగ్రహాన్ని పోలేరమ్మ ఆలయం నుంచి ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తీసుకువచ్చారు. తొమ్మిదో రోజైన సోమవారం గ్రామదేవతలకు పొంగళ్లను నైవేద్యంగా సమర్పించడం, చిరుపెళ్ళికొడుకు ఊరేగింపు కార్యక్రమాలను పెద్దఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే బంధువుల రాకతో గ్రామంలో సందడి నెలకొంది.



ఘటాలకు చద్దిని నైవేద్యంగా సమర్పిస్తున్న భక్తులు

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ

- *సంగం డెయిరీ డైరెక్టర్ జగన్‌మోహన్‌రావు*
- *లీటరుకు రూ.3.50 బోనస్*



బోనస్‌ను పంపిణీ చేస్తున్న డెయిరీ డైరెక్టర్ జగన్‌మోహన్‌రావు

జగ్గాపురం (యడ్లపాడు) : పాడిరైతులను ప్రోత్సహించేందుకు అత్యధిక బోనస్‌ను సంగం డెయిరీ అందిస్తోందని డైరెక్టర్ కట్టా జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. మండలంలోని జగ్గాపురం సంగండైరీ పాలకేంద్రంలో ఆదివారం సాయంత్రం పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జగన్‌మోహనరావు మాట్లాడుతూ 2016-17 సంవత్సరానికి పాల ఉత్పత్తిదారులకు డెయిరీ లీటరుకు రూ.3.50 చొప్పున అందిస్తున్నదని, డెయిరి ఆవిర్భవించాక ఇది అత్యధికమని చెప్పారు. గత ఏడాదితో పోల్చితే 70పైసలు అధికమన్నారు. డెయిరి నర్సరావుపేట డివిజన్ మేనేజర్ శింగారావు మాట్లాడుతూ డివిజన్ పరిధిలో డెయిరీకి అనుబంధంగా 170 పాలకేంద్రాలు ఉన్నాయని వాటిలో 16 వేల మంది పాడిరైతులు సభ్యులుగా ఉన్నారన్నారు. రూ.3.80 కోట్లను పాల ఉత్పత్తిదారులకు బోనస్‌గా అం దిస్తున్నామన్నారు. జగ్గాపురం పాలకేంద్రంలో గత ఆర్థికసంవత్సరంలో 60 మంది పాడిరైతుల నుంచి సుమారు 70వేల లీటర్లను సేకరిస్తున్నారన్నారు. సేకరించిన పాలకు డెయిరి రూ.1.57లక్షలు బోనస్ రూపంలో అందించ గా మరో, రూ.1.32 లక్షలు పాలకేంద్రంవారు జతచేసి రైతులకు పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో పాల కేంద్రం అధ్యక్షులు కల్లూరి సాంబశివరావు, డైరెక్టర్లు పోపూరి రంగారావు, బొద్దులూరి సత్యనారాయణ, జాగర్లమూడి రామారావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు, కార్యదర్శి, గ్రామపెద్దలు, పాడిరైతులు పాల్గొన్నారు.

ముఖ్యమైన ఫోన్ నంబర్లు

చిలకలూరిపేట

మున్సిపల్ ఛైర్‌పర్సన్	9849907279
మున్సిపల్ కమిషనర్	9849907278
మున్సిపల్ డీఈ	9849906585
ప్రభుత్వ ఆసుపత్రి	08647-254433
మార్కెట్‌యార్డు ఛైర్మన్	9240412306
తహసీల్దార్	9849904025
అర్బన్ సీఐ	9440796227
మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్	9441952885
రూరల్ సీఐ	9440796268
ఆర్టీసీ డీఎం	9959225427

చిలకలూరిపేట కూరగాయల ధరలు 1 కిలో రూపాయల్లో

టమోటా - రూ.52, వంకాయ- రూ.32, బెండకాయలు- రూ.24, పచ్చిమిర్చి- రూ.26, కాకరకాయలు - రూ.40, బీరకాయలు - రూ.18, దొండకాయలు - రూ.28, గోరుచిక్కుళ్లు -రూ.28, పెద్దచిక్కుళ్లు -రూ.50, దోసకాయలు -రూ.20, పొట్లకాయ- 1రూ.10, సొరకాయ -1రూ. 10, మునగకాయ- 1రూ. 5, అరటి- 1రూ.10, బంగాళదుంప- రూ.18, క్యారెట్- రూ.56, క్యాబేజి- రూ.24, క్యాలీఫ్లవర్- రూ.34, బీట్‌రూట్- రూ.40, చేమదుంప -రూ.40, ఉల్లిపాయలు - రూ.22

పట్టణంలో రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు

చిలకలూరిపేట అర్బన్ : మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 73వ జయంతిని పట్టణంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణ ప్రధాన కార్యదర్శి బొజ్జా అంకమ్మరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గోవిందు శంకర్ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు ఎంబీటీ సుభాని, సీనియర్ నాయకులు బేతంచర్ల రామకోటేశ్వరరావులు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిం చారు. ప్రధానమంత్రిగా రాజీవ్‌గాంధీ ప్రజాహిత సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి దేశాభివృద్ధికి పాటుపడ్డారని కొనియాడారు. శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధి రాజీవ్‌గాంధీ ప్రవేశపెట్టిన సంస్కరణలు దోహదపడ్డాయన్నారు. కార్యక్రమంలో పార్టీ చిలకలూరిపేట రూరల్ అధ్యక్షుడు మద్దాలి శ్రీనివాసరావు, బీసీ నాయకులు ఎ.గురుస్వామి, ఎస్టీ నాయకులు జి.సుబ్బారావు, కుంచాల లక్ష్మయ్య, షేక్ కరీం, పి.సుబ్బారావు, షేక్ బషీర్, రామునాయక్ తదితరులు పాల్గొన్నారు.


రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్‌పార్టీ నాయకులు

చిలకలూరిపేట : మండలంలోని వేలూరు గ్రామంలోని జాకబ్ డే కేర్ సెంటర్‌లో కేర్స్, సెడ్స్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో గడ్డం పాల్ విజయకుమార్, సురేష్‌బాబు, గద్దే కమలకుమారి, జేసుదాస్, కిరణ్, కార్యంశెట్టి సిగ్మన్, కార్యంశెట్టి పల్లవి తదితరులు పాల్గొన్నారు.

పందుల పెంపకం దార్లకు ఉపాధి కల్పన దిశగా చర్యలు


పట్టణంలో పందుల నిర్మూలన డ్రైవ్ నిర్వహిస్తున్న చిత్రం

చిలకలూరిపేట టౌన్ : పట్టణాల్లో పందుల సమస్య ఎక్కువగా ఉండటంతో నిర్మూలించేందుకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు సమస్య శాశ్వత పరిష్కార దిశగా చర్యలు చేపడుతున్నారు. రెండేళ్లుగా పందుల నిర్మూలన డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ ఫలితం లేకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గాలవైపు పందుల పెంపకం దార్లను మళ్లించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇటీవల ఏర్పాటు చేసిన సమావేశంలో ఊరికి దూరంగా పందులను పెంచుకునేందుకు స్థలాన్ని కేటాయించాలని భావించినప్పటికీ అది ఇప్పట్లో ఓ కొలిక్కి వచ్చేలా కనిపించకపోవడంతో వారికి ఎస్టీ కార్పో రేషన్ నుంచి రాయితీ రుణాలు అందించి వేరే ఇతర వ్యాపారాలు కొనసాగించేలా చేసేందుకు రంగం సిద్ధమవుతోంది.

60కి పైగా కుటుంబాలు

పట్టణంలో 60కి పైగా కుటుంబాల వారు వారసత్వంగా వస్తున్న పందుల పెంపకాన్ని కొనసాగిస్తున్నారు. వీరు సుమారు రెండు వేల పందులను పెంచుతున్నారు. కర్నాటక రాష్ట్రంలో పందుల వ్యాపారానికి మంచి గిరాకీ ఉం ది. దీనితో పందుల పెంపకం దారులకు ఇది మంచి వ్యాపారంగా మారింది. పట్టణంలో సంచరిస్తూ పెరుగుతున్న పందులను పెద్దయ్యాక అమ్ముకోవడంతో పెట్టుబడి కూడా అవసరంలేని వ్యాపారంగా దీనిని మార్చుకున్నారు. మంచి లాభాలు కూడా వస్తుండటం తో ఈ వ్యాపారాన్ని వదులుకునేందుకు వారు సిద్ధంగా లేరు. పందులకు ఆహారం అందించాలనే పరిస్థితి కానీ, జబ్బులు వస్తాయనే ఆలో చనకాని వ్యాపారులకు లేదు. యథేచ్ఛగా పట్ట ణంలోకి పందులను వదిలివేస్తూ జీవనం సాగిస్తున్నారు.

ఇతర వ్యాపారాలు చేసుకునేందుకు..

పెట్టుబడి లేని పందుల వ్యాపారాన్ని వదులుకొని ఇతర వ్యాపారాలు చేసుకోవాలంటే పందుల పెంపకం దార్ల ఆర్థిక పరిస్థితి అను కూలించని పరిస్థితి ఉంది. దీనితో వారికి ఎస్టీ కార్పొరేషన్ నుంచి రుణాలు అందిచి వారిచే పందుల వ్యాపారం మానిపించి ఇతర వ్యాపారాల వైపు మళ్లించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రాథమికంగా 16 మంది పందుల పెంపకం దార్ల వద్ద నుంచి ఎస్టీ కార్పొరేషన్ నుంచి రాయితీ రుణాలు కోసం దరఖాస్తులు స్వీకరించారు. పారిశుధ్య అధికారులు శనివారం గుంటూరులోని ఎస్టీ కార్పొరేషన్ జిల్లా అధికారులతో సమావేశమై ఈ దిశగా చర్చించారు. రుణాలను సద్వినియో గం చేసుకుంటామంటే మంజూరు చేసేందుకు అభ్యంతరం లేదని ఎస్టీ కార్పొరేషన్ అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో క్రమంగా పందుల వ్యాపారులను ప్రత్యామ్నాయ వ్యాపారాలవైపు మళ్లించే ప్రక్రియకు అడుగులు పడుతున్నాయి. అధికారుల కృషి ఫలించి పట్టణంలో పందుల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించాలని ఆశిద్దాం.

మెగా రక్తదాన శిబిరం

150 మంది రక్తం అందజేత


రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న అఖిలభారత చిరంజీవి ఫ్యాన్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల రవీంద్రబాబు

చిలకలూరిపేట అర్బన్ : సినీనటుడు, రాజ్యసభ సభ్యుడు మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని చిరంజీవి, పవన్‌కల్యాణ్ అభిమాన సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన శిబి రం నిర్వహించారు. స్థానిక బృందావన్ బ్యాం కెట్ హాలులో జరిగిన ఈ రక్తదాన శిబిరాన్ని అఖిలభారత చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల రవీంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా అభిమానులు ఏర్పాటు చేసిన చిరంజీవి జన్మదిన కేకును ఆయన కట్ చేశారు. శిబిరంలో మొత్తం 150 మంది యువకులు రక్తదానం చేశా రు. ఈ సందర్భంగా రవీంద్రబాబు మాట్లాడుతూ రక్తదానం, నేత్రదానం వంటి కార్యక్రమాలతో చిరంజీవి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. మెగా అభిమానులు అంటే క్రమశిక్షణకు మారుపేరని, ఇంత పెద్దఎత్తున రక్తదానానికి ముందుకు వచ్చిన యువతే అందుకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో కూనపరెడ్డి బలరాం, ఇక్కుర్తి లోకేష్, తోట వెంకట్, ఓం ప్రకాష్, బాషా, కరిముల్లా, తలహాఖాన్, బేరింగ్ మౌలాలి, శివతేజ, తేజ పాల్గొన్నారు.

పైపులైన్లు వేశారు సరే.. రోడ్డుకు మరమ్మతులేవి..?


చిలకలూరిపేట టౌన్ : అమృత్ పథకంలో భాగంగా పట్టణంలోని పలు వార్డులకు తాగునీటి సమస్యను తీర్చేందుకు అధికారులు నూతన పైపులైన్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా 21వ వార్డు పరిధిలోని జాగుపాలెంలో కూడా నూతన పైపులైన్ నిర్మాణం కోసం సీసీ రోడ్డును పగులగొట్టి తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేశారు. అయితే పైపులైన్ల నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్నప్పటికీ రోడ్డు మరమ్మతులకు సంబంధించిన పనులు మాత్రం అధికారులు మరచిపోయారు. దీనితో జాగుపాలేనికి చెందిన ప్రజలు నడిచేందుకు కూడా ఇబ్బందులు ఎదుర్కొనవలసిన పరిస్థితి ఏర్పడింది. నూతన పైపులైను నుంచి ఇళ్లకు కుళాయిల కోసం ఇంటర్ కనెక్షన్‌లు ఇచ్చిన అధికారులు వాటిపై గ్రావెల్ పోసి చదును చేయకపోవడంతో ఈ రహదారులలో ద్విచక్రవాహనాలు ప్రయాణించే పరిస్థితి లేదు. పైపులైను రోడ్డు మధ్యలో ఉండటం, దాని నుంచి ఎత్తుగా ఇంటర్ కనెక్షన్‌లు ఉండటంతో నడవాల న్నా ఇబ్బంది నెలకొంది. రాత్రి సమయాలలో వృద్ధులు, పిల్లలు ఇంటర్ కనెక్షన్ పైపులు తగిలి ప్రమాదాలకు గురవుతున్నారని ప్రజలు వాపోతున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ అధికారులకు పలు మార్లు విన్నవించినా సమస్యను పరిష్కరించడంలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్యను పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.


21వవార్డు జాగుపాలెంలో నూతన పైపులైను ఏర్పాటు చేసి రోడ్డు మరమ్మతులు చేయని చిత్రం


రోడ్డు మధ్యలో ఉన్న పైపులైను ద్వారా ఇళ్లకు ఇచ్చిన కనెక్షన్‌లు

అప్పు తీర్చలేదంటూ వ్యక్తిపై దాడి

వినుకొండరూరల్ : అప్పు తీర్చలేదంటూ వ్యక్తిపై దాడి చేసిన సంఘటన స్థానిక ఇందిరానగర్‌లో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. సంఘటన వివరాల ప్రకారం కాలం శ్రీను ఇందిరానగర్‌లో నివాసం ఉంటూ మసీదుమాన్యంలో పొలం కౌలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఇందిరానగర్‌కు చెందిన కిరాణా యజమాని చిన్న విజయకు రూ.20వేలు బాకిపడ్డాడని, దీనివిషయంపై ఆదివారం అప్పు తీర్చమని శ్రీనును చిన్నవిజయ, తన కుమారుడు సాయి అడగగా మాటామాటా పెరిగి వారు శ్రీనుపై బ్లేడు, రాళ్లతో దాడికి దిగారు. దీంతో శ్రీనుకు తీవ్రగాయాలు కాగా 108 ద్వారా ప్రభుత్వాసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు తరలించారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు శ్రీను కుటుంబసభ్యులు తెలిపారు.


దాడిలో గాయపడ్డ కాలం శ్రీను

పొలం వివాదంలో దాడి : ఒకరికి గాయాలు

ముప్పాళ్ల(ఈపూరు) : పొలం వివాదంలో ఒకరిపైఒకరు దాడి చేసుకున్న సంఘటన మండలంలోని ముప్పాళ్ల గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఈపూరు పోలీసులు తెలిపిన కథనం ప్రకారం..గ్రామానికి చెందిన కె.చంద్రరావు, చౌడయ్యలు పొలం విషయంలో గొడవపడి దాడి చేసుకున్నారు. దాడిలో చౌడయ్యకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ పట్టాభిరామయ్య తెలిపారు.

పోలీసుల మోహరింపుతో వెనక్కు తగ్గిన రెండుపార్టీలు

అచ్చంపేట : మండల కేంద్రమైన అచ్చంపేటలో తెలుగుదేశంపార్టీ, వైసీపీ బహిరంగ చర్చకు సిద్ధమంటూ ఒకరిపై ఒకరు సవాలు విసురుకున్న నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు రెండు పార్టీల నాయకులకు నోటీసులు అందజేశారు. ఇన్‌చార్జి ఎస్‌ఐ సురేష్ ఆధ్వర్యంలో ఆదివారం అచ్చంపేటలో 144 సెక్షన్ విధించిన నేపథ్యంలో రెండుపార్టీల నాయకులు వెనక్కి తగ్గారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ఎలాంటి ర్యాలీలు, బహిరంగ సభలకు అనుమతిలేదని కరాఖండిగా చెప్పటంతో రెండు పార్టీలు బహిరంగ చర్చను విరమించుకున్నారు.

ఆఫీసర్స్ వాయిస్

పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన

డాక్టర్ రోహిణిరత్నశ్రీ, వైద్యాధికారి



పెదకూరపాడు: పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా ఆరోగ్య సిబ్బంది ప్రజల్లో అవగాహన కల్పించాలి. పరిసరాలు శుభ్రంగా లేకుంటే దోమలు వృద్ధిచెంది రోగాలు ప్రబలే విషయంపై ప్రజలకు తెలియజేయాలి. ఇంటి ప్రాంగణంలో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలి. మురుగునీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధిచెంది రోగాలు వచ్చే ప్రమాదం ఉంది.

ముఖ్యమైన ఫోన్ నంబర్లు

పెదకూరపాడు మండలం	
తహసీల్దార్	: 9949098618
ఎస్‌ఐ	: 9440796269
ఎంపీడీవో	: 7032983509
ఎంఈవో	: 9110331798
వ్యవసాయాధికారి	: 8886614096
వైద్యాధికారి	: 8121943623
క్రోసూరు మండలం	
ఎంపీడీవో	: 7032983498
ఎంఈవో	: 9502423782
ఎస్‌ఐ	: 9440796235
ఏడీఏ	: 8886614114
ఏఈ (ఎలక్ట్రికల్)	: 9440812336
అచ్చంపేట మండలం	
తహసీల్దార్	: 9949098611
ఎస్‌ఐ	: 9440796234
ఎంపీడీవో	: 7032983482

ఒత్తిడిని అధిగమించాలి - కమిషనర్

పిడుగురాళ్లటౌన్ : ప్రతి వ్యక్తి మానసిక ఒత్తిడికి దూరంగా ఉండాలని కమిషనర్ శివరామిరెడ్డి సూచించారు. ఆదివారం పట్టణంలోని విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్లో ఆనంద ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివరామిరెడ్డి, భవనాశి యల్లారావు, వైస్ చైర్మన్ అద్దంకి రత్నాకరరావు మాట్లాడుతూ ఉద్యోగులు ఒత్తిడికి దూరంగా ఉండి, సమన్వయంతో విధులు నిర్వర్తించాలని కోరారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలు, నృత్యాలు చేశారు. కమిషనర్, మున్సిపల్ ఉద్యోగులు విద్యార్థులతో కలసి డాన్స్ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సాంబశివరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా పాఠశాల క్రీడాస్థలాలు

పిచ్చి మొక్కలతో ఆవరణలు

వ్యాయామంపై కొరవడిన శ్రద్ధ

నిర్లక్ష్యం వహిస్తున్న విద్యాధికారులు



అపరిశుభ్రంగా ఉన్న కస్తూర్బా గాంధీ స్కూల్ ఆవరణ

క్రోసూరు : మండలంలోని పలు పాఠశాలల క్రీడాస్థలాలు చిట్టడవులను తలపిస్తున్నాయి. ఆటస్థలాలు మొత్తం పిచ్చిచెట్లతో నిండిపోయి అపరిశుభ్రంగా ఉంటున్నాయి. మండలంలోని ఊటుకూరు, బయ్యవరం, క్రోసూరు, హైస్కూళ్ల ఆటస్థలాలు పిచ్చిచెట్లతో నిండిపోయాయి. కొన్ని సంవత్సరాల నుంచి ఆటస్థలాలను శుభ్రం చేయలేదన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలతో పోల్చుకుంటే ప్రైవేటు విద్యాసంస్థల క్రీడాస్థలాలు విద్యార్థుల ఆటపాటలతో కళకళలాడుతున్నాయి. క్రోసూరు జడ్పీ హైస్కూల్ ఆటస్థలం పిచ్చిచెట్లతో నిండిపోయి ప్రమాదకరంగా తయారైంది. పాఠశాల ఆవరణలో విషస్పరం ఇటీవల ఒక ఆవును కాటు వేయడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దీనితో విద్యార్థులు భయభ్రాంతులకు గురయ్యారు. క్రీడాస్థలాలు సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. అసలే సెల్‌ఫోన్‌లతో, వీడియో గేమ్స్‌లతో క్రీడలకు దూరమవుతున్న విద్యార్థులు ఆటస్థలాల కారణంగా వ్యాయామానికి నోచుకోవడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. క్రోసూరులోని కస్తూర్బాగాంధీ స్కూల్ క్రీడాస్థలం పిచ్చిచెట్లతో నిండిపోయి గడ్డి మొలిచి కాలుబెట్టడానికి వీలులేకుండా తయారైంది. ఇప్పటికైనా సంబంధిత స్కూల్ యాజమాన్యాల వారు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాస్థలాలను శుభ్రపరిచేందుకు శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉంది.



విద్యార్థుల ఆటలతో కళకళలాడుతున్న క్రోసూరులోని ప్రైవేటు స్కూల్ ఆటస్థలం

రాజకీయాల్లో టీడీపీకి ప్రత్యేకస్థానం

టీడీపీ మండల నాయకులు

అచ్చంపేట : తెలుగుదేశం పార్టీకి రాష్ట్రంలో ప్రత్యేక స్థానం ఉందని తెలుగుదేశం పార్టీ మండల నాయకులు అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ టీడీపీలోని నాయకులకు వ్యక్తిగత చరిత్ర కూడా గొప్పదేనని, పరిపాలనలో దేశంలోను, విదేశాల్లోను నందమూరి తారక రామారావు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నారన్నారు. 1985 తర్వాత మెరిట్ ప్రకారం ఉద్యోగాలు కల్పించింది తెలుగుదేశం ప్రభుత్వమేనని తెలిపారు. తెలుగుదేశం నైతిక విలువలకు, నిబద్ధతకు మారుపేరన్నారు. వైసీపీ అధ్యక్షుడిది చరిత్రంతా అవినీతేనని, రాష్ట్రంలో ఎలాంటి పరిపాలన చేయకుండా అభివృద్ధిపై చర్చకు రమ్మనటం హాస్యాస్పదమన్నారు. చట్టంపై గౌరవం, పోలీసు సూచనల మేరకు బహిరంగ చర్చను విరమిస్తున్నామని నాయకులు తెలిపారు. ముందుగా బహిరంగ చర్చకు వచ్చేందుకు మండల పరిషత్ కార్యాలయం వద్ద వందలాదిమంది తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధమయ్యారు. సమావేశంలో అచ్చంపేట మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు బత్తుల శ్రీనివాసరావు, మండల పరిషత్ ఇన్‌చార్జి అధ్యక్షుడు పొన్నెకంటి రామారావు, క్రోసూరు మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ నందిగం ఆశీర్వాదం, అచ్చంపేట పీఏసీఎస్ అధ్యక్షుడు రాయిడి విశ్వేశ్వరరావు, మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి పాపిరెడ్డి, తాళ్ళూరి లక్ష్మీనారాయణ, యంపరాల మధుసూధనరావు, సందెపోగు శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు బత్తుల కోటేశ్వరరావు, చల్లా అనూపకళ, పూల కోటేశ్వరరావు, గుడేటి అరుణ్, చందు, వాసిరెడ్డి రవి, సూరె పున్నారావు, పూల వెంకటేశ్వర్లు, తెల్లపాటి లక్ష్మీనారాయణ, కె.దిబ్బయ్య, శిఖా నాగయ్య, తోమాస్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న తెలుగుదేశంపార్టీ నాయకులు

పల్లె అభివృద్ధే లక్ష్యం

● ఒంగోలు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అజయ్‌కుమార్

పెదకూరపాడు : పల్లె అభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పరిరక్షణ సంఘం పనిచేస్తుందని ఒంగోలు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టీజే అజయ్‌కుమార్ అన్నారు. పెదకూరపాడులో అంబేద్కర్ రీడింగ్ రూం వద్ద ఆదివారం మాల, కుల, సంరక్షణ, సంక్షేమ పరిరక్షణ సంఘం జనరల్ బాడీని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెలో ప్రధాన అవసరాలు అయిన సిమెంట్ రోడ్ల నిర్మాణం, శ్మశాన స్థల ప్రహరీ నిర్మాణం, పలు అంశాలను ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ద్వారా నిధులు మంజూరు చేయించి పల్లె అభివృద్ధికి సంఘంలోని ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. శిథిలావస్థలో ఉన్న మహిళా మండలి భవనాన్ని తొలగించి ఆ స్థానంలో మరో భవనాన్ని నిర్మించుకునేందుకు ప్రజాప్రతినిధుల సహకారం తో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాల కుల, సంక్షేమ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు పమిడిపల్లి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు పిల్లి బాలస్వామి, కార్యదర్శి గుడిపూడి రాజు, డాక్టర్ కొమరాబత్తిన రత్తయ్య, గోగులపాటి కోటేశ్వరరావు, కొర్రపాటి వెంకటేశ్వర్లు, చింతాబత్తిన అంతోను తదితరులు ఉన్నారు.

రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు

అచ్చంపేట : మండల కేంద్రమైన అచ్చంపేటలోని శ్రీశ్రీనివాస నర్సింగ్‌హోంలో రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ మండల మైనార్టీ అధ్యక్షుడు ఎస్‌కే సైదావలి రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. ముందుగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రిలోను వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిలుకా చంద్రయ్య, ఎస్‌కే కరిముల్లా, పరిమి శ్రీనివాస్, సందెపోగు రవి, మందా యాకోబు, కస్తల ప్రసాద్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ఎన్‌ఐఓఎస్ పరీక్షలు

పరీక్షకు 205 మంది హాజరు




క్రోసూరు : నేషనల్ లిటరసీ మిషన్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలో నిర్వహించిన ఎన్‌ఐఓఎస్ పరీక్షకు 205 మంది మహిళా వయోజనులు హాజరయ్యారు. ఈ పరీక్ష 18 గ్రామ పంచాయతీలలో జరిగింది. చిన్నతనంలోనే బడి మానివేసినవారు గత పరీక్షల్లో సీ గ్రేడ్ పొందిన వారు ఈ పరీక్షకు అర్హులు. మండల వ్యాప్తంగా వయోజనుల్లో అక్షరాస్యతను పెంపొందించటానికి కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించినట్లు వయోజన విద్య సూపర్‌వైజర్ దేవరకొండ కృష్ణ తెలియజేశారు. పలు గ్రామాల్లోని అక్షర భారతి కేంద్రాల్లో జరిగిన పరీక్షలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అక్షరభారతి మండల కోఆర్డినేటర్ మక్కెన వీరాంజనేయులు, నరేష్ పరీక్షలను నిర్వహించారు.

అచ్చంపేట మండలంలో 540 మంది



అచ్చంపేట : మండలంలోని 22 గ్రామ పంచాయతీలలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ పరీక్షలు ఆదివారం జరిగాయి. ఈ పరీక్షకు సీ గ్రేడ్, డ్రాపౌట్స్ 15 సంవత్సరాలు దాటిన 340 మంది పరీక్షలు రాశారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోను, పాఠశాలల్లోను ఈ పరీక్షలు జరగగా సాక్షరభారత్ మండల కోఆర్డినేటర్ రుద్రపోగు ఆంజనేయులు పరీక్షలను పర్యవేక్షించారు. నీలేశ్వరిపాలెం విలేజ్ కోఆర్డినేటర్ కె.పెద్దస్వామి, ఆర్.అరుణ పాల్గొన్నారు.

మిరప మొక్కలు నాటుతున్న కూలీలు



పెదకూరపాడు : మండలంలోని పలు గ్రామాల్లో రైతులు పొలాల్లో మిరప మొక్కలను నాటిస్తున్నారు. మిర్చి మొక్కలు నాటేందుకు వాతావరణం కూడా అనుకూలంగా ఉండడంతో పొలాలను దున్ని చదును చేసి మొక్కలు నాటే పనిలో నిమగ్నమయ్యారు.

'పేద బ్రాహ్మణులు, విద్యార్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం'

దాచేపల్లి: అర్హత కల్గిన పేద బ్రాహ్మణులు పింఛన్ కు, విద్యార్థులు ఉపకార వేతనాలకు దరఖాస్తులు చేసుకోవచ్చునని బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు పోతరాజు ప్రసాదరావు తెలిపారు. ఆదివారం సంఘం అధ్యక్షుడు ప్రసాదరావు, నియోజకవర్గ కో ఆర్డినేటర్ భరద్వాజశర్మలు మాట్లాడుతూ, సెప్టెంబర్ 30 లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. వితంతవు లు, వికలాంగులు, వృద్ధులకు పింఛన్‌లు, పేద విద్యా ర్థులకు ఉపకార వేతనాలు (స్కాలర్‌షిప్‌లు) అందజే సేందుకు బ్రాహ్మణ వెల్‌ఫేర్ కార్పొరేషన్ అవకాశం కల్పించిందన్నారు.

22న నవరత్నాలు పథకంపై అవగాహన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ మండల కన్వీనర్ సందెపోగు సత్యం తదితరులు

అచ్చంపేట : మండల కేంద్రమైన అచ్చంపేటలోని సాయిబాబా మందిరం వద్ద ఈ నెల 22వ తేదీ సాయంత్రం 4 గంటలకు వైసీపీ పార్టీ నవరత్నాలు కార్యక్రమంపై మండల సదస్సు జరుగుతుందని వైసీపీ మండల కన్వీనర్ సందెపోగు సత్యం అన్నారు. ఆదివారం మండల కన్వీనర్ సందెపోగు సత్యం ఇంటివద్ద జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వాలు చేసిన అభివృద్ధికి, ఇప్పటి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని బేరీజు వేసుకోవాలని అన్నారు. కోనూరు అడ్డరోడ్డు నుంచి ఊటుకూరు వరకు గుంతలమయమైన రోడ్లను తాత్కాలిక మరమ్మత్తులు కూడా చేపట్టలేదని, ఇదేనా అభివృద్ధికి సూచిక అన్నారు. ప్రజావేదికపై మాట్లాడాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసులు పర్మిషన్ ఇవ్వకపోవటంతో బహిరంగ చర్చకు దూరం గా ఉన్నామని తెలిపారు. సమావేశంలో వైయస్సార్‌సిపి మండల కన్వీనర్ సందెపోగు సత్యం, సిహెచ్ఎస్ఆర్‌కె సాయిరెడ్డి, చిలుకా వెంకటరావు, దండా సత్యానారాయణరెడ్డి, అంబటి నారాయణ, తుమ్మా చిన్నపరెడ్డి, పొన్నెకంటి వెంకట్రావు, ఎస్‌కే నాగులు, మచ్చా కోటేశ్వరరావు, ఏరువ బాలశౌరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాగవరం సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే హామీ

క్రోసూరు : మండలంలోని నాగవరం గ్రామ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ హామీ ఇచ్చారు. గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో పలువురు గ్రామస్థులు ఆయనను కలిసి సమస్యల గురించి విన్నవించారు. గ్రామంలో ఎస్సీ కాలనీకి వెళ్ళే రహదారితో పాటు పలు అంతర్గత రహదారులను సిమెంట్ రోడ్లుగా మార్చేందుకు నిధులు కేటాయించాలని కోరారు. గ్రామంలో నిరుపేదలందరికి పక్కా గృహాలు మంజూరు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. కాపు కార్పొరేషన్ ద్వారా నాగవరం గ్రామంలో రుణాలు ఇప్పించాలని, తమ గ్రామానికి ప్రాధాన్యం కల్పించాలని వారు కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ క్రోసూరు ఎంపీటీవో అనురాధతో మాట్లాడారు. సోమవారం జరగనున్న క్రెడిట్ క్యాంపులో నాగవరం గ్రామానికి చెందిన వారికి ప్రాధాన్యం కల్పించాలని తెలియజేశారు. అంతర్గత రహదారులను, పక్కా గృహాలను సంబంధిత అధికారులతో మాట్లాడి మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో గ్రామానికి చెందిన చిరంజీవి, పులిబండ్ల అప్పయ్య, యర్రంశెట్టి అప్పారావు, సాంబశివరావు తదితరులు ఉన్నారు.

సారా బట్టీపై దాడి.. బెల్లం ఊట ధ్వంసం

అచ్చంపేట : మండలంలోని మాదిపాడు పంచాయతీ పరిధిలో గల జడపల్లి మోటుతండాలోని అటవీ ప్రాంతంలో రూరల్ సీఐ బి.కోటేశ్వరరావు సారా బట్టీలపై దాడులు చేశారు. 600 బెల్లం ఊట బట్టీలను ధ్వంసం చేసి సారా తయారీకి ఉపయోగించే సామాన్లను స్వాధీనం చేసుకున్నారు. మండలంలో సారా కాసే నిర్వాహకులపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనతో పాటు పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.



మాదిపాడు పరిధిలోని జడపల్లిమోటు తండా వద్ద సారా బట్టీలు ధ్వంసం చేసి సామాన్లు స్వాధీనం చేసుకున్న సీఐ కోటేశ్వరరావు

తెలుగుభాష ప్రాముఖ్యంపై వ్యాసరచన పోటీలు

కారంపూడి: ప్రభుత్వ గుర్తింపు పొందిన సెయింట్‌జాన్స్ హైస్కూల్ ఆవరణలో తెలుగుభాష ప్రాముఖ్యంపై ఆదివారం వ్యాసరచన పోటీలు జరిగాయి. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన సుమారు 1000 మందికిపైగా విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు. విజేతలుగా హైస్కూల్ విభాగంలో సీహెచ్ అభినవ్, పి.అన్నపూర్ణ, ప్రైమరీ విభాగంలో గుండా తేజస్, కజ్జం సాత్విక్‌లు నిలిచారు. వారికి కరస్పాండెంట్ భరత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రేష్మీ , పీఈటీ విజయ్ బహుమతి ప్రదానం చేశారు.

పల్లెల్లో తీరనున్న రహదారుల కష్టాలు

పలు గ్రామాల్లో సీసీ రోడ్ల పనులు

బురదలేని రహదారులే లక్ష్యం

పెదకూరపాడు : మండలంలోని పలు గ్రామాల్లో సిమెంటు రహదారులు నిర్మించనున్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ గ్రామ పంచాయతీల భాగస్వామ్యంతో మండలంలో సీసీ రోడ్ల నిర్మాణపు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ సహకారంతో సీసీ రోడ్ల నిర్మాణపు పనులు జరుగుతున్నాయి. 13, 14 ఆర్థిక సంఘం నిధులతో పెదకూరపాడులోని అత్యధిక బజార్లు ఇప్పటికే కోటిరూపాయలకు పైగా వ్యయంతో సిమెంటు రోడ్ల నిర్మాణాలు పూర్తి చేశారు.



పెదకూరపాడు నుంచి ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లే నూతనంగా నిర్మించిన సిమెంటు రోడ్డు



రామాపురంలో నిర్మిస్తున్న సిమెంటు రోడ్డు

పెదకూరపాడు ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ చొరవతో బురదతో కూడిన రోడ్డు ఉండకూడదనే ఉద్దేశంతో సిమెంటు రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు ప్రత్యేక శ్రద్ధ చూపారు. వివిధ శాఖల నిధులతో కూడా సిమెంటు రోడ్లను ఇప్పటికే నిర్మించారు. ఎంతో కాలంగా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రోడ్లు అద్వానంగా ఉండడంతో రూ.8 లక్షల వ్యయంతో నూతనంగా సిమెంటు రోడ్లు నిర్మించారు. గ్రామంలో అత్యధిక శాతం సిమెంటు రోడ్లు వేయడంతో కొత్తకళను సంతరించుకుంటున్నాయి. నిధులు ఎక్కువ రావడమే ఇందుకు మూల కారణం. తొందరలో పెద కూరపాడు ఎస్సీ కాలనీల్లో కూడా సిమెంటు రోడ్ల నిర్మాణానికి నిధులు వెచ్చించి శంకుస్థాపన చేసేందుకు ప్రజా ప్రతి నిధులు సిద్దమయ్యారు. ఏదిఏమైనా గ్రామంలో సిమెంటు రోడ్లు ఉండడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

నేడు క్రెడిట్ క్యాంపు

అచ్చంపేట : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం క్రెడిట్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి డీజీ నాయక్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీకి చెందిన లబ్ధిదారులు క్రెడిట్ క్యాంపులో పాల్గొనాలని తెలియజేశారు.

నేడు వెలక్కాయల వేలం పాట

దాచేపల్లి : వినాయక చవితి పండుగను పురస్కరించుకొని నారాయణపురంలోని ఆర్ అండ్‌బీ బంగ్లాలో ఉన్న వెలక్కాయలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఏఈ సుబ్బారావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వివరాలకు సెల్ నం. 94910 45158ను సంప్రదించవచ్చునన్నారు.

గణేష్ విగ్రహాలు పెట్టుకొనేవారు అనుమతులు పొందాలి

రూరల్ సీఐ కోటేశ్వరరావు

అచ్చంపేట : ఈ నెల 25వ తేదీన వినాయకచవితి వేడుకలు జరుగనున్న నేపథ్యంలో విగ్రహాలు పెట్టేకొనేవారు పోలీసుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సత్తెనపల్లి రూరల్ సీఐ బి.కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం సాయంత్రం అచ్చంపేట పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విగ్రహాలు పెట్టుకొనేందుకు అనుమతులు కావాల్సినవారు మీ-సేవలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రాత్రి పూట 10 గంటల వరకు మాత్రమే మైక్ ఉపయోగించాలని, నిమజ్జనాలు ఎక్కడ చేస్తారనేది కూడా ముందుగా తెలియజేయాలన్నారు. అచ్చంపేటలోని ఆంజనేయస్వామి విగ్ర హం సెంటర్ వద్ద మైకులు ఎవ రూ పెట్టరాదని తెలిపారు. గ్రా మాల్లో బెల్ట్‌షాపులు నిర్వహించ రాదని, అలాంటి వారిపై కఠినమైన నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా విగ్రహ కమిటీ వారే పూర్తి బాధ్యతలు వహించాలని తెలిపారు.



రైతు సేవలో రెవెన్యూశాఖకు 64అర్జీలు

అమరావతి : మండల పరిధిలోని అత్తలూరులో శనివారం జరిగిన రైతుసేవలో రెవెన్యూ శాఖ గ్రామసభలో రైతుల నుంచి 64 అర్జీలు అందినట్లు తహసీల్దార్ భాస్కరరావు తెలిపారు. అడంగళ్ లో భూమి నమోదుకు 59, భూమి సర్వేకు 5 అర్జీలు అందాయని వాటిని సత్వరం పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బందితో పాటు రైతులు పాల్గొన్నారు.



అత్తలూరు గ్రామంలో రెవెన్యూ అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ భాస్కరరావు

అంబేద్కర్ ఆశయాలే ప్రభుత్వ లక్ష్యం



అమరావతి : రాజ్యాంగాన్ని అందించిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలు అమలు చేసే విధంగా రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలన సాగిస్తున్నారని స్థానిక శాసనసభ్యులు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. ఆదివారం ధరిణికోటలోని స్వశక్తి కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే స్థానికులను ఉద్దేశించి ప్రసంగించారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం దీర్ఘకాలం ప్రజాస్వామ్యం వర్ధిల్లేలా రచించారని అన్నారు. సమసమాజ స్థాపనకు అంబేద్కర్ చూపిన మార్గం అందరూ అనుసరించాలన్నారు. బౌద్ధమతం విరాజిల్లిన ధాన్యకటక ప్రాంతంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

ప్రతి ఒక్కరూ ఆనందంగా గడపాలి

మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు



హ్యాపీ సండే కార్యక్రమంలో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు, కమిషనర్ .రమేష్‌బాబు, అధికారులు

బాపట్ల టౌన్ : ప్రతి ఒక్కరు ఆనందంగా ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం హ్యాపీ సండే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదని మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్ బాబు అన్నారు. ఆదివారం స్థానిక జమ్ముల పాలెం ఆర్వోబీ వద్ద హ్యాపీ సండే కార్యక్రమాన్ని పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ, ప్రతి నెలా 3వ ఆదివారం ఉదయం 7గంటల నుంచి హ్యాపీ సండే కార్యక్రమం విద్యార్థినీవిద్యార్థులతో, అధికారులతో కలిసి నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని ఆనందాన్ని పొందాలన్నారు. ఆటపాటలతో సంతోషంగా గడపాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినీవిద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ తోట మల్లేశ్వరి, మున్సిపల్ డీఈ సీతారామారావు, కౌన్సిలర్లు చింతా దేవసహాయం, నాగరాజు, నెమలికంటి హనుమంతరావు, మున్సిపల్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆదిశేషారెడ్డి, సంతోషమ్మ, శ్రీమన్నారాయణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



కొత్త బస్టాండ్‌లో షాపులను తనిఖీ చేస్తున్న ఆర్టీసీ ఆర్ఎం జ్ఞానంగారి శ్రీహరి

అనుమతించిన వస్తువులే విక్రయించాలి

ఆర్టీసీ ఆర్ఎం శ్రీహరి

బాపట్ల టౌన్ : బాపట్ల డిపో పరిధిలోని షాపుల్లో అనుమతించిన వస్తువులను మాత్రమే విక్రయించాలని ఆర్టీసీ ఆర్ఎం జ్ఞానంగారి శ్రీహరి అన్నారు. ఆదివారం బాపట్ల డిపో పరిధిలోని షాపుల్లో ఆయన ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనుమతించని వస్తువులు షాపుల్లో విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అంతేగాక, ఆ షాపులను సీజ్ చేయమని డిపో మేనేజర్ వెంకటేశ్వర్లుకు ఆదేశాలు జారీచేశామన్నారు. అద్దె బస్సుల డ్రైవర్ల లైసెన్స్‌లు తనిఖీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

22న మండల పరిషత్‌లో క్రెడిట్ క్యాంప్

కర్లపాలెం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పలు కార్పొరేషన్‌ల ద్వారా స్వయం ఉపాధి కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 22వ తేదీన క్రెడిట్ క్యాంప్ నిర్వహిస్తున్నట్టు మండలాభివృద్ధి అధికారి పులి శరత్ బాబు తెలిపారు. కర్లపాలెం మండల పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్లలో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నవారు దరఖాస్తుతోపాటు రేషన్, ఆధార్ కార్డులు, కుల ధ్రువపత్రాలతో హాజరు కావాలని ఎంపీడీవో సూచించారు. అన్ని పంచాయతీలలో కార్యదర్శులు పై విషయాన్ని ప్రచార సాధనం ద్వారా తెలియజేయాలని ఆదేశించామన్నారు. మండలంలో మొత్తం యూనిట్‌లు 213 ఉండగా, ఎస్టీ కార్పొరేషన్ 58, ఎస్సీ కార్పొరేషన్ 12, బీసీ కార్పొరేషన్ 53, కాపు కార్పొరేషన్ 73, ముస్లింమైనార్టీ 16, క్రిస్టియన్ మైనార్టీ 1 చొప్పున బ్యాంక్‌లకు కేటాయించామని ఎంపీడీవో వివరించారు.

బాపట్లలో 23న రుణమేళా

బాపట్ల : మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జరగాల్సిన రుణమేళా 23వ తేదీ బుధవారం ఉదయం 11గంటలకు జరుగుతుందని కమిషనర్ ఎం.రమేష్ బాబు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, మైనార్టీలకు రుణాలు ఇచ్చేందుకు స్క్రీనింగ్ కమ్ సెలక్షన్ కమిటీ ద్వారా అర్హులైన లబ్ధిదారులను ఎంపికచేస్తామన్నారు. కావున అభ్యర్థులు 23వ తేదీన ఆన్‌లైన్ అప్లికేషన్, ఒరిజనల్ ధ్రువపత్రాలు మూడు సెట్లతో హాజరు కావాలని సూచించారు.

చిరస్మరణీయుడు వైద్యశాస్త్రవేత్త రోనాల్డ్‌రాస్ : సాయిబాబు

బాపట్ల : అద్భుతమైన పరిశోధనల ద్వారా మానవాళిని మలేరియా మహమ్మారి నుంచి విముక్తి కల్పించిన సుప్రసిద్ధ వైద్యశాస్త్రవేత్త రోనాల్డ్‌రాస్ చిరస్మరణీయుడని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పిసి.సాయిబాబు పేర్కొన్నారు. అంతర్జాతీయ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా ఆదివారం వ్యవసాయ కళాశాల విద్యార్థులతో కలిసి రోనాల్డ్‌రాస్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయిబాబు మాట్లాడుతూ మలేరియా వ్యాధి వ్యాప్తికి ఆడ ఎనాఫిలిస్ దోమే కారణమని 1897 ఆగస్టు 20న తన పరిశోధనా ఫలితాలను రాస్ వెల్లడించారని తెలిపారు. ఈ అపూర్వ పరిశోధనకు సికింద్రాబాద్ వేదిక కావడం తెలుగువారికి గర్వకారణమన్నారు. మలేరియా వ్యాధి వ్యాప్తికి పరాన్నజీవి ప్లాస్మోడియం కారణమని ప్రకటించి రాస్ ప్రపంచానికి మహోపకారం చేశారన్నారు. ఇది వైద్యపరిశోధన చరిత్రలోనే గొప్ప మలుపు అన్నారు. ఈ పరిశోధనకుగాను 1902లో రాస్‌కు నోబుల్ బహుమతి లభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల పీడీ ఐ.ఎస్.నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.



రోనాల్డ్‌రాస్ పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న విద్యార్థులు, డాక్టర్ పిసి.సాయిబాబు తదితరులు

భర్త కోసం..

బాపట్ల : ప్రేమించి పెళ్ళి చేసుకున్న భర్త నుంచి తనను అత్తమామలు వేరుచేయాలని చూడడమే కాకుండా ఇంటి నుంచి గెంటివేశారని, తన భర్తను తనకు ఇప్పించాలని దేవూరి అనూష చేపట్టిన దీక్ష కొనసాగింది. ఆదివారం కూడా పట్టణంలోని వివేకానంద కాలనీలో భర్త వికాస్ ఇంటిముందు బైఠాయించింది. ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు కొండా అన్నమ్మ, ఎం.పల్లవి తదితరులు అనూషకు మద్దతు తెలియజేశారు. భార్యభర్తలను కలపాలని ఆమెకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని వారు పేర్కొన్నారు. అయితే దీక్ష చేస్తున్న అనూషకు న్యాయం చేసేందుకు పోలీసులు ఏమాత్రం స్పందించడంలేదంటూ పెద్దఎత్తున విమర్శలు వస్తున్నాయి. భార్యభర్తలను విడదీయాలని చూస్తున్న అత్తమామలకు పోలీసులు మద్దతు ఉందని అనూష కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. భర్త వచ్చేవరకు తన పోరాటం ఆగదని, ప్రాణత్యాగానికైనా సిద్ధమని అనూష తెలిపింది.



అత్తింటి ముందు బైఠాయించిన అనూష

'బాలిక మృతి కారకులపై చర్యలు తీసుకోవాలి'

బాపట్ల : తాడేపల్లిలో ఎస్టీ బాలిక మృతికి కారణమైన వైద్యసిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆదివాసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి తిరువీధుల శంకర ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం ఎన్జీవోస్ హోమ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న కత్తి చెంచమ్మకు వైద్యసిబ్బంది వ్యాక్సిన్ ఇవ్వడం వలన అస్వస్థతకు గురై మృతిచెందిందని ఆయన ఆరోపించారు. కావున పీహెచ్‌సీ సిబ్బందిపై కేసు నమోదు చేసి, చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కారుమంచి ఏసుపాదం, డేగల ప్రసాద్, దేవరపల్లి రామకోటేశ్వరరావు, ఐ.వెంకట శ్రీనివాసరావు, సూరేపల్లి శ్రీనివాసరావు, జంపాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల కూరగాయల ధరలు (రూ.) 1 కిలో

వంకాయలు: 30, బీర: 20, బెండ: 25, టమోట: 55, దొండ: 20, దోస: 20, కాకర: 30, క్యారెట్: 60, క్యాబేజి: 25, పచ్చిమిర్చి: 30, బీట్‌రూట్: 40, చేమ: 30, బంగాళదుంప: 20, ములక్కాయ: 05, సొరకాయ: 20, కీరదోస: 35, గోరుచిక్కుడు: 30.

సినిమా గైడ్

విజయకృష్ణ - నేనే రాజు నేనే మంత్రి
అన్నపూర్ణ - లై
శ్రీనివాస - జయ జానకి నాయక
అలంకార్ - ఫిదా
తిరుమల పిక్చర్ ప్యాలెస్ (కర్లపాలెం) - నేనే రాజు నేనే మంత్రి
విజయలక్ష్మి(ఖాజీపాలెం) (పిట్టలవానిపాలెం)- జయ జానకి నాయక
వెంకటరమణ ఫిక్చర్ ప్యాలెస్ (పిట్టలవానిపాలెం)- జయ జానకి నాయక

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో సామాజికపరమైన (వ్యక్తిగతమైనవికాదు) సమస్యలు ఉన్నాయా? అలా ఉన్న సమస్యల గురించి ఫోన్ చేసి ఆంధ్రజ్యోతికి తెలపండి. ఆ సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారి దృష్టికి తీసుకువెళ్తాం.

సమయం : ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి 8 గంటల మధ్య
ఫోన్ నెంబర్ : 9985411240

3 స్టారుకు మాత్రమ

వైభవంగా పోలేరమ్మ కొలుపులు

బాపట్ల టౌన్ : పట్టణంలోని 5వ వార్డులో ఆదివారం అత్యంత వైభవంగా పోలేరమ్మ కొలుపులు నిర్వహించారు. వేకువజాము నుంచే మహిళలు ఆలయ ప్రాంగణానికి చేరుకొని, పొంగళ్లు పెట్టి అమ్మవారికి ధూపదీప, నైవేద్యాలు సమర్పించారు. మొక్కుబడులను చెల్లించుకున్నారు. పట్టణ ప్రజలు అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో గురకా గోపి, అన్నెం ముత్తమ్మ, తన్నీరు బుల్లియ్య, డి.ఏడుకొండలు, జి.వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ నక్కల ప్రమీల, నక్కల భావన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వద్దంటున్నా ఓవర్ లోడింగ్..

- పోలీసుల మాటలు బేఖాతరు
- తీరు మార్చుకోని ఆటో డ్రైవర్లు
- చర్యలు తీసుకోని అధికారులు

బాపట్ల : ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి, ఓవర్ లోడింగ్‌తో ఆటోలు నడపరాదు, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు అంటూ పోలీసులు, వాహనాల తనిఖీ అధికారులు ఎన్ని హెచ్చరికలు జారీచేసినా వాహనచోదకులలో మాత్రం మార్పు రావడం లేదు. యథేచ్ఛగా నిబంధనలు అతిక్రమిస్తున్నారు. ఎక్కువమంది ప్రయాణికులను ఎక్కించుకొని అతివేగంతో ఆటోలు నడుపుతున్నారు. పోలీసులు హెచ్చరిస్తున్నా కొంత దూరం వెళ్ళిన తర్వాత మరలా ప్రయాణికులను ఎక్కించుకుంటూనే ఉంటున్నారు. ట్రాఫిక్ పోలీసులు పట్టణంలో అనేకమంది ఆటోడ్రైవర్‌లకు సూచనలు చేసినా వినీవినిపించనట్లు వ్యవహరిస్తున్నారు. ఒక్క ఆటోలో 25వందికి పైగా ప్రయాణికులను ఎక్కిస్తున్నారంటే డ్రైవర్‌ల అలక్ష్యం అర్థమౌతోంది. అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరించడం వల్లే ఆటో డ్రైవర్ల పోకడలకు అడ్డులేకుండా పోతున్నది. నియోజకవర్గంలోని బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలలో నిత్యం అత్యధికమంది ప్రయాణికులు,, కూలీలతో వెళుతున్న ఆటోలు, ట్రాక్టర్‌లు కనిపిస్తూనే ఉన్నాయి.


వెనుక డోర్‌పై కూడా ప్రయాణికులను ఎక్కించుకుని వెళుతున్న ఆటో

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి


రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

బాపట్ల టౌన్ : పట్టణంలో ఘనంగా రాజీవ్‌గాంధీ 73వ జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు లేళ్ల వెంకటప్పయ్య మాట్లాడుతూ, భారతదేశంలో సాంకేతిక రంగాన్ని అభివృద్ధి చేసి, ఆ రంగంలో యువతకు ఉపాధి అవకాశాలను కల్పించినది రాజీవ్‌గాంధీయేనన్నారు. భారతదేశ ప్రతిష్ఠ కోసం ప్రాణాలర్పించిన ఘనత ఆయన కుటుంబానికే దక్కుతుందన్నారు. అటువంటి కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తలుగా పనిచేయడం గర్వకారణంగా ఉందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి చేజర్ల నారాయణరెడ్డి, పీసీసీ కార్యదర్శి షేక్ హాసీఫ్‌హుస్సేన్, మద్దిబోయిన తాతయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శులు యాతం మోజెస్ రాజు, నీలం కోటేశ్వరరావు, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఆరీఫ్‌ఖాన్, మండల అధ్యక్షుడు ఆసోది శ్రీనివాసరెడ్డి, కోట వెంకటేశ్వరరెడ్డి, సలగల యెహోషువా, వీరరాఘవయ్య, దోనేపూడి రవి తదితరులు పాల్గొన్నారు.

సంగం డెయిరీ ద్వారానే పాల ఉత్పత్తిదారులకు గిట్టుబాటు ధర

సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు గుండ్రెడ్డి శివ

కర్లపాలెం : పాల ఉత్పత్తిదారులకు సంగం డెయిరీ ద్వారానే గిట్టుబాటు ధర లభిస్తుందని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు గుండ్రెడ్డి శివ అన్నారు. మండలంలోని యాజలి గ్రామంలో సంగం డెయిరీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాల సొసైటీ సభ్యులకు ఆదివారం ఆయన బోనస్ పంపిణీ చేశారు. యాజలి సొసైటీ పరిధిలోని పాల కేంద్రంలో 145 మంది రైతులకు రూ.4,20,600, యాజలి ఎంసీసీ కేంద్రంలోని ఉత్పత్తిదారులు 89 మందికి రూ.2,45,500 బోనస్‌ను శివ, సంగం డెయిరీ డైరెక్టర్ మరీదు వెంకటేశ్వరరావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాలకేంద్రం అధ్యక్షుడు కేసాని శ్రీనివాసరావు, మువ్వా మల్లేశ్వరరావు, మేనేజర్ వెంకటరమణనాయుడు, సూపర్‌వైజర్ సంగీత కృష్ణ, యాజలి నీటి సంఘం అధ్యక్షుడు పసుపులేటి సుబ్బారావు, దామర్ల మన్మథరావు, మువ్వా గుడారయ్య, మువ్వా సోమయ్య, నందిపాటి సుబ్బారావు, ఆలా శ్రీను, మువ్వా గోపయ్య, సూపర్‌వైజర్ కృష్ణారావు, సందీప్, రైతులు పాల్గొన్నారు.


యాజలి పాల సొసైటీలో సభ్యులకు బోనస్ పంపిణీ చేస్తున్న గుండ్రెడ్డి శివ


కొండుబొట్లపాలెంలో బోనస్ పంపిణీ చేస్తున్న సంగం డెయిరీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు

బోనస్ పంపిణీ

కొండుభొట్లపాలెం (బాపట్ల) : మండలంలోని కొండుభొట్లపాలెం పాలఉత్పత్తిదారుల సహకార సంఘంలో ఆదివారం బోనస్ పంపిణీ చేశారు. పాలకేంద్రం అధ్యక్షుడు నామన లతారవికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సంగం డెయిరీ డైరెక్టర్ మరీదు వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 62మంది పాల ఉత్పత్తిదారులకు లీటర్‌కు 3రూపాయల 50 పైసలు చొప్పున బోనస్ రూపంలో రూ.92,450 పంపిణీ చేశారు. పాడిరైతులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ వెంకటరమణనాయుడు, కార్యదర్శి బోడపాటి చంద్రశేఖరరావు, పాలకవర్గ సభ్యులు పల్లప్రోలు రాములు, ఇక్కుర్తి చెంచులక్ష్మీ, నామన ప్రసాదరావు, భావన్నారాయణ, వాసు, ఎ.గిరిరాజమ్మ, పల్లప్రోలు వెంకాయమ్మ, పిచ్చయ్య, కె.సత్యవతి పాల్గొన్నారు.


విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక సాయం, పుస్తకాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు పురం వెంకటసాంబశివరావు తదితరులు

విద్యార్థుల కుటుంబాలకు ఉపాధ్యాయుల వితరణ

బాపట్ల : తమ పాఠశాలలో చదివే విద్యార్థులకు చెందిన రెండు గృహాలు అగ్నిప్రమాదంలో దగ్ధమవడంతో విజయలక్ష్మీపురం శ్రీ సీతారామ పాఠశాల ఉపాధ్యాయులు స్పందించారు. ఇటీవల సంజయ్ గాంధీకాలనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌వల్ల రెండు ఇళ్లు దగ్ధమయ్యాయి. అందు నివశించే కుటుంబాల పిల్లలు తమ విద్యార్థులు కావడంతో, వారి స్థితిగతులను ఆరాతీసిన ప్రధానోపాధ్యాయుడు పురం వెంకటసాంబశివరావు, ఉపాధ్యాయులు గుంటి ప్రగతి, జంజనం శివప్రసన్న కలిసి రూ.6వేలు, దుస్తులు, విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ సీహెచ్ ఉమా, ఉపాధ్యాయుడు నారాయణమూర్తి పాల్గొన్నారు.

కరాటేలో సంగీత్ రీడ్స్ ప్రతిభ

బాపట్ల : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇన్‌వేషనల్ కరాటే చాంపియన్‌షిప్ 2017 పోటీల్లో బాపట్ల విద్యార్థి ఎ.సంగీత్ రీడ్స్ అత్యుత్తమ ప్రతిభను కనబరిచి బంగారు, వెండి పతకాలు సాధించాడు. మంగళగిరిలో ఆదివారం కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఈ పోటీలకు బాపట్ల శ్రీచైతన్య స్కూల్ నుంచి నలుగురు విద్యార్థులు హాజరయ్యారు. అందులో సంగీత్ రీడ్స్ బ్లాక్ బెల్టు విభాగంలో బంగారు, కటా విభాగంలో వెండి పతకాలు సాధించాడు. ఆ విద్యారిని నిర్వాహకులు అభినందించారు.


కరాటేలో గోల్డ్ మెడల్ అందుకుంటున్న విద్యార్థి సంగీత్ రీడ్స్



ఉచిత దంతవైద్యశిబిరం

పట్టణంలోని సీబీజడ్ చర్చి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. చీరాల ప్రకాష్ డెంటల్ కేర్ వైద్యులు అబ్రహాం బ్లెస్సీ, డాక్టర్ సజ్‌నా అబ్రహాంలు రోగులను పరిక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చర్చి పెద్దలు జె.క్రిష్టాఫర్, ఎన్.సంజీవ్ తదితరులు సేవలందించారు. 100మంది దంతవ్యాధి బాధితులు చికిత్స పొందినట్లు నిర్వాహకులు తెలియజేశారు. (బాపట్ల)

వయోజనులకు అక్షరాస్యత పరీక్షలు

పిట్టలవానిపాలెం : మండలంలోని అన్ని గ్రామాల్లో సాక్షరభారత్ ఆధ్వర్యంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ ద్వారా వయోజనులకు అక్షరాస్యత పరీక్షలు నిర్వహించారు. మండలంలోని చందోలు, సంగుపాలెం కోడూరు, అల్లూరు, రెడ్డిపాలెం, గోకరాజు నల్లిబోయినవారిపాలెం తదితర గ్రామాల్లో సాక్షరభారత్ మండల కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు పర్యటించి, పరీక్షల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అక్షరాస్యత పరీక్షలో అర్హత సాధించినవారికి సర్టిఫికెట్లను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విలేజ్ కో ఆర్డినేటర్‌లు బసవకుమారి, ఆరీఫ్, ప్రశాంత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



అన్నీ విజయవాడకే..

● ఆర్టీసీ స్లీపర్ బస్సుకూ దిక్కులేదు
● గుంటూరు- విజయవాడ ఏసీ సర్వీసులూ విజయవాడ డిపోలవే
● గుంటూరుపై పాలకులు, ఉన్నతాధికారుల శీతకన్ను
● పేరుకే రాజధాని జిల్లా..

గుంటూరు: పేరుకే నవ్యాంధ్ర రాజధాని జిల్లా.. ఆ స్థాయిలో ఆర్టీసీ బస్సుల సౌకర్యం లేదు.. ఆదాయముంటేనే ఏసీ సర్వీసులు నడుపుతామంటూ ఆర్టీసీ ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. దీనికితోడు జిల్లాలోని ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవటంతో ఏసీ సర్వీసులూ, స్లీపర్ బస్సులూ విజయవాడకే తరలిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు పండుగలు, సెలవు దినాల్లో ప్రైవేటు ట్రావెల్స్‌ను ఆశ్రమించి జేబులు గుల్ల చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంటోంది. గతంలో గుంటూరు నుంచి హైదరాబాద్ రాకపోకలు సాగించేందుకు ఆర్టీసీ వెన్నెల స్లీపర్ బస్సు ఒకటి అందుబాటులో ఉండేది. ఆర్టీసీలో స్లీపర్ కోచ్‌లో అత్యంత అధునాతన బస్సుల్లో వెన్నెల బస్సు ఒకటి. మొదట్లో ప్రయాణికుల నుంచి ఆదరణ బాగానే ఉంది. పండుగ రోజులు, ఆదివారాలు, వరుస సెలవుల సమయాల్లో రెండు వారాలు ముందుగానే స్లీపర్ బస్సుల్లో సీట్లన్నీ రిజర్వేషన్లతో నిండిపోయేవి. సాధారణ సమయాల్లో టికెట్ల బుకింగ్ ఆశించిన స్థాయిలో లేదు. కొన్ని నెలలపాటు పరిస్థితిని పరిశీలించిన ఉన్నతాధికారులు నష్టాల పేరుతో వెన్నెల స్లీపర్ బస్సును విజయవాడ డిపోకు తరలించేశారు. ఓఆర్ రాకపోవటంతో బస్సు నిర్వహణ కష్టంగా మారిందని చెబుతున్నారు. గుంటూరు నుంచి చెన్నైకు సూపర్‌లగ్జరీ బస్సే దిక్కయింది. ఏసీ సర్వీసు కావాలంటే విజయవాడ నుంచి వచ్చే బస్సు కోసం వేచి చూడాల్సిన పరిస్థితి. ఇక్కడ నుంచి చెన్నైకు ఆర్టీసీ ఏసీ సర్వీసు లేకపోవటంతో ప్రయాణికులు ప్రైవేటు ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తున్నారు. కాగా ప్రస్తుతం గుంటూరు నుంచి హైదరాబాద్‌కు ఏసీ సర్వీసులు అమరావతి, గరుడ, గరుడ ప్లస్, ఇంద్ర బస్సులు ఉన్నాయి. నష్టాల పేరుతో ఏసీ స్లీపర్ కోచ్ తొలగించి దాదాపు రెండేళ్లవుతున్నా పట్టించుకున్న నాథుడు లేడు. నష్టాల పేరుతో స్లీపర్ బస్సును ఎత్తివేయటం సరికాదని ప్రయాణికులు పెదవి విరుస్తున్నారు. రాజధాని జిల్లా కేంద్రం కావటంతో హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, తిరుపతి, విశాఖపట్నం వంటి దూరప్రాంతాలకు రాకపోకలు పెరిగాయని చెబుతున్నారు. మరోవైపు ఉన్న ఏసీ సర్వీసులు కూడా ఆదివారాలు, వరుస సెలవులు, పండుగ సమయాల్లో ఏమాత్రం సరిపోవడం లేదని, తప్పక ప్రైవేటు ట్రావెల్స్‌ను ఆశ్రయించాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏసీ సర్వీసులూ విజయవాడవే..

గుంటూరు- విజయవాడ మధ్య రాకపోకలు సాగించే ఏసీ సర్వీసులూ విజయవాడ డిపోలకు చెందినవే. వాటి ద్వారా వచ్చే ఆదాయం కూడా విజయవాడ డిపోలకే తరలిపోతోంది. గుంటూరు రీజియన్‌పై ఉన్నతాధికారులు శీతకన్ను వేసినట్లు పలువురు ప్రయాణికులు విమర్శలు గుప్పిస్తున్నారు. గుంటూరు- విజయవాడ ఏసీ సర్వీసులు గుంటూరు-2 డిపో నుంచి ప్రవేశపెడితే ఆదాయం కూడా పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. విజయవాడ రీజియన్ స్థాయిలో గుంటూరు బస్టాండ్‌ను చూడటంలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సెలవులొస్తే ప్రైవేటు ట్రావెల్స్‌కు పండగే..

గుంటూరులో ఆర్టీసీ ఏసీ బస్సులు రద్దీకి తగిన విధంగా లేకపోవటం ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలకు వరంగా మారింది. వరుస సెలవులు, పండుగ సమయాల్లో ఆర్టీసీ ఏసీ బస్సులు ముందుగానే రిజర్వేషన్ ఫుల్ అవడం, స్పెషల్ బస్సులకు అదనపు చార్జీలు వసూలు చేటయంతో ప్రజలు ప్రైవేటు ట్రావెల్స్ వైపునకు మొగ్గుచూపుతున్నారు. ఏసీ సర్వీసులతో కొన్ని ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలు రెట్టింపు చార్జీలు దండుకుంటున్నాయి.

రీజియన్ అభివృద్ధిపై దృష్టి పెట్టాలి..

గుంటూరు ఆర్టీసీ రీజియన్ అభివృద్ధిపై జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చొరవ చూపాలని ప్రయాణికులు కోరుతున్నారు. రాజధాని జిల్లా కేంద్రం గుంటూరుకు అదే స్థాయిలో ఏసీ సర్వీసులు, కొత్త సర్వీసులు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. ప్రజలకు సౌకర్యవంతమైన బస్సులు అందుబాటులోకి తీసుకొస్తే ప్రైవేటు ట్రావెల్స్ చార్జీల దోపిడీ, ప్రమాద భయాలు కూడా ఉండవని, రద్దీకి అనుగుణంగా సర్వీసులు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

అగ్రిగోల్డ్ బాధిత కుటుంబాలకు సాయమేదీ?

● సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ ● 29న పొన్నూరుకు బస్సు యాత్ర

పొన్నూరుటౌన్: అగ్రిగోల్డ్ బాధితులు బలవన్మరణాలకు పాల్పడకుండా ప్రభుత్వం ఆదుకోవాలని అగ్రిగోల్డ్ ఏజెంట్స్ అండ్ కస్టమర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం అగ్రిగోల్డ్ బాధితుల సమావేశం ఆ పార్టీ పట్టణ కార్యదర్శి కీర్తి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అజయ్‌కుమార్ మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులు రాష్ట్రవ్యాప్తంగా 140 మందికి పైగా ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. బాధిత కుటుంబాలకు రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం నేటికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలోని లక్షలాది మంది అగ్రిగోల్డ్ బాధిత కుటుంబాలను చంద్రబాబు మరచిపోయారన్నారు. అగ్రిగోల్డ్ బాధితుల సంఘం ఆధ్వర్యంలో బాధితులకు న్యాయం జరిగేవరకు పోరాడతామన్నారు. ఈ నెల 16 వ తేదీన శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో బయల్దేరిని అగ్రిగోల్డ్ బాధితుల బస్సు చైతన్య యాత్ర సెప్టెంబర్ 15 అనంతపురంలో ముగుస్తుందన్నారు. 29న బస్సు చైతన్య యాత్ర పొన్నూరు రానున్నట్లు చెప్పారు. బస్సు యాత్రకు స్వాగతం పలకాలని నాయకులను కోరారు. అగ్రిగోల్డ్ బాధిత సంఘం జిల్లా కార్యదర్శి అగస్టీన్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కె.మౌలాలి, ఏరియా గౌరవాధ్యక్షుడు ఆరేటి రామారావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కేసాని కోటేశ్వరరావు, ఉమామహేశ్వరరావు, రామకృష్ణ, ఎం.వెంకాయమ్మ, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జంగాల అజయ్‌కుమార్

జాతీయ జెండాకు అగౌరవం

● అవనతం చేయకుండా వదిలేసిన మున్సిపల్ అధికారులు
● ఆరు రోజులుగా ఎండకు ఎండి వానకు తడుస్తున్న వైనం

తెనాలి రూరల్ : జాతీయ జెండాకు దక్కాల్సిన గౌరవం దక్కడం లేదు. పురపాలక సంఘ అధికారుల నిర్వాకంతో ఆరు రోజులుగా జాతీయ జెండా ఎండకు ఎండి, వానకు తడుస్తోంది. స్థానిక రణరంగ చౌక్‌లో ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపల్ చైర్మన్ పెండేల వెంకట్రావు, కమిషనర్ కె.శకుంతల తదితరులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అదే రోజు సాయంత్రం జెండాను అవనతం చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో అప్పటి నుంచి జెండా అలానే ఉంది. ఈ ఘటన అధికారుల నిర్లక్ష్య ధోరణికి అద్దం పడుతోందని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



ఆరు రోజులుగా ఎండ, వానకు తడుస్తున్న జాతీయ జెండా

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలి : ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి

బాపట్ల టౌన్ : రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చేందుకు నీతిఆయోగ్ నిబంధనలు వర్తించవని, దేశంలో ఏ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఉండదని చెప్పిన కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక హోదా ఉన్న 11 రాష్ట్రాలకు మళ్లీ పదేళ్లు ప్రత్యేక హోదా పొడిగించిందని, రాష్ట్రానికి కూడా ప్రత్యేక హోదా ఇవ్వాలని శాసన మండలి సభ్యుడు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆయన గృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉమ్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీతో సరిపెట్టడం సరికాదన్నారు. నంద్యాల ఉపఎన్నికలో వైసీపీ అభ్యర్థి గెలవడం ఖాయమన్నారు.



ఉమ్మారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థులు

నకిలీ ఉద్యోగులను తొలగించాలి..

వ్యవసాయశాఖలో నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన అధికారులను వెంటనే విధుల నుంచి తొలిగించి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక వ్యవసాయ కళాశాల ప్రధాన గేటు ముందు 12వ రోజు రిలే నిరాహార దీక్షలు చేస్తున్న విద్యార్థులను ఆయన పరామర్శించారు. వ్యవసాయశాఖ కార్యదర్శి వెంటనే విద్యార్థులను సంప్రదించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు.

పెదనందిపాడు ఎంపీపీకి పితృవియోగం

పెదనందిపాడు : ప్రముఖ పారిశ్రామిక వేత్త, పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు, శ్రీనివాస కాటన్ అండ్ ఆయిల్ మిల్స్ డైరెక్టర్, విశ్వతేజస్విని స్పిన్నింగ్ మిల్లు పార్టనర్, లయన్స్ మాంటిస్సోరి పాఠశాల అధ్యక్షుడు, ఎంపీపీ ముద్దన నగరాజకుమారి తండ్రి నర్రా సుబ్బరామయ్య (93) ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆయన ఈ ప్రాంతంలో విద్యాభివృద్ధికి విశేష కృషి చేశారు. పలు అభివృద్ధి కార్యాక్రమాలు, గ్రంథాలయ నిర్మాణం చేపట్టారు. ఈయనకు భార్య, కుమారుడు, ఉప ఎంపీపీ బాలకృష్ణ ఉన్నారు.



సుబ్బరామయ్య (ఫైల్)

వాసవి సేవా సమితుల సమాఖ్య నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

● మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యకు ఘన సత్కారం

నరసరావుపేట టౌన్ : జిల్లా వాసవి సేవా సమితుల సమాఖ్య నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం సత్తెనపల్లి రోడ్డులోని విజయ్ కల్యాణ మండపంలో అత్యంత వైభవంగా జరిగింది. విశిష్ట అతిథిగా హాజరైన మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్యను వెండి కిరీటం, శాలువాతో ఘనంగా సత్కరించారు. నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా కూరపాటి లక్ష్మీ పూర్ణచంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా పల్లబోతు రమేష్, కోశాధికారిగా కొత్తూరి ప్రదీప్ కుమార్, కో-ఆర్డినేటర్‌గా చందోలు ప్రకాశరావు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి హాజరైన ఉపన్యాసకులు, ప్రత్యేక ఆహ్వానితులను సన్మానించారు. చీతిరాల గురు పెద్దన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా, కపలవాయి విజయకుమార్, కాకుమాను పెదపేరిరెడ్డి, మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, పడుచూరి వెంకటేశ్వర్లు, దేవకి వెంకటేశ్వర్లు, భవనాసి యల్లారావు, కట్టమూరి శంకరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ వనమా సుబ్బారావు, ఎంఆర్‌కే మూర్తి, కూరపాటి వెంకట హనుమంతరావు, పూరా భాస్కరరావు, కేపీ రంగారావు, కొల్లిపర కాశీ విశ్వనాథం, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న సమాఖ్య నూతన కార్యవర్గం

నేటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

రొంపిచర్ల: ఈ నెల 21, 22, 23 తేదీలలో ఉపాధ్యాయులకు టెలీకాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంఈవో కేపీ బాబురెడ్డి ఆదివారం తెలిపారు. 21వ తేదీన ప్రైమరీ పాఠశాలల ఉపాధ్యాయులకు తెలుగు, గణితం, ఈవీఎస్‌పై శిక్షణ ఉంటుందన్నారు. 22న ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు తెలుగు, గణితం, సైన్స్‌పై శిక్షణ జరుగుతుందన్నారు 23వ తేదీన సోషల్ సబ్జక్టుపై ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. ఆయా పాఠశాలల నుంచి 50 శాతం ఉపాధ్యాయులకు శిక్షణకు హాజరు కావాలన్నారు.

మాజీ గవర్నర్ రోశయ్యను కలిసిన కాసు



మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్యను మర్యాద పూర్వకంగా కలుసుకున్న మాజీ మంత్రి కాసు వెంకట కృష్ణారెడ్డి తదితరులు

నరసరావుపేట టౌన్: స్థానిక శివా అతిథి గృహంలో ఆదివారం తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్యను మాజీ మంత్రి కాసు వెంకట కృష్ణారెడ్డి కలిశారు. ఈ సందర్భంగా యోగ క్షేమాలు ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, అధికారులు రోశయ్యను కలిశారు. మునిసిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా, తహసీల్దార్ విజయ జ్యోతికుమారి మాజీ ముఖ్యమంత్రి రోశయ్యను మర్యాద పూర్వకంగా కలిశారు. మాజీ మంత్రి కాసు వెంట కాంగ్రెస్ నాయకులు పెనుగొండ వెంకటేశ్వరరావు, కపలవాయి రమేష్‌చంద్రదత్తు, అట్లూరి విజయ కుమార్, యన్నం రవీంద్రారెడ్డి, పడాల చక్రారెడ్డి తదితరులు ఉన్నారు.

వినాయక వ్రతకల్ప పుస్తక ఆవిష్కరణ

స్థానిక శివా అతిథి గృహంలో నరసరావుపేట చాంబర్ ఆఫ్ కామర్స్ వినాయక వ్రతకల్ప పుస్తకాన్ని మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు చీతిరాల గురు పెద్దన్న, ప్రధాన కార్యదర్శి మునగా శ్రీనివాసరావు, కోశాధికారి కూకుట్ల జగదీష్ కుమార్, ఆత్మకూరి రాజేంద్ర ప్రసాదరావు, సోమా రమేష్, బూర్లగడ్డ వెంకట మదన మోహనరావు, అర్వపల్లి ప్రదీప్ కృష్ణ, కూరపాటి లక్ష్మీ పూర్ణచంద్రరరావు తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల...

స్థానిక శివా అతిథి గృహంలో మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వాసవి సేవా సమితి సహకారంతో పంపిణీ చేసే నోటు పుస్తకాలను ఆదివారం ఆవిష్కరించారు. సేవా సమితి అధ్యక్షుడు కందకట్ల వెంకట రమణమూర్తి, ప్రధాన కార్యదర్శి చీమకుర్తి రాజారావు, కోశాధికారి చిలకల భాస్కర శ్రీనివాసరావు, గౌరు శ్రీనివాసరావు, పీ వెంకట రామారావు, బీ బ్రహ్మానందం, సీహెచ్ శ్రీనివాసరావు, వీ అశోక్ కుమార్, సీహెచ్ వెంకటరావు, కొత్త సాంబశివరావు, ఎస్ మహానంది, ఎస్ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మర్రిచెట్టుపాలెం వద్ద మంత్రి ఆదినారాయణరెడ్డి దిష్టి బొమ్మను దహనం చేస్తున్న దళిత బహుజన హక్కుల పోరాట సమితి నాయకులు

మంత్రి వ్యాఖ్యలకు నిరసనగా రాస్తారోకో

రొంపిచర్ల: మండలంలోని మర్రిచెట్టుపాలెం వద్ద అద్దంకి - నార్కెట్‌పల్లి హైవేపై ఆదివారం దళిత బహుజన హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. రాష్ట్ర మంత్రి ఆదినారాయణరెడ్డి దళితులపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర అధ్యక్షుడు గోదా రమేష్ కుమార్ క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు హైవేపై బైఠాయించారు. ఈ సందర్భంగా రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆయన దిష్టి బొమ్మను దహనం చేశారు.

కార్యక్రమంలో వెంకట రమణ, ఖాదర్ బాబు, నాగరాజు, ఇన్నయ్య, రాములు, రామకోటి, శ్రీను, యాకోబు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మాచవరం ఎంపీయూపీ పాఠశాలలో తాగునీటికి కటకట

మాచవరం (రొంపిచర్ల): మండలంలోని మాచవరం ఎంపీయూపీ పాఠశాలలో తాగునీటికి కటకటలాడుతున్నారు. ఈ పాఠశాలలో 150 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పదిమంది ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యా బోధన చేస్తున్నారు. పాఠశాలలో పూర్వ విద్యార్థుల సహకారంతో శాస్త్రవేత్తల విగ్రహాలను ఏర్పాటు చేశారు. పాఠశాలలో ఉపాధ్యాయుడు యలవర్తి వెంకటేశ్వర్లు సహకారంతో విద్యార్థులకు యోగాసనాలనూ నేర్పుతున్నారు. హెచ్ఎం విశాలక్ష్మి మంచినీటి సమస్యను ప్రస్తావిస్తూ మధ్యాహ్న భోజన పథకానికి పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు సొంత నిధులతో తాగునీటిని సమకూరుస్తున్నారని దాతలు ముందుకు వచ్చి తాగు నీటిని ప్లాంట్‌ను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

బావిలో పడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి



మృతుడు కోటేశ్వరరావు

నరసరావుపేట లీగల్: మతిస్థిమితం లేని సుమారు 40 సంవత్సరాల వ్యక్తి బావిలో పడి మృతి చెందిన సంఘటన మండలంలోని ఇస్సపాలెంలో గ్రామంలో జరిగింది. రూరల్ ఎస్ఐ ఏవీ బ్రహ్మం తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. గ్రామానికి చెందిన కాల కోటేశ్వరరావు(40) గత కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేక పొలాల వెంట తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 19న ఇంటి నుంచి వెళ్ళి మరలా తిరిగి రాలేదని, వెతుకుతుండగా ఆదివారం ఉదయం గ్రామ సమీపంలో ఓ బావిలో శవమై కనిపించాడని మృతుని భార్య కాలా శివమ్మ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు నమోదు చేసుకున్న పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బ్రహ్మం తెలిపారు. మృతునికి ఒక కుమార్తె ఉంది.

శంకరునికి మహన్యాస రుద్రాభిషేకం



శాకాంబరిదేవి అలంకరణలో గంగా పార్వతీదేవి, ప్రత్యేక అలంకరణలో భవానీ శంకరుడు

నకరికల్లు: మాస శివరాత్రిని పురస్కరించుకొని ఆదివారం మండలంలోని గంగా పార్వతి సమేత భవానీ శంకర్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భవానీ శంకరునికి మహన్యాస రుద్రాభిషేకం చేశారు. గంగా పార్వతీ అమ్మవారిని శాకాంబరిగా అలంకరించారు. మహిళలు కుంకుమార్చన పూజల్లో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలలో కేశవ శర్మ, వాతడుగు రామాంజనేయులు, వందనపు శంకరరావు, ఈ శివ గాంధి, ఏ శివ కోటేశ్వరరావు, వీ శ్రీనివాసరావు, మాచర్ల రమేష్‌లు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకోండి

● నకరికల్లుకు రూ.6.65 కోట్లు కేటాయింపు ● మండల ప్రత్యేక అధికారి ఆషారాణి

నకరికల్లు: ప్రభుత్వం ఉపాధి పథకాలను అందిస్తున్న ప్రోత్సాహకాలను యువత సద్వినియోగం చేసుకొని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని మండల ప్రత్యేక అధికారి చావా ఆషారాణి కోరారు. ప్రభుత్వం వివిధ కార్పొరేషన్‌ల ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు అందిస్తున్న స్వయం ఉపాధి పథకాలకు రుణాల వివరాలను ఆమె వెల్లడించారు. నకరికల్లు మండలంలో వివిధ కార్పొరేషన్ల ద్వారా ఎస్సీలు 73 మందికి, కాపులు 73 మందికి, బీసీలు 53 మందికి, ముస్లింలు 46 మందికి, ఎస్టీలు 13 మందికి, క్రిష్టియన్లు పది మందికి, బీసీ కార్పొరేషన్ ద్వారా వాషర్‌మెన్ సొసైటీకి, నాయీ బ్రాహ్మణ సొసైటీకి, బట్రాజు సొసైటీకి ఈ రుణాలను మంజూరు చేయనున్నట్లు ఆమె తెలిపారు. మండలంలో 1881 దరఖాస్తులు వచ్చాయన్నారు.

మూడు గ్రూపులకు రూ.45 లక్షల రుణం, రూ.45 లక్షల సబ్సిడీ కింద అందిస్తారన్నారు. 268 మంది వ్యక్తిగత రుణాల కింద రూ.3.48 కోట్లు రుణం కింద, రూ.3.02 కోట్లు సబ్సిడీ ద్వారా, లబ్ధిదారుని వాటాగా రూ.15 లక్షలు ఉందన్నారు. 2017 - 2018 ఆర్థిక సంవత్సరానికి యువతకు స్వయం ఉపాధి కోసం ఈ నిధులను వెచ్చిస్తున్నట్లు ఆమె తెలిపారు.

ముఖ్యమైన ఫోన్ నెంబర్లు

శాసన సభ్యుడు	: 9440993399
మునిసిపల్ చైర్మన్	: 9848157403
ఆర్డీవో	: 9849150077
ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్	: 9885334747
బ్లడ్ బ్యాంక్	: 08647- 224455
మునిసిపల్ కమిషనర్	: 9849905831
డీఎస్పీ	: 9440796209
నరసరావుపేట తహసీల్దార్	: 9849904024
నరసరావుపేట ఎంపీడీవో	:9849903369
ఆర్టీసీ డీఎం	: 9959225428
వ్యవసాయ అధికారి	: 8886614117
నీటి పారుదల శాఖ ఎస్ఈ	: 9490757900
పబ్లిక్ హెల్త్ ఈఈ	: 9849906229
పౌర సరఫరాల అధికారి	: 9701027286

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో సామాజికపరమైన (వ్యక్తిగతమైనవి కాదు) సమస్యలు ఉన్నాయా? అలా ఉన్న సమస్యల గురించి ఫోన్ చేసి ఆంధ్రజ్యోతికి తెలపండి. ఆ సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారి దృష్టికి తీసుకువెళ్తాం.

సమయం: ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి 8 గంటల మధ్య **సెల్ నెంబర్**: 9985411239

సినిమా గైడ్

ఈశ్వరమహల్	గౌతమ్‌నంద
విజేత	ఆనందో బ్రహ్మ
చిత్రాలయ	నక్షత్రం
శారదాంబ	జయ జానకి నాయక
రవికళామందిర్	ఫిదా
లక్ష్మీనరసింహ	నేనే రాజు...నేనే మంత్రి

నరసరావుపేట కూరగాయల ధరలు 1 కిలో రూపాయల్లో

టమోటా:50, బెండ:20, గోరుచిక్కుళ్లు:25, వంకాయలు:40, బీర:25, పచ్చిమిర్చి:30, క్యారెట్:80, బంగాళదుంప:25, దోస:20, దొండ:25, క్యాబేజి:30, కాకర:40, బీట్‌రూట్:50, పెద్ద చిక్కుళ్లు:50, క్యాలీఫ్లవర్:40, కీరదోస:40, సొరకాయ(1):15, ములక్కాయ(1):రూ.10

గుర్తింపు కార్డులు చూపి ఉత్తరాలు తీసుకోండి

పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

నరసరావుపేట టౌన్: రిజిస్టర్డ్, స్పీడ్, ఆర్డనరీ ఉత్తరాలు వచ్చినవారు సంబంధిత ఉప తపాలా కార్యాలయానికి వెళ్ళి తగిన గుర్తింపు కార్డు జిరాక్స్ ఇచ్చి తీసుకోవచ్చని పోస్టల్ సూపరింటెండెంట్ జే శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లోని తపాలా ఉద్యోగులు సమ్మెలోకి వెళ్ళినట్లయితే ఈ విధంగా ఉత్తరాలు పొందాలన్నారు. పోస్టాఫీసు సేవింగ్స్ బ్యాంక్ మొత్తం ఆన్‌లైన్ చేయబడిందన్నారు. ఖాతాదారులు డబ్బులు వేసుకోవాలన్నా, తీసుకోవాలన్నా సమీపంలోని ఉపతపాలా కార్యాలయానికి వెళ్ళి తీసుకోవచ్చని చెప్పారు. లేదా ఇతర తపాలా కార్యాలయాల్లో నైనా ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోవచ్చన్నారు.

రజకులను ఎస్సీలో చేర్చాలి: వెంకటస్వామి

నరసరావుపేట టౌన్: రజకులను ఎస్సీల్లో చేర్చాలని ఉదయగిరి వెంకట స్వామి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పాత పోలీసు స్టేషన్‌లోని రజకుల కార్యాలయంలో సమావేశం జరిగింది. ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రభుత్వం రజకులను ఎస్సీల్లో చేర్చాలన్నారు. రజక సంఘాల ఐక్యవేదిక నాయకుడు పాతపాటి అంజిబాబు ఎస్సీల్లో చేర్చాలని రాష్ట్ర స్థాయిలో నిరంతరం శ్రమించటం అభినందనీయమన్నారు. ఈ సమావేశంలో నడికోట సత్యనారాయణ, సీహెచ్ శ్రీనివాసరావు, ఎన్ తిరుపతిరావు, కే ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఐక్య వేదిక జిల్లా లీగల్ అడ్వయిజర్‌గా రాజా

నరసరావుపేట టౌన్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీ ఐక్యవేదిక జిల్లా లీగల్ అడ్వయిజర్‌గా మోతుకూరి రాజాను నియమించారు. ఆదివారం స్థానిక కోటప్పకొండ రోడ్డులోని ఐక్య వేదిక కార్యాలయంలో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో ఈ నియామకం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పొనుగోటి పూర్ణచంద్రరరావు, ఉపాధ్యక్షుడు కుందా భాగ్యరాజు, కార్యదర్శి కొలకలూరి ఆంజనేయులు, పట్టణ అధ్యక్షుడు కండ్రాతి సాంబయ్య, జిల్లా అధ్యక్షుడు షేక్ నాసర్ వలి, సిద్దు అనంతాచారి, బాదుగున్నల శ్రీనివాసరావు, పసుమర్తి అంకారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో అన్నదానం

నరసరావుపేట టౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో కుసుమ హరనాథ నిత్యాన్నాదాన సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం 200 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో కనమర్లపూడి శ్రీనివాసరావు, చిన్ని వెంకట శ్రీనివాసరావు, అరిపిరాల భాను భుజంగ రవి ప్రసాదు, మురారిశెట్టి వెంకట కోటేశ్వరరావు, ట్రస్ట్ చైర్మన్ రెడ్డి హరనాథ బాబు, జనరల్ సెక్రటరీ ఇమ్మడిశెట్టి గోవర్దనరావు, మాజేటి కోటేశ్వరరావు, కొల్లిపర సత్యనారాయణ, డీవీఎస్ఎన్ పున్నారావు తదితరులు పాల్గొన్నారు.


కొలుపుల సందర్భంగా యువకుల కోలాహలం

రెడ్డిపాలెంలో వైభవంగా కొలుపులు

రొంపిచర్ల: మండలంలోని రెడ్డిపాలెం గ్రామంలో ఆదివారం నాయీ బ్రాహ్మణులు కొలుపులు నిర్వహించారు. వివిధ ప్రాంతాలలో ఉన్న వీరు గ్రామానికి వచ్చి ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు.

నేడు రొంపిచర్లలో స్పీకర్ కోడెల పర్యటన

రొంపిచర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద 2016 - 17 సంవత్సరానికి కార్పొరేషన్‌ల ద్వారా మంజూరైన రుణాలను శాసన సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు లబ్ధిదారులకు సోమవారం అందజేస్తారని ఎంపీడీవో కే మాధ్యూబాబు ఆదివారం తెలిపారు. అదేవిధంగా పశు వైద్యశాఖ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు గేదెలు పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

చీమలమర్రిలోనూ ...

నకరికల్లు: మండలంలోని చీమలమర్రి గ్రామంలో సోమవారం సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. అన్ని శాఖల అధికారులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని స్పీకర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

వయోజనులకు ఎన్ఐవోఎస్ పరీక్షలు


పరీక్షలను పర్యవేక్షిస్తున్న మండల కో-ఆర్డినేటర్ అయ్యపరెడ్డి, సూపర్‌వైజర్ శ్రీనివాసులు

నరసరావుపేట రూరల్: మండలంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ పరీక్షలు ఆదివారం నిర్వహించారు. ఇస్సపాలెం, జొన్నలగడ్డ, కేసానుపల్లి గ్రామాల్లో ఈ పరీక్షలకు 290 మంది మహిళలు హాజరయ్యారని ఎన్ఐవోఎస్ మండల కో-ఆర్డినేటర్ అయ్యపరెడ్డి తెలిపారు. పరీక్షలను సూపర్ వైజర్ యూ శ్రీనివాసులు పర్యవేక్షించారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి ప్రభుత్వం మూడో తరగతి ఉత్తీర్ణులైనట్టు ధ్రువ పత్రాలు అందజేస్తారని నిర్వాహకులు తెలిపారు.

నకరికల్లు మండలంలో..

నకరికల్లు: వయోజనులందరికీ ఆదివారం మండలంలోని 13 గ్రామాలలో పరీక్ష నిర్వహించారు. 214 మంది గాను 192 మంది ఈ పరీక్షకు హాజరయ్యారు. ఇందులో పురుషులు 63 మంది కాగా, మహిళలు 129 మంది హాజరు కావటం విశేషం. మండల కో-ఆర్డినేటర్ సీహెచ్ పుల్లారావు పరీక్షలను పర్యవేక్షించారు. చీమల మర్రిలో వయోజనులకు సాక్షర భారతీ కో-ఆర్డినేటర్ వై రాజ్యలక్ష్మి పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి మూడో తరగతికి సమానమైన ధ్రువ పత్రాలను ఎన్ఐవోఎస్ ద్వారా అందజేయనున్నారు.

పొలం వివాదంలో దాడి


గాయపడిన పచ్చల చౌడయ్య

నరసరావుపేట లీగల్: పొలం వివాదం నేపథ్యంలో ఈపూరు మండలం ఆరేపల్లి వుప్పాళ్ళకు చెందిన పచ్చల చౌడయ్యపై అదే గ్రామానికి చెందిన అనిశెట్టి చంద్రరావు దాడి చేసినట్లు బాధితుడు పోలీసులకు తెలిపాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. చౌడయ్య ప్రభుత్వం భూమి సాగు చేసుకుంటుండగా ఆ భూమి తమకు చెందినదని, నీవెట్లా సాగు చేసుకుంటావని కులం పేరుతో దూషించి చంద్రరరావు, మరో ఇరువురు తనపై దాడి చేసినట్టు బాధితుడు ఫిర్యాదు చేశాడు. బాధితుడు నరసరావుపేట ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు.

ఆర్య వైశ్యుల అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ కృషి

- చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మాజేటి వెంకటేష్
- ఆర్య వైశ్య కార్పొరేషన్ ప్రకటనపై హర్షం


సమావేశంలో మాట్లాడుతున్న మాజేటి వెంకటేష్

నరసరావుపేట లీగల్: వైశ్యులు అన్ని రంగాలలో అభివృద్ధి చెందటానికి తెలుగుదేశం పార్టీ ఎంతో కృషి చేసిందని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మాజేటి వెంకటేష్ అన్నారు. వైశ్యులకు ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేస్తూ ప్రకటన వెలువడిన నేపథ్యంలో పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో గల కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క వైశ్యుడు టీడీపీకి ఎంతో రుణపడి ఉన్నాడని అన్నారు. తమకు ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేయటంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య ప్రముఖులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వైశ్య నేతలు టీజీ వెంకటేష్, సిద్దా రాఘవరావు తదితరులకు అభినందనలు తెలియ జేశారు.

కార్యక్రమంలో వైశ్య నేతలు వనమా సుబ్బారావు, ఆత్మకూరి జగన్మోహనరావు, ఎం శ్రీనివాసరావు, జీ రాంబాబు, రెడ్డి హరనాథబాబు, గట్టుపల్లి సత్యనారాయణ, ఊటుకూరి శ్రీనివాసరావు, అత్తులూరి సుబ్బారావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు

తుళ్లూరు: రెండు పేకాట స్థావరాలపై తుళ్లూరు పోలీసులు ఆదివారం దాడులు చేసి రూ.38,290 నగదును స్వాధీనం చేసుకున్నారు. 21 మంది జూదరులను అరెస్టు చేసారు. మందడంలో జూదమాడుతున్న 15 మందిని అదుపులోకి తీసుకొని రూ. 2,440 నగదును, రాయపూడిలో పేకాడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని రూ.35,850 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తుళ్లూరు సీఐ సుధాకర్ తెలిపారు. సోమవారం జూదరులను కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు తెలిపారు.

ఎస్ఎస్ఏ సిబ్బందికి ఇక నుంచి ఆదివారం పని దినాలే

నకరికల్లు: ప్రభుత్వ నిబంధనల ప్రకారం మండల వనరుల కేంద్రంలో సర్వశిక్ష అభియాన్ కింద పని చేసే ఉద్యోగులు ఇక మీదట ఆదివారం కూడా విధులు నిర్వహించాల్సి ఉంది. ఈ నిబంధనలలో భాగంగా ఆదివారం మండల వనరుల కేంద్రంలో ఎంఐఎస్ కో ఆర్డినేటర్ మల్లిఖార్జునరావు, డేటా ఎంట్రీ ఆపరేటర్, సీఆర్‌పీలు విధులకు హాజరయ్యారు.


మండల వనరుల కేంద్రంలో ఆదివారం విధులు నిర్వహిస్తున్న ఎస్ఎస్ఏ సిబ్బంది

పంపు ఆపరేటర్ కుటుంబానికి ఆర్థిక సాయం


మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న సర్పంచ్ మేళం సౌమ్య

నరసరావుపేట లీగల్: మండలంలోని ములకలూరు గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన నూనె ముసలయ్య (69) కుటుంబానికి గ్రామ సర్పంచ్ మేళం సౌమ్య, టీడీపీ నేతలు కొల్లి ఆంజనేయులు, పెద్దిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కేవీఎస్ ప్రసాదు రూ 10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముసలయ్య గత 15 సంవత్సరాలుగా గ్రామంలోని రక్షిత మంచి నీటి పథకానికి పంపు ఆపరేటర్‌గా చేసిన సేవలను కొనియాడారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

అమరావతి: మండల పరిధిలోని అమరావతి, ధరణికోటకు చెందిన ఆరుగురు జూదరులను పోలీసులు అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.22,160 స్వాధీనం చేసుకున్నారు. అమరావతిలో పేకాట అడుతున్న స్థావరంపై సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఎస్ఐలు రహంతుల్లా, నరసింహారావు, సిబ్బంది దాడులు నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు.

పేదల విద్యకు ప్రోత్సాహం

పొన్నూరుటౌన్: సమాజంలో ఉన్నత స్థానాలకు చేరినవారు, విశ్రాంత ఉద్యోగులు నిరుపేదల విద్యకు సహకరించాలని విశ్రాంత సామాజిక ఆరోగ్య అధికారి నందిపాటి శివప్రసాద్ అన్నారు. ఠాగూర్ నాయీ బ్రాహ్మణుల ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమంలో శివప్రసాద్ పాల్గొన్నారు. తనవంతుగా ముగ్గురు విద్యార్థులకు రూ. 6500 అందచేసినట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ సమాజానికి తనవంతుగా సాకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఠాగూర్ నాయీబ్రాహ్మణుల ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

సాంకేతిక విప్లవ సారథి రాజీవ్‌గాంధీ



రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా కేక్‌ను కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పొన్నూరుటౌన్: దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికిన మార్గదర్శి రాజీవ్‌గాంధీ అని కసుకర్రు గ్రామసర్పంచి కాంగ్రెస్ నాయకుడు జక్కా నాగశ్రీనివాసప్రసాద్ అన్నారు. ఆదివారం పట్టణంలోని మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని నిర్వహించారు. స్థానిక గుంటూరు బస్టాండ్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రాజీవ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పించి కేక్‌ను కోసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ దేశాభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది తూమాటి రమేష్, సజ్జా కృష్ణబాబు, వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మురుగుల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికి రక్షిత మంచినీరు

ఎమ్మెల్యే నరేంద్రకుమార్



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

పొన్నూరుటౌన్: రానున్న రోజుల్లో ప్రతి గ్రామానికి రక్షిత మంచినీటి అందించటమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే, సంగండెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. మండల పరిధిలోని మునిపల్లె గ్రామంలో దాతలు, 13వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన ఎన్టీఆర్ సుజల రక్షిత మంచినీటి పథకాన్ని ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ రక్షిత మంచినీటి పథకం నిర్మాణానికి సహకరించిన డాక్టర్ ఆవుల శ్రీనివాస్, ప్రత్తిపాటి నాగేశ్వరరావు కుటుంబీకులను ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఎన్టీఆర్ సుజల పథకం ద్వారా ప్రతిగ్రామంలో రక్షిత మంచినీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మండలంలో భూగర్భ జలాలు ఉప్పునీటిగా మారిపోయిన నేపథ్యంలో ప్రతి గ్రామానికి మంచినీరు అందించేందుకు కాంప్రహెన్సివ్ ప్రొటెక్టివ్ వాటర్ స్కీమ్ నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ఈ పథకం ద్వారా సమీపంలోని అన్ని గ్రామాలకు మంచినీరు అందించే సౌలభ్యం ఉంటుందన్నారు. ఆర్వో ప్లాంట్లు నిర్మించుకున్న గ్రామస్తులు కమిటీగా ఏర్పడి నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయటానికి కృషి చేసిన దాతలు, గ్రామస్థులను దుశ్శాలువా, పూలమాలలతో ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బొర్రు సీతమ్మ, ఎంపీడీవో టి.శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ రామచంద్రరావు, పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యుస్ ఏఈ బత్తిన అవంతి, సంగండెయిరీ డైరెక్టర్ బొర్రు రామారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మాదల వెంకటేశ్వరరావు, మాజీ వైస్ చైర్మన్ బండ్లమూడి బాబూరావు, గ్రామసర్పంచి పాలపర్తి సత్యవతి, ఎంపీటీసీ శైలజ, వట్టికూటి శ్రీను, గూడురు బాబు, నాగళ్ళ మురళి, నాగభైరు వెంకటస్వామి, తలశిల ప్రసాద్, సబ్బినేని వీరశేఖర్, ముప్పవరపు వెంకటేశ్వరరావు, దాసరి కోటేశ్వరరావు, యూనివర్సిటీ టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకుడు ఆకుల తులసీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీతోటమ్మ ఉత్సవం



తోటమ్మతల్లి ఉత్సవంలో పాల్గొన్న రజక జనసంఘం సభ్యులు

పొన్నూరు: స్థానిక పట్టణ రజక జన సంఘం ఆధ్వర్యంలో తోటమ్మతల్లి ఉత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. తోటమ్మతల్లి అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక అర్చనలు, విశేష పూజలు, సామూహిక పొంగళ్ళు నిర్వహించారు. అనంతరం తోటమ్మతల్లికి పూల అలంకరణ చేశారు. పాతపొన్నూరు నుంచి డప్పులు, వాయిద్యాలతో తోటమ్మ పటంతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం తోటమ్మతల్లి ఆలయంలో భక్తులు రజక జన సంఘం సభ్యులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ రజక జనసంఘం సభ్యులు పి.సుబ్బారావు, ఆలూరి శ్రీనివాసరావు, కాపూరి వెంకటరమణ, గోవాడ రమణ, ఉల్లంగుంట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో పోలాక్షమ్మ తిరునాళ్ల



పొన్నూరుటౌన్: పట్టణంలోని నిడుబ్రోలులో వెంచేసియున్న శ్రీపోలాక్షమ్మతల్లి తిరునాళ్ళు ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నిడుబ్రోలుకు చెందిన యువత పెద్దసంఖ్యలో ఆలయాలకు తరలివచ్చి అమ్మవారికి జలాభిషేకాలను జరిపారు. అనంతరం అమ్మవారికి మంగళ స్నానాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చి అమ్మవారికి పొంగళ్ళు నైవేద్యంగా సమర్పించారు. యువత ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రభోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాంప్రదాయ డప్పువాయిద్యాలు, కనకతప్పెట్ల మధ్య అమ్మవారి జాతర మహోత్సవం ఘనంగా జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కన్నుల పండువగా తెప్పోత్సవం



సరోవరంలో తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పొన్నూరుటౌన్: శ్రీపద్మావతీ గోదాదేవి సమేత శ్రీస్వర్ణ వెంకటేశ్వస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం స్వామివారి తెప్పోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయ ప్రాంగణంలోని సరోవరంలో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై పద్మావతీ గోదాదేవి సమేతంగా శ్రీస్వర్ణ వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను ప్రతిష్ఠించి తెప్పోత్సవాన్ని నిర్వహించారు. స్వామివారి తెప్పోత్సవాన్ని వీక్షించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

నేడు ప్రజావాణి

కాకుమాను: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరుగుతుందని ఎంఆర్‌వో జగన్నోహన్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరవుతున్నారని తెలిపారు.

23న రుణమేళా

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 23న రుణమేళా జరుగుతుందని ఎంపీడీవో బ్రహ్మయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు కార్పొరేషన్‌ల వారు మాత్రమే హాజరవ్వాలన్నారు. ఎస్‌బీఐ, చైతన్య గోదావరి, కెనరా, ఆంధ్రాబ్యాంక్ ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

పాడి రైతు శ్రేయస్సే సంగం లక్ష్యం

పొన్నూరుటౌన్: జిల్లాలో పాడిరైతుల శ్రేయస్సే లక్ష్యంగా సంగండెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ముందుకు సాగుతున్నారని సంగండెయిరీ డైరెక్టర్ బొర్రు రామారావు అన్నారు. మండల పరిధిలోని ఇటికంపాడు, నండూరు గ్రామాల్లో ఆదివారం పాల రైతులకు బోనస్‌పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. లీటరుకు రూ. 3.5 చొప్పున ఇటికంపాడు గ్రామంలో 65 మంది రైతులకు రూ. 1.45 లక్షలు, నండూరులో 65 మందికి రూ. 1.48 లక్షలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రామారావు మాట్లాడుతూ సంగం ఆర్జించిన లాభాల్లో అత్యధిక శాతం బోనస్ రూపంలో రైతులకే చెల్లించేలా పాలకవర్గం నిర్ణయం తీసుకుందన్నారు. సుమారు రూ. 17 కోట్లను బోనస్‌ల రూపంలో సంగం పరిధిలోని పాల రైతులకు చెల్లిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో పాడిపరిశ్రమ మరింత విస్తృతి పరిచేలా సంగం పాలకవర్గ నిర్ణయాలు ఉన్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో అప్పికట్ల చిల్లింగ్ పాయింట్ మేనేజర్ వి.వి.నాయుడు, సూపర్‌వైజర్ ఎం. ఆంజనేయులు, కార్యదర్శి రావిపాటి రవి, సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు వార్తలు

సాధికార సర్వేపై విచారణ



సిబ్బంది నిర్వహించిన సర్వేపై విచారణ చేస్తున్న ఏపీవో ఎం శ్రీనివాసరావు, జిల్లా ఎంఐఎస్ కోఆర్డినేటర్ జీ భాస్కరరావు

ప్రత్తిపాడు: సాధికార సర్వేలో ప్రత్తిపాడు మండలంలో ఉన్నట్లు నమోదై ఈ మండలంలో విద్యాభ్యాసం అభ్యసించకుండా వున్న విద్యార్థుల సర్వేకు సంబందించి ఆదివారం స్థానిక మండల విద్యావణరుల కేంద్రంలో విచారణ జరిగింది. గతంలో ప్రభుత్వం సాధికార సర్వే నిర్వహించింది. ఇందులో 915 మంది విద్యార్థులు స్థానికంగా వున్న పాఠశాలల్లో వారి పేర్లు నమోదు కాలేదు. దీనికి సంబందించి మండలంలో విద్యార్థులు ఎక్కడ చదువుతున్నారు. ఎక్కడ నివాసం వుంటున్నారు. వివాహం జరిగి విద్యకు దూరంగా వున్నారా అన్న విషయాలపై సర్వే పూర్తి చేశారు. ఈ సర్వే ఎలా వుంది అన్న దానిని ఏపీవో ఎం శ్రీనివాసరావు, జిల్లా ఎంఐఎస్ కోఆర్డినేటర్ జీ భాస్కరరావులు పరిశీలన చేశారు. అయితే వీరు తీసుకువచ్చిన సర్వేలో వలసలకు సంబందించి సరైన సమాచారం లేకపోవడంతో మరలా సర్వే నిర్వహించాలని స్పష్టం చేశారు. ఏ ఊర్లో ఉన్నారు.. ఊరు ఎప్పుడు వెళ్లారు.. ఎంత కాలం నుండి వుంటున్నారు. వివాహం జరిగిన విద్యార్థులు అయితే అందుకు సంబందించి పూర్తి స్పష్టత, పై విషయాలపై వీఆర్‌వోల వద్ద కనఫర్‌మేషన్ తీసుకోవడం చేయాలని సూచించారు. త్వరగా పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదికను అందేజేయాలన్నారు.

సేంద్రియ వ్యవసాయానికి చిన్న యంత్ర పరికరాలు మేలు



ప్రకృతి వ్యవసాయ శిక్షణ కార్యక్రమంలో భాగంగా మహిళా రైతుకు సర్టిఫికెట్ అందజేస్తున్న సూర్యనారాయణ రాజు, చిత్రంలో ఫౌండేషన్ చైర్మన్ వై.వెకంటేశ్వరరావు, ధర్మారం బాజీ, ప్రకాష్

వట్టిచెరుకూరు: రైతుల శ్రమే పెట్టుబడిగా పెట్టి కొనసాగించే వ్యవసాయ పద్ధతే సేంద్రీయ వ్యవసాయం. సేంద్రీయ వ్యవసాయంలో రసాయనాలను ఉపయోగించరు కనుక కలుపు నివారణ, అంతర సేద్య పనులకు మనుషుల మీద, యంత్ర పరికరాల మీద ఆధారపడాల్సిన అవసరం ఉంటుందని ప్రకాష్ తెలిపారు. అతి తక్కువ సామర్థ్యంగల ఇంజన్ సహాయంతో పని చేస్తూ ఒకే ఒక మనిషి ఉపయోగించగల యంత్ర పరికరాలు రైతులకు అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. మొక్కల సాళ్ళ మధ్యలో అంతర సేద్యం, కలుపు నివారించగల పనిముట్లు, మొక్కలకు బోదెలు చేసే యంత్ర పరికరం, గడ్డి, కలుపును కోయడానికి అనువైన బ్రస్ కట్టర్, ఎక్కువ ఎత్తుగల మొక్కలకు ద్రావణాలు, కషాయాలు పిచికారి చేసే స్ప్రేయర్లు, అదే విధంగా బ్యాటరీతో నడిచే వివిధ రకాల స్ప్రేయర్లు, పండ్ల మొక్కలు నాడడానికి అవసరమైన గుంతలు తవ్వడానికి అవసరమైన యంత్ర పరికరం, వివిధ రకాల విత్తనాలను, నారును నాటే చిన్న పనిముట్లు మొదలైన వాటి పనితరాన్ని ప్రత్యక్షంగా యంత్ర పరికరాల రూపకర్త ప్రకాష్ తెలిపారు. రైతునేస్తం ఫౌండేషన్‌లో జరిగిన ప్రకృతి వ్యవసాయ అవగాహన సదస్సులోరైతులకు చూపించడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత, ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన కషాయాలు, ద్రావణాల తయారీ గురించి విపులంగా వివరించారు. అనంతరం ప్రాకృతిక రైతు ధర్మారం బాజీ రైతులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

చవితి ఉత్సవాలకు ముస్తాబు

- గ్రామాలకు ఉత్సవమూర్తుల విగ్రహాల తరలింపు
- పట్టణంలో చిరువ్యాపారుల సందడి



చవితి ఉత్సవాలకుసిద్ధమవుతున్న గణనాధులు

పొన్నూరు: వినాయక చవితి ఉత్సవాలకు పొన్నూరు పట్టణం, మండలంలోని ప్రజలు, వివిధ ఉత్సవ కమిటీ నాయకులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇప్పటికే గణనాధుని విగ్రహాలను ఆయా గ్రామాలకు, మండల కేంద్రాలకు తరలిస్తున్నారు. పండుగకు అవసరమైన సామాగ్రి, పూలు, పండ్లు, వివిధ రకాల పత్రి, కొనుగోలు చేసేందుకు ప్రజలు సమాయత్తం అవుతున్నారు. దీంతో పొన్నూరు పరిసర ప్రాంతాల్లో పండుగ సందడి నెలకొంది.

వినాయకచవితి పండుగను ఘనంగా నిర్వహించేందుకు ప్రజలు ఏర్పాట్లు పూర్తిచేస్తున్నారు. అయితే వినాయక చవితి పండుగను ఇళ్ళలో చేసుకోవటంకన్నా సామూహికంగా చేసుకోవటానికి వాడవాడలా, గ్రామగ్రామాన వినాయకుని విగ్రహాలు ఏర్పాటుచేసి ఉత్సవాలు చేసేందుకు యువకులు ఉత్సాహం చూపుతున్నారు. పట్టణంలోని పలు కూడలి ప్రాంతాల్లో వినాయకచవితి ఉత్సవాలను 3, 5, 7 రోజులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వినాయకచవితిని పురస్కరించుకుని పూజా సామాగ్రిని విక్రయించేందుకు వ్యాపారులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు.

పట్టణంలో వినాయక చవితిని పురస్కరించుకుని పలు కూడలి ప్రాంతాల్లో భారీ విగ్రహాల ఏర్పాట్లకు సిద్ధం చేశారు. మూడు అడుగుల విగ్రహం నుంచి పది అడుగుల విగ్రహాలను ట్రాక్టర్లు, ఆటోలలో తరలిస్తున్నారు. పట్టణంలో గణనాధుల కొనుగోళ్ళు పెరిగాయి. వినాయకునికి అందించే దర్భా, అరటి ఆకులు, తామరపువ్వులు, అరటికాయలు, తంగెడుపూలు, కలబంద గ్రామాల నుంచి తీసుకుని వచ్చి విక్రయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మందిరాలలో వినాయక ప్రతిమలను తరలించే పనుల్లో యువకులు బిజీబిజీగా ఉన్నారు. ఈ నెల 25 తేదీన శుక్రవారం నాటి పండుగ ఏర్పాట్లలో భాగంగా కావాల్సిన పూజా సామాగ్రిని కొనుగోలు చేసేందుకు ప్రజలు సమాయత్తం అవుతున్నారు.

పోలీసుల హెచ్చరిక

వినాయక ప్రతిమలు ఏర్పాటుచేసేవాళ్ళు అన్ని అనుమతులు ఉంటేనే ఏర్పాటుచేసుకోవాలి. పురవీధుల్లో అనుమతులు లేకుండా ఏర్పాటుచేసుకుంటే చర్యలు తప్పవని అర్బన్ సిఐ కె.కోటేశ్వరరావు తెలిపారు. అలాగే ఉత్సవాల పేరుతో వివాధాలకు కారణమయ్యేవారు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ వినాయకుని బొమ్మలు కాకుండా మట్టితో తయారుచేసిన వినాయకుల ప్రతిమలనే పూజించాలని పర్యావరణవేత్తలు ఇప్పటికే పలుమార్లు సూచించటం జరిగిందన్నారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విగ్రహాల ఏర్పాటులో పోలీసుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సిఐ కోటేశ్వరరావు నిర్వాహకులకు సూచించారు.

పెదనందిపాడు మండంలో....

పెదనందిపాడు: వినాయక చవితి పండుగ సమీపిస్తుండటంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. దీనిలో భాగంగా అన్ని గ్రామాల్లో భారీ ఎత్తున వీధులవారీగా ఉత్సవ కమిటీ సభ్యులు వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు ముమ్మర ప్రయత్నం చేస్తున్నారు. ం 5 నుండి 20 అడుగుల ఎత్తు వరకు రకరకాల విగ్రహాలను చేస్తున్నారు. ప్రస్తుతం గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నందున కమిటీ సభ్యులు ముందస్తు పందిళ్ళను ప్లాస్టిక్‌తో ఏర్పాటు చేస్తున్నారు. గ్రామాల్లో విగ్రహాలు కొనేందుకు దుకాణాల వద్దకు వెళ్ళి విగ్రహాలను ఎంపికచేసుకుని అడ్వాన్స్‌లు చెల్లిస్తున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది మండలంలోని 16 గ్రామాల్లో ప్రధాన కూడలి ప్రదేశాల్లో విగ్రహాలను ఏర్పాటుచేసేందుకు కమిటీవారు ముందుకు వస్తున్నారు. కొంతమంది విగ్రహాలను అందచేసేందుకు దాతలు ముందుకు రావటంతో కమిటీ వారు ఏర్పాటు చేసుకుంటున్నారు. నిమజ్జనం చేసేందుకు కూడా దూర ప్రాంతాలకు వెళ్ళి బాపట్ల సూర్యలంకలో విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు కమిటీ సభ్యులు నిర్ణయించుకున్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలకు 460 మంది హాజరు

ప్రత్తిపాడు: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ పరీక్షలు ప్రత్తిపాడు మండలంలో ప్రశాంతంగా జరిగాయి. మండల పరిధిలోని అన్ని గ్రామాలలో వున్న సాక్షర భారత్ కేంధ్రాలలో ఈ పరీక్షలను ఆదివారం నిర్వహించారు. ఈ పరీక్షలకు 460 మంది హాజరు అభ్యర్థులు హాజరయ్యారు. సాక్షర భారత్ కేంధ్రాల ద్వారా విద్యను నేర్చుకున్న వారితో పాటు మధ్యలో బడి మానేసిన 15 సంవత్సరాలు పై బడిన వారు ఈ పరీక్షలకు హాజరయ్యారు. మండలంలో జరిగిన ఈ పరీక్షలను మండల కో ఆర్డినేటర్ డబ్బూరి శ్రీనివాసరావు పర్యవేక్షించాడు.

పెదనందిపాడు మండలంలో....

పెదనందిపాడు: మండల పరిధిలోని 16 గ్రామాల్లో పంచాయతీ, సాక్షర భారతి కేంద్రాల వద్ద వయోజనులకు 15వ విడత సామర్థ్యపు పరీక్షలు ఆదివారం నిర్వహించారు. మండల పరిధిలోని వయోజనులు ఈ పరీక్షలకు 450 మంది హాజరైనట్లు మండల కోఆర్డినేటర్ పి.పేరేశ్వరరావు తెలిపారు. సి గ్రేడ్ సాధించిన వారు, డ్రాపౌట్స్, నూతన అక్షరాశ్యులకు పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. నాగులపాడు, వరగాని కేంద్రాలను రాష్ట్ర పరీక్షల జెఎస్‌ఎస్ డైరెక్టర్ పి.శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సాక్షర భారతి కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ అద్దె బస్సులపై పూర్తి పర్యవేక్షణ

కంచర్ల వెంకటేశ్వరావు, ఆర్టీసీ డీఎం, పొన్నూరు



పొన్నూరు: స్థానిక ఆర్టీసీ డిపోలో ఉన్న నాలుగు ప్రైవేటు అద్దె బస్సులను అధికారుల పూర్తి పర్యవేక్షణతో నడుపుతున్నామని స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ కంచర్ల వెంకటేశ్వరరావు ఆదివారం విలేకరులకు తెలిపారు. పొన్నూరు - గుంటూరు మధ్య రోజుకు ఆరు ట్రిప్పులు తెలుగు వెలుగు బస్సు సర్వీసులుగా తిరుగుతున్నాయన్నారు. ఈ బస్సులను ప్రతి రోజు వాషింగ్, స్వీపింగ్, డ్రైవర్ లైసెన్స్, డ్రైవర్ మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, కంట్రోలర్, మానిటరింగ్‌లో ఉన్న సీనియన్ సూపర్‌వైజర్ తనిఖీ చేసిన తర్వాత మాత్రమే బస్సులు నడుపుతున్నామని తెలిపారు. అద్దె బస్సులు పూర్తిగా తనిఖీ చేసిన తర్వాత మాత్రమే సర్వీసుకు ఇస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. అయితే పలు పత్రికల్లో బస్సులను తనిఖీ చేయటం లేదని వచ్చిన కథనాలలో వాస్తవం లేదని ఆయన పేర్కొన్నారు.

నేటితో ముగియనున్న అద్దంకమ్మ కొలుపులు

యడ్లపాడు : స్థానిక గ్రామదేవత అద్దంకమ్మ కొలుపులు సోమవారంతో ముగియనున్నాయి. నాలుగేళ్లకు ఒకసారి శ్రావణమాసంలో తొమ్మిది రోజులపాటు ఈ కొలుపులను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గ్రామంలో చద్దిని సేకరించి గ్రామదేవతలకు నైవేద్యంగా సమర్పించే కార్యక్రమం 8వ రోజైన ఆదివారంతో ముగిసింది. పోలేరమ్మ ఆలయం వద్ద నుంచి కుండలతో ఊరేగింపుగా గ్రామంలో తిరుగుతూ చద్దిని సేకరించి మూడు ఆలయాలలోని గ్రామదేవతలకు నైవేద్యంగా సమర్పించారు. ఆదివారం రాత్రి అద్దంకమ్మ తల్లి ఉత్సవ విగ్రహాన్ని పోలేరమ్మ ఆలయం నుంచి ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తీసుకువచ్చారు. తొమ్మిదో రోజైన సోమవారం గ్రామదేవతలకు పొంగళ్లను నైవేద్యంగా సమర్పించడం, ఊరేగింపు కార్యక్రమాలను పెద్దఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎనిమిది మంది జూదరుల అరెస్టు

పొన్నూరు: పట్టణంలోని పలుచోట్ల మట్కా జూదం ఆడుతున్న నిర్వాహకులపై దాడులు నిర్వహించి ఎనిమిది మందిని ఆదివారం స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్ సిఐ కోదాటి కోటేశ్వరరావు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 5,400 నగదు స్వాధీనం చేసుకున్నారు. ముద్దాయిలను సోమవారం స్థానిక కోర్టులో హాజరుపరచనున్నట్లు ఆయన తెలిపారు.

దళిత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

సత్తెనపల్లి: స్థానిక బాపిస్టు చర్చిలో ఆదివారం మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత ఎంప్లాయిస్ ప్రథమ సమావేశం ఎంప్లాయిస్ జిల్లా అధ్యక్షుడు బంకా వాసుబాబు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో వివిధ అంశాలపై చర్చించారు. సత్తెనపల్లి డివిజన్ పరిధిలో ఉద్యోగులను చైతన్యపరిచి సమస్యల పరిష్కారం దిశగా కృషి చేయటం జరుగుతుందని నాయకులు అన్నారు. సమావేశంలో కొయ్యలమూడి సుధాకర్, గుల్లా రామారావు, బాబూరావు, కొలకలూరి ప్రశాంత్, గార్లపాటి సునీల్, చొప్పర కమలాకర్, ప్రేమ్‌కుమార్, పేరేచర్ల నాగరాజు, విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు చిత్తశుద్ధితో పనిచేయాలి



చంద్రన్న బీమా పథకం చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రావణకుమార్

మేడికొండూరు: నిరుపేదలకు సేవలందిస్తున్న అంగన్‌వాడీలు మరింత చిత్తశుద్ధితో పనిచేయాలని తాడికొండ శాసనసభ్యులు తెనాలి శ్రావణకుమార్ చెప్పారు. ఫిరంగిపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మేడికొండూరు, ఫిరంగిపురం మండలాలలోని అంగన్‌వాడీ నిర్వాహకులతో మండలంలోని పేరేచర్లలో ఆదివారం జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. సమావేశానికి సీడీపీవో నూరాణి అధ్యక్షత వహించారు. సభలో ఎమ్మెల్యే శ్రావణకుమార్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడానికి అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు కృషి చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం నిరుపేదల కుటుంబాల సంక్షేమానికి, పౌష్టికాహారం అందించేందుకు అనేక కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు రాలేకపోతున్న 8, 9 నెలల గర్భిణులకు, బాలింతలకు హాట్ ప్యాకెట్‌లలో పౌష్టికాహారం అందజేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాల నిర్మాణానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందని తెలిపారు. అంతేకాకుండా అంగన్‌వాడీ కార్యకర్తలకు, సహాయకులకు పక్కా గృహాలు నిర్మించి ఇస్తామని, స్థలాలు లేని వారికి సంబంధిత గ్రామంలో స్థలాలు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు గుంటుపల్లి సాంబశివరావు, ఎంపీపీ మసీదు సలీమాబి, మాజీ ఎంపీపీ మొక్కల సుబ్బారావు, మాజీ జడ్పీటీసీ సభ్యులు పాములపాటి శివన్నారాయణ, ఫిరంగిపురం మండల టీడీపీ అధ్యక్షుడు డేగల ప్రభాకర్, మేడికొండూరు మండల టీడీపీ అధ్యక్షుడు మల్లిపెద్ది రమేష్, మాజీ అధ్యక్షుడు నార్నె శ్రీనివాసరావు, పేరేచర్ల సర్పంచ్ దేవరకొండ వెంకటస్వామి, నాయకులు షేక్ అబ్దుల్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ఆర్థిక కష్టాలు

సత్తెనపల్లి: అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీస్కూల్స్‌గా తీర్చిదిద్దుతాం. చిన్నారులకు కార్పొరేట్ విద్యతో పాటు మంచి పౌష్టికాహారం అందిస్తాం. అన్న అమృతహస్తం పథకం ద్వారా గర్భిణులు, బాలింతలకు బలవర్ధక ఆహారం అందిస్తామంటూ పాలకులు, అధికారులు ప్రకటనలు కురిపిస్తున్నారు. అయితే ముందుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలు తీర్చిన తర్వాత వాటికి కార్పొరేట్ హంగులు సమకూర్చాలని సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు.

నెలనెలా అందని వేతనాలు

సహజంగా ఎక్కువమంది ఉద్యోగులు ప్రతినెలా 5వ తేదీలోపు జీతాలు తీసుకొని ఇంటికి కావాల్సిన వస్తువులు కొనుక్కుంటారు. కానీ అంగన్‌వాడీల పరిస్థితి భిన్నంగా ఉంటుంది. ఇంటికి కావాల్సిన సరుకుల కోసంకాక అంగన్‌వాడీకేంద్రాలకు కావాల్సిన సరుకుల కోసం వీరు అప్పులు చేస్తున్నారు. జీతం 5, 6 నెలలకొకసారి వస్తుండటంతో ఆ జీతాలు తాము తెచ్చే అప్పులకు వడ్డీకి సరిపోవటంలేదని సిబ్బంది వాపోతున్నారు.

భారమౌతున్న నిర్వహణ

ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ కార్యకర్తలకు పెనుభారంగా మారుతుంది. భవనం అద్దె, కూరగాయలు, గ్యాస్ తదితరాల కోసం సిబ్బంది అప్పు చేయాల్సి వస్తుంది. అంగన్‌వాడీ కేంద్రాల అద్దె బకాయిలు సకాలంలో చెల్లించటంలేదు. బకాయిల చెల్లింపులకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతుంటారని అంగన్‌వాడీలు వాపోతున్నారు. నెలవారి చెల్లింపులు చేస్తే అంగన్‌వాడీ కేంద్రాలపై అధికారులకు పూర్తిస్థాయిలో పట్టు ఉంటుంది. కానీ బకాయిలు పేరుకుపోయి సిబ్బంది ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో చదువు శ్రద్ధగా చెప్పండి, పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయండి అని అధికారులు, సీడీపీవోలు అడగలేని స్థితిలో ఉన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు పౌష్టికాహారం పంపిణీ తో పాటు టీకాలు వేయటం, పల్స్ సర్వే, ఓటర్ల నమోదు తదితర బాధ్యతలు కూడా అప్పగిస్తూ తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అంగన్‌వాడీలు వాపోతున్నారు. దీనివల్ల కేంద్రాలకు పూర్తి న్యాయం చేయలేకపోతున్నామంటున్నారు.



అంగన్‌వాడీ కేంద్రం

రైతు ఆర్థిక భరోసాకు పశుసంపద దోహదం

భట్లూరు, గుజ్జర్లపూడి(సత్తెనపల్లిరూరల్): పాల ఉత్పత్తిదారుల సంక్షేమానికి కృషి చేస్తూ వారికి ప్రతి ఏటా బోనస్‌ను అందించటం గొప్ప విషయమని విజయ బ్యాంక్ మేనేజర్ (సత్తెనపల్లి) గుజ్జర్లపూడి విజయసారధి అన్నారు. మండలంలోని భట్లూరు, గుజ్జర్లపూడి గ్రామాల్లో శనివారం రాత్రి సంగం డెయిరీ పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన విజయసారధి మాట్లాడుతూ రైతులు బోనస్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశు సంపదను పెంపొందించుకుంటే పంటలు లేని కాలంలో కుటుంబానికి పాడి ఆర్థిక భరోసా ఇస్తుందన్నారు. అనంతరం రెండు గ్రామాల్లో పాల ఉత్పత్తిదారులకు విజయసారధి బోనస్‌ను పంపిణీ చేశారు. భట్లూరులో 64 మంది రైతులకు 90 వేల రూపాయలు బోనస్‌ను పంపిణీ చేయగా మందడపు సాంబశివరావు అత్యధికంగా 5,450 రూపాయలు బోనస్ అందుకున్నట్లు సంగం డెయిరీ డైరెక్టర్ పోపూరి కృష్ణారావు చెప్పారు. గుజ్జర్లపూడిలో 70 మంది రైతులకు లక్షా 40 వేల రూపాయలు బోనస్ పంపిణీ చేయగా పుట్టా చలమయ్య అత్యధికంగా 12,400 రూపాయల బోనస్‌ను అందుకున్నారన్నారు. అనంతరం బ్యాంక్ మేనేజర్ విజయసారధిని, ఇటీవల బదిలీపై వెళ్ళిన పంచాయతీ కార్యదర్శి కాశిమాల రాజేష్‌లను గ్రామ రైతులు పూలదండలు, దుశ్శాలువలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో రెంటపాళ్ళ బిఎంసి ఇన్‌ఛార్జ్ రామకృష్ణ, సూపర్‌వైజర్ గోపి, పశువుల డాక్టర్ మోహిద్దీన్, సర్పంచ్‌లు మందడపు అనసూర్యమ్మ, పుట్టా శివపార్వతి, గ్రామ టిడిపి అధ్యక్షుడు ఈదర రామారావు, టిడిపి నాయకులు జవ్వాజి వెంకట రమణారావు, గండు నా రాయణ, మందడపు సుబ్బారావు, నెల్లూరి శ్రీనివాసరావు, పాల ఉత్పత్తిదారులు, రైతులు పాల్గొన్నారు.



విజయ బ్యాంక్ మేనేజర్ విజయసారధిని సన్మానిస్తున్న పోపూరి కృష్ణారావు, గ్రామస్తులు

శ్రీలక్ష్మీ ఆచూకీ కోసం గాలింపు

సత్తెనపల్లి: పట్టణంలోని కూరగాయల మార్కెట్ ప్రాంతంలో నివసిస్తూ బుధవారం ఇంటి నుంచి వెళ్ళిపోయిన ఆర్ శ్రీలక్ష్మి కోసం కుటుంబసభ్యులు, పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. శ్రీలక్ష్మి ఇంటినుంచి వెళ్ళేటప్పుడు డబ్బులు కూడా తీసుకెళ్ళలేదని కుటుంబసభ్యులు చెబుతున్నారు. సీఐ సాంబశివరావు ఆధ్వర్యంలో పోలీసులు శ్రీ లక్ష్మీ ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు.

కూరగాయల ధరలు

టమాటా - 50, వంకాయ-30, బెండకాయ - 18, బీరకాయ - 20, 22, కాకరకాయ - 24, 29, పచ్చిమిర్చి - 28, క్యారెట్ - 52, క్యాబేజి- 18, గోరుచిక్కుడు - 20, దోసకాయ - 16, పొట్లకాయ - 15, క్యాలీఫ్లవర్ - 30, బంగాళదుంప - 16, బీట్‌రూట్ - 27, కీరదోస - 23, క్యాప్సికం -52, బీన్స్ - 62, చిక్కుడుకాయ - 34,చామదుంప - 26, దొండకాయ - 12, 26, ఉల్లిగడ్డలు - 21, అరటికాయ - 5, 6, మునగకాయ - 6, 7, ఆకుకూరలు కట్ట - 5 రూపాయలు

ఎస్సీ, ఎస్టీ కాంట్రాక్టర్లకు అమలుకాని 15 శాతం పనులు

సత్తెనపల్లి: ఎస్సీ, ఎస్టీలకు విద్య, ఉద్యోగ రంగాలతోపాటు ప్రైవేటు రంగంలోను రిజర్వేషన్ కల్పించి ఆర్థిక భరోసా కల్పిస్తానని చెబుతున్న ప్రభుత్వం క్షేత్రస్థాయిలో అమలుకావటంలేదు. తద్వారా ఎంతోమంది ఎస్సీ, ఎస్టీలు ఉన్నత చదువులు చదువుకొని ఉపాధిలేక అల్లాడుతున్నారు. పురపాలక సంఘంలో ఎస్సీ, ఎస్టీ కాంట్రాక్టర్లకు 15 శాతం పనులు కల్పించాలని నిబంధన ఉన్నప్పటికీ అది అమలుకావటంలేదు. పట్టణంలో 60 వేల జనాభా ఉన్నారు. వీరిలో 20 శాతం ఎస్సీ, ఎస్టీలు ఉన్నారు. పట్టణంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ పనుల్లో ఎస్సీ, ఎస్టీలకు నామమాత్రంగానే కాంట్రాక్ట్ పనులు మంజూరవుతున్నాయి. పురపాలక సంఘ పరిధిలో ఎస్సీ, ఎస్టీలకు 15 శాతం కాంట్రాక్ట్ పనులను కేటాయించాలని ప్రభుత్వం 1990 సెప్టెంబర్ 5న జీవో ఎంఎస్ నెంబర్- 398, 477 ను జారీ చేసింది. ఈ జీవోల ప్రకారం ప్రతి క్వార్టర్‌కు వచ్చే కాంట్రాక్ట్ పనుల్లో విధిగా ఎస్సీ, ఎస్టీలకు 15 శాతం పనులను కేటాయించాలి. ఇందుకు సంబంధించి నోటిఫికేషన్‌లోని ఎస్సీ, ఎస్టీ కాంట్రాక్టర్లకు పనుల వివరాలను కూడా పొందుపరచాల్సి ఉంది. ఇకనైనా సంబంధిత అధికారులు ఎస్సీ, ఎస్టీలకు 15 శాతం కాంట్రాక్ట్ పనులు కేటాయించాలని పలువురు కోరుతున్నారు.

సినిమా గైడ్

శ్రీలక్ష్మి టాకీస్	నేనే రాజు నేనే మంత్రి
ఈశ్వరసాయి	ఆనందో బ్రహ్మ
సాయికృష్ణ	జయ జానకి నాయక
నాజ్(పేరేచర్ల)	నేనే రాజు నేనే మంత్రి

ఆఫీసర్స్ వాయిస్

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

రూరల్ ఎస్ఐ నజీర్ బేగ్



సత్తెనపల్లిరూరల్: ఈ నెల 25వ తేదీ వినాయక చవితి పండుగ సందర్భంగా మండలంలోని అన్ని గ్రా మాల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా పోలీసుశాఖ అనుమతి తీసుకోవాలని రూరల్ ఎస్ఐ నజీర్‌బేగ్ ఆదివారం తెలిపారు. మండపాల ఏర్పాటు, మైక్ ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి ఉండాలన్నారు. అనుమతి పొందకుండా ఎవరైనా మండపాలు ఏర్పాటుచేస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయన్నారు.



ప్రయాణికుల సౌకర్యం కోసమే వనితా కార్డులు: డీవో

రేపల్లె: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రయాణికులకు సౌకర్యంగా ఉండేందుకు ఏపీఎస్ ఆర్టీసీ వనితా కార్డులను ప్రవేశపెట్టిందని డివిజనల్ అధికారిణి వాణిశ్రీ తెలిపారు. ఆదివారం పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి వనితా కార్డులను ఆమె అందించారు. వనితా కార్డులు పొందిన వారికి రాయితీ, ప్రమాద బీమా సౌకర్యం ఉందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మించారు.. వదిలేశారు...

● 23 లక్షలతో నిర్మించిన వంతెన నిష్ప్రయోజనం ● ఇబ్బందుల్లో రైతులు



కోతలకు గురై అభివృద్ధికి నోచుకోని వంతెన



నిజాంపట్నం: పల్లపట్ల వామనమూర్తి డ్రెయిన్‌పై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరి నిష్ప్రయోజనంగా మిగిలింది. ఎంతోకాలం ఇబ్బందులు పడి డ్రెయిన్ దాటడంలో ప్రమాదవశాత్తూ ప్రాణాలు కోల్పోయిన సంఘటనలూ ఉన్నాయి. 2006లో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో 23 లక్షల నిధులతో ఆర్భాటంగా శంకుస్థాపనలు చేశారు. ఎట్టకేలకు నాసిరకపు నిర్మాణ పనులతో 2008లో అసంపూర్తిగా నిర్మించి చేతులు దులుపుకున్నారు. అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు, గుత్తేదారులు అందినంత ఎవరికి వారు సొమ్ము చేసుకున్నారే తప్ప వంతెన ఏవిధంగా ఉపయోగపడుతుందని ఆలోచించిన నాధుడే లేడు. వంతెన ముఖద్వారాల వద్ద రివిట్‌మెంట్ వేయకపోవడంతో కోతలకు గురైంది. వంతెనకు సైడ్‌వాల్స్, అప్రోచ్ మెంట్‌లు నిర్మించకపోవటంతో కాలినడకకే తప్ప ఫలితం శూన్యం. నగరం, నిజాంపట్నం మండలాలను అనుసంధానం చేస్తూ వారధిగా ఉన్న వంతెన గురించి ఎవరూ ఎందుకు పట్టించుకోవటం లేదోనన్న ఆలోచన ప్రశ్నగానే మిగిలిపోయింది. వంతెనకు ఇరువైపులా రహదారి మార్గం ఉన్నా అభివృద్ధి చేయటంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. రహదారి మార్గాన్ని అభివృద్ధి చేస్తే ఇతర మండలాల నుంచి నిజాంపట్నం, రేపల్లె పట్టణాలకు చేరుకోవటానికి 8 కి.మీ దూరం తగ్గుతుంది. నిజాంపట్నం మండలం పల్లపట్ల పరిసర గ్రామాల్లోని పంట దిగుబడులను నగరం మండలం పరిసర గ్రామాలకు చేర్చుకోవటానికి, నగరం మండలం రెవిన్యూలో ఉన్న భూముల పంట దిగుబడులను పల్లపట్ల పరిసర గ్రామాలకు తరలించుకోవటానికి రైతులకు పెనుభారంగా ఉంది. ప్రస్తుతం ఖరీఫ్ సాగుచేసుకునేందుకు కూలీలను, ఎరువులను తరలించటం ఆర్థిక, శ్రమ, వ్యవప్రయాసలతో కూడుకుంది.

ఈ రహదారితో ప్రయోజనం: యల్లావుల మల్లేశ్వరరావు



వామనమూర్తి డ్రెయిన్‌పై పల్లపట్ల గ్రామ సమీపంలో నిర్మించిన వంతెన బాగా ప్రయోజనకంగా ఉపయోపడుతుంది. దిగుబడులను రవాణా చేసుకోవటానికి దగ్గర మార్గం కావటంతో ఇతర మండలాలకు ప్రయాణం చేయటం సులభతరమవుతుంది. వంతెన మార్గం ద్వారా నగరం మండలాన్ని అనుసంధానం చేస్తూ 400 మీటర్ల రహదారిని అభివృద్ధి చేస్తే రైతుల కష్టాలు తీరుతాయి.



పగుళ్ళిచ్చిన వంతెన

సమస్య ఎక్కడంటే..

వంతెన దిగువన ఉన్న మాగాణి భూమిలో 400 మీటర్లు ఒక రైతుది. దానిని కొనుగోలు చేసేందుకు ఎవరూ సహకరించకపోవటంతో సమీప రైతులు చెప్పిన ధరకు కొనుగోలు చేయటం కష్ట సాధ్యంగా ఉంది. స్థానిక ప్రజాప్రతినిధులు, ఇరు మండలాల గ్రామ సర్పంచ్‌లు, పెద్దలు, అధికారులు సమస్యను విశ్లేషించి వంతెన రహదారి అభివృద్ధి కృషి చేయాలని రైతులు వేడుకుంటున్నారు.



కబడ్డీ ఆడుతున్న కమిషనర్ మారుతీ దివాకర్

క్రీడలతో ఆరోగ్యం పదిలం: తాడివాక

రేపల్లె: విద్యార్థి దశలో చదువుతోపాటు వ్యాయామం కూడా ఆరోగ్యానికి దోహదపడుతుందని ఛైర్మన్ తాడివాక శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్‌లో హ్యాపీ సండే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు హ్యాపీ సండే ద్వారా విశ్రాంతి, వ్యాయామం చేకూరుతుందన్నారు. విద్యలో రాణిస్తూ క్రీడల్లో ప్రతిభ చూపి రేపల్లె ప్రాంత కీర్తిని చాటాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ మారుతీదివాకర్, హెచ్ఎం సంధ్యారాణి, ఆర్టీసీ డివిజనల్ అధికారిణి వాణిశ్రీ, కౌన్సిలర్ దేవగిరి రంగారావు, బచ్చు హనుమంతరావు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్ఐవోఎస్ పరీక్ష



చెరుకుపల్లి: 15వ సాక్షర భారత్ కార్యక్రమం ద్వారా అక్షరాస్యులైన వారికి ఆదివారం ఎన్ఐవోఎస్ పరీక్ష నిర్వహించినట్లు సాక్షర భారత్ మండల కోఆర్డినేటర్ పులిగడ్డ వెంకట శివ ప్రసాద్ తెలిపారు. వయోజనులైన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సాక్షర భారత్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. మండలంలో 13 కేంద్రాల్లో 570 మంది పరీక్షలకు హాజరైనట్లు ఆయన తెలిపారు.

మిగిలిన కేంద్రాలలో కోఆర్డినేటర్ల కొరత కారణంగా ఎన్ఐవోఎస్ పరీక్ష నిర్వహించలేదని తెలిపారు.

గ్రామ దేవతలకు శ్రావణమాస పూజలు



అద్దేపల్లి ఆడెమ్మతల్లి దేవాలయానికి ఊరేగింపుగా వెళుతున్న పద్మశాలీయ సంఘీయులు

భట్టిప్రోలు: మండలంలోని గ్రామ దేవతలకు శ్రావణమాసం ఆదివారాన్ని పురస్కరించుకుని కుంకుమ పూజలు నిర్వహించి పొంగళ్ళు, నైవేద్యాలు సమర్పించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆదివారం ఉదయం కనకతప్పెట్లు, మంగళ వాయిద్యాలతో గులామ్‌లు చల్లుకుంటూ ఆనందోత్సాహాలతో గ్రామదేవతల దేవాలయాలకు చేరుకున్నారు. అద్దేపల్లి గ్రామదేవత ఆడెమ్మ తల్లి దేవస్థానానికి పద్మశాలీయ సంఘీయుల ఆధ్వర్యంలో ప్రజలు తరలివెళ్ళారు. స్థానిక కొత్తపేటలోని వడ్డెర సంఘం ఆధ్వర్యంలో గ్రామదేవత దండిపార్వతమ్మ దేవాలయానికి భారీ ఊరేగింపుగా వెళ్లారు. అదేవిధంగా మండలంలోని ఐలవరం గ్రామదేవత పైడమ్మతల్లి దేవస్థానంకు పద్మశాలీయ సంఘీయుల ఆధ్వర్యంలో భారీగా భక్తులు తరలివెళ్ళి మొక్కుబడులు తీర్చుకుని శ్రావణ మాస పూజలు నిర్వహించారు.

ఇసుకపల్లిలో...

రేపల్లె: ఇసుకపల్లిలోని వేపాళమ్మ తల్లి తిరునాళ్ళ మహోత్సవాన్ని ఆయా వార్డుల సభ్యులు అత్యంత కోలాహలంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయాన్నే పూత కార్యక్రమం నిర్వహించి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పోతురాజు ఉత్సవం నిర్వహిస్తూ గ్రామంలో ఊరేగింపు చేశారు. గ్రామంలోని భక్తులు అమ్మవారికి పొంగళ్లు నైవేద్యం సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు.

అదేవిధంగా గ్రామదేవత బూరగలమ్మ తల్లి ఆలయంలో శ్రావణమాసం ఆదివారాన్ని పురస్కరించుకుని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అర్చనలు చేశారు.

పేటేరులో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

రేపల్లె: మండలంలోని పేటేరు గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆదివారం ఇంటిలిజెన్స్ ఎస్ఐ కనపర్తి కోటేశ్వరరావు, విశ్రాంత ఎంఈవో భూపతి ధర్మారావులు ఆవిష్కరించారు. భారతజాతికి రాజ్యాంగం ద్వారా దిశ, నిర్ధేశం కల్పించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని కొనియాడారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహానికి యూత్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కార్యక్రమంలో సెన్సార్‌బోర్డు సభ్యులు దిలీప్ రాజా, సర్పంచ్ గోలినాంచారమ్మ పాల్గొన్నారు.



పేటేరులో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఇంటిలిజెన్స్ ఎస్ఐ కనపర్తి కోటేశ్వరరావు, విశ్రాంత ఎంఈవో ధర్మారావు


గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కనపర్తి చిట్టిబాబు

రేపల్లె: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం అర్ధరాత్రి పట్టణంలోని ఎంసీఏ హాలు రోడ్డులో చోటు చేసుకుంది. ఎస్ఐ రవీంద్రారెడ్డి వివరాల మేరకు ఉప్పూడి గ్రామానికి చెందిన కనపర్తి చిట్టిబాబు(41) రోడ్డుపై వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందినట్లు తెలిపారు. ఇతను పెనుమూడి శివాలయం నైట్‌వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడని తెలిపారు. అతని సోదరుడు కనపర్తి అబ్రహం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.

చేనేత సొసైటీ వ్యవస్థాపక మేనేజర్ మృతి



భట్టిప్రోలు: సీనియర్ కమ్యూనిస్ట్ నాయకుడు, చేనేత సొసైటీ వ్యవస్థాపక మేనేజర్ డోగుపర్తి పిచ్చియ్య(75) అనారోగ్యంతో మృతి చెందారు. 1974 మే 31న ది రైలుపేట చేనేత సహకార సంఘం మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన పిచ్చియ్య ఎన్నో ఒడి దుడుకులను ఎదుర్కొని కార్మికులకు ఉపాధిని కల్పించేందుకు ఎంతో కృషి చేశారు. గతంలో కమ్యూనిస్ట్ నాయకుడుగా ప్రజా సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాల్లో పాల్గొన్నారు. ఈయన మృతిపట్ల పలువురు చేనేత నాయకులు, కార్మికులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు.

అంబేద్కర్ విగ్రహానికి వైసీపీ నాయకుల క్షీరాభిషేకం

భట్టిప్రోలు: రాష్ట్ర మంత్రి ఆదినారాయణరెడ్డి దళితులపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మండలంలోని కోళ్ళపాలెం గ్రామంలో వైసీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలియచేశారు. మండలంలోని పెద పులివర్రు పంచాయతీ శివారు కోళ్ళపాలెంలోని అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నివాళులర్పించారు. దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి ఆదినారాయణరెడ్డిపై కఠినచర్యలు తీసుకోవాలని మంత్రి పదవిని నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు నీలా నాగరాజు, జల్లి సాల్మన్, నీలా చంటి, నీలా రాకేష్, పున్నారావు, మేడికొండ నాగేంద్రం గాలి యేసేబు, మాణిక్యారావు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి ఘననివాళి



సత్తెనపల్లి : పట్టణంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఆదివారం స్వర్గీయ రాజీవ్‌గాంధీ జయంతిని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి జ్ఞానరాజ్‌పాల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నేతలు చాంద్‌బాషా, కొత్త లక్ష్మయ్య, రేగళ్ళ కోటిస్వామి, బగ్గి నరసింహారావు, మార్కెట్ బాబు, సందెపోగు గాంధీ, చెంచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తుదిదశలో వైద్యశాల భవన నిర్మాణ పనులు



సత్తెనపల్లి : పట్టణంలోని కమ్యూనిటీ వైద్యశాలలో 4 కోట్ల రూపాయల నిధులతో జరుగుతున్న నూతన భవన నిర్మాణపు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. పనుల్లో భాగంగా ఆసుపత్రి నూతన గేట్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నారు. దసరా నాటికి ఆసుపత్రి నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రారంభించనున్నట్లు ఆసుపత్రి వర్గాల ద్వారా తెలిసింది.

చురుగ్గా వెలుగు కార్యాలయ నిర్మాణ పనులు



ముప్పాళ్ళ: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో వెలుగు కార్యాలయ నిర్మాణపు పనులు కొనసాగుతున్నాయి. 32 లక్షల రూపాయలతో చేపట్టిన వెలుగు కార్యాలయ నిర్మాణపు పనులు ప్రస్తుతం బేస్‌మెంట్ లెవల్ పూర్తయింది. 7 నెలల క్రితం సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు భూమిపూజ చేశారు. అనంతరం కొద్ది రోజుల పాటు నిర్మాణపు పనులను చేపట్టగా, అనంతరం కొన్ని కారణాల చేత పనులను నిలిపివేశారు. ఇదే విషయాన్ని సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు దృష్టికి తీసుకురావటంతో సమస్యను అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. దీంతో కార్యాలయ నిర్మాణపు పనులు రెండు రోజులుగా జరుగుతున్నాయి.

శివాలయంలో శాంతి కల్యాణం

పిడుగురాళ్లటౌన్: పట్టణంలోని శివాలయంలో మాస శివరాత్రి సందర్భంగా ఆదివారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు, శాంతి కల్యాణం జరిగాయి. ఉదయం స్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, నక్షత్ర హారతులు, నందీశ్వర, ద్వారపాలకుల, మకరకాళీసమేత వీరభద్రుడికి ప్రత్యేక పూజలు, గోపూజ, ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం శివపార్వతులకు దేవస్థాన అర్చకులు శాంతి కల్యాణం నిర్వహించారు.

ఆహ్లాదకరంగా ఆనంద ఆదివారం

సత్తెనపల్లి: ప్రజలంతా వారంలో ఒక రోజు అయినా సంతోషంగా ఉండేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో ప్రభుత్వం ఆనంద ఆదివారం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని మున్సిపల్ చైర్మన్ యెల్లినేడి రామస్వామి అన్నారు. పట్టణంలోని భవిరిశెట్టివారి వీధిలో ఆదివారం ఆనంద ఆదివారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారంలో ఆరురోజులు కష్టపడ్డ ప్రజలు, ఉద్యోగులు 7వ రోజు సుఖ సంతోషాలతో ఉండాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన పలువురు విద్యార్థులు, యువతీ, యువకులు కబడ్డీ, షటిల్, కుర్చీ ఆటలు తదితర ఆటలను ఉత్సాహంగా ఆడారు. మున్సిపల్ సిబ్బంది, అధికారులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. పట్టణానికి చెందిన పలువురు చిన్నారులు ఆనందంతో నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలకు ఆర్వో రంగారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, అకౌంటెంట్ ప్రసాద్‌లు బహుమతులు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఆర్వో రంగారావు, ఆర్ఐ రాంప్రసాద్, టీపీవో వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు చౌటా శ్రీనివాసరావు, బాబులమ్మ, నాయకులు రెడ్డి శ్రీనివాస్, ఎన్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ యెల్లినేడి రామస్వామి





పట్టణంలోని భవిరిశెట్టి వారివీధిలో ఆనంద ఆదివారంలో భాగంగా జరిగిన కార్యక్రమంలో నృత్యాలు చేస్తున్న చిన్నారులు, కబడ్డీ ఆడుతున్న చిన్నారులు

ప్రజావాణిని వినియోగించుకోవాలి

ముప్పాళ్ళ: స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని తహసీల్దార్ జి సుజాత ఆదివారం తెలిపారు. మండలంలోని ప్రజలు సమస్యలు ఏమైనా ఉంటే తహసీల్దార్ కార్యాలయంలో జరిగే ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తు చేయాలని కోరారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు ప్రజావాణిలో పాల్గొంటారని సమస్యలను పరిశీలించి వెంటనే పరిష్కరించటం జరుగుతుందన్నారు.

నేడు పంచాయతీ కార్యదర్శుల సమావేశం

ముప్పాళ్ళ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించనున్నట్లు ఈవోపీఆర్‌డీ ఏవీవీ కుమారి ఆదివారం తెలిపారు. సమావేశంలో గ్రామాలలో నెలకొని ఉన్న సమస్యలు, మంచినీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణపై చర్చించటం జరుగుతుందని , అన్ని గ్రామాల కార్యదర్శులు పాల్గొనాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ముప్పాళ్ళ: మండలంలోని మాదల మహేశ్వరి డెయిరీ వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనటంతో ఇద్దరికి గాయాలైన సంఘటన ఆదివారం జరిగింది. సత్తెనపల్లికి చెందిన తేనేటి మధుచంద్రిక వెంకటేశ్వర్లు నరసరావుపేట నుంచి సత్తెనపల్లి వస్తుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నారు. ఈ ఘటనలో మధుచంద్రిక, వెంకటేశ్వర్లుకు గాయాలయ్యా యి. వీరిని సత్తెనపల్లిలోని వైద్యశాలకు తరలించారు. ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భుజంగరావు తెలిపారు.

జూదరుల అరెస్టు

ముప్పాళ్ళలో అచ్చు, బొమ్మ ఆడుతున్న 20 సంవత్సరాలలోపు యువకులు ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ భుజంగరావు ఆదివారం తెలిపారు. ముప్పాళ్ళ ప్రభుత్వ వైద్యశాల వెనుక అచ్చుబొమ్మ ఆడుతున్నవారిని దాడిచేసి పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి 9,500 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

బాధిత కుటుంబానికి చంద్రన్న బీమా అందజేత



సత్తెనపల్లిరూరల్ : మండలంలోని నందిగామలో అనారోగ్యంతో మృతిచెందిన తొరటి వెంకటేశ్వర్లు కుటుంబసభ్యులకు ఆదివారం చంద్రన్న బీమా ఆర్థిక సహాయం అందజేశారు. మృతుని భార్య సామ్రాజ్యంకు రూ.5 వేలను గ్రామ టిడిపి నేత చెంబేటి బొల్లయ్య అందించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు గద్దె అనురాధ ఉన్నారు.

ఘనంగా అమ్మవారి బోనాలు

మాచర్ల రూరల్: వర్షాలు సమృద్ధిగా కు రిసి పాడిపంటలతో ఆనందంగా ఉండేలా చూడమని వేడుకుంటూ పట్టణంలోని పోలేరమ్మ, చౌడేశ్వరి అమ్మవార్లకు పుర ప్రజలు బోనాలు సమర్పించారు. మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ మహిళలు పెద్ద ఎత్తున బోనాలను తలపై ధరించి ఆలయాలకు ఊరేగింపుగా వచ్చారు. పలు సామాజిక వర్గాలకు చెందిన మహిళలు పోలేరమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించగా యాద వ సంఘ ఆధ్వర్యంలో చౌడేశ్వరి అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు జరిపారు.

కంచరగుంట గ్రామంలో...

కంచరగుంట (దుర్గి): కంచరగుంట గ్రామంలో ఆదివారం పోలేరమ్మ జాతర వార్షిక మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్య నివేదనలు సమర్పించారు.

90 శాతం వరినాట్లు పూర్తి

ఏవో వెంకటనరసయ్య



పినపాడులో వరి నాట్లు వేస్తున్న కూలీలు

తెనాలి రూరల్ : ఖరీఫ్ సాగులో భాగంగా మండలంలో 90 శాతం వరి నాట్లు పూర్తి అయినట్లు మండల వ్యవసాయాధికారి పి.వెంకటనరసయ్య తెలిపారు. మండలంలో 8543 హెక్టార్లలో వరి సాగు చేయాల్సి ఉండగా, ఇప్పటికే వెద పద్ధతిలో 3200, సాధారణ పద్ధతిలో 4800 హెక్టార్లలో వరి నాట్లు పూర్తి అయ్యాయని అన్నారు. ఇంకా సుమారు 800 హెక్టార్లలో వరి నాట్లు వేయాల్సి ఉందని, వారంలోగా అన్ని పూర్తి అవుతాయని వివరించారు. వెద పద్ధతిలో వరి నాట్లు వేసిన వారు భూమిలో తేమ ఉండే విధంగా చూసుకోవాలని సూచించారు. పొలాలలో ఎలుకల ఎద్దడిని నివారించేందుకు రైతులకు వ్యవసాయ శాఖ బ్రోమోడైలిన్ మందును పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వరినాట్లు వేయడం పూర్తి అయిన వారు గట్లను శుభ్రంగా, కలుపు పెరగకుండా చూసుకోవాలని సూచించారు. ఈ ఏడాది నుంచి ఈ పాస్ విధానం ద్వారా ఎరువుల అమ్మకాలు జరుగుతాయని, ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు. అడపదడపా వర్షాలు పడటం, పట్టిసీమ ద్వారా డెల్టా ప్రాంతానికి సాగు నీరు రావడంతో వరి నాట్లు ఊపందుకున్నాయని వివరించారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



ఆర్టీసీ డిపోలో పర్యటిస్తున్న నేతలు

తెనాలి క్రైం: కార్మికుల సమస్యలు తెలుసుకునేందుకు కృషి చేస్తున్నట్లు ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ అడిషనల్ జనరల్ సెక్రటరీ దామోదర్ పేర్కొన్నారు. సంఘ నేతలు ఆదివారం తెనాలి డిపోను సందర్శించారు. కార్మికుల సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు. డిపోల్లో ఉద్యోగులు, కార్మికులకు కార్యాలయంలో కనీస వసతుల కల్పన, ఉన్నతాధికారుల ఒత్తిళ్లపై ఆరా తీశారు. కార్యక్రమంలో జోనల్ చైర్మన్ ఎన్‌వీ కృష్ణారావు, రీజనల్ సెక్రటరీ సీహెచ్ సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేష్‌ఖన్నా, జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ పి.యలమంద, డిపో అధ్యక్షుడు టి.బాబురావు, కార్యదర్శి విజయబాబు పాల్గొన్నారు.

స్వచ్ఛరైల్, స్వచ్ఛభారత్ కొనసాగించాలి



శుభ్రపరుస్తున్న బాపట్ల ఏడీఎన్ ప్రకాష్ ప్రజాపత్

తెనాలి క్రైం : స్వచ్ఛరైల్, స్వచ్ఛభారత్ స్ఫూర్తిని కొనసాగించాలని బాపట్ల ఏడీఎన్ ప్రకాష్ ప్రజాపత్ పిలుపునిచ్చారు. ఆదివారం రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన స్వచ్ఛభారత్‌కి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ప్లాట్‌ఫాంలు, వాటర్ ట్యాంకు, రైల్వే ట్రాక్ ఎప్రాన్ పైభాగం తదితర ప్రాంతాల్లో పరిశుభ్రత చేపట్టారు. రైల్వేలో పరిశుభ్రతకు పెద్ద పీట వేస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్లాట్‌ఫాంలను సుందరంగా ఉంచేం దుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఉద్యోగులు, సిబ్బంది స్వచ్ఛరైల్వే, స్వచ్ఛభారత్ నినాదాన్ని అంకితభావంతో ఆచరించాలని సూచించారు. ప్రయాణికులు రైళ్లలో ప్రయాణించేటప్పుడు తిను బండారాలు, ప్లాస్టిక్ వస్తువులను వదలరాదని నిర్దేశించిన డస్ట్‌బిన్‌లలో వేయా లని కోరారు. కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ షేక్ అబ్దుల్ హక్, సూపర్ వైజర్లు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా సాధనకు అఖిల పక్షం

తెనాలి అర్బన్ : రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించేందుకు సీఎం అఖిలపక్షాన్ని ఏర్పాటు చేయాలని డీసీసీ అధికార ప్రతినిధి ఎం.దశరధ రామిరెడ్డి కోరారు. ప్రస్తుతం ప్రత్యేక హోదా కలిగి ఉన్న 11 రాష్ట్రాలకు కేంద్రం 27 వేల 413 కోట్ల విలువైన రాయితీలను ఇస్తున్న దృష్ట్యా మన రాష్ట్రానికి కూడా హోదా సాధించేందుకు అఖిల పక్షాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. 2017 మార్చి నాటికి ప్రత్యేక హోదా ఎత్తి వేస్తున్నామని 2017లో లోక్‌సభలో ప్రకటించారని, కానీ, మరో పదేళ్ల రాయితీలు కల్పించే నిర్ణయం తీసుకున్న దృష్ట్యా హోదా సాధనకు కృషి చేయాలన్నారు.

చిరంజీవి అభిమానుల రక్తదానం



రక్తదానం చేస్తున్న చిరంజీవి అభిమానులు

తెనాలి రూరల్ : మెగా స్టార్, పద్మశ్రీ చిరంజీవి జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకుని అఖిల భారత చిరంజీవి అభిమాన సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. స్థానిక రజక చెరువు వద్ద గల పురపాలక ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పలువురు చిరంజీవి అభిమానులు రక్తదానం చేశారు. కార్యక్రమాన్ని తోటకూర రమణరావు, గ్యాలం వేణు, వల్లెం మురళి పర్యవేక్షించారు. అభిమానులు కాలేషా, రఫీ, పెసర్లంక రమణ, బెల్లపు యశ్వంత్, శంకర్, కోటి, శివమణి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఆదినారాయణరెడ్డి బర్తరఫ్‌కు డిమాండ్



మంత్రి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నేతలు

తెనాలి క్రైం : దళితుల పట్ల అమర్యాద వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర మంత్రి ఆదినారాయణరెడ్డిని ఆ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని పలు ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఐసా విద్యార్థులు, రివల్యూషనరీ యూత్ అసోసియేషన్, సీపీఎంఎల్ లిబరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక లిబరేషన్ కార్యాలయం నుంచి గాంధీ చౌక్ వరకు మంత్రి దిష్టిబొమ్మను ఊరేగించారు. కాళ్లతో కొడుతూ మరోమారు ఇటువంటి వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సభ్య సమాజం తలదించుకునేలా మంత్రి మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు లోకం భాస్కరరావు, ఆర్.బెన్‌హర్, కంచర్ల ప్రవీణ్, విజయ్, సుధీర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

29న 'అగ్రి' బాధితుల చైతన్యయాత్ర రాక



చైతన్యయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అగస్టీన్

తెనాలి అర్బన్ : అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలని బాధిత సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కేతినేని అగస్టీన్ కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా అగ్రిగోల్డ్ బాధితులు చైతన్య యాత్రలను ఈ నెల 16న ఇచ్ఛాపురంలో ప్రారంభించారని తెలిపారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో చైతన్య యాత్రల పోస్టర్లను ఆవిష్కరించారు. డిపాజిటర్లకు అన్యాయం చేసిన కీలకమైన డైరెక్టర్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. డివిజన్ అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం స్థానం ఆదేశాలు ఇచ్చినా ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టడంలో విఫలమైందన్నారు. సమస్య తీవ్రతను ప్రభుత్వానికి, కోర్టు దృష్టికి తీసుకువెళ్లేందుకు చైతన్య యాత్రలు చేపట్టాల్సి వచ్చిందన్నారు. ఈ నెల 29వ తేదీన యాత్ర తెనాలి చేరుతుందని తెలిపారు. మార్కెట్ సెంటర్‌లో బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. బాధితులు షేక్ బషీర్, చంద్రశేఖర్, కృష్ణ, నరసింహారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తెనాలి రైతు బజారులో
కూరగాయల ధరలు 1 కిలో రూపాయల్లో

టమాటా-47, వంకాయ-29 బెండ-20, మిర్చి- 18, కాకర-18 బీర-20, క్యాబేజి-24, క్యారెట్-48, దొండ-27, బంగాళదుంప-15, ఉల్లిపాయలు-26, గోరుచిక్కుడు-26, దోస-8, సొర-10, పొట్ల-5, అరటి(1)-5, చామ-26, పెద్దచిక్కుడు-34, ములక్కాయ-6, ఆకుకూర-కట్ట-4, బీట్ రూట్- 22, కీర-24, బీన్స్-62, క్యాప్సికం-50, నిమ్మకాయలు (డజను)-15



వైకుంఠపురంలో నేటి కార్యక్రమాలు

తెనాలి: వైకుంఠపురంలోని శ్రీ లక్ష్మీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో సోమవారం ఉదయం 5.30 గంటలకు స్వామి వారికి బిందె తీర్థం సమర్పించి 6 గంటలకు బాల భోగం, నివేదన చేస్తారు. ఉదయం 10 గంటలకు శాంతి కల్యాణం నిర్వహిస్తారు. 11.30 గంటలకు 50 మందికి అన్నదానం చేస్తారు. మధ్యాహ్నం 12.30 గంటలకు మహా నివేదన అనంతరం ఒంటి గంటకు ద్వార బంధన చేస్తారు. తిరిగి 3.50 గంటలకు ఆలయం తలుపులు తెరిచి రాత్రి 7.30 గంటలకు బాల భోగం, 8 గంటలకు ద్వార బంధనం నిర్వహిస్తారు.

తెనాలి సినిమా గైడ్

పెమ్మసాని- అనబెల్, **స్వరాజ్-** నిన్నుకోరి, **వీనస్-** నక్షత్రం, **గెయిటీ** - దువ్వాడ జగన్నాథం, **ప్రియ- ఫిదా**, **శ్రీప్రియ** -లై, **అలంకార్-** పల్నాటి బ్రహ్మనాయుడు, **లక్ష్మి-** ఆనందోబ్రహ్మ, **శ్రీలక్ష్మి** - జయ జానకి నాయక **సంగమేశ్వర-** నేనే రాజు నేనే మంత్రి, **మినీ సంగమేశ్వర-** గౌతమ్‌నంద

హలో... ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో సామాజికపరమైన (వ్యక్తిగతమైనవి కాదు) సమస్యలు ఉన్నాయా? అలా ఉన్న సమస్యల గురించి ఫోన్‌చేసి ఆంధ్రజ్యోతికి తెలపండి. ఆ సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారి దృష్టికి తీసుకువెళ్తాం.

సమయం : ప్రతి రోజు సాయంత్రం 6 నుంచి 8 గంటల మధ్య
ఫోన్ నెంబర్ : 08644-225900

తీరనున్న పేదల 'ఇంటి' కల

● ఎన్టీఆర్ గృహ నిర్మాణాలకు ఏర్పాట్లు
● మూడు విభాగాల్లో 1152 ఇళ్లు





కాంక్రీటు ప్లాంటు నిర్మాణ పనుల్లో కార్మికులు, గృహ నిర్మాణం జరుగుతున్న ప్రదేశం(ఇన్‌సెట్‌లో)

తెనాలి అర్బన్ : పట్టణ పేదల సొంత ఇంటి కల నెరవేరనుంది. ఎన్టీఆర్ గృహ నిర్మాణ పనులకు అవసరమైన ఏర్పాట్లలో షాపూర్‌జీ పల్లోంజి కంపెనీ నిమగ్నమైంది. పట్టణానికి సమీపంలోని జగ్గడిగుంట పాలెం వద్ద చినపరిమి రహదారిలో సేకరించిన 12.5 ఎకరాల్లో ఇళ్ల నిర్మాణానికి ఇటీవల భూమి పూజ చేశారు. ఇళ్ల నిర్మాణ బాధ్యతను నిర్మాణ రంగంలో పేరుగాంచిన షాపూర్‌జీ పల్లోంజి కంపెనీకి ప్రభుత్వం అప్పగించింది. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో ఈ కంపెనీ నిర్మాణ బాధ్యతలు చేపట్టింది. 300 చదరపు అడుగులు, 365 చదరపు అడుగులు, 430 చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడు విభాగాల్లో 1152 ఇళ్ల నిర్మాణాలను ఏడాదిన్నర కాలంలో నిర్మించాల్సి ఉంది. జీ+3 అంతస్తులలో నిర్మించి పేదలకు అందించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

సిబ్బందికి క్వార్టర్స్ ఏర్పాటు..

ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సిబ్బంది, కార్మికులు నిర్మాణ స్థలంలో నివసించేందుకు ఏర్పాటు చేశారు. గత నెల రోజులుగా నిర్మాణాలకు కావాల్సిన ప్రాథమిక వసతులను కల్పించే పనిలో నిమగ్నమయ్యారు. సిబ్బంది కోసం రెండు భారీ రేకుల షెడ్డులను ఏర్పాటు చేశారు. తూర్పు, నిజాంపట్నం కాల్వల మధ్య స్థలాన్ని కూడా వినియోగించుకునేందుకు అనువుగా మార్చుకున్నారు.

మట్టి పనులు ప్రారంభం..

ఇళ్ల నిర్మాణానికి కేటాయించిన భూమి పొలాల మధ్య ఉండటంతో నిర్మాణానికి అనువుగా మట్టి పనులు ప్రారంభించారు. పడమర కాల్వ వెంట కాల్వ కట్టను రహదారిగా మార్చుకునే పని జరుగుతోంది. వర్షాలు కురిస్తే ఈ మార్గం బురదగా మారడంతో మెటీరియల్ తరలించే వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఈ మార్గాన్ని గ్రావెల్‌తో పటిష్టపరిచేందుకు మున్సిపాలిటీ నిధులు మంజూరు చేసింది. నిర్మాణ స్థలం ఒకచోట చదరంగా లేకపోవడంతో మెటీరియల్ చేరవేసేందుకు అంతర్గత రహదారుల నిర్మాణం చేపట్టారు. నిర్మాణానికి అవసరమైన కాంక్రీటును తయారు చేసేందుకు సమీపంలో భూమిని లీజుకు తీసుకుని కాంక్రీటు ప్లాంట్ నిర్మించే పనులు జరుగుతున్నాయి. నిర్మాణ పనులను పర్యవేక్షించేందుకు కంపెనీ ప్రాజెక్టు మేనేజర్‌ను నియమించింది.

దేశాభివృద్ధే ప్రధాని మోదీ ధ్యేయం

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

కొల్లిపర : దేశాభివృద్ధే ప్రధాని మోదీ ధ్యేయమని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి పాటిబండ్ల రామకృష్ణ అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో బూత్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. పేదల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. సమావేశంలో మండల బీజేపీ అధ్యక్షుడు భీమిరెడ్డి గోపిరెడ్డి, నాయకులు ఆరిమండ విజయభాస్కర్‌రెడ్డి, కఠారి వాసుదేవనాయుడు, గన్నిశెట్టి కోటేశ్వరరావు, మండ్రు మురళి, కొత్తపల్లి యోగనందకిశోర్, కొండా కిశోర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా పోతురాజు స్వామి కొలుపులు

తెనాలి కల్చరల్ : స్థానిక పినపాడులోని పోతురాజుస్వామి గుడి వద్ద శ్రావణ మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీదేవి అమ్మవారికి వ్రతాలను, అభిషేకాలను జరిపారు. ఎడ్లబండిపై ప్రభలను అలంకరించి మేళతాళాలు, మంగళవాయిద్యాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. పొంగళ్లు, పానకాలను నైవేద్యాలుగా సమర్పించి భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు. లోక కళ్యాణార్ధం ఏటా కొలుపులు నిర్వహించడం అనవాయితీ అని గ్రామస్తులు దేశబోయిన పోతురాజు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు నాగరాజు, సాంబశివరావు, మైలా రాము, కరేటి రవి, టి.బోసు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి

తెనాలి అర్బన్ : మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మారీసుపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పొన్నూరు నాగసూర్యశశిధరరావు మాట్లాడుతూ దేశాభివృద్ధికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు ఎనలేనివన్నారు. ఆయన ఆశయ సాధనలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేస్తున్నారని చెప్పారు. అన్ని రాష్ట్రాలను సమదృష్టితో చూసి అభివృద్ధికి బాటలు వేశారని తెలిపారు. పార్టీ నాయకులు తోటకూర వెంకటరమణరావు, కాళిదాసు వెంకటేశ్వరరావు, రహిమాన్, దశరథరామిరెడ్డి, నల్లగొర్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగి సేవా కార్యక్రమాలు

తెనాలి టౌన్ : విశ్రాంత బ్యాంకు ఉద్యోగి జేసీ ప్రకాశరావు ఆధ్వర్యంలో కొత్తపేటలోని హారిక కేబుల్ విజన్ ఆఫీసు వద్ద ఆదివారం పేదలకు అన్నదానం, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హెచ్‌సీవీ అధినేత కరణం వెంకటేశ్వరరావు ప్రకాశరావు సేవలను కొనియాడారు. ఆయన బ్యాంకు ఉద్యోగంలో ఉన్నప్పుడు కూడా పేదలకు సేవలు అందించే వారని, రిటైర్డ్ అయిన తర్వాత కూడా సేవా కార్యక్రమాలు కొనసాగించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత చోడవరపు విఠల్ ప్రసాద్, ఎం.సాంబశివరావు, హెచ్‌సీవీ ఉద్యోగులు పాల్గొన్నారు.

వేడుకగా గంగానమ్మ కొలుపులు

తెనాలి కల్చరల్ : స్థానిక రజకపేటలో రజక యూత్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి గంగానమ్మ తల్లి కొలుపులను వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా గంగానమ్మతల్లి విద్యుత్ ప్రభను ఏర్పాటు చేసి పురవీధులలో ఊరేగించారు. కార్యక్రమంలో గుంటూరు రూరల్ డీఎస్పీ గోలి లక్ష్మయ్య, అమృతలూరు జడ్పీటీసీ చందోలు పృధ్వీలత, బేతపూడి శివరామయ్య, ఉప్పలపాటి సాయికృష్ణ, జ్ఞానేశ్వర్, ఎం.గోవర్ధనరావు, బేతపూడి రాధ, వాసు పాల్గొన్నారు.

పోస్టాఫీసులో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

తెనాలి టౌన్ : గ్రామీణ తపాలా సిబ్బంది ఈ నెల 16వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలో ఉన్నందున ప్రజల అసౌకర్యాన్ని తొలగించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెనాలి డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ హరికృష్ణప్రసాద్ తెలిపారు. సేవింగ్ ఖాతా, సుకన్య, రికరింగ్ డిపాజిట్లు, తమ సమీప సబ్ పోస్టాఫీసుల్లో డిపాజిట్లు చేసి ఖాతాలలో జమ అయినట్లు రశీదు తీసుకోవాలని కోరారు. తమకు వచ్చిన రిజిష్టర్ ఉత్తరాలు, మనియార్డర్లు, స్పీడ్ పోస్టు తమ సమీప పిన్ కోడ్ పోస్టాఫీసులో ఏదేని గుర్తింపు కార్డు చూపించి తీసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా గ్రామ దేవత కొలుపులు

కొల్లూరు : గ్రామదేవత కొలుపులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం కొల్లూరు 1వ వార్డులోని కాపు సామాజిక వర్గీయులు గ్రామదేవత అంకమ్మ తల్లి కొలుపులు చేశారు. అమ్మవారిని పురవీధుల్లో కనక తప్పెట్లు నడుమ ఊరేగించారు. సంబరంలో చిన్నా,పెద్ద ఉత్సాహంగా అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

అర్చకుల వేతనాల పెంపునకు విజ్ఞప్తి



సమావేశంలో మాట్లాడుతున్న అనంతాచార్యులు

తెనాలి కల్చరల్ : గ్రామీణ, పట్టణాల్లోని ఆలయాల్లో పని చేసే అర్చకుల వేతనాలు రూ.10 వేలకు పెంచే ప్రతిపాదన వెంటనే అమలు చేయాలని రాష్ట్ర అర్చక సమాఖ్య ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.అనంతాచార్యులు విజ్ఞప్తి చేశారు. వేతనాల పెంపు ప్రతిపాదన పరిశీలనలో ఉందని దేవాదాయ ధర్మదాయ శాఖ మంత్రి పి.మాణిక్యాలరావు ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. గంగానమ్మ పేటలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా సమాఖ్య ప్రధాన కార్యదర్శి మేడూరి శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ అర్చక కోడ్ రాని వారు దరఖాస్తులను పూర్తి చేసి సమాఖ్య ప్రతినిధులకు అందజేయాలని కోరారు. అర్చక సమాఖ్య నాయకులు వేణుగోపాల్, టి.రఘు, లక్ష్మీనారాయణ, వేదాంతం మాధవ్, జంధ్యాల గురునాథప్రసాద్, పెనుమూడి సుబ్బారావు, భాష్యం రామాచార్యులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో టీవీఎస్

పయనీర్ గ్రూప్ చైర్మన్ రమేష్



రైతులకు వివరిస్తున్న టీవీఎస్ గ్రూప్ చైర్మన్ చుక్కపల్లి రమేష్

కొల్లిపర : రైతులకు టీవీఎస్ వాహనాలు సరసమైన ధరలకు అందించాలన్న లక్ష్యంతో ఈ ప్రాంతంలో షోరూం ఏర్పాటు చేసినట్లు పయనీర్ గ్రూప్ చైర్మన్ చుక్కపలి రమేష్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని దావులూరు అడ్డరోడ్డు సెంటర్‌లో ఏర్పాటు చేసిన టీవీఎస్ షోరూం ఆయన ప్రారంభించారు. రైతులకు టీవీఎస్ వాహనాల బ్రోచర్ అందజేశారు. మార్కెట్‌లో అన్నీ మోటార్ వాహనాల కన్నా ఎక్కువగా అమ్ముడుపోయేవి టీవీఎస్ మాత్రమే అన్నారు. పొలాలకు ఎరువులు, విత్తనాలు తీసుకెళ్ళటానికి టీవీఎస్ ఎక్స్‌ఎల్ పెట్టింది పేరని వివరించారు. ఈ ప్రాంతంలో బ్రాంచి ప్రారంభించిన శుభ సందర్భంగా ప్రత్యేక ఆఫర్లతో వాహనాలను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పయనీర్ గ్రూఫ్ ఆఫ్ సంస్థ ఎండీ చుక్కపలి రాకేష్, పయనీర్ టీవీఎస్ మేనేజర్ వెల్లంకి శివర్యామ్మ్రప్రసాద్, వెల్లంకి వంశీ తదితరులు పాల్గొన్నారు

రూ.4.61 లక్షల బోనస్ పంపిణీ



రైతులకు బోనస్ అందజేస్తున్న ఆదినారాయణ

తెనాలి అర్బన్ : మండలంలోని అంగలకుదురు పాల సొసైటీలో రైతులకు రూ.4.61 లక్షల బోనస్ పంపిణీ చేశారు. సొసైటీ భవనంలో ఆదివారం 2016-17 ఆర్థిక సంవత్సరంలో పాలు సరఫరా చేసిన రైతులకు లీటరుకు రూ.3.50 చొప్పున బోనస్‌ను అందించారు. సంగం డెయిరీ మేనేజర్ పి.ఆదినారాయణ మాట్లాడుతూ రైతులు తమ పాడి అభివృద్ధికి డెయిరీ అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. డివిజనల్‌లో పాల ఉత్పత్తి మెరుగు అవుతుందని దీంతో డెయిరీ వ్యాపారాన్ని మరింత విస్తరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో గవిని వెంకట్రావు, సూపర్‌వైజర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి రాజీనామాకు డిమాండ్



ఎస్ఐకి వినతిపత్రాన్ని అందజేస్తున్న దళిత నాయకులు

కొల్లిపర : దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేసి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన మంత్రి ఆదినారాయణరెడ్డి తన పదవికి రాజీనామ చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంత్రిపై ఫిర్యాదు చేశారు. తొలుత దళిత సంఘాల నాయకులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఆదినారాయణరెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దళిత నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి ఆదినారాయణరెడ్డి ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారు సరిగా చదవరని, శుభ్రంగా ఉండరని కించపరుస్తూ బహిరంగంగా మీడియా ముందు మాట్లాడిన మాటల ఆధారంగా వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత నాయకులు పిల్లి గంగాధర్‌రావు, చిలుమూరు ఝాన్సీ, ఉన్నం నాని, బత్తుల రవి, మండ్రు స్టాలిన్, పిల్లి ప్రసన్న, ఆరే సురేష్, ఎస్టీ నాయకుడు కట్టా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సామగ్రి పంపిణీ

అమృతలూరు: ఇటీవల అగ్నిప్రమాద బాధితులకు ఆదివారం దాతలు చేయూతనందించారు. గ్రామానికి చెందిన క్రొత్తపల్లి రామకృష్ణమోహనలాల్ సక్సేనా జ్ఞాపకార్థం గొట్టిపాటి గంగాధర్, పైనేని రత్నప్రసాద్ ఆర్థిక సాయంతో ముగ్గురు బాధితులకు వంట సామగ్రి, దుప్పట్లు, బియ్యం రిటైర్డ్ టీచర్ క్రొత్తపల్లి హరి నాథ్‌బాబు అందజేశారు.

జూదరుల అరెస్టు

అమృతలూరు: మండలంలోని పెదపూడిలో జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. శనివారం రాత్రి పేకాట స్థావరంపై దాడి చేసి 5 వ్యక్తులను అరెస్టు చేసి. వారి వద్ద రూ.2300 స్వాధీనం చేసుకున్నారు.

రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛభారత్



స్వచ్ఛభారత్‌లో రైల్వే చీఫ్ సూపరింటెండెంట్ శ్యాంబాబు

దుగ్గిరాల: స్థానిక రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛభారత్ ఆదివారం నిర్వహించారు. చీఫ్ సూపరింటెండెంట్ ఎ.శ్యాంబాబు, స్టేషన్ మాస్టర్ పాములు, ఇతర సిబ్బంది ప్లాట్‌ఫారం, రైల్వేస్టేషన్ ఆవరణలో చీపుళ్లతో శుభ్రం చేశారు. పలువురు ప్రయాణికులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. పరిసరా ల్లోని చెట్లను, పిచ్చిమొక్కలను తొలగించేందుకు చర్యలు తీసుకోను న్నట్లు అధికారులు తెలిపారు. మనస్టేషన్‌ను మనమే పరిశుభ్రంగా ఉంచుదామంటూ రైల్వే అధికారులు, ప్రయాణికుల్లోనూ స్ఫూర్తిని కలిగించే ప్రయత్నం చేశారు.

వైభవంగా గ్రామ దేవత జాతర

వేమూరు : మండలంలోని జంపనిలో చారిత్రక ప్రసిద్ధి చెందిన గ్రామ దేవత రాములమ్మ తల్లి వార్షిక జాతర గ్రామస్తులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారికి జలాభిషేకం చేశారు. పసుపు, కుంకుమలతో అలంకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పట్టు చీర సమర్పించి పొంగళ్లు నివేదించారు. గ్రామస్తులు కులమతాలకు అతీతంగా అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పెంపుడు పక్షులు, పశువులు క్షేమంగా ఉండాలని కోరుతూ వాటిని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. అమ్మవారి ప్రతిమ గ్రామంలో ఊరేగించారు. ఇంటింటికి ఆగిన అమ్మవారికి ప్రతి కుటుంబ సభ్యులు పసుపు నీరు పోసి హారతులు సమర్పించుకున్నారు. కనక తప్పెట్లు, బాణ సంచాలతో యువకులు కేరింతలు కొట్టారు. ఆలయాన్ని తెలవర్ణాలు, విద్యుద్దీపాలతో శోభాయామానంగా అలంకరించారు.

విస్తరణ పనులు ప్రారంభం ఎన్నడో.?



విస్తరణకు నోచుకోని అమృతలూరు - గోవాడ రహదారి

అమృతలూరు : తెనాలి-చెరుకుపల్లి ప్రధాన రహదారిలో అమృతలూరు-గోవాడ గ్రామాల మధ్య రహదారి అభివృద్ధి పరచాలని ప్రజలు కోరుతున్నారు. ఇటీవల కూచిపూడి లాకు నుంచి పెదపూడి- అమృతలూరు గ్రామ మధ్య వరకు రహదారిని సుమారు 5 కోట్ల రూపాయలతో విస్తరణ చేశారు. కొంతమేరకు వాహనదారుల ఇక్కట్లు తీరాయి. కాని పెదపూడి-అమృతలూరు గ్రామాల మధ్య కొంత మేర, గోవాడ వరకు సింగిల్ రహదారి ఉండడంతో భారీ వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు తప్పుకోవడం ఇబ్బందిగా మారింది. ఈ రహదారి వెడల్పు తక్కువగా ఉంది. మార్జిన్లలో గుంటలు ఉండడంతో వాటిలో నీరు నిలిచి వాహనాలు తప్పుకునే క్రమంలో ఇబ్బందులు పడుతున్నారు. అసలే వర్షాకాలం వాహనాలు జారి ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే రహదారి అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల మెరుపు దాడి

తెనాలి క్రైం : పట్టణ సాలిపేటలోని ఓ ఇంటిలో రహస్యంగా పేకాట నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఆదివారం రాత్రి వన్‌టౌన్ పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు వివరాల ప్రకారం.. నిత్యం ఈ ప్రాంతంలో పేకాట జరుగుతుందని స్థానికుల సమాచారంతో దాడి చేశామని తెలిపారు. 10 మంది పేకాట రాయుళ్ళ పట్టుబడినట్లు చెప్పారు. వీరి నుంచి రూ.52,520, 10 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పేకాట రాయుళ్ళపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు.

వర్షాలతో సాగు బాగు

- వెద నాటుతో మరింత లాభం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



ముదురు వరి పైరుకు ఎరువులు చల్లుతున్న రైతులు

వేమూరు : ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు పట్టిసీమ నీరు, వర్షాలు ఎంతగానో దోహదపడుతున్నాయి. వెద సాగుకు మరింత లాభాన్ని చేకూరుస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. మండలంలో 22 వేల ఎకరాలలో వరి సాగు చేస్తున్నారు. ఇందులో భూగర్భ జలాలపై ఆధారపడి 2500 ఎకరాల్లో ముదురు నాట్లు వేశారు. వాటికి కూడా మోటార్ల, సాగు నీరు వాడకుండానే వర్షం ఉపకరిస్తుంది. ఐదు వేల ఎకరాల్లో వేసిన వెద నాట్లు ప్రస్తుత వర్షాలు ఎంతగానో ఉపకరిస్తున్నాయి. నీరు నిల్వ కట్టకుండా చేస్తే ఈ సాగు పద్ధతి ద్వారా రైతుకు ఖర్చులు తగ్గుతున్నాయి. కాకపోతే చేదురు మదురుగా నీరు పెట్టాల్సి ఉండేది. ఆ శ్రమ లేకుండానే వర్షం నీరు ప్రయోజనాన్ని కలిగిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. మరో ఐదు వేల ఎకరాల్లో ఇంత వరకు లేత నాట్లు వేశారు. ఈ భూములకు మరో 10-15 రోజులు ఆగితే కానీ, సాగు నీరు అందేది కాదు. అలాంటిది వర్షం నీటితో ఈ భూములు తడిశాయి. నాట్లు వేసుకోగలిగారు. ఇంకో 9500 ఎకరాల్లో నాట్లు పడాల్సి ఉంది. ఆ రైతులు ఏటా పద్ధతి లోనే వరి నారుమళ్ల ఆలస్యంగా పోయడం వల్ల ఆ భూముల్లో మరో 10 రోజులకు కానీ నాట్లు పడే అవకాశం లేదు. ప్రస్తుత వర్షాలకు నేల పూర్తిగా తడిసి ఉన్నందున పట్టిసీమ ద్వారా నాట్లు సులభంగా వేసుకునే అవకాశం ఏర్పడుతోంది. ముఖ్యంగా వర్షాలతో ఈ ఏడాది చాలా వరకు శ్రమ తగ్గిందని, మొదటి దశలో తెగుళ్ల సోకవని, ఖర్చులు, కూలీల బారం మరింతగా తగ్గిందని రైతులు ఆనం దం వ్యక్తం చేస్తున్నారు. వాతావరణం ఇలాగే అను కూలిస్తే గత ఏడాది కన్నా అధికంగానే దిగుబడి సాధించగలమన్న ఆశాభావాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు.

అందరికీ ఆనందమే..



ఈ ఏడాదికి వాతావరణం అనుకూలించింది. ప్రభుత్వం గత ఏడాది కన్నా 15 రోజులు ముందు గానే సాగుకు పట్టిసీమ నీటిని అందించడం వల్ల రైతులందరికీ ఆనందంగా ఉంది. గత ఏడాది కన్నా ఈ ఏడాది 15 రోజుల ముందుగానే ఆరు ఎకరాల్లో నాట్లు వేశాను. ఈ అవకాశం ఏర్పడినందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు.

- కూచిపూడి ప్రసాద్, రైతు, పోతుమర్రు

ఖర్చులు తగ్గాయి..



వర్షాలు పడటంతో పాటుగా సాగు నీరు కూడా సకాలంలో అందింది. తద్వారా రైతుకు శ్రమ తగ్గడంతో పాటుగా ఖర్చు కూడా తగ్గింది. ఐదు ఎకరాల్లో వెద నాటుకు వర్షాలు బాగా ఉపయోగపడ్డాయి. ప్రభుత్వం సాగునీరు అందించే విషయంలో ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తే ఈ ఏడాది కూడా రైతులు అధిక దిగుబడులు సాధించగలుగుతారు.

- గవిని సతీష్‌బాబు, రైతు, జంపని

తెలుగు వికాసానికి కృషి చేయాలి

తెనాలి కల్చరల్ : అమృత భాష తెలుగు మృతభాషగా మారకుండా తెలుగు భాషా వికాసానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్వరలయ వేదిక వ్యవస్థాపకుడు సాయి లక్ష్మరాజు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం స్వరలయ వేదిక తెలుగు భాషోద్యమ సమితి సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు భాషోత్సవాలను ప్రారంభించారు. సభకు సాయి అధ్యక్షత వహించారు. చిన్నారులకు తెలుగు భాషపై అవగాహన పెంపొందించేందుకు, పట్టు సాధించేందుకు ఆంగ్ల పదం లేకుండా ఉపన్యాసం పోటీలను ఏర్పాటు చేశామన్నారు. తెలుగు భాషను గౌరవిస్తామని ప్రతిజ్ఞ చేశారు. పోటీల్లో పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. విశ్రాంత తెలుగు పండితులు ఈఎల్‌వీ అప్పారావు, సామ్రాజ్యలక్ష్మిలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ నెల 27న తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రమ్‌లో విజేతలకు బహుమతి ప్రదానం చేస్తామన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 22న శాఖా గ్రంథాలయంలో కవితా పఠనం జరుగుతుందని సమితి కార్యదర్శి పీటీ అవధాని తెలిపారు.

ఎస్‌బీఐ అభివృద్ధికి ఆర్‌ఎం కృషి

ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యదర్శి సుధాకర్

తెనాలి అర్బన్ : ఎస్‌బీఐ తెనాలి రీజియన్‌లో వ్యాపారాభివృద్ధికి రీజనల్ మేనేజర్ ఎంఎల్‌వీఎస్ ప్రకాష్ విశేషకృషి చేశారని బ్యాంకు ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యదర్శి సుధాకర్ పేర్కొన్నారు. విజయవాడకు బదిలీ అయిన రీజనల్ మేనేజర్‌ను ఆదివారం గాంధీచౌక్‌లోని ప్రిన్స్ కాన్ఫరెన్స్ హాలులో వీడ్కోలు పలికారు. అన్ని బ్యాంకులలో సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసి వ్యాపార లావాదేవీలలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉండేలా కృషి చేశారని చెప్పారు. ఖాతాదారులు, వ్యాపారుల సంక్షేమమే ధ్యేయంగా రిజర్వ్ బ్యాంకు ఆదేశాల ప్రకారం నిర్ణయాలు తీసుకుంటూ బ్యాంకుల పట్ల ఆదరణ పెంపొందించారని తెలిపారు. నోట్ల రద్దు సమయంలో అన్ని బ్యాంకులకు కొత్త కరెన్సీని సరఫరా చేయడంతో పాటు ఏటీఎంలలోనూ అందుబాటులో ఉంచి ప్రజల ఇక్కట్లను గట్టెక్కించారని చెప్పారు. ఆ సమయంలో నిరంతరం పని చేసి నగదు భద్రపరుచుకునేందుకు ఆలస్యమైనా సిబ్బందిని అప్రమత్తం చేసి ఉంచారని అన్నారు. ఆర్‌ఎం ప్రకాష్ మాట్లాడుతూ రీజియన్‌లో వ్యాపార అభివృద్ధికి సహకారం అందించిన మేనేజర్లు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో పని చేసి తెనాలి రీజియన్ ప్రతిష్ఠ మరింత పెంచాలని కోరారు. చీఫ్ మేనేజర్లు సుబ్రహ్మణ్యం, ప్రసాద్, సత్యనారాయణ, ఉదయ్, తాతాజీ, వెంకటేశ్వర్లు, బిక్రం, బీవీ రెడ్డి, కేవీ రావు తదితరులు పాల్గొన్నారు.

అడిగే వారే కనిపించడం లేదు..

పెరగని ధరతో నిరాశలో మినుము రైతులు

చుండూరు : మినుము ధర రైతులను నిరాశ పరుస్తోంది. గత ఏడాది బస్తా రూ.8-12 వేలు ధర పలికింది. ఈ ఏడాది రూ.4500లకు కొనడానికి వ్యాపారులు ముందుకు రావడం లేదు. మూడో పంటగా సాగు చేసిన మినుము రైతు రూ.1800-2000 ధర్నకైనా అమ్ముదామన్న గ్రామాలలో అడిగే వారే కనిపించడం లేదు. గిట్టుబాటు ధర రాక మూడు వంతుల పంట రైతుల వద్దే నిల్వ ఉండిపోయింది. రూ.5 వేలకు కొనుగోలు కేంద్రాల ద్వారా కొంటామన్న ప్రభుత్వ వాగ్దానం ఇంకా కార్యరూపం దాల్చలేదు. గత ఏడాది ఎకరానికి 6-7 బస్తాల దిగుబడి దానికి తోడు మంచి ధర రావడంతో రైతు లాభపడ్డాడు. ఈ సంవత్సరం మినుముపై మాడుతెగులు ఆశించడంతో ఎకరాకు 2-3 బస్తాలు మించి దిగుబడి లేదు. కొందరు రైతులకు ఆ మాత్రం కూడా రాక పంట దున్నేశారు. గతంలో వలే మినుముకు మంచి ధర వస్తుందని ఎదురు చూస్తున్న రైతుకు ప్రస్తుత ధరలు కుంగదీస్తున్నాయి. ఖరీఫ్ వరి నాట్లు ముమ్మరం కావడంతో కూలీలకు డబ్బులు, ఇతర పెట్టుబడుల కోసం రైతులు, కౌలుదారులు ఆర్థికంగా సతమతమవుతున్నారు. మండలంలో చుండూరు, మోదుకూరు, వలివేరు, చినపరిమి, యడ్లపల్లిలోని వివిధ బ్యాంకులు కౌలుదారులకు రుణాలు ఇవ్వడానికి ముందుకు రావడం లేదు. రైతుల రుణ పరిస్థితి అంతంత మాత్రంగా ఉంది. చేతిలో ఉన్న పంట అమ్ముడుపోక, బ్యాంకుల రుణాలు అందక అధిక వడ్డీలకు కౌలుదారులు, రైతులు అప్పులు చేయక తప్పడం లేదు. కనీస గిట్టుబాటు ధర రూ.ఆరు వేలకైనా మినుములు కొనుగోలు చేసి రైతులను సకాలంలో ఆర్థికంగా ఆదుకోవాలని పలువురు మండల రైతులు కోరుతున్నారు.

ఉపకార వేతనాల పంపిణీ

తెనాలి కల్చరల్: గాయత్రి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఆర్థికంగా వెనకబడిన బ్రాహ్మణ విద్యార్థులకు రూ.3 లక్షల ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. స్థానిక సుబ్రహ్మణ్య శాస్త్రి కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన సభకు పిరాట్ల నారాయణమూర్తి అధ్యక్షత వహించారు. చివుకుల సుందరం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 6 నుంచి పది తరగతుల విద్యార్థులకు, ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఎంబీఏ, ఎంసీఏ, పీజీ, బీటెక్ చదువుతున్న విద్యార్థుల ఆర్థికస్థితి పరిగణలోకి తీసుకుని ఉపకార వేతనాలను సొసైటీ తరపున అందజేశారు. లబ్ధిపొందిన విద్యార్థులకు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సినీ రచయిత జనార్ధన మహర్షిని సొసైటీ వ్యవస్థాపకుడు వేమూరి విజయభాస్కర్ సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఈపూరు : రోడ్డు ప్రమాదంలో యువకుడు గాయపడిన సంఘటన మండలంలోని శ్రీనగర్ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది.

గుండేపల్లి గ్రామానికి చెందిన మొండితోక అంజయ్య వినుకొండ నుంచి మోటారు సైకిల్‌పై వస్తుండగా అదుపుతప్పి రోడ్డుపక్కనే ఉన్న విద్యుత్‌స్తంభాన్ని ఢీ కొట్టాడు.

ప్రమాదంలో అంజయ్య తలకు, రెండుకాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో వినుకొండ ఆసుపత్రికి తరలించారు.

బాలింతలకు భరోసా ఇవ్వని అన్న అమృత హస్తం



పాలు, గుడ్లు ఇంటికి తీసుకెళ్తున్న బాలింతలు, గర్భిణులు

వినుకొండ రూరల్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు ఏర్పాటు చేసిన అన్న అమృతహస్తం పథకం సక్రమంగా అమలు కావడం లేదు. ఆయా కేంద్రాల పరిధిలో ఉన్న మహిళలు ఎవరూ కూడా మధ్యాహ్న భోజనానికి ఆసక్తి చూపడం లేదు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాలు నామమాత్రంగా కేంద్రాలను నిర్వహిస్తూ గర్భిణులకు, చిన్నారులకు భరోసా ఇవ్వడంలో పూర్తి విఫలం చెందుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే మహిళలు కేంద్రాల ద్వారా వండి అందించే లావు బియ్యం అన్నం తింటుంటే కడుపులో నొప్పి వస్తుందని చెబుతున్నారు. మరికొంతమంది మహిళలు కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్నం తినకుండా తమ ఇంటికి పాలు, గుడ్లను తీసుకొని పోవడం జరుగుతుంది. కొన్నికొన్ని అంగన్‌వాడి కేంద్రాలు కలిసి సమ్మేళితమై ఒక పెద్ద కేంద్రంగా ఏర్పడటంతో అంగన్‌వాడీ కేంద్రం తమ ఇంటికి దూరంగా ఉందని మధ్యాహ్నం వేళ అంగన్‌వాడీ కేంద్రం వరకు నడిచివెళ్లి భోజనం తిని రావాలంటూ అలసటగా ఉంటుందని మహిళలు వాపోతున్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జూలై 1వ తేదీన మహిళలకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్న అమృతహస్తం పథకాన్ని ప్రారంభించింది. ప్రారంభించిన తొలినాళ్లల్లో మహిళలు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి భోజనాన్ని చేసి వెళ్లేవారు. కాలం మారేకొద్ది అనేక కేంద్రాల్లో కేంద్రానికి వచ్చేవారు అన్నం తినకుండా గుడ్డు, పాలను తీసుకొని వెళ్తున్నారు. చాలా కేంద్రాల్లో కూడా పిల్లలకు భోజనాన్ని అందించడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వలన పథకం నానాటికి తీసికట్టుగా మారింది. వినుకొండ రూరల్ పరిధిలో 66 కేంద్రాలు ఉండగా వాటిలో బాలింతలకు, గర్భిణులకు సరైన పౌష్టికాహారం అందించడంలో అధికారులు చూపిస్తున్న తాత్సర్యానికి ప్రజలు అనాసక్తి చూపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సన్నబియ్యంతో వండిన అన్నం వడ్డిస్తే తినేందుకు ఆసక్తి చూపుతామని అంటున్నారు.

కడుపులో నొప్పి వస్తుంది



అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే స్టోర్ బియ్యం తింటుంటే కడుపులో నొప్పి వస్తుందని రైల్వేపేటకు చెందిన దూదేకుల ఖాశింబీ చెప్పారు. గర్భిణులైన మాకు ప్రభుత్వం నాణ్యమైన బియ్యం అంగన్‌వాడీ కేంద్రాలకు అందజేస్తే బాగుంటుందని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. **- దూదేకుల ఖాశింబీ, రైల్వేపేట.**

నాణ్యమైన భోజనం అందించాలి



ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన భోజనం అందించాలి. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందించే భోజనం ద్వారా ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. నాణ్యమైన భోజనం అందిస్తే బాగుంటుంది. **- కె.జెరీనా, రైల్వేపేట.**

పాలు, గుడ్లు ఇంటికి తీసుకెళ్తున్నాం



అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజనం సరిగా లేకపోవడంతో మధ్యాహ్న భోజన సమయానికి కేంద్రానికి వచ్చి పాలు, గుడ్లు ఇంటికి తీసుకెళ్తున్నాం. ప్రభుత్వం గతంలో మాదిరిగానే గుడ్లు, పాలు, పౌష్టికాహారం అందిస్తే బాగుంటుంది.

- ఎ. నాగలక్ష్మి, మసీదుమాన్యం .

అంగన్‌వాడీ కేంద్రం దూరంగా ఉంది



తమ అంగన్‌వాడీ కేంద్రాన్ని వేరే అంగన్‌వాడీ కేంద్రంతో కలిపివేయడంతో అక్కడికి వెళ్ళటం చాలా దూరంగా ఉండటంతో మధ్యాహ్న భోజనానికి రాలేకపోతున్నాం. దీంతో పాలు, గుడ్లు ఇంటికి తీసుకెళ్తున్నాను.

- ఎం. సుహాసిని, మసీదుమాన్యం



రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

వినుకొండ : భారతదేశ మాజీ ప్రధాని, దివంగత రాజీవ్‌గాంధీ 73వ జయంతి డీసీసీ అధ్యక్షుడు మక్కెన మల్లికార్జునరావు ఆదేశాల మేరకు స్థానిక రాజీవ్ ఫౌండేషన్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ ములకా రామతులసిరెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా స్థానిక సంస్థల్లో ఓబీసీ రిజర్వేషన్లు, నేరుగా స్థానిక సంస్థలకు నిధుల బదలాయింపు, 73, 74 రాజ్యాంగ సవరణలు రాజీవ్‌గాంధీ ఘనతే అని అన్నారు. కార్యక్రమంలో కాం గ్రెస్ నాయకులు గంటా కాలేషా, అనుముల ప్రసాద్, పొట్లపాడు వలి, గాలి నాగేశ్వరరావు, రెడ్డి వెంకటరత్నం, గుడివాడ గుర్నాధం, షేక్ అహ్మద్‌సన తదితరులు పాల్గొన్నారు.

అప్పు తీర్చలేదంటూ వ్యక్తిపై దాడి

వినుకొండరూరల్ : అప్పు తీర్చలేదంటూ వ్యక్తిపై దాడి చేసిన సంఘటన స్థానిక ఇందిరానగర్‌లో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. సంఘటన వివరాల ప్రకారం కాలం శ్రీను ఇందిరానగర్‌లో నివాసం ఉంటూ మసీదుమాన్యంలో పొలం కౌలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఇందిరానగర్‌కు చెందిన కిరాణా యజమాని చిన్న విజయకు రూ.20వేలు బాకిపడ్డాడని, దీనివిషయంపై ఆదివారం అప్పు తీర్చమని శ్రీనును చిన్నవిజయ, తనకుమారుడు సాయి అడగగా మాటామాటా పెరిగి వారు శ్రీనుపై బ్లేడు, రాళ్లతో దాడికి దిగారు. దీంతో శ్రీనుకు తీవ్ర గాయాలు కాగా 108 ద్వారా ప్రభుత్వాసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు తరలించారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు శ్రీను కుటుంబసభ్యులు తెలిపారు.



దాడిలో గాయపడ్డ కాలం శ్రీను

సాఫ్ట్‌బాల్ జిల్లా జట్టుకు గుడ్‌షపర్డ్ విద్యార్థి ఎంపిక



వినుకొండ : స్థానిక గుడ్‌షపర్డ్ స్కూల్ విద్యార్థి షేక్ బాజీ సాఫ్ట్‌బాల్ జిల్లా జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ ఇన్నారెడ్డి ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 1 నుంచి 3వ తేదీ వరకు ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణంలో జరిగే రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో షేక్ బాజీ జిల్లా జట్టు తరపున పాల్గొంటాడని తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన బాజీని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

ఆఫీసర్స్ వాయిస్

మధ్యాహ్న భోజనం కోసం గ్యాస్ కనెక్షన్లు తీసుకోవాలి

ఎంఈవో ఎం.సాంబశివరావు



నూజెండ్ల : ప్రభుత్వ పాఠశాల్లో మధ్యాహ్న భోజనం గ్యాస్ వినియోగించి తయారు చేసేందుకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠశాల అభివృద్ధి నిధుల నుంచి కనెక్షన్లు తీసుకోవాలి. వంట చెరకు స్థానంలో గ్యాస్ సిలెండర్‌ను మధ్యాహ్న భోజన నిర్వాహకులు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెంపొందించేందుకు డిజిటల్ విద్యాబోధనను ప్రారంభించనున్నాం. మండలంలో అన్ని పాఠశాలలకు సాధారణ బదిలీల్లో భాగంగా పూర్తి స్థాయిలో ఉపాధ్యాయుల నియామకం జరిగింది.



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేస్తున్న ట్రస్ట్ చైర్మన్ చింతలచెర్వు రఘు

ప్రభుత్వ విద్యను ప్రోత్సహించేందుకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు : ఎంఈవో

వినుకొండ : ప్రభుత్వ విద్యను ప్రోత్సహించేందుకు మెరిట్‌స్కాలర్‌షిప్‌లు తోడ్పడతాయని ఎంఈవో సాంబశివరావు తెలిపారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో చింతలచెర్వు సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో తెలుగు మీడియంలో స్కూల్ ఫస్ట్ సాధించిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను ఆదివారం ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ చింతలచెర్వు రఘు, భువనగిరి సుబ్రహ్మణ్యం, ఎం.వి.శర్మ, పి.సుబ్బారావు, గాలి శ్రీకృష్ణయ్య, పి.వి.సురేష్, జీవీ రమణారావు, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు కుటుంబసభ్యులు ఆదివారం ఉదయం తిరుమల శ్రీవారిని వీఐపీ బ్రేక్ దర్శనంలో దర్శించుకున్నారు. **- వినుకొండ రూరల్.**

పొలం వివాదంలో దాడి : ఒకరికి గాయాలు

ముప్పాళ్ల(ఈపూరు) : పొలం వివాదంలో ఒకరిపైఒకరు దాడి చేసుకున్న సంఘటన మండలంలోని ముప్పాళ్ల గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఈపూరు పోలీసులు తెలిపిన కథనం ప్రకారం..గ్రామానికి చెందిన కె.చంద్రరావు, చౌడయ్యలు పొలం విషయంలో గొడవపడి దాడి చేసుకున్నారు. దాడిలో చౌడయ్యకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ పట్టాభిరామయ్య తెలిపారు.


బదిలీపై వెళ్తున్న బ్యాంక్ మేనేజర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

ఆంధ్రాబ్యాంక్ మేనేజర్‌కు సన్మానం

వినుకొండ : గడిచిన రెండు సంవత్సరాల నుంచి ఆంధ్రాబ్యాంక్ కొత్తపేట శాఖలో ఖాతాదారులకు ఎనలేని సేవలు చేసి బదిలీపై వెళ్తున్న మేనేజర్ కె.పుష్పరాజ్‌కు సిబ్బంది ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తపేట బ్యాంక్ పరిధిలో డిపాజిట్‌దారులకు, వ్యాపారస్తులకు సకాలంలో రుణసౌకర్యం అందించి రైతు, గోల్డ్, హౌసింగ్, ముద్ర రుణాలు అందించి బ్రాంచికి మంచి పేరు తీసుకొచ్చి బదిలీపై వెళ్లడం బాధాకరమన్నారు.

ఈ కార్యక్రమంలో బ్యాంక్ సీఎండీ రమణమూర్తి, నూతన మేనేజర్ శ్రీనివాసనాయక్, రమేష్‌బాబు, ఆంజనేయులు నాయక్, బాల అంజని, షేక్ సుబేదార్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

మక్కెన చినరామయ్యకు ఘన నివాళి

వినుకొండరూరల్ : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, పెదకంచర్ల మాజీ సర్పంచ్, డీసీసీ అధ్యక్షుడు మక్కెన మల్లికార్జునరావు తండ్రి మక్కెన చినరామయ్య సంస్మరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సంస్మరణ కార్యక్రమానికి మాజీ మంత్రి కాసు కృష్ణారెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొల్లా బ్రహ్మనాయుడు, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరై చినరామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాసు కృష్ణారెడ్డి మాట్లాడుతూ మక్కెన చినరామయ్య నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఎనలేని కృషి చేశారని, కష్టకాలంలో కూడా పార్టీని నమ్ముకున్నవారి సమస్యలను పరిష్కరించడంలో ముందుండేవారని, ఆయన లేని లోటు పూడ్చలేనిదన్నారు. అనంతరం మక్కెన కుటుంబసభ్యులు గోపూజ నిర్వహించి, 25వేల మందికి భోజన ఏర్పాట్లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ములకా రామతులసిరెడ్డి, అనుముల నాగప్రసాద్, ఎలిశెట్టి నరసింహారావు, రెడ్డి వెంకటరత్నం, గుడివాడ గుర్నాధం, ముత్తినేని గిరిబాబు, చప్పిడి వాసు, చప్పిడి అంజి, మక్కెన మహేష్, తులం శ్రీనివాసరావు, ముత్తినేని శ్రీనివాసరావు, దివ్యకోలు శ్రీనివాసరావు, దగ్గుబాటి వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు, వినుకొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదినేని ఆంజనేయులు, మాదాల శ్రీను, మక్కెన రామాంజనేయులు, కర్నాటి వెంకటరెడ్డి, వైసీపీ నాయకులు చీరపురెడ్డి కోటిరెడ్డి, ఈదర పెద్దిరెడ్డి, కొణతం ఎరుకల రెడ్డి, ఎం.ఎల్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి


గోపూజ చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు మక్కెన మల్లికార్జునరావు కుటుంబసభ్యులు

సినిమా గైడ్

అరుణా	ఆనందో బ్రహ్మ
వెంకటేశ్వర	జయ జానకి నాయక
సురేష్	నేనే రాజు నేనే మంత్రి
కీర్తి	లై

ముఖ్యమైన ఫోన్ నెంబర్లు

శాసనసభ్యుడు	984950111
వ్యవసాయ శాఖాధికారి	8886614124
మున్సిపల్ కమీషనర్	9849905835
సర్కిల్ ఇన్‌స్పెక్టర్	9440796248
వినుకొండ తహసీల్దార్	9849904030
వినుకొండ ఎంపీడీవో	9849903368
వినుకొండ ఎంఈవో	9704440568
ఆర్టీసీ డీఎం	9959225431
మున్సిపల్ చైర్మన్	9440449361
పౌరసరఫరాల అధికారి	8897509585
ఆర్ అండ్‌బీ డీఈ	9440818328
ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ	9100121416

వినుకొండ కూరగాయల ధరలు (రూ.) 1 కిలో

టమోటా:రూ.40, వంకాయలు:రూ.30, బెండ: రూ.30, దొండ:రూ30, క్యారెట్ :రూ.60, క్యాబేజీ: రూ.30, దోస: రూ.20, పచ్చిమిర్చి:రూ.60,బంగాళదుంప: రూ.30, గోరు చిక్కుళ్లు:రూ.30, బీర :రూ.30, కాకర: రూ.30, బీట్‌రూట్: 60, పొట్లకాయ: రూ.30, పెద్ద చిక్కుళ్లు: రూ.60, మునక్కాయ (1): రూ.5, ఆకుకూర కట్ట: రూ.5

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో సామాజికపరమైన (వ్యక్తిగతమైనవికాదు) సమస్యలు ఉన్నాయా? అలా ఉన్న సమస్యల గురించి ఫోన్ చేసి ఆంధ్రజ్యోతికి తెలపండి. ఆ సమస్య పరిష్కా రానికి సంబంధిత అధికారి దృష్టికి తీసుకువెళ్తాం.

సమయం : ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి 8 గంటల మధ్య
ఫోన్ నెంబర్ : 9985411238

వయోజనులకు ఎన్ఐఓఎస్ పరీక్షలు

వినుకొండరూరల్ : మండలంలోని ఏనుగుపాలెం, పెదకంచర్ల, గోనుగుంట్లవారిపాలెం, ఉమ్మడివరం, భారతాపురం గ్రామపంచాయతీల నందు సాక్షరభారత్ వయోజన విద్యాకేంద్రాల్లో నేషనల్ లిటరసీ మిషన్ అథార్టీ వయోజనులకు ఆదివారం అక్షరాస్యత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో 670మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 618మంది పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా సాక్షరభారత్ మండల కోఆర్డినేటర్ ప్రభాకర్ మాట్లాడుతూ వయోజనులు ఎన్ఐఓఎస్ పరీక్షను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ప్రభుత్వం ఉత్తీర్ణులకు అక్షరాస్యులుగా అధికార గుర్తింపును అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు, గ్రామసమన్వయకర్తలు భాగ్యలక్ష్మి, సీతాలక్ష్మి, బాబూరావు, పెద్దబ్బాయి, వెంకటరత్నం, అనురాధ, మరియమ్మ పాల్గొన్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం : నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి సాక్షరభారత్ కేంద్రాల వల్ల ఉపయోగం ఉంటుందని సాక్షరభారత్ మండల కోఆర్డినేటర్ కోటేశ్వరరావు తెలిపారు. మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో ఉన్న సాక్షరభారత్ కేంద్రాల్లో ఆదివారం వయోజనులకు పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల ద్వారా అక్షరాస్యులుగా సర్టిఫికెట్ ఇవ్వబడుతుందని ఆయన తెలిపారు.


ఎన్ఐఓఎస్ పరీక్షలు రాస్తున్న వయోజనులు


శావల్యాపురంలో పరీక్షలు రాస్తున్న వయోజనులు


మొక్కులు చెల్లించేందుకు వెళ్తున్న మహిళలు

గ్రామదేవత కరుణ కోసం పొంగళ్లు

నూజెండ్ల : మండలంలోని వి.అప్పాపురం గ్రామంలో వరుణుడి కరుణ కోసం ఆదివారం పోలేరమ్మకు మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు. నాలుగు రోజులుగా గ్రామంలో వర్షాలు పడాలని గ్రామదేవతకు గ్రామంలోని బొడ్రాయికి జలాభిషేకాలు చేసి ఆదివారం పోలేరమ్మకు మహిళలు మేళతాళాలు, కనకతప్పెట్లతో ఉత్సవాలు చేసుకుంటూ పొంగళ్లు, కాయలు, పూలు నైవేద్యంగా సమర్పించేందుకు గ్రామంలో అందరిని కలుపుకొని పోలేరమ్మ దేవాలయానికి వెళ్లారు. సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహించి ఆటపాటలతో ఉత్సవాలు నిర్వహించారు.

పొగనారు మడులకు రైతులు సమాయత్తం

బొల్లాపల్లి: పొగాకు అమ్మకాలు ముగిశాయి. వచ్చే నెలలో చివరినుంచి తిరిగి పొగాకు సాగు ప్రారంభమవుతుంది. ఇప్పుడిప్పుడే చెదురుమదురు వర్షాలు పడుతుండడంతో బొల్లాపల్లి మండలంలో వెల్లటూరు, సంగినుడుపాలెం, బొల్లాపల్లి తదితర గ్రామాల్లో పొగాకు నారుమడులు పెట్టేందుకు రైతులు సమాయత్తమౌతున్నారు. ఇప్పటికే గ్రామాల్లో మడులు తయారు చేసి విత్తనాలు వారం రోజుల క్రితమే వేశారు. మొక్కలు వస్తున్నాయి. వెల్లటూరు, సంగినీడుపాలెం బోర్లు ఆధారంగా పొగాకు నారుమడులు రైతులు పెడుతున్నారు. 40 నుంచి 50 రోజుల్లో పొగాకు నారు నాటుకోవడానికి సిద్ధం కావాలి. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా పడతాయని అంచనాకు రైతులు వస్తున్నారు


వెల్లటూరులో పొగనారుమడుల్లో విత్తనాలు వేసిన చిత్రం


మోటార్ల నుంచి నీరు పెడుతున్న చిత్రం